బుధవారం 14-3-2018

సత్యమేవ జయతే

సాక్షి



'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 352

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విజయీభవ!

నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్

ఆశల పల్లకిలో భారత ఆటగాళ్లు ● 'నంబర్‌వన్' రేసులో శ్రీకాంత్ ● సింధు, సైనా సత్తాకు పరీక్ష

బ్యాడ్మింటన్‌లో అతి పురాతన, అత్యంత ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్. 119 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత్ నుంచి ఇద్దరు మాత్రమే విజేతలుగా నిలిచారు. ఒకరు ప్రకాశ్ పదుకొనే కాగా... మరొకరు పుల్లెల గోపీచంద్. ప్రకాశ్ 1980లో టైటిల్ నెగ్గగా... 2001లో గోపీచంద్ ఈ ఘనత సాధించాడు. వీరిద్దరి తర్వాత పురుషుల సింగిల్స్‌లో మరెవరూ టైటిల్‌కు చేరువ కాలేదు. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ 2015లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గతేడాది అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడాకారులు మెరుపులు మెరిపించారు. ఏకంగా ఏడు సూపర్ సిరీస్ టైటిల్స్ సాధించి సంచలనం సృష్టించారు. దాంతో ఈ ఏడాది తొలి ప్రముఖ టోర్నీ 'ఆల్ ఇంగ్లండ్'లో అందరి దృష్టి వారిపైనే కేంద్రీకృతమైంది. మనవాళ్లు అంచనాలకు అనుగుణంగా రాణించి... 17 ఏళ్ల నిరీక్షణకు తెరదించాలని ఆశిద్దాం.

బర్మింగ్‌హామ్

మారిన నిబంధనలు... పెరిగిన ప్రైజ్‌మనీ... టోర్నీ స్థాయిల్లో మార్పుల నేపథ్యంలో ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌కు రంగం సిద్ధమైంది. గాయం కారణంగా ప్రపంచ చాంపియన్, నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) ఈ టోర్నీకి దూరం కావడంతో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్‌కు 'నంబర్‌వన్' అయ్యే అవకాశం వచ్చింది. గతేడాది నాలుగు సూపర్ సిరీస్ టైటిల్స్ నెగ్గిన శ్రీకాంత్ అదే జోరును కొనసాగించి ఆల్ ఇంగ్లండ్ విజేతగా నిలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా వరల్డ్ నంబర్‌వన్ అవుతాడు. ఒకవేళ మూడో ర్యాంకర్ శ్రీకాంత్ టైటిల్ నెగ్గలేక పోయినా... కనీసం క్వార్టర్ ఫైనల్ చేరి... మరోవైపు లిన్ డాన్ (చైనా), లీ చోంగ్ వీ (మలేసియా), చెన్ లాంగ్ (చైనా) తొందరగా నిష్క్రమించినా అతనికి నంబర్‌వన్ అయ్యే అవకాశం ఉంటుంది.

భారత్ తరఫున పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్‌తోపాటు సాయిప్రణీత్, ప్రణయ్... మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, సైనా నెహ్వాల్ బరిలోకి దిగనున్నారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో బ్రైస్ లెవెర్డెజ్ (ఫ్రాన్స్)తో శ్రీకాంత్... ఐదో సీడ్ సన్ వాన్ హో (కొరియా)తో సాయిప్రణీత్... ఎనిమిదో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో ప్రణయ్ తలపడతారు. మరోవైపు మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో సైనా నెహ్వాల్... పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్)తో సింధు ఆడనున్నారు. భారత క్రీడాకారులందరికీ క్లిష్టమైన 'డ్రా' ఎదురుకావడంతో... టైటిల్ వేటలో ముందంజ వేయాలంటే వారు ప్రతి మ్యాచ్‌లో తమ అత్యుత్తమ ఆటతీరు కనబర్చాల్సి ఉంటుంది.

మరోవైపు పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మార్కస్ ఇలిస్–లాంగ్‌రిడ్జ్ (ఇంగ్లండ్)లతో సుమీత్ రెడ్డి–మనూ అత్రి... టకురో హోకి–కొబయాషి (జపాన్)లతో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ఆడతారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో షిహో తనక–యోనెమోటో (జపాన్)లతో మేఘన–పూర్విషా... మత్సుతోమో–తకహాషి (జపాన్)లతో సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప తలపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో మార్విన్–లిండా (జర్మనీ)లతో సిక్కి–ప్రణవ్ చోప్రా ఆడతారు.

1.15 మీటర్ల నిబంధన...

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య కొత్తగా రూపొందించిన '1.15 మీటర్ల సర్వీస్ నిబంధన'ను ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో ప్రవేశపెడుతున్నారు. దీని ప్రకారం సర్వీస్ సమయంలో కోర్టు నుంచి 1.15 మీటర్ల ఎత్తు వరకు మాత్రమే షటిల్‌ను ఉంచాలి. అది దాటితే ఫాల్‌గా పరిగణిస్తారు. ప్రస్తుతం షట్లర్లు దాదాపు నడుము భాగం వద్ద షటిల్ ఉంచి సర్వీస్ చేస్తున్నారు.

- మొత్తం 10 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీగల ఈ టోర్నీలో పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 70 వేల డాలర్ల (రూ. 45 లక్షల 31 వేలు) చొప్పున లభిస్తాయి. దాంతో పాటు 12 వేల ర్యాంకింగ్ పాయింట్లు వారి ఖాతాలో చేరుతాయి. రన్నరప్‌గా నిలిచిన వారికి 34 వేల డాలర్లు (రూ. 22 లక్షలు), 10,200 ర్యాంకింగ్ పాయింట్లు లభిస్తాయి.
- తొలి రోజున ఉదయం 9 గంటలకు (భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం గం. 2.30 నుంచి) మ్యాచ్‌లు మొదలై రాత్రి 11 గంటలకు (తెల్లవారు జాము 4.30 వరకు) ముగుస్తాయి. బుధవారం మొత్తం ఐదు కోర్టుల్లో 80 మ్యాచ్‌లను నిర్వహిస్తారు. **స్టార్ స్పోర్ట్స్–2లో మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.**

ఐదు 'గ్రేడ్'లుగా...

గతేడాది వరకు సూపర్ సిరీస్ ప్రీమియర్, సూపర్ సిరీస్ టోర్నమెంట్‌లు జరిగేవి. అయితే ఈ ఏడాది నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) టోర్నమెంట్‌లను ఐదు 'గ్రేడ్'లుగా విభజించింది. గ్రేడ్–1లో ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ ఉండగా... గ్రేడ్–2లో ఆల్ ఇంగ్లండ్, చైనా ఓపెన్, ఇండోనేసియా ఓపెన్‌లకు చోటు కల్పించారు. వీటిని వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలుగా పిలుస్తారు. గ్రేడ్–3 టోర్నీలను (చైనా, డెన్మార్క్, ఫ్రాన్స్, జపాన్, మలేసియా) వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలుగా... గ్రేడ్–4 టోర్నీలను (హాంకాంగ్, ఇండియా, ఇండోనేసియా, కొరియా, మలేసియా, సింగపూర్, థాయ్‌లాండ్) వరల్డ్ టూర్ సూపర్–500... గ్రేడ్–5 టోర్నీలను (ఆస్ట్రేలియా, చైనీస్ తైపీ, జర్మనీ, ఇండియా, కొరియా, మకావు, న్యూజిలాండ్, స్పెయిన్, స్విట్జర్లాండ్, థాయ్‌లాండ్, యూఎస్‌ఏ) వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలుగా వ్యవహరిస్తారు.

నేను చాలా బద్ధకస్తుడిని!

విరాట్ కోహ్లి సరదా కబుర్లు



న్యూఢిల్లీ: మైదానంలో విరాట్ కోహ్లి చురుకుదనం గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. క్రికెట్‌లో ఫిట్‌నెస్‌కు కొత్త అర్థం చెప్పిన ఆటగాడతను. అయితే ఆటకు దూరంగా ఉన్న సమయంలో మాత్రం దానికి పూర్తి భిన్నంగా ఉంటానని అతడు చెబుతున్నాడు. ఏదైనా పని లేకపోతే తనంత బద్ధకస్తుడు మరొకరు ఉండరని కోహ్లి వెల్లడించడం విశేషం. మంగళవారం జరిగిన ఒక ప్రచార కార్యక్రమంలో కోహ్లి తన ఇష్టాయిష్టాల గురించి ఆసక్తికర సంగతులు పంచుకున్నాడు.

చిరాకు తెప్పించేలా...

చేయాల్సిన పనేమీ లేనప్పుడు ఒకే చోట నేను గంటల కొద్దీ కూర్చుండిపోతాను. మైదానంలో ఎంత చురుగ్గా ఉన్నా, ఇంట్లో మొద్దులా ఉండిపోతా. నా ఈ ప్రవర్తన ఇతరులకు చిరాకు తెప్పించేలా ఉంటుంది. నేను ఎంత బద్ధకస్తుడినో దీన్ని బట్టి చెప్పవచ్చు. ప్రస్తుతం లభించిన విరామాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నాను. క్రికెట్ మ్యాచ్‌లు చూడటం లేదు. ఫలితాల గురించి మాత్రం తెలుసుకుంటున్నాను.

అతడు అసాధ్యానికి సవాల్ విసురుతున్నాడు...

ఇటీవలే స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ ఆటోబయోగ్రఫీ చదివాను. స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ నా ఫేవరెట్ ప్లేయర్. ఫెడరర్ అద్భుతంగా, అందంగా ఆడతాడు. తనకు ఒక మంచి కుటుంబం ఉంది. ప్రాధాన్యతలేమిటో బాగా తెలుసు. జనాల వ్యాఖ్యలు, విమర్శల గురించి పట్టించుకోకుండా తనకంటూ సమయాన్ని కేటాయిస్తాడు. 36 ఏళ్ల వయసులో అలవోకగా గ్రాండ్‌స్లామ్‌లు గెలిచేస్తున్నాడు. అసాధ్యం అనే మాటనే అతడు సవాల్ చేస్తున్నాడు. నిజంగా రోజర్ అంటే చాలా గౌరవం.

బయోపిక్ బాగుండదేమో...

నా బయోపిక్ తీస్తే అది ఆసక్తికరంగా ఉండకపోవచ్చు. నా జీవితం సరిగ్గా ఎలా సాగిందో అది అలాగే ఉండాలి. నిజంగా తీస్తే గనక ఒక కొత్త నటుడు ఎవరైనా నా పాత్రను సమర్థంగా పోషించాల్సి ఉంటుంది. చేతి గడియారాన్ని బహుమతిగా ఇవ్వాలనుకుంటే చహల్‌కు ఇస్తాను. ఎందుకంటే అతను ప్రతీసారి ఆలస్యంగా వస్తాడు.

రాయల్స్ బ్యాటింగ్ కోచ్‌గా మజుందార్



జైపూర్: దేశవాళీ మాజీ స్టార్ బ్యాట్స్‌మన్ అమోల్ మజుందార్ రాజస్తాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. హెడ్ కోచ్ ప్యాడీ ఆప్టన్, బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులేలతో కలిసి అతడు పనిచేయనున్నాడు. మజుందార్ (ముంబై) 171 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడి 48.13 సగటుతో 11,167 పరుగులు చేశాడు.

ఫైనల్ వేటలో...

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ పోరు ● గెలిస్తే నేరుగా తుది పోరుకు

కొలంబో: అనుభవం లేని ఆటగాళ్లతో బరిలో దిగి... ఆరంభ విఘ్నాన్ని అధిగమించి గాడిన పడిన టీమిండియా బుధవారం నిదహస్ ట్రోఫీ ముక్కోణపు టి20 టోర్నీలో బంగ్లాదేశ్‌ను ఎదుర్కోనుంది. రోహిత్ సేనకిది చివరి లీగ్ మ్యాచ్. కాగా ముష్ఫికర్ బృందం ఆతిథ్య శ్రీలంకతో మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. దీంట్లో నెగ్గితే... రన్‌రేట్ వంటి సాంకేతికాంశాల అవసరం లేకుండా భారత్ నేరుగా ఫైనల్ చేరుతుంది. ఒకవేళ ఓడినా ప్రస్తుతానికి రన్‌రేట్ మెరుగ్గా (+0.21) ఉంది కాబట్టి పెద్దగా ఇబ్బంది రాదు. అయితే... శ్రీలంక, బంగ్లాదేశ్ మ్యాచ్ ఫలితం కోసం కొంత ఎదురు చూడాల్సి రావచ్చు.

రెండు వరుస విజయాల ఊపులో భారత్... శ్రీలంకపై రికార్డు ఛేదన ఆత్మవిశ్వాసంతో బంగ్లాదేశ్... టీమిండియా గెలిస్తే రాజసంగా ఫైనల్ చేరుతుంది... బంగ్లాదేశ్ నెగ్గితే తుది పోరు రేసులో ముందుంటుంది!



మార్పుల్లేకుండానే భారత్!

టోర్నీ తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై పరాజయం నుంచి టీమిండియా త్వరగానే కోలుకుంది. స్థాయికి తగ్గట్లు ఆడి తర్వాత వరుసగా రెండు విజయాలు అందుకుంది. బంగ్లాదేశ్‌పై ఈ స్థితిలో ప్రయోగాలు చేసి ఇబ్బంది పడటం ఎందుకని భావిస్తే గత మ్యాచ్‌లో ఆడిన జట్టునే బరిలో దించే అవకాశం ఉంది. దీంతో రిషభ్ పంత్ సహా మొహమ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్, దీపక్ హుడా మరోసారి బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. అయితే... ప్రధాన ఆందోళనంతా కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్ గురించే. మరో ఓపెనర్ ధావన్ రాణిస్తున్నా, రోహిత్ తక్కువ స్కోర్లకే వెనుదిరుగుతుండటంతో శుభారంభాలు దక్కడం లేదు. కీలకమైన ఫైనల్‌కు ముందు కెప్టెన్ ఫామ్ అందుకుంటే జట్టుకు అంతకుమించిన ఆనందం ఉండదు. మరోవైపు కేఎల్ రాహుల్‌ను ఓపెనర్‌గా పంపి రోహిత్ నాలుగో స్థానంలో వచ్చే ఆలోచనపైనా చర్చ జరుగుతోంది. రైనా మెరుపులకు తోడు మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్‌లతో మిడిలార్డర్ స్థిరంగా ఉంది. అచ్చం బ్యాటింగ్‌లోలాగే బౌలింగ్‌లో 'ఓపెనింగ్' ఇబ్బంది ఎదురవుతోంది. పేసర్ జైదేవ్ ఉనాద్కట్ భారీగా పరుగులిస్తున్నాడు. కొత్త బంతి పంచుకుంటున్న యువ ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ పొదుపైన బౌలింగ్, ఆపై శార్దుల్ ఠాకూర్, విజయ్ శంకర్ కొంత కట్టడి చేస్తుండటంతో ప్రభావం కనిపించడం లేదు. వీరితో పాటు చహల్ సైతం మెరుగ్గా రాణిస్తేనే... బంగ్లా బ్యాట్స్‌మెన్‌ను నిలువరించగలరు.

బ్యాటింగ్‌పైనే బంగ్లా ఆశలు

తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, లిటన్‌దాస్, ముష్ఫికర్ రహీమ్ లంకపై చెలరేగి ఆడారు. కెప్టెన్ మహ్మూదుల్లా, షబ్బీర్ రెహ్మాన్ రాణించకున్నా జట్టు ఘన విజయం సాధించిందంటే వీరే కారణం. ఇప్పటివరకు పెద్దగా బయటపడని తన ఆటను లిటన్‌దాస్ గత మ్యాచ్‌లో రుచి చూపించాడు. సౌమ్యను కాదని తనను ఓపెనర్‌గా పంపిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌కు బంగ్లాదేశ్ రెండు మార్పులు చేసేలా కనిపిస్తోంది. భారీగా పరుగులిస్తున్న తస్కిన్ అహ్మద్ స్థానంలో అబు జయేద్‌ను, బ్యాట్స్‌మన్ షబ్బీర్ బదులు ఆరిఫుల్ హక్‌ను ఎంచుకోవచ్చు. మంచి బ్యాటింగ్ లైనప్ ఉన్న ఈ జట్టుకు... పేసర్లు ముస్తాఫిజుర్, రూబెల్ హుస్సేన్, స్పిన్నర్ మెహదీ హసన్‌ల ప్రతిభ తోడైతే విజయం కష్టం కాబోదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), ధావన్, రైనా, రాహుల్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, విజయ్ శంకర్, వాషింగ్టన్ సుందర్, చహల్, శార్దుల్ ఠాకూర్, జైదేవ్ ఉనాద్కట్.

బంగ్లాదేశ్: మహ్మూదుల్లా (కెప్టెన్), తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, లిటన్‌దాస్, ముష్ఫికర్ రహీమ్, షబ్బీర్ రెహ్మాన్/ఆరిఫుల్ హక్, ముస్తాఫిజుర్, రూబెల్ హుస్సేన్, తస్కిన్ అహ్మద్/అబు జయేద్, మెహదీ హసన్, నజ్ముల్ ఇస్లాం.

పిచ్, వాతావరణం

సాయంత్రం, రాత్రి వేళల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపిస్తోంది.

నా వ్యూహాలను అంచనా వేయలేరు!

కొత్తగా ఉండేందుకు ప్రయత్నిస్తా ● కింగ్స్ ఎలెవన్ కెప్టెన్ అశ్విన్



న్యూఢిల్లీ: 'కెప్టెన్సీ నాకో కొత్త సవాల్. నాయకుడిగా తర్వాతి అడుగు ఎలా వేస్తానో మీరెవరూ ఊహించలేరు. ఓపెనర్లు మిడిలార్డర్‌లో ఆడొచ్చు. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ఓపెనింగ్‌కు దిగొచ్చు. అంచనాలకు అందకుండా వ్యూహాలు రూపొందిస్తా' అని ఐపీఎల్ టీమ్ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కొత్త కెప్టెన్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. మంగళవారం జెర్సీ ఆవిష్కరణలో పంజాబ్ టీమ్ మెంటార్ వీరేంద్ర సెహ్వాగ్‌తో కలిసి పాల్గొన్న అశ్విన్ మాట్లాడుతూ... 'నేను సెహ్వాగ్, యువీల కెప్టెన్సీలో ఆడాను. వారి అనుభవం, సలహాలను ఉపయోగించుకోవడంలో వెనక్కి తగ్గను' అని పేర్కొన్నాడు. భారత పరిమిత ఓవర్ల జట్టులో పునరాగమనానికి ఐపీఎల్‌ను వేదికగా భావించడం లేదని చెప్పాడు.

నంబర్‌వన్ బౌలర్ రబడ



దుబాయ్: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో 11 వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను గెలిపించిన పేసర్ కగిసో రబడ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో 902 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. భారత స్పిన్నర్ అశ్విన్ రెండు స్థానాల్ని మెరుగుపర్చుకొని నాలుగో స్థానానికి ఎగబాకాడు. జడేజా మూడో ర్యాంకులోనే కొనసాగుతున్నాడు. బ్యాటింగ్ ర్యాంకుల్లో భారత కెప్టెన్ కోహ్లి రెండో స్థానంలో, పుజారా ఆరో ర్యాంకులో ఉన్నారు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్రస్థానంలో, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా వరుసగా రెండు, మూడు ర్యాంకుల్లో ఉన్నాయి.

సర్దార్‌పై వేటు

కామన్వెల్త్ గేమ్స్‌కు భారత హాకీ జట్టు ప్రకటన



న్యూఢిల్లీ: అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో నిరాశాజనక ప్రదర్శనతో పాటు కెప్టెన్‌గా జట్టు వైఫల్యంలో భాగంగా నిలిచిన సీనియర్ ఆటగాడు సర్దార్ సింగ్‌పై హాకీ ఇండియా (హెచ్ఐ) నమ్మకం కోల్పోయింది. కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత జట్టు నుంచి సర్దార్‌ను తప్పించింది. ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఏప్రిల్ 7 నుంచి జరిగే ఈ పోటీల కోసం మంగళవారం జట్టును ప్రకటించారు. సర్దార్‌తో పాటు మరో సీనియర్ ప్లేయర్ రమణ్‌దీప్ సింగ్‌ను కూడా ఎంపిక చేయలేదు. 18 మంది సభ్యుల జట్టుకు మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా... చింగ్లెన్‌సనా సింగ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. మన్‌ప్రీత్ సారథ్యంలోనే ఆసియా కప్ గెలుచుకున్న భారత్, హాకీ వరల్డ్ లీగ్ ఫైనల్లో కూడా కాంస్యం సాధించింది. గాయం నుంచి కోలుకున్న మరో సీనియర్ ఆటగాడు, మేటి గోల్‌కీపర్ శ్రీజేశ్‌కు జట్టులో చోటు లభించింది.

ఇటీవల జరిగిన అజ్లాన్ షా టోర్నీలో సర్దార్ ఆట తర్వాత అతనిపై వేటు ఖాయమనే కనిపించింది. అయితే ఇదే టోర్నీలో మెరుగ్గా ఆడిన రమణ్‌దీప్‌ను కూడా తప్పించడం ఆశ్చర్యపరచింది. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చిన కుర్రాళ్లు దిల్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్‌లకు కామన్వెల్త్ అవకాశం దక్కింది. '2017 ఆసియా కప్‌తో మొదలు పెట్టి వేర్వేరు టోర్నీల్లో ఆటగాళ్ల ప్రదర్శనను పరిగణనలోకి తీసుకొని జట్టును ఎంపిక చేశాం. మా దృష్టిలో కామన్వెల్త్ క్రీడల్లో పతకం సాధించగల అత్యుత్తమ జట్టు ఇది' అని భారత కోచ్ జోయెర్డ్ మరీనే చెప్పారు.

భారత హాకీ జట్టు: పీఆర్ శ్రీజేశ్, సూరజ్ కర్కేరా (గోల్ కీపర్లు), రూపిందర్‌పాల్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, వరుణ్ కుమార్, కొతాజిత్ సింగ్, గురీందర్ సింగ్, అమిత్ రోహిదాస్ (డిఫెండర్లు), మన్‌ప్రీత్ సింగ్, చింగ్లెన్‌సనా సింగ్, సుమీత్, వివేక్ సాగర్ ప్రసాద్ (మిడ్‌ఫీల్డర్లు), ఆకాశ్‌దీప్ సింగ్, ఎస్వీ సునీల్, గుర్జంత్ సింగ్, మన్‌దీప్ సింగ్, లలిత్‌కుమార్ ఉపాధ్యాయ్, దిల్‌ప్రీత్ సింగ్ (ఫార్వర్డ్‌లు).

సెరెనాపై వీనస్ పైచేయి



ఇండియన్ వెల్స్: పునరాగమనంలో అమెరికా టెన్నిస్ తార సెరెనాకు మరో ఓటమి. ఈసారి ఆమెపై అక్క వీనస్ పైచేయి సాధించింది. సోమవారం జరిగిన ఇండియన్ వెల్స్ డబ్ల్యూటీఏ ప్రీమియర్ టోర్నీ మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో వీనస్ 6–3, 6–4తో సెరెనాను వరుస సెట్లలో ఓడించింది. గంటా 26 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పదో సీడ్ వీనస్ ఆరు ఏస్‌లు సంధించింది. సెరెనా నాలుగే ఏస్‌లు కొట్టగా, నాలుగుసార్లు సర్వీస్ కోల్పోయింది. మరో మ్యాచ్‌లో యూఎస్ ఓపెన్ విజేత స్లోన్ స్టీఫెన్స్... 19వ సీడ్ డరియా కసట్కినా (రష్యా) చేతిలో ఓడగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంప్ వోజ్నియాకి 6–4, 2–6, 6–3తో అలెక్సాండ్రా సస్నోవిచ్‌పై గెలుపొందింది. పురుషుల విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ 6–2, 6–1తో ఫిలిప్ క్రజినోవిక్ (సెర్బియా)పై విజయం సాధించాడు. డ్రాప్ షాట్లు మేళవిస్తూ ఆరు ఏస్‌లు కొట్టిన రోజర్ ఒక దశలో వరుసగా 17 పాయింట్లు సాధించాడు. 58 నిమిషాల్లోనే మ్యాచ్ ముగించాడు. ఫెడరర్ ఈసారీ టైటిల్ సాధిస్తే రికార్డు స్థాయిలో ఆరోసారి గెల్చుకున్న ఆటగాడిగా నిలుస్తాడు.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 352


బుధవారం 14-3-2018

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కనీస బ్యాలెన్స్ చార్జీ తగ్గింపు

75 శాతం మేర తగ్గించిన ఎస్‌బీఐ..
ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి – 8లో



రాజకీయవేత్తను కాలేదు

అంతరాత్మను తెలుసుకునేందుకే
ఆధ్యాత్మిక బాట: రజనీకాంత్ – 11లో

కోమటిరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వం రద్దు

జానారెడ్డి సహా 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్



మంగళవారం గాంధీభవన్‌లో దీక్ష చేస్తున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్

- మండలిలోనూ ఆరుగురు ఎమ్మెల్సీలపై చర్యలు
- బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సస్పెన్షన్
- సోమవారం అసెంబ్లీలో జరిగిన ఘటన దురదృష్టకరం: స్పీకర్
- సభ్యత్వం రద్దు, సస్పెన్షన్ తీర్మానాలను ప్రవేశపెట్టిన మంత్రి హరీశ్
- వాటికి సభ ఆమోదం తెలపగానే రంగంలోకి మార్షల్స్
- స్వచ్ఛందంగా బయటికి వెళ్లిపోయిన కాంగ్రెస్ నేతలు
- సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ మండలిలో కాంగ్రెస్ సభ్యుల ఆందోళన
- ప్రభుత్వ తీరును తప్పుబడుతూ నినాదాలు
- బలవంతంగా బయటికి తరలించిన మార్షల్స్

సాక్షి, హైదరాబాద్

గవర్నర్ ప్రసంగం సందర్భంగా శాసనసభలో జరిగిన ఘటనలకు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి (నల్లగొండ), ఎస్‌ఏ సంపత్ కుమార్ (అలంపూర్)లపై వేటు పడింది. సభా హక్కుల ఉల్లంఘన, సభ గౌరవానికి భంగం కలిగించారనే ఆరోపణలతో వారి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ మంగళవారం అసెంబ్లీ తీర్మానించింది. ప్రస్తుత అసెంబ్లీ ముగిసే వరకు వారి సభ్యత్వాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్‌కు చెందిన మిగతా 11 మంది ఎమ్మెల్యేలను బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేసింది. మరోవైపు మండలిలోనూ ఆరుగురు కాంగ్రెస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది.

దురదృష్టకరమైన ఘటన..: సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నర్సింహన్ ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ మిగతా 2వ పేజీలో ▶



సస్పెన్షన్ అనంతరం అసెంబ్లీ నుంచి బయటకు వస్తున్న జానారెడ్డి, జీవన్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి, గీతారెడ్డి, ఉత్తమ్ తదితరులు

అరాచక శక్తులను సహించేది లేదు

పరాకాష్టకు కాంగ్రెస్ అరాచకాలు: కేసీఆర్



- వాళ్లకు ఇంత అసహనం ఎందుకు?.. ఓర్వలేక నాపైనా విష ప్రచారం
- అన్ని ఎన్నికల్లో ఓడిపోతున్నారు.. అందుకే ఈ అసహనం, కక్ష
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై నిర్ణయం సరైన చర్యే
- నిన్నటి ఘటన బాధాకరం: అక్బరుద్దీన్
- జానా సస్పెన్షన్ సరికాదు: కిషన్‌రెడ్డి - 6లో

నన్నెందుకు సస్పెండ్ చేశారు?

కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత జానారెడ్డి -6లో

మూకుమ్మడి రాజీనామాలు?

కాంగ్రెస్ పార్టీ యోచన

- కోమటిరెడ్డి, సంపత్ విషయంలో ప్రభుత్వ వైఖరిని బట్టి నిర్ణయం.. ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు, సస్పెన్షన్‌పై పోరుబాట
- భవిష్యత్ కార్యాచరణపై సీఎల్పీ భేటీలో చర్చ
- రాష్ట్రపతికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు
- జాతీయస్థాయిలో చర్చనీయాంశం చేసేలా నాయకుల వ్యూహం

- వివరాలు 6లో

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

- 2,542 కేంద్రాలు.. 5,38,867 మంది విద్యార్థులు
- నిర్ణీత సమయం దాటాక 5 నిమిషాల వరకే ప్రవేశం
- డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లు అనుమతి
- పాఠశాల విద్యా కమిషనర్ కిషన్ వెల్లడి

- వివరాలు 3లో



సీఆర్పీఎఫ్‌పై మావోల పంజా

భారీ మందుపాతర పేల్చిన మావోయిస్టులు

9 మంది జవాన్లు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

- ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కిష్టారం వద్ద ఘటన
- 20 అడుగులు ఎగిరిపడిన మైన్‌ప్రూఫ్ వాహనం
- తడపలగుట్ట ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగానే దాడి!

సాక్షి, కొత్తగూడెం: తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టులు భారీ దాడికి తెగబడ్డారు. సీఆర్పీఎఫ్ జవాన్లు లక్ష్యంగా.. సుక్మా జిల్లా కిష్టారం వద్ద మంగళవారం అత్యంత శక్తివంతమైన మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో తొమ్మిది మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన వారంతా ఉత్తరప్రదేశ్, బిహార్, బెంగాల్ రాష్ట్రాలకు చెందినవారే. కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సీఆర్పీఎఫ్ 212 బెటాలియన్‌కు చెందిన జవాన్లు రెండు మైన్ ప్రూఫ్ వాహనాల్లో సమీపంలోని కాసారం అనుబంధ క్యాంపునకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఇటీవల 20 మంది మావోయిస్టులు మిగతా 2వ పేజీలో ▶

1.83 లక్షల కోట్లు!

రేపే అసెంబ్లీలో 2018–19 వార్షిక బడ్జెట్

- రూ.లక్ష కోట్లకు మించి ప్రగతి పద్దు
- కొత్తగా రైతు లక్ష్మి, రైతన్న బీమా పథకాలు - 6లో



మార్చి 31 తరువాత కూడా!

- ఆధార్ అనుసంధాన గడువును పొడిగించిన సుప్రీంకోర్టు - 11లో

ఇదం జగత్



కనీసం గతంలో రాసిన లేఖలు అందాయని రిప్లయిచ్చినా చాలట సార్



ఆర్థిక బిల్లులపై సాగని చర్చ

- ఏడో రోజూ పార్లమెంటులో నిరసనల పర్వం
- ఎలాంటి చర్చా లేకుండానే బుధవారానికి వాయిదా

-వివరాలు 11లో

కోమటిరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వం రద్దు..

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగ ప్రతులను చించి విసిరేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెడ్‌ఫోన్స్ సెట్‌ను విసిరేయగా.. అది తగిలి శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ గాయపడ్డారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న అధికారపక్షం.. నిరసన తెలిపిన కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. మంగళవారం ఉదయం శాసనసభ సమావేశం కాగానే ఈ అంశాన్ని లేవనెత్తింది. స్పీకర్ మధుసూదనాచారి సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న అనంతరం దీనిపై మాట్లాడారు. ''గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన సమయంలో దుర్మార్గమైన, దురదృష్టకరమైన, అవాంఛనీయ సంఘటన చోటు చేసుకుంది. సభకు నా తీవ్ర మనస్తాపాన్ని తెలియజేస్తున్నా.. నాలుగేళ్లుగా దేశంలోనే గొప్పగా, గౌరవంగా సభను నిర్వహిస్తున్నాం. నేను తీవ్రంగా మనస్తాపం చెందాను. దాడిలో దెబ్బతిన్న స్వామి గౌడ్‌ను చూసి షాక్‌కు గురయ్యాను..''అని పేర్కొన్నారు.

సభా నిబంధనల మేరకు..

తర్వాత శాసనసభ వ్యవహారాల మంత్రి టి.హరీశ్‌రావు మాట్లాడారు. ''నిన్నటి అరాచక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ ఘటన ప్రజాస్వామ్యానికే మాయని మచ్చను మిగిల్చింది. మీ (స్పీకర్) తీవ్ర మనోవేదనకు, ఆవేదనకు అనుగుణంగా అసెంబ్లీ నిబంధనల (240 పేజీలోని సబ్ రూల్ 2) ప్రకారం.. కాంగ్రెస్ సభ్యులు కె.జానారెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, జె.గీతారెడ్డి, టి.జీవన్‌రెడ్డి, జి.చిన్నారెడ్డి, డి.కె.అరుణ, టి.రామ్మోహన్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి, ఎన్.పద్మావతి, దొంతి మాధవరెడ్డిలను బడ్జెట్ సమావేశాల కాలానికి సస్పెండ్ చేయాలని ప్రతిపాదిస్తూ తీర్మానం ప్రవేశపెడుతున్నాను. నిన్న జరిగిన దాడి చాలా చాలా తీవ్రమైనది. దట్టమైనది. చట్టసభలను అవమానపరిచేలా, రాష్ట్ర గౌరవాన్ని దెబ్బ తీసేలా జరిగింది. ఈ విషయంలో శాసన సభ తీవ్ర వేదనకు గురైంది. శాసనసభ నిబంధనలను ఉల్లంఘించి, సభా మర్యాదలకు భంగం కలిగించడానికి కారణమైన వారిపై పార్లమెంటరీ నిబంధనల (120 పేజీలోని 7.1 పేరా, రాజ్యాంగంలోని 194వ ఆర్టికల్ మూడో సెక్షన్) ప్రకారం.. కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్.ఎ.సంపత్‌కుమార్‌ల సభ్యత్వాలను ప్రస్తుత శాసనసభ కాలం ముగిసేవరకు రద్దు చేయాలని ప్రతిపాదిస్తూ తీర్మానం ప్రవేశపెడుతున్నాను..'' అని తెలిపారు. ఈ తీర్మానాలను పరిగణనలోకి తీసుకున్న స్పీకర్.. సభ ఆమోదం కోరారు. అనంతరం తీర్మానాలు ఆమోదించినట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం అప్రజాస్వామికమని కాంగ్రెస్ సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అప్పటికే మార్షల్స్ సభలోకి ప్రవేశించారు. అందులో మహిళా మార్షల్స్ ఎక్కువ సంఖ్యలో వచ్చారు. తొలుత వారు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి వద్దకు వచ్చి బయటికి తీసుకెళ్లేయత్నం చేశారు. ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆగారు. కొద్దిసేపటి తర్వాత కాంగ్రెస్ సభ్యులంతా బయటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలోకి రావడం గమనార్హం.

సభ్యత్వం రద్దుపై గెజిట్ నోటిఫికేషన్

మరో ఇద్దరిపైనా వేటు?

కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసనసభ్యత్వం రద్దు చేస్తూ అసెంబ్లీ సచివాలయం మంగళవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ ఇద్దరు ఎమ్మెల్యేల నియోజకవర్గాలు నల్లగొండ, అలంపూర్‌లు ఖాళీ అయినట్లుగా నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీనికి సంబంధించిన ఫైలును గుర్తిస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి అసెంబ్లీ కార్యాలయం లేఖ రాసింది. కాగా సోమవారం అసెంబ్లీలో మండలి చైర్మన్‌పై జరిగిన దాడి వీడియో ఫుటేజీని స్పీకర్ మధుసూదనాచారి మంగళవారం సాయంత్రం మరోమారు పరిశీలించారు. మరో ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు రామ్మోహన్‌రెడ్డి (పరిగి), వంశీచంద్‌రెడ్డి (కల్వకుర్తి) లు సైతం అనుచితంగా వ్యవహరించినట్లు వీడియో ఫుటేజీలో గుర్తించినట్లు తెలుస్తోంది. వారి శాసనసభ సభ్యత్వాలు కూడా రద్దు చేసేలా నిర్ణయం ఉంటుందని సమాచారం.

మండలిలో గందరగోళం..

శాసన మండలిలోనూ ఆరుగురు కాంగ్రెస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది. గవర్నర్ ప్రసంగం సందర్భంగా జరిగిన గందరగోళానికి బాధ్యులను చేస్తూ వారిని బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. మంగళవారం శాసన మండలి ప్రారంభమైన వెంటనే.. కాంగ్రెస్ సభ్యులు విపక్ష నేత షబ్బీర్‌అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సంతోష్, దామోదర్‌రెడ్డి, ఆకుల లలిత, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలను సస్పెండ్ చేయాలని ప్రతిపాదిస్తూ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తీర్మానాన్ని ప్రతిపాదించారు. దానిని పరిగణనలోకి తీసుకుని మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్.. తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. సస్పెండైన సభ్యులు సభను వీడి వెళ్లాలని సూచించారు. అయితే కాంగ్రెస్ సభ్యులు బయటికి వెళ్లకుండా ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సస్పెండైన సభ్యులకు సభలో మాట్లాడే అవకాశం ఉండదని, బయటకు వెళ్లిపోవాలని డిప్యూటీ చైర్మన్ స్పష్టం చేశారు. అయినా కాంగ్రెస్ సభ్యులు ఆందోళన కొనసాగించడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో మార్షల్స్‌ను రప్పించి.. కాంగ్రెస్ సభ్యులను బయటకు పంపారు. ఈ సమయంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



మావోయిస్టుల మందుపాతర దాడిలో మరణించిన జవాన్లు

సీఆర్పీఎఫ్‌పై మావోల పంజా

▶ మొదటి పేజీ తరువాయి

మరణించిన తడపలగుట్టలో ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగానే మావోయిస్టులు ఈ దాడికి పాల్పడినట్లుగా భావిస్తున్నారు.

200 కిలోల పేలుడు పదార్థంతో..

ఇటీవల మావోయిస్టుల విధ్వంస కార్యకలాపాలు పెరగడంతో కిష్టారం క్యాంపునకు అనుబంధంగా కాసారంలో మరో సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో పలువురు జవాన్లు రెండు మైన్ ప్రూఫ్ (మందుపాతరల పేలుళ్లను తట్టుకునే) వాహనాల్లో ఈ అనుబంధ క్యాంపునకు బయలుదేరారు. దీనిపై సమాచారం అందుకున్న మావోయిస్టులు.. మార్గంలో సుమారు 200 కిలోల అత్యాధునిక పేలుడు పదార్థాల (ఐఈడీ)ను అమర్చారు. సీఆర్పీఎఫ్ జవాన్ల వాహనాల్లో మొదటి వాహనం అక్కడికి చేరుకోగానే.. మందుపాతరను పేల్చారు. మావోయిస్టులు సాధారణంగా 20 కిలోల వరకు పేలుడు పదార్థాన్ని మందుపాతరల్లో వాడుతారు. అలాంటిది ఏకంగా 200 కిలోల వరకు వాడటంతో... భారీ పేలుడు సంభవించింది. జవాన్ల వాహనం మైన్ ప్రూఫ్ అయినా కూడా.. ఆ పేలుడు ధాటికి సుమారు 20 అడుగుల మేర ఎగిరిపడింది. అందులో ఉన్న 11 మంది జవాన్లలో తొమ్మిది మంది అక్కడికక్కడే మృతి చెందారు. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. అయితే చనిపోయిన జవాన్లకు సంబంధించిన ఆయుధాలను ఎత్తుకెళ్లేందుకు మావోయిస్టులు ప్రయత్నించారని.. వెనుక మరో వాహనంలో వస్తున్న జవాన్లు కాల్పులు జరపడంతో వారు పారిపోయారని పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో 200 మంది వరకు మావోయిస్టులు పాల్గొని ఉంటారని పేర్కొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు జవాన్లను హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌కు తరలించారు. మృతదేహాలు ఘటనా స్థలంలోనే ఉన్నాయని.. బుధవారం మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం చేయనున్నారు. అనంతరం ఏపీ పరిధిలో ఉన్న సీఆర్పీఎఫ్ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

అంతా యూపీ, బెంగాల్, బిహార్ వారే..

మరణించిన జవాన్లంతా ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాలకు చెందినవారే. వారిని ఆర్‌కేఎస్.థామస్, అజయ్ కె.ఆర్.యాదవ్, మనోరంజన్, జితేందర్‌సింగ్, శోభిత్ కె.ఆర్.శర్మ, లక్ష్మణ్, మనోజ్ సింగ్, ధర్మేంద్ర సింగ్, చంద్ర హెచ్.ఎస్‌లుగా గుర్తించారు. మాధవ్‌కుమార్, రాజేశ్‌కుమార్‌లు గాయపడ్డారు. ఘటనా స్థలాన్ని ఛత్తీస్‌గఢ్ డీఐజీ డీపీ ఉపాధ్యాయ, సుక్మా ఎస్పీ అభిషేక్ శాండిల్య పరిశీలించారు.

సెలవులు ముగించుకుని రాగానే..

ఆంధ్రప్రదేశ్‌లోని ఎటపాకలో ఉన్న సీఆర్పీఎఫ్ కార్యాలయం ద్వారా సరిహద్దుల్లో బేస్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇటీవల సెలవులు ముగించుకుని వచ్చిన 212 బెటాలియన్‌కు చెందిన జవాన్లు ఇక్కడ రిపోర్టు చేసి.. తమ బేస్ క్యాంపులకు వెళ్లి విధుల్లో చేరారు. వారిలో కొందరు కిష్టారం సమీపంలోని కాసారం అనుబంధ క్యాంపునకు వెళ్తుండగా మావోయిస్టుల బాంబు దాడి ఘటన జరిగింది. సెలవులు ముగించుకుని విధుల్లో చేరిన కొన్ని గంటల్లోనే జవాన్లు మృత్యువాతపడటంతో విషాదం నెలకొంది.

తడపలగుట్ట ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా..!

తెలంగాణలో కార్యకలాపాలు ముమ్మరం చేయాలనుకున్న మావోయిస్టులకు తడపలగుట్ట ఎన్‌కౌంటర్ రూపంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆలోచనలో ఉన్న మావోయిస్టులు.. అవకాశం కోసం ఎదురుచూసి, తాజా దాడికి పాల్పడ్డారని తెలుస్తోంది.

సంతాపం వ్యక్తం చేసిన ప్రధాని

మావోయిస్టుల మందుపాతర పేలుడులో 9 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ''మావోయిస్టుల దాడిలో అమరులైన సీఆర్పీఎఫ్ జవాన్లకు భారతదేశం సెల్యూట్ చేస్తోంది. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా..''అని ట్వీటర్‌లో పేర్కొన్నారు. కాగా జవాన్లు మరణించిన ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు.

29న నింగిలోకి జీఎస్‌ఎల్‌వీ ఎఫ్08!

శ్రీహరికోట (సూళ్లూరుపేట): శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట సమీపంలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో ప్రయోగవేదిక నుంచి ఈ నెల 29న జీఎస్‌ఎల్‌వీ ఎఫ్08 రాకెట్ ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 11న రాకెట్ మూడోదశ అయిన క్రయోజనిక్ దశ అనుసంధానం పూర్తయింది. దీంతో మూడు దశల రాకెట్ అనుసంధానం పనులు పూర్తయ్యాయి. ఈ మూడు దశల రాకెట్ పరీక్షలు నిర్వహించిన అనంతరం ఈనెల 19న రాకెట్ శిఖరభాగాన 2,140 కిలోల బరువు కలిగిన జీశాట్–6ఏ ఉపగ్రహాన్ని అమర్చనున్నారు. అనంతరం రెండు రోజుల పాటు రాకెట్‌కు అన్ని రకాల సాంకేతిక పరీక్షలు నిర్వహించి 23న మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్ నుంచి ప్రయోగవేదికకు అనుసంధానించే పనులు చేపట్టనున్నారు. అక్కడ 6 రోజుల పాటు పరీక్షలు నిర్వహించిన అనంతరం 29న సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్యలో ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మీరు మైనారిటీలకు వ్యతిరేకం

ఎస్సీ, ఎస్టీ, బీసీలు పట్టరు
కేంద్రంపై టీఆర్‌ఎస్ ఎంపీల మండిపాటు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలకు వ్యతిరేకమని.. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆ పార్టీకి పట్టరని టీఆర్‌ఎస్ ఎంపీలు నిప్పులు చెరిగారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని, అలా పెంచుకునే అధికారం రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఎంపీలు మంగళవారం ఆందోళన చేపట్టారు. వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. సభ వాయిదా పడగానే గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. పార్టీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, బి.వినోద్‌కుమార్, అజ్మీరా సీతారాం నాయక్, నగేష్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సి.హెచ్.మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బాల్క సుమన్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పసునూరి దయాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. '7 రోజులుగా ధర్నా చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రంలో ఆమోదం తెలిపిన రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూలులో చేర్చాలన్నదే మా ప్రధాన డిమాండ్. ఒక దేశంలో ఒకే నీతి ఉండాలని కోరుతున్నాం. జనాభా దామాషా ప్రకారం రాష్ట్రాలు వివిధ వర్గాలకు రిజర్వేషన్లు పెంచుకునే హక్కు కల్పించాలని అడుగుతున్నాం. తమిళనాడులో 69 శాతం, మహారాష్ట్రలో 52 శాతం అమలు చేస్తున్నారు. రాజస్తాన్‌లో, హరియాణాలో అడుగుతున్నారు. అలాంటప్పుడు రిజర్వేషన్లపై మీ పెత్తనం ఎందుకు? మేం కేంద్రంలో రిజర్వేషన్లు అడగటం లేదు. మా రాష్ట్రంలో మేం ఇచ్చుకుంటాం అంటున్నాం. దేశంలో ఒకే పన్ను ఉండాలని జీఎస్టీ ఆమోదించుకున్నారు. ఒకే దేశం ఒకేసారి ఎన్నికలని మద్దతు కూడగడుతున్నారు. అన్నీ ఒకటిగా ఉన్నప్పుడు రిజర్వేషన్లపై విభిన్న రీతులు ఎందుకు?'అని ప్రశ్నించారు. ఈశాన్య రాష్ట్రాల్లో వివిధ వర్గాల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని, తెలంగాణలోనూ ఆ విధానాన్నే అమలు చేయాలని ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ డిమాండ్ చేశారు.

ఏబీకే ప్రసాద్ సతీమణి సుధారాణి కన్నుమూత



భార్య భౌతికకాయం వద్ద కంటతడి పెడుతున్న ఏబీకే ప్రసాద్

హైదరాబాద్: సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్ సతీమణి సుధారాణి కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. వారం క్రితం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 8 గంటలకు ఆమె మృతి చెందారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం భట్లపెనుమర్రుకు చెందిన సుధారాణిని, కృష్ణా జిల్లా ఉప్పులూరుకు చెందిన ఏబీకే ప్రసాద్ 1955లో వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు కుమార్తెలు హేమలత, స్వర్ణలత, విశ్వభారతి, రాధిక ఉన్నారు. ఏబీకే ప్రసాద్ భార్య సుధారాణితో కలిసి కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు.

నివాళులర్పించిన ప్రముఖులు: కిమ్స్ ఆస్పత్రి నుంచి మంగళవారం ఉదయం సుధారాణి భౌతికకాయాన్ని సీఆర్ ఫౌండేషన్‌కు తీసుకొచ్చారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సాక్షి ఫైనాన్స్ అండ్ అడ్మిన్ డైరెక్టర్ వైఈపీ రెడ్డి, ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి, ఎడిటర్ వర్ధెల్లి మురళి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సుగుణమ్మ, ఇతర పాత్రికేయ ప్రముఖులు నివాళులు అర్పించారు. ఏబీకే ప్రసాద్‌ను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సుధారాణి చితికి నిప్పంటించిన సోదరుడు

ఏబీకే ప్రసాద్ సతీమణి సుధారాణి అంత్యక్రియలు రాయదుర్గంలోని మహాప్రస్థానం శ్మశానవాటికలో మంగళవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. సుధారాణి చితికి ఆమె సోదరుడు చలసాని వేణుదుర్గాప్రసాద్ నిప్పంటించారు.

మానవత్వం లేని ప్రభుత్వమిది

ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆగ్రహం

- దివ్యాంగుల పట్ల కనికరమే లేదని మండిపాటు
- మన ప్రభుత్వం రాగానే వారి కార్పొరేషన్‌ను సంస్కరిస్తాం
- అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తామని హామీ



గుంటూరు జిల్లా ఈతేరు వద్ద ఓ అవ్వ చెబుతున్న సమస్యలను సావధానంగా వింటున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'దివ్యాంగులను సైతం ఆదుకోలేని ప్రభుత్వమిది.. వాళ్లేమైనా గొంతెమ్మ కోరికలు కోరుతున్నారా? నిరాదరణకు గురవుతున్న తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.. ఆ మాత్రం ఆదుకోలేకపోతే సంక్షేమ ప్రభుత్వం అనేదానికి అర్థం ఏముంటుంది? అసలు ఈ ప్రభుత్వానికి కొంచమైనా మానవత్వం ఉందా..?' అని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర 111వ రోజు మంగళవారం ఏపీలోని గుంటూరు జిల్లా బాపట్ల నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా వివిధ వర్గాలు, కుల సంఘాల నేతలు, అన్నదాతలు వైఎస్ జగన్‌ను కలిసి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ''ఈ ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదయ్యా.. మీరే ఆదుకోవాలయ్యా..'' అంటూ అడుగడుగునా తమ సమస్యలను వెళ్లబోసుకున్నారు. వారందరి సమస్యలను ఓపిగ్గా వింటూ, ఓదార్చుతూ.. ధైర్యం చెబుతూ జననేత ముందుకు సాగారు.

రూ.3 వేలు పింఛన్ ఇప్పించండి సార్..

కాళ్లూ చేతులు లేని వారు కొందరు, కంటి చూపు లేని వారు మరికొందరు, విధి వంచితులు ఇంకొందరు, ఊతకర్రతో నడిచే వారు మరి కొందరు.. వీరంతా తమకు నెలకు రూ.3 వేల పింఛన్ ఇప్పించాలని జగన్‌కు విన్నవించారు. అనేక సమస్యలు, ఈతిబాధలతో ఇక్కట్లు పడుతున్న వందలాది మంది దివ్యాంగులు కొండుభొట్లవారి పాలెం అడ్డరోడ్డు వద్ద జగన్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రస్తుతం పింఛన్‌గా వస్తున్న రూ.వెయ్యి, రూ.1,500 తమ కుటుంబ పోషణకు సరిపోవడం లేదన్నారు. ఈ పింఛన్‌ను కూడా వేలి ముద్రలు పడడం లేదని కొందరికి ఇవ్వడం లేదని వాపోయారు. ఉద్యోగాలు, ఉపాధి లేక అల్లాడాల్సి వస్తోందన్న ఆక్రోశం వెళ్లగక్కారు. రాష్ట్రంలో 22 లక్షల మంది దివ్యాంగులం ఉన్నామని, ఇళ్లు లేని వారికి స్థలాలు ఇచ్చి గృహ వసతి కల్పించాలని కోరారు. తమకు 3 శాతం రిజర్వేషన్లు ఉన్నా ఉద్యోగాలు భర్తీ చేయడం లేదన్నారు. దివ్యాంగుల గుర్తింపు కార్డుల కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తోందని వాపోయారు. జగన్ స్పందిస్తూ.. దివ్యాంగుల డిమాండ్లన్నీ న్యాయ సమ్మతమైనవే అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల కార్పొరేషన్‌ను సంస్కరించి అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

111వ రోజు
13–03–2018,
మంగళవారం
ఈతేరు, గుంటూరు జిల్లా



ఆ అక్కచెల్లెమ్మల ఆప్యాయత చూసి కళ్లు చెమర్చాయి

కొండుభొట్లవారిపాలెం ఊరు దాటేప్పటికే సూర్యుడుకాస్తా చురుక్కుమంటున్నాడు. ఆ ఎండలోనూ అడుగులు వడివడిగా పడుతున్నాయి. చుట్టూ పొలాలే కావడంతో నడక స్పీడు పెరిగింది. ఆ సమయంలో కనిపించిన దృశ్యం ముందుకు కదలనీయలేదు. కనుచూపుమేరలో పొలాల గట్లమీద అక్కచెల్లెమ్మలు పరుగులుదీస్తూ వస్తున్నారు.. చేతులూపుతూ ఏదో చెబుతున్నారు.. అక్కడే ఆగిపోయాను. వాళ్ల పరుగు వేగం మరింత పెరిగింది. నేను నిలబడ్డ రోడ్డుకు, వాళ్లు వస్తున్న పొలాలకూ మధ్య నీళ్లతో నిండిన మోకాళ్లలోతు కాలువ ఉంది. అయినా వాళ్లు లెక్కచేయలేదు. రొప్పుతూ, ఆయాస పడుతూ, హమ్మయ్యా.. అనుకుంటూ వచ్చారు. 'అన్నా..' అంటూ ఆప్యాయంగా చుట్టుముట్టారు. ఆత్మీయంగా చేతులు పట్టుకుని ముచ్చట్లు చెప్పారు. వాళ్లంతా అక్కడ మినుము చేలో కూలికి వచ్చారట. దగ్గర్లోని మర్రిపూడి గ్రామానికి చెందినవారట. 'అన్నా.. మాకెంత ఆనందంగా ఉందో' అందో చెల్లెమ్మ. 'మాకిది మరిచిపోలేని రోజు' అంది ఓ అక్క. 'మీ నాన్నే మాకు నీడనిచ్చాడు.. ఆయన పాలన వచ్చాకే కడుపునిండా అన్నం తిన్నాం.. అందుకే నువ్వు వస్తున్నది చూసి.. తినే తిండిని కూడా పక్కన పెట్టి ఇదిగో చేతులు కూడా కడుక్కోకుండా వచ్చాం..' అంటూ చేయి చూపింది వాలి లక్ష్మి. ఆ అక్కచెల్లెమ్మల ఆప్యాయత చూసి కళ్లు చెమర్చాయి. మరో ఫర్లాంగు దూరం వెళ్లానో లేదో.. ఇదే సన్నివేశం. కేవీపాలేనికి చెందిన మహిళా కూలీలు పరిగెత్తుకొచ్చి నాతో కష్టసుఖాలు చెప్పుకొన్నారు. మీ నాన్న మాకు దేవుడి తర్వాత దేవుడు లాంటివాడు.. అన్ని రకాలుగా ఆదుకున్నాడు.. అందో అమ్మ. ఆమె చెప్పడం పూర్తికాక ముందే.. సోదరి జ్యోతి కడుపులోంచి పొంగుకొస్తున్న ప్రేమను నాముందుంచింది.. నాన్నగారి హయాంలో ఆ తల్లికి జరిగిన మేలును గుర్తుచేసుకుంది. 'అప్పట్లో నా భర్త కాలు విరిగిందన్నా.. మీ నాన్నగారిచ్చిన ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో పైసా ఖర్చుపెట్టకుండా వైద్యం చేయించుకున్నాం. ఇప్పుడు పనికెళ్తున్నాడన్నా. ఆయన బయటపడతాడని నేనసలు అనుకోలేదు. మీ నాన్నగారే లేకపోతే.. అన్ని లక్షల రూపాయలు ఎక్కడ తెచ్చి వైద్యం చేయించేవాళ్లం?' అంటూ సంతోషం వ్యక్తం చేసింది.

కాస్త ముందుకెళ్లగానే దాదాపు వందమందికి పైగా దివ్యాంగులు కలిశారు. 'అన్నా.. ఈ పాలనలో మాకు న్యాయం జరగడంలేదు. మీ నాన్నగారి హయాంలో సదరం క్యాంపు సర్టిఫికెట్ ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ వచ్చేది. కానీ ఇప్పుడు జన్మభూమి కమిటీల సిఫారసు లేనిదే.. వందశాతం వైకల్యం ఉన్నా పింఛన్ ఇవ్వడం లేదు. వాళ్ల సిఫారసు కావాలంటే చేయి తడపాల్సిందే. మాలో 90 శాతం మందికి పింఛన్ రూ.1,000 మాత్రమే ఇస్తున్నారు. కొద్ది మందికి మాత్రమే రూ.1,500 వస్తోంది. కానీ ఈ ప్రభుత్వం మాత్రం దివ్యాంగులందరికీ రూ.1,500 ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటోంది. అంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. దివ్యాంగుల పట్ల ఎంతో ఉదారంగా ఉండాల్సిన ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో వారికి అందాల్సిన సంక్షేమ పథకాలలో కోత విధించడం, వివక్ష చూపించడం అమానుషం కాదా?

వైఎస్. జగన్. (సంతకం)

ప్రజల అవసరాలే ఎజెండా

2018-19 బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి ఈటల

- వ్యవసాయానికే తొలి ప్రాధాన్యం
- 'సాగు'కు గతేడాది కంటే ఎక్కువ నిధులు
- 'సాక్షి'తో ఈటల ఇంటర్వ్యూ



సాక్షి, హైదరాబాద్: రాబోయే ఎన్నికలు.. ఓట్లను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన అవసరం తమకు లేదని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలే లక్ష్యంగా బడ్జెట్ రూపు దిద్దుతామని చెప్పారు. బుధవారం అసెంబ్లీలో 2018–19 వార్షిక బడ్జెట్ మంత్రి ప్రవేశపెట్టనున్నారు. తెలంగాణ తొలి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఈటల వరుసగా 5 సార్లు బడ్జెట్ ప్రవేశపెడుతుండటం విశేషం. ఈ నేపథ్యంలో 'సాక్షి'కి ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో కొత్త బడ్జెట్ విశేషాలు.. ప్రభుత్వం ఎంచుకున్న ప్రాధాన్యాంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

సాక్షి: ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యాంశాలు ఏంటీ?

ఈటల: నాలుగేళ్ల సంక్షేమం, ప్రజల అవసరాలే ఎజెండాగా బడ్జెట్ ప్రవేశపెట్టాం. ఈసారి వ్యవసాయం, అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం, సంక్షేమ రంగానికి రెండో ప్రాధాన్యం ఉంటుంది. పరిశ్రమలు, ఐటీ రంగానికి మూడో ప్రాధాన్యం ఉంటుంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయిస్తాం.

సాక్షి: కొత్త పథకాలు అమలు చేసే ప్రణాళిక ఉందా?

ఈటల: రైతులకు రుణమాఫీతో పాటు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ఆలోచనతో రూపొందించిన వ్యవసాయానికి పెట్టుబడి సాయం పథకానికి ఈసారి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తాం. రైతులకు బీమా పథకాన్ని వర్తింపజేస్తాం. రైతులకు సంపూర్ణ ధీమా అందిస్తాం.

సాక్షి: బడ్జెట్ భారీగానే ఉండబోతుందా.. రాష్ట్ర ఆదాయ వ్యయాలు అంచనాలకు తగ్గట్లే ఉన్నాయా?

ఈటల: వృద్ధి రేటు భారీగానే ఉంది. రాష్ట్ర బడ్జెట్ అదే తీరుగా ఉంటుంది. గతేడాది రూ.1.49 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టాం. అందులో దాదాపు రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు చేశాం. బడ్జెటేతర నిధులు మరో రూ.25 వేల కోట్లకు వరకు వెచ్చించాం. రెండింటినీ కలిపితే బడ్జెట్ అంచనాలకు చేరువయ్యాయి.

సాక్షి: జీఎస్‌టీ ప్రభావం ఉందా? కేంద్రం నుంచి ఆశించినన్ని నిధులొచ్చాయా?

ఈటల: రెవెన్యూ రాబడిపై జీఎస్‌టీ ప్రభావం పడింది. దీంతో అంచనాలకు అనుగుణంగా ఆదాయ వృద్ధి జరగలేదు. కానీ క్రమంగా స్థిర పడుతోంది. వచ్చే ఏడాది మరింత పుంజుకుంటుందనే ఆశాభావం ఉంది. కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ నిధులేమీ రాలేదు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే పన్నుల వాటా, జీఎస్‌టీ వాటా వచ్చాయి. రాష్ట్రం చెల్లించిన పన్నుల నుంచి కేంద్రం రాజ్యాంగం ప్రకారం ఇవ్వాల్సిన వాటానే ఇచ్చింది. అదనంగా గ్రాంట్లు రాలేదు.

సాక్షి: నిరుడు ఎంబీసీలకు కేటాయించిన రూ. 1,000 కోట్లు ఖర్చవలేదు.. ఎస్సీ ఎస్టీ అభివృద్ధి నిధుల్లో ఖర్చవనివి వచ్చే ఏడాదికి బదిలీ చేస్తారా?

ఈటల: ఎంబీసీల పథకాలు, ప్రణాళిక, కార్పొరేషన్ ఏర్పాటులో జాప్యం జరిగింది. ఈసారి బడ్జెట్ తర్వాత నేరుగా పథకాలు అమలు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధికి కేటాయించిన నిధులను వివిధ పథకాల రూపంలో జనాభా శాతానికి మించే ఖర్చు చేశాం.

సాక్షి: భారీగా అప్పులు తెస్తున్నారు.. భవిష్యత్‌లో ఇబ్బందులు రావా?

ఈటల: ఏ రాష్ట్రమైనా నిర్ణీత నిబంధనల మేరకే అప్పులు చేస్తుంది. అప్పులు రాష్ట్ర జీఎస్‌డీపీలో 25 శాతం మించకూడదు. తెలంగాణ జీఎస్‌డీపీ దాదాపు రూ.8 లక్షల కోట్లు. అప్పులు రూ.2 లక్షల కోట్ల లోపే ఉన్నాయి. వాటిని ఆస్తుల కల్పనకు, ప్రాజెక్టులు, రోడ్లు, భవనాల నిర్మాణానికే ఖర్చు చేశాం. అవన్నీ ప్రజల అవసరాలే. ఎఫ్‌ఆర్‌బీఎం పరిధికి లోబడి అప్పులు తీసుకున్నాం. తెలంగాణ రెవెన్యూ మిగులు రాష్ట్రం. అందుకే కేంద్రం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితినీ 3.5 శాతానికి పెంచింది. గ్యారంటీలిచ్చి కొన్ని రుణాలు తీసుకున్నాం. రాష్ట్ర రెవెన్యూ రాబడిలో 90 శాతం మించకుండా గ్యారంటీలు ఇచ్చే వెసులుబాటు ఉంటుంది. నిబంధనల మేరకే నిధుల సమీకరణ చేసి ఆర్థిక క్రమశిక్షణ పాటించినందుకే తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలబడింది.

సాక్షి: అయిదోసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు.. మీ అనుభూతి ఎలా ఉంది? ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

ఈటల: ఉద్యమ సమయంలో ఉన్న అనుమానాలు, సందేహాలు, సంశయాలన్నీ పటాపంచలయ్యాయి. కొత్త రాష్ట్రం ఏర్పడి ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరే మంచి రోజులొచ్చాయి. ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, రేషన్ బియ్యం, కేసీఆర్ కిట్లు.. ప్రజలకు ఆపద వచ్చినప్పుడల్లా ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసాను టీఆర్ఎస్ ప్రభుత్వం అందించింది. ఆత్మహత్యలు, కరువు కాటకాల తెలంగాణను ఆకుపచ్చ తెలంగాణ దిశగా.. అసలు సిసలు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలబెట్టగలిగాం.

వెబ్‌సైట్‌లో జేఈఈ మెయిన్ హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ఏప్రిల్‌లో నిర్వహించనున్న జేఈఈ మెయిన్ పరీక్షల హాల్‌టికెట్లను సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) అందుబాటులోకి తెచ్చింది. జేఈఈ మెయిన్ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ల (ఈ–అడ్మిట్ కార్డు) డౌన్‌లోడ్ లింకును అందుబాటులో ఉంచింది. దేశవ్యాప్తంగా 112 కేంద్రాల్లో వచ్చే నెల 8న ఆఫ్‌లైన్ పరీక్షను, అదే నెల 15, 16వ తేదీల్లో దేశంలోని 258 కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనుంది. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు తలెత్తితే విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాన్ని 7042399520, 7042399521, 7042399525, 7042399526 నంబర్లలో సంప్రదించవచ్చు. పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 వరకు సంప్రదించవచ్చని పేర్కొంది. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది.

నేడు వెబ్‌సైట్‌లో టీఆర్‌టీ ప్రాథమిక కీలు

21 నుంచి 31వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: వివిధ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ఇటీవల నిర్వహించిన టీఆర్‌టీ పరీక్షల ప్రాథమిక కీలను tspsc.gov.in వెబ్‌సైట్‌లో బుధవారం నుంచి అందుబాటులో ఉంచనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, లాంగ్వేజ్ పండిట్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల కీలపై ఈ నెల 21 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు పేర్కొంది. 31 తర్వాత అభ్యంతరాలను స్వీకరించమని స్పష్టం చేసింది. అభ్యర్థులు తమ అభ్యంతరాలను 'టెక్స్ట్ బాక్స్ ఆఫ్ సబ్మిట్ ఆబ్జెక్షన్స్'లింకు ద్వారా పంపించాలని, బాక్సు లో ఇంగ్లిష్‌లోనే టైప్ చేయాలని సూచించింది. ఇతర భాషల్లో అభ్యంతరాలు తెలపాల నుకునే వారు పీడీఎఫ్‌లో ఫైల్ అటాచ్ లింకు ద్వారా పంపించాలని సూచించింది.

ఏప్రిల్‌లో డీఎల్‌ఎడ్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా కొనసాగుతున్న డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) కోర్సు మొదటి సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ చివరివారంలో ఉంటాయని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్) ప్రాంతీయ సంచాలకుడు ఆర్.అనిల్‌కుమార్ తెలిపారు. అలాగే ఈ నెల 15లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టీజీసెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ, విద్యా శాఖ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీసెట్) దరఖాస్తుల గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు టీజీసెట్ కన్వీనర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ (tgcet.cgg.gov.in)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు గడువు 26 వరకు

హైదరాబాద్: ట్రిపుల్ ఐటీ–హైదరాబాద్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువు తేదీని మార్చి 15 నుంచి 26 వరకు పొడిగించారు. అడ్మిషన్ల ప్రక్రియలో అనేక మార్పులు చేసిన నేపథ్యంలో అధికారులు గడువును పెంచారు. అడ్మిషన్ల ప్రక్రియలో మార్పులకు శ్రీకారం చుట్టామని.. భిన్నంగా, వినూత్నంగా ఆలోచించే విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు ట్రిపుల్ ఐటీ అకడమిక్ డీన్ ప్రొఫెసర్ చెప్పారు.

'ఆర్టీసీ ఆస్పత్రిలో స్పెషలిస్టుల్ని నియమించాలి'

సాక్షి, హైదరాబాద్: తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో స్పెషలిస్టు డాక్టర్లు లేక తీవ్ర ఇబ్బంది ఎదురవుతోందని, ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి వైద్యులను నియమించాలని ఆర్టీసీ ఎన్ఎంయూ డిమాండ్ చేసింది. ప్రతిరోజు 1300 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారని, స్పెషలిస్టులు లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆ సంఘం నేతలు నాగేశ్వరరావు, కమాల్‌రెడ్డి, మౌలానా, నరేందర్‌లు ఓ ప్రకటనలో తెలిపారు.

సిరిసిల్లలో అపెరల్ సూపర్ హబ్!

రూ.100 కోట్లతో మూడేళ్లలో ఏర్పాటు

- ప్రభుత్వంతో కే వెంచర్స్ సంస్థ ఎంవోయూ
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి: కేటీఆర్



మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న చేనేత శాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్, కే వెంచర్స్ ప్రతినిధి

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల వస్త్ర పారిశ్రామికవాడలో ఆధునిక యంత్ర పరికరాలతో అపెరల్ సూపర్ హబ్ ఏర్పాటు కానుంది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రముఖ వస్త్ర ఉత్పత్తి సంస్థ 'కే వెంచర్స్'ఈ హబ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు సమక్షంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖతో కే వెంచర్స్ సంస్థ మంగళవారం సచివాలయంలో పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. సిరిసిల్ల జిల్లా పెద్దూరులోని 60 ఎకరాల్లో వస్త్ర పారిశ్రామికవాడను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండగా, అందులోని 20 ఎకరాల్లో 5,000 కుట్టు యంత్రాల యూనిట్లు సహా ఎంబ్రాయిడరీ, ప్రింటింగ్, వాషింగ్ తదితర యంత్ర పరికరాలతో హబ్ ఏర్పాటు కానుంది. మూడు విడతలుగా మూడేళ్లలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 15 వేల మంది, పరోక్షంగా మరో 15 వేల మందికి ఉపాధి లభించనుందని.. అందులో 90 శాతం మహిళలే ఉంటారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ జనాభా 75 వేలని, ఈ పరిశ్రమ ద్వారా 30 వేల మందికి జీవనోపాధి లభిస్తుందని చెప్పారు. హబ్ ఏర్పాటుకు కే వెంచర్స్ రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టనుందని, ప్రాజెక్టుకు మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం అందించనుందని వెల్లడించారు. సిరిసిల్ల ప్రాంతంలో ఉన్న చేనేత, పవర్‌లూం రంగ కుటీర పరిశ్రమలన్నింటినీ సమీకరించి వర్క్ ఆర్డర్లు ఇప్పించడం ద్వారా ఉత్పత్తిని పెంచేందుకు అపెరల్ సూపర్ హబ్ కృషి చేస్తుందన్నారు. ప్రాజెక్టులో భాగంగా వచ్చే నెలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తారని, మరో ఏడాదిలోపు తొలి దశ ప్రాజెక్టు కింద వస్త్ర ఉత్పత్తులు ప్రారంభమవుతాయని చెప్పారు. పరిశ్రమ ద్వారా ఏటా 25 లక్షల వస్త్రాలు ఉత్పత్తి అవుతాయన్నారు. సూపర్ హబ్ నుంచి అరవింద్, శ్యాం లాంటి ప్రముఖ బ్రాండ్‌ల వస్త్ర ఉత్పత్తులు జరిపేందుకు ఆయా కంపెనీలతో కే వెంచర్స్ చర్చలు జరుపుతోందని మంత్రి చెప్పారు.

గుండ్ల పోచంపల్లిలో ఫ్యాషన్ సిటీ

కాకతీయ టెక్స్‌టైల్స్ పార్కులో కొరియాకు చెందిన యాంగ్వాన్ కంపెనీ 8 ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయనుందని, దీని ద్వారా 8 వేల మందికి ఉపాధి లభించనుందని మంత్రి వెల్లడించారు. నిరుపయోగంగా ఉన్న గుండ్ల పోచంపల్లి వస్త్ర పారిశ్రామికవాడను ఉపయోగంలోకి తీసుకొస్తామని, దీని ద్వారా 25 వేల మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. నిఫ్ట్ డైరెక్టర్‌గా పని చేసిన డాక్టర్ రాజారాంను ఈ పారిశ్రామికవాడకు సీఈఓగా నియమించామ న్నారు. మార్కెట్లోకి వస్తున్న ఫ్యాషన్ కొత్త పోకడలను అనుసరిస్తేనే వస్త్ర వ్యాపారం వృద్ధి చెందుతుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గుండ్ల పోచం పల్లిలో 10 ఎకరాల్లో ఫ్యాషన్ సిటీ ఏర్పాటు చేసేందుకు యాంగ్వాన్ కంపెనీ ముందుకు వచ్చిందని తెలిపారు. వస్త్ర పరిశ్రమ రంగంలో కోయంబత్తూరు, కరూరు, తిరుచూరులతో తెలంగాణ పోటీపడాలన్నారు. చేనేత, పవర్‌లూం కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేటీఆర్ వివరిం చారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, చేనేత శాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్, కే వెంచర్స్ సీఈఓ ఎస్.సు సింద్రన్, సిరిసిల్ల మునిసిపల్ చైర్మన్ పావని తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

- 2,542 కేంద్రాలు.. 5,38,867 మంది విద్యార్థులు
- నిర్ణీత సమయం దాటాక ఐదు నిమిషాల వరకు అనుమతి
- డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లకు అనుమతి
- వెల్లడించిన పాఠశాల విద్యా కమిషనర్ కిషన్

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షలను ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాఠశాల విద్యా కమిషనర్ కిషన్ వెల్లడించారు. పరీక్షల ఏర్పాట్లపై ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సుధాకర్‌తో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 2,542 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు 5,38,867 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. 26 సమస్యాత్మక కేంద్రాలతోపాటు మరో 405 పరీక్ష కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లను పంపించామని, అందని వారు, స్కూళ్లు నిరాకరిస్తే వెబ్‌సైట్ నుంచి (www.bse.telangana.gov.in) డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

5 నిమిషాలు గ్రేస్ పీరియడ్..

పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతాయని (కొన్ని సబ్జెక్టులు 12:45 గంటల వరకు), విద్యార్థులు ఉదయం 8:45 గంటల కల్లా పరీక్ష కేంద్రంలోకి చేరుకోవాలని కిషన్ సూచించారు. అయితే నిర్ణీత సమయం 9:30 గంటల తరువాత 5 నిమిషాల వరకే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు.

బీజీ-2 పత్తి విత్తన ప్యాకెట్ ధర 740

- అందులో రాయల్టీ రూ. 39
- కేంద్రం గెజిట్ నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: బీజీ పత్తి విత్తన ధరలను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి బీజీ–1 పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ. 635గా ఖరారు చేసింది. దీనికి రాయల్టీని ఎత్తివేసింది. ఇక రైతులు విరివిగా వినియోగించే బీజీ–2 విత్తన ప్యాకెట్ ధర రూ. 740 నిర్ధారించింది. అందులో రూ. 39 రాయల్టీ ప్రకటించింది. గతేడాది కంటే కాస్త ధర తగ్గించడం గమనార్హం. ఒక్కో ప్యాకెట్ 450 గ్రాములుంటుందని కేంద్ర వ్యవసాయ శాఖ తన గెజిట్‌లో వివరించింది. 2017–18 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఏకంగా 47 లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. దాదాపు కోటి ప్యాకెట్ల వరకు రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. ఈసారి వేసిన అంచనా ప్రకారం 90 లక్షల బీజీ–2 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఆ ప్రకారం కంపెనీలు రైతులకు పత్తి విత్తనాలను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

ఉత్తరప్రదేశ్‌కు తెలంగాణ సోన విత్తనం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్–15048) రకం వరి విత్తనాలను పంపాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ శాంతోష్‌కుమార్‌ఖేరే మంగళవారం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావుతో సమావేశమయ్యారు. అలాగే శనగ, ఇతర పప్పుధాన్యాల ఉత్పత్తి, సరఫరా కోసం రెండు రాష్ట్రాల మధ్య అవగాహన ఒప్పందం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో రైతుల సంక్షేమం కోసం తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలను వ్యవసాయ కమిషనర్ జగన్‌మోహన్ వివరించారు.

కంది చెల్లింపులకు రూ.640 కోట్ల రుణం

సాక్షి, హైదరాబాద్: కంది రైతులు బకాయిలు తీర్చడానికి, రూ.640 కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. మార్క్‌ఫెడ్ రూ.440 కోట్లు, హాకా రూ.200 కోట్లు తీసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆ రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. గతంలో చెల్లింపుల కోసం ఈ రెండు సంస్థలకు కలిపి రూ.600 కోట్ల రుణానికి అనుమతి ఇచ్చింది.

సీఎంను కలిసిన సీపీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అంజనీ కుమార్, డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డితో కలసి సీఎం కేసీఆర్‌ను మంగళవారం కలిశారు. ప్రజల ఆకాంక్షకు, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సీఎం కొత్వాల్‌ను ఆదేశించారు.

ఎస్సీ సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మార్పీఎస్–టీఎస్

హైదరాబాద్: ఎస్సీ సంక్షేమంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్–టీఎస్ డిమాండ్ చేసింది. ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 20న సమరభేరి సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్–టీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక అధ్యక్షుడు తమకం వీరేశంలు తెలిపారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్–టీఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు కింది ఉపకులాలకు చేరడం లేదని, దీనిపై ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి జగదీశ్‌రెడ్డిలు స్పందించాలని కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్, డప్పు చెప్పుకు 2వేల రూపాయల పెన్షన్ విషయంలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు.

కోదండరాం పార్టీలోకి ఇన్నయ్య

కోదండరాం సమక్షంలో నేడు చేరిక

సాక్షి, హైదరాబాద్: జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో ఏర్పాటుకానున్న తెలంగాణ జన సమితిలోకి ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య చేరనున్నారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించబోయే కార్యక్రమంలో కోదండరాం సమక్షంలో ఆయన చేరనున్నారు. టీఆర్ఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన గాదె ఇన్నయ్య తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది వేయడానికి విశేషంగా కృషి చేశారు. వివిధ శాఖలు, రంగాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాలను అంకెలతో సహా అధ్యయనం చేసి, పలు పుస్తకాల ద్వారా వెలుగులోకి తెచ్చారు. అంతకుముందు పీపుల్స్‌వార్‌లోనూ పనిచేశారు. టీఆర్ఎస్ ఆవిర్భావానికి ముందుగానే పార్టీ అధినేత కేసీఆర్‌తో కలసి పనిచేశారు. ఆ తర్వాత కేసీఆర్‌తో విభేదించారు. రాష్ట్ర సాధనకోసం వివిధ ఉద్యమసంస్థలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా జఫర్‌ఘడ్‌లో ఓ అనాథాశ్రమాన్ని నడిపిస్తున్నారు.

ఏప్రిల్ ఆఖరులోగా పాఠశాలల గుర్తింపు

విద్యా శాఖ నిర్ణయం: కమిషనర్ కిషన్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలల ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టెంపరరీ రికగ్నైజేషన్ (ఈటీఆర్) గుర్తింపు ప్రక్రియను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేయాలని నిర్ణయించినట్లు విద్యా శాఖ కమిషనర్ కిషన్ వెల్లడించారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయం నాటికి గుర్తింపులేని స్కూళ్లు అనేవే లేకుండా, ముందుగానే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో 12 స్కూళ్లకు సంబంధించిన ఈటీఆర్‌ల విషయంలో ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసిన సిబ్బందిపై కేసులు నమోదు చేశామని, విచారణ కొనసాగుతోందన్నారు. హైదరాబాద్‌లో ఇంటి అడ్వాన్స్‌ల విషయంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పెట్టి రుణం తీసుకున్న సిబ్బంది విషయంలోనూ విచారణ జరుపుతున్నామన్నారు.

సాక్షి

బుధవారం, మార్చి, 14

పదునుతేరిన బంధం!

అంతర్గత సమస్యలు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రవచిస్తున్న 'అమెరికా ఫస్ట్', రష్యా నుంచి అడపా దడపా ఎదురయ్యే చికాకులు ప్రపంచీకరణ పునాదుల్ని కదిలిస్తున్న తరుణంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ భారత్‌లో నాలుగురోజులు పర్యటించారు. రక్షణ, భద్రత, అణు ఇంధనం వగైరా రంగాల్లో ఇరు దేశాల మధ్యా 14 ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాలకు చెందిన కంపెనీల మధ్యా కుదిరిన ఒప్పందాల విలువ లక్ష కోట్ల రూపాయలపైబడే ఉంది. భారత్–ఫ్రాన్స్‌ల మధ్య ఎంతటి గాఢమైన అనుబంధం ఉన్నదో చెప్పడానికి మాక్రాన్‌కు లభించిన ఘనమైన స్వాగతసత్కారాలే తార్కాణం. అలాగని గత నెల మన దేశంలో పర్యటించిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో తరహాలో మాక్రాన్ సూటూ బూటూ వదిలి ఇక్కడి సంప్రదాయ దుస్తులు ధరించి మనల్ని అలరించాలని చూడలేదు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయానా విమానాశ్రయానికెళ్లి మాక్రాన్ దంపతులకు స్వాగతం పలికారు. ఆయనను ఆలింగనం చేసుకున్నారు. ఇది కొత్తగా పుట్టుకొచ్చిన అనుబంధం కాదు. రెండు దేశాలూ వ్యూహాత్మక బంధంలోనికి అడుగుపెట్టి రెండు దశాబ్దాలు పూర్తయింది. 1998లో వాజపేయి హయాంలో మన దేశం పోఖ్రాన్‌లో అణు బాంబు పరీక్ష నిర్వహించినప్పుడు అమెరికా, బ్రిటన్, చైనా తదితర దేశాలన్నీ తీవ్ర విమర్శలకు దిగితే ఫ్రాన్స్ మనకు అండగా నిలబడింది. యూరప్ యూనియన్ (ఈయూ) శిఖరాగ్ర సదస్సులో భారత్‌పై ఆంక్షలు తెచ్చేందుకు బ్రిటన్ ప్రయత్నిస్తున్నప్పుడు దాన్ని వీటో చేస్తానని హెచ్చరించింది ఫ్రాన్సే. అందుకు ఆనాటి భద్రతా సలహాదారు బ్రజేష్ మిశ్రా స్వయంగా పారిస్ వెళ్లి కృతజ్ఞతలు చెప్పి వచ్చారు. అనంతరకాలంలో రెండు దేశాల మధ్యా వ్యూహాత్మక ఒప్పందం కుదిరింది.

నిలకడగా మాట్లాడటం, నిర్దిష్టమైన విధానాల్ని ప్రకటించి వాటికి కట్టుబడి ఉండటం డోనాల్డ్ ట్రంప్‌కు లేని కారణంగా అంతర్జాతీయంగా ఒక అనిశ్చితి ఏర్పడింది. అమెరికాతో తమకెలాంటి సంబంధాలున్నాయో, అవి ఎటుపోతాయో తెలియని అయోమయ స్థితిలో ప్రతి దేశమూ ఉంది. ఇటు చైనా అందుకు పూర్తి విరుద్ధం. ట్రంప్ తీరుతెన్నుల పర్యవసానంగా ఏర్పడ్డ ఈ పరిస్థితిని అది సంపూర్ణంగా వినియోగించుకుంటోంది. తన పలుకుబడి విస్తరించుకుంటోంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు తాజాగా వచ్చిన అపరిమిత అధికారాల కారణంగా ఈ దూకుడు ఉన్నకొద్దీ పెరుగుతుందే తప్ప తగ్గదు. అటు రష్యా కూడా కొత్త ఎత్తులు వేస్తోంది. చైనా, పాకిస్తాన్‌లతో అంటకాగడానికి ఉత్సాహపడుతోంది. ఈ పరిస్థితుల్లో భారత్–ఫ్రాన్స్‌లు మరింత దగ్గరయ్యాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఇప్పటికే నిర్ణయించగా...ఫ్రాన్స్‌తో మన దేశానికి ఇప్పుడు కుదిరిన సైనిక దళాల సహకార ఒప్పందం దాన్ని మరింత పటిష్టపరుస్తుంది. ఇరు దేశాల సైన్యాలు పరస్పరం సహకరించుకోవడానికి, ఉమ్మడి విన్యాసాలకూ, శిక్షణకూ, విపత్తుల్లో సాయం ఇచ్చిపుచ్చుకోవడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఫ్రాన్స్‌కు జిబౌతి, అబూధాబీ, రీయూనియన్ ఐలాండ్ వగైరాల్లో సైనిక స్థావరాలున్నాయి. మన దేశం కూడా సెషెల్స్, మారిషస్, ఒమన్‌లలో నావికా దళ సదుపాయాలను సమకూర్చుకోవాలని చూస్తోంది. ఈ విషయంలో ఇప్పుడు కుదిరిన ఒప్పందం తోడ్పడుతుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఒక్కో దేశంతోనే సన్నిహితమవుతూ భారత్ పలుకుబడిని తగ్గిస్తున్న చైనా పోకడలను నిలువరించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇరు దేశాల నావికా దళాలూ ఒకరి స్థావరాలను మరొకరు వినియోగించుకునే సదుపాయం వల్ల ఇండో–పసిఫిక్ ప్రాంత భద్రతకు భరోసా ఏర్పడుతుంది. సౌరశక్తి వినియోగంలో పరస్పర సహకారం పెంచుకుని శిలాజ ఇంధనాల అవసరాన్ని గణనీయంగా తగ్గించాలన్న సంకల్పంతో రెండు దేశాల చొరవతో ఇప్పటికే అంతర్జాతీయ సౌర కూటమి(ఐఎస్ఏ) ఏర్పడి పనిచేస్తోంది. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి దీన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని రెండు దేశాలూ నిర్ణయించాయి. అలాగే రకరకాల ఆంక్షలతో ట్రంప్ అమెరికా తలుపులు మూస్తున్న తరుణంలో మన విద్యార్థులకూ, శాస్త్రవేత్తలకూ, ఇంజనీర్లకూ ఫ్రాన్స్‌లో మెరుగైన అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్న మాక్రాన్ హామీ ఆశలు రేకెత్తిస్తుంది.

ఫ్రాన్స్‌తో యూపీఏ హయాంలో 2012లో కుదిరిన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపైనా, ఎన్‌డీఏ వచ్చాక ఆ యుద్ధ విమానాల కోసమే 2016లో కుదిరిన ఒప్పందంపైనా ఎన్ని వివాదాలు తలెత్తాయో అందరికీ గుర్తుంది. అప్పట్లో రూ. 1.34 లక్షల కోట్ల వ్యయంతో 126 విమానాలు కొనాలని యూపీఏ సర్కారు వాటిని ఉత్పత్తి చేసే డసాల్ట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. 18 విమానాలను నేరుగా అందజేసి, మిగిలిన 108 విమానాలనూ బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్(హెచ్ఏఎల్)లో ఉత్పత్తి చేసేతా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేస్తామని అది హామీ పడింది. కానీ ఇక్కడ రేకెత్తిన వివాదాలు చూసి వెనక్కు తగ్గింది. నరేంద్ర మోదీ 2015లో ఫ్రాన్స్ పర్యటించినప్పుడు రాఫెల్ విమానాలు 36 కొనాలన్న ఒప్పందంపై సంతకాలయ్యాయి. ఒక్కో విమానం విలువ దాదాపు రూ. 670 కోట్లు. యుద్ధ విమానాలకు సంబంధించి కుదిరిన ఒప్పందం బయట పెట్టాలని మొన్నటి పార్లమెంటు సమావేశాల్లో విపక్షాలు ఆందోళన చేయగా యూపీఏ హయాంలో 2008లో ఇరు దేశాల మధ్యా కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం కారణంగా దాన్ని బయటపెట్టలేకపోతున్నామని ప్రభుత్వం జవాబిచ్చింది. దాని ప్రకారం ఏ ఒప్పందంలోని అంశాలనైనా రెండు దేశాలూ వెల్లడించకూడదు. పదేళ్లపాటు అమల్లో ఉండే ఆ క్లాజుకు మొన్న జనవరి 24తో కాలదోషం పట్టింది. కనుక రాఫెల్ ఒప్పందాన్ని వెల్లడించడానికి ఇకపై ఎలాంటి ఆటంకాలూ ఉండవనుకునేలోగానే తాజాగా ఆ 'గోప్యత' క్లాజుకు రెండు దేశాలూ ప్రాణప్రతిష్ట చేశాయి. ఇది సహజంగానే 'రాఫెల్' చుట్టూ అల్లుకున్న వివాదాలను మరింత పెంచుతుంది. మొత్తానికి మాక్రాన్ పర్యటన ఇరు దేశాల సంబంధాలనూ మరింత ఉన్నత స్థితికి చేర్చింది.



ప్రపంచ రాజకీయాల అంతిమ సారాంశం అధికారం, ఆధిపత్యం కోసం పోరాటమే.. కానీ దాన్ని వివేచనతో కొనసాగించకపోతే మిగిలేది నిత్య ఘర్షణే.

– బిగ్నూ బ్రెజెన్‌స్కీ
అమెరికన్ దౌత్యవేత్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.ద్వాదశి ప.3.02 వరకు, తదుపరి త్రయోదశి నక్షత్రం శ్రవణం ప.2.36 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం సా.6.56 నుంచి 8.40 వరకు, దుర్ముహూర్తం ప.11.44 నుంచి 12.32 వరకు అమృతఘడియలు తె.5.21 నుంచి 7.04 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం : 6.03
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

నమాజ్ వేళలు

ఫజర్ : 5.13
జొహర్ : 12.25
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.26
ఇషా : 7.38


'చంద్రుల' నోట చైనా పాట



దేవులపల్లి అమర్

తెలుగు రాష్ట్రాల పాలకులు ఇద్దరూ తమకు అడ్డంకిగా మారిన ప్రతిపక్షాలను ఖాళీ చేయించడానికి అన్ని ప్రజాస్వామ్య సూత్రాలనూ కాలరాస్తున్నారు. తాము అధికారంలో ఉన్నాం కాబట్టి ఇక ప్రతిపక్షాల అవసరం లేదంటారు. నిరసనలకు తావే లేదంటారు. అక్కడా ఇక్కడా ప్రభుత్వం చేస్తున్న తప్పులను గురించి వేలెత్తి చూపే హక్కు, గొంతెత్తి మాట్లాడే హక్కూ లేకుండా చెయ్యడం నిత్యకృత్యం అయిపోయింది. ప్రజాస్వామ్యంలో ఉన్నామన్న విషయం మరిచిపోయి జిన్‌పింగ్‌లాగా శాశ్వతంగా అధికారంలో కొనసాగుతామని అనుకుంటూ ఉన్నందువల్లనే ఇద్దరు సీఎంలకూ అభివృద్ధిలో చైనా ఆదర్శంగా కనిపిస్తున్నట్లుంది.

డేట్‌లైన్ హైదరాబాద్



రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఈ మధ్య వేర్వేరు సందర్భాలలో చైనాలో పరిపాలనను, అక్కడ జరుగుతున్న అభివృద్ధిని ఉదహరించారు. ఇటు తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు తాను జాతీయ రాజకీయాలకు వెళ్లనున్నట్టు ప్రకటించిన సభలో చైనాను ప్రస్తావిస్తే, అటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్కడి శాసనసభలో మాట్లాడుతూ చైనాను కొనియాడారు. ఇద్దరి మాటల్లోనూ మనకు అర్థం అయింది ఏమిటంటే అభివృద్ధి సాధించాలంటే చైనాను ఆదర్శంగా తీసుకోవాలి అని. అభివృద్ధి అంటే ఏమిటి? అది ఎవరి అభివృద్ధి? దేన్నయినా పణంగా పెట్టి ఆ అభివృద్ధి సాధించుకోవలసిందేనా? చైనా సాధిస్తున్న అభివృద్ధిని గురించి ఇంకోసారి చర్చించుకుందాం. ఇటీవలే చైనా దేశ రాజ్యాంగాన్ని సవరించి ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ జీవితకాలం పదవిలో కొనసాగేందుకు వెసులుబాటు కల్పించింది ఆ దేశ పార్లమెంట్. రెండు సార్ల కంటే ఎక్కువగా అధ్యక్ష పదవిలో ఎవరూ కొనసాగకూడదన్న నియమాన్ని సవరించి జిన్‌పింగ్‌కు నిరాఘాటంగా అధికారంలో కొనసాగే అవకాశం కల్పించడం చైనా దేశాన్ని ఏకవ్యక్తి నియంతృత్వం వైపు నెట్టడమే అన్న విమర్శను అక్కడి ప్రభుత్వం తోసిపుచ్చి ఈ చర్యకు ప్రజల ఆమోదం ఉందని తేల్చేసింది.

చైనా మోడల్ దేనికి నిదర్శనం?

అభివృద్ధి పేరిట చైనా దేన్ని పణంగా పెడుతుందో ఈ తాజా చర్యల వల్ల మనకు అర్థమవుతుంది. అక్కడ జరుగుతున్న అభివృద్ధి ఎంత గొప్పగా ఉందో, అభివృద్ధి కోసం దేశాన్ని నియంతృత్వ పాలకుల చేతుల్లో ఎలా పెట్టెయ్యవచ్చునో, దానికోసం స్వేచ్ఛాస్వాతంత్ర్యాల అవసరం అసలే అక్కరలేదనో ఎవరయినా ఆర్థిక శాస్త్ర పండితులు చెప్తారేమో. కానీ భావ ప్రకటనా స్వేచ్ఛను, జీవించే హక్కును కోరుకునే వారెవ్వరూ ఇప్పటి చైనా పోకడలను హర్షించరు, ఆమోదించరు. విచిత్రంగా చైనాలో ఈ రాజ్యాంగ సవరణ జరుగుతున్న సమయంలోనే ఇక్కడ మన తెలుగు రాష్ట్రాల సీఎంలు ఇద్దరి నోటా చైనా అభివృద్ధి పాట వినిపించింది. నిజంగా ఈ ఇద్దరు నాయకులను చైనాలో జరుగుతున్న అభివృద్ధి ఆకర్షించిందా లేకపోతే జిన్‌పింగ్ లాగా తమకు శాశ్వత అధికారం కట్టబెడితేనే చైనా మోడల్ అభివృద్ధి సాధిస్తామని ప్రజలకు చెప్పదల్చుకున్నారా తెలియదు. ఈ సందేహం రావడానికి కారణం ఉంది. ఇద్దరు ముఖ్యమంత్రులూ తాము అధికారంలో ఉన్నాం కాబట్టి ఇక ప్రతిపక్షాల అవసరం లేదంటారు. తాము అధికారంలో ఉన్నాం కాబట్టి నిరసనలకు తావు లేదంటారు. అక్కడా ఇక్కడా ప్రభుత్వం చేస్తున్న తప్పులను గురించి వేలెత్తి చూపే హక్కు, గొంతెత్తి మాట్లాడే హక్కూ లేకుండా చెయ్యడం నిత్యకృత్యం అయిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు తానూ చెయ్యబోయే అభివృద్ధిని 2050 సంవత్సరం వరకూ విస్తరిస్తుంటారు. అంటే ఆయన, ఆయన కొడుకు లోకేష్, ఆ తరువాత మనుమడు దేవాన్ష్ కూడా ముఖ్యమంత్రులు అయిపోవొచ్చు ఈ 52 ఏళ్ళ కాలంలో. అట్లాగే తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు 20 ఏళ్ళ దాకా మాదే అధికారం అంటారు. ప్రతిపక్షాలు లేనే లేవు, ఎప్పుడు ఎన్నికలొచ్చినా రాష్ట్ర శాసనసభలోని 119 స్థానాల్లో 106 మావేననీ, వచ్చే 20 ఏళ్ళు అధికారం మాదే అని కూడా అంటుంటారు. ఇద్దరూ ప్రతిపక్షాలను ఖాళీ చేయించడానికి అన్ని ప్రజాస్వామ్య సూత్రాలనూ, విలువలనూ కాలరాస్తుంటారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామన్న విషయం మరిచిపోయి జిన్‌పింగ్‌లాగా శాశ్వతంగా అధికారంలో కొనసాగుతామని అనుకుంటూ ఉన్నందువల్లనే ఇద్దరు ముఖ్యమంత్రులకూ అభివృద్ధిలో చైనా ఆదర్శంగా కనిపిస్తున్నట్టు ఉన్నది.

ప్రత్యేక హోదాపై మొదటి నుంచి కుప్పిగంతులే!

రాష్ట్ర విభజనకు అనుకూలంగా లేఖలిచ్చి, విడిపోతున్న సమయంలో 15 ఏళ్ళు ప్రత్యేక తరగతి హోదా కావాలని డిమాండ్ చేసి ఆ తరువాత అధికారంలోకి వచ్చాక అదే హోదా కోసం పోరాటం చేస్తున్న ప్రతిపక్షాన్ని, ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం కదలనివ్వదు, జైళ్ళలో పెడుతుంది. కేసులు పెడుతుంది. హోదా సంజీవని కాదు, ప్యాకేజీతోనే ప్రయోజనం అని చెప్పి చెప్పి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేసి, చివరికి ప్రజాగ్రహానికి తలొగ్గక తప్పని స్థితిలో మళ్ళీ ప్రత్యేక హోదా పాట అందుకున్నది. ఎన్నికల ఎత్తుగడగా బీజేపీని వదిలించుకోవాలని ఆలోచిస్తున్నప్పటికీ చంద్రబాబుకు పూర్తి ధైర్యం చాలడం లేదు. అందుకే కేంద్ర ప్రభుత్వంలో నుండి మాత్రం తన మంత్రులతో రాజీనామా చేయించి ఎన్‌డీఏ కూటమిలో మాత్రం కొనసాగుతున్నారు. రెండవసారి అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ కేంద్రంతో తగాదా పడలేము, మంచిగా ఉండి సాధించుకోవాలి అనే పాట పాడుతూ వొచ్చిన చంద్రబాబుకు, ఆయన పార్టీ నాయకులకూ ఇప్పుడు బీజేపీతో సంబంధాలు చెడేసరికి సహకార ఫెడరలిజం గుర్తొచ్చింది. 2016 సెప్టెంబర్ 8న కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఆంధ్రప్రదేశ్‌కి ఇస్తున్న ప్యాకేజీ గురించి ప్రకటించినప్పుడు ఉబ్బితబ్బిబ్బయిపోయి ఆయనకు సన్మానాలు చేసిన చంద్రబాబు, అదే ప్రకటనను అక్షరం పొల్లు పోకుండా 2018 మార్చిలో చేస్తే మాత్రం అన్యాయం జరిగిందని ప్రకటనలు చేస్తున్నారు. అధికారాన్ని మళ్ళీ ఎట్లాగయినా దక్కించుకోవాలన్న ఆరాటం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది ఆయన నిర్ణయాల్లో. తాము ఇంకా బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏలో భాగస్వామిగా కొనసాగుతూనే, ప్రత్యేక హోదా ఇచ్చే ఏ పార్టీకయినా మద్దతు ఇస్తామన్న ప్రతిపక్షాన్ని మాత్రం బీజేపీలో చేరబోతున్నది అని నిందించేందుకు చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు శతవిధాలా చేస్తున్న ప్రయత్నాన్ని ఏపీ ప్రజలు అర్థం చేసుకోలేరని అనుకుంటే పొరపాటు.

ఇక దేశానికే రాజకీయ ప్రత్యామ్నాయాన్ని తాను ఇస్తాననీ మూడవ ఫ్రంట్‌కు తాను నాయకత్వం వహిస్తానని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి రైతు సమస్యల మీద కేంద్రాన్ని నిలదీయడానికి ఉద్యమం చేస్తానని, ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేస్తానని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం నిరసన తెలిపే హక్కు ప్రజలకు ఉండదు. హైదరాబాద్‌లో ధర్నా చౌక్ ఎత్తేసి నిరసనకారులను ఇళ్ళల్లో నిర్బంధించి అవసరం అయితే పోలీస్ స్టేషన్లకు తరలించి ముఖ్యమంత్రి మాత్రం జంతర్ మంతర్‌కు నిరసన కార్యక్రమం నిర్వహించడానికి వెళతారు. రిజర్వేషన్ల పెంపు డిమాండ్ మీద ఆయన పార్టీ ఎంపీలు లోక్‌సభను స్తంభింప చెయ్యొచ్చు, ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలపవచ్చు కానీ తెలంగాణ అసెంబ్లీలో మాత్రం విపక్షాల నిరసనకు అనుమతి లేదు. ప్లకార్డులు ధరించి సభకు రావడం అరాచకం.

దాడుల రాజకీయంలోనూ పక్షపాతమే!

శాసనసభలో గవర్నర్ మీద దాడి హేయమయిన చర్య. ఎవరూ సమర్థించకూడని చర్య. అయితే గవర్నర్ ప్రసంగం సమయంలో నిరసన తెలపడం ఇవాళ కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. నిలబడి నిరసన తెలపడం, నినాదాలు చెయ్యడం, ప్రసంగాల ప్రతులను చించివెయ్యడం చాలా కాలంగా శాసనసభల్లో మామూలు అయిపోయింది. అయితే భౌతికంగా గవర్నర్ మీద దాడికి దిగడం ఎవరితో ప్రారంభం అయింది? ఉమ్మడి రాష్ట్రంలో ఇదే గవర్నర్ గారి మీద ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ సభ్యులు కాదా దాడి చేసింది. శాసన సభ ఆవరణలో ఒక ఎంఎల్ఏను కొట్టండిరా తన్నండిరా అని రెచ్చగొట్టిన పెద్ద మనిషి ఇవాళ తెలంగాణ ప్రభుత్వంలో నంబర్ టూగా ఉన్నాడు. రేపో మాపో ఆయనే ముఖ్యమంత్రి కూడా అవుతారని వార్తలు వస్తున్నాయి. అయితే ఆ సంఘటనను ఆదర్శంగా చేసుకుని గవర్నర్ మీద మళ్ళీ దాడి చెయ్యడాన్ని ఎవరూ సమర్థించరు. చెప్పేదేమంటే మేం చేస్తే మంచిది, ఇతరులు చేస్తే చెడ్డది అన్న ప్రభుత్వాల, రాజకీయ పక్షాల వైఖరి సరయినది కాదు అనే.

తెలంగాణ ఉద్యమ కాలంలో ఉద్యమం అనేక మార్గాల్లో, అనేక పద్ధతుల్లో సాగింది. ప్రత్యేక రాష్ట్ర సాధన ఆకాంక్ష ప్రజల్లో ఎంత బలంగా ఉందో చెప్పడానికి మిలియన్ మార్చ్, సాగర హారం, సకల జనుల సమ్మె, వంటా వార్పూ వంటి పలు కార్యక్రమాలు జరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీ ఆ ఉద్యమ కార్యక్రమాలు అన్నింట్లో భాగస్వామి. వాటిల్లో ఒకటయిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ జరుపుకోవడాన్ని ఎందుకు ప్రభుత్వం అడ్డుకున్నట్టు? ఉద్యమ కాలంలో తెలంగాణ సాధన కోసం ఆ నాటి ప్రభుత్వంతో తలపడిన దానికి, ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవడానికి తేడా లేదా? మిలియన్ మార్చ్ నిర్వహణను నిషేధించడానికి ఆ నాడు ప్రభుత్వం ఏ కారణాలు చెప్పిందో, స్ఫూర్తి సభను నిషేధించడానికి నేటి ప్రభుత్వమూ అవే కారణాలు చూపడం విడ్డూరం. ఆ నాటి దృశ్యమే ఈనాడూ ట్యాంక్ బండ్ చుట్టూ కనిపించింది. ఆనాడు వేల మంది పోలీసులు ఉద్యమకారుల మీద విరుచుకుపడి అరెస్టులు సాగిస్తే ఈనాడు పోలీసులు అంతకంటే ఎక్కువ దాష్టీకం చేశారు, దౌర్జన్యం చేశారు.

పాలకులు ఎవరయినా ప్రజా ఉద్యమాల పట్ల, వారి ఆకాంక్షల పట్ల ప్రదర్శించే అసహనంలో మాత్రం మార్పు ఉండదేమో!

మన పాలకులూ చైనా దారి పట్టినట్టు ఉన్నారు..!!

datelinehyderabad@gmail.com

జనం ఆమోదిస్తేనే పాపులారిటీ

కొమ్మినేని శ్రీనివాసరావుతో గొల్లపూడి మారుతీరావు

సినిమా నటుల పాపులారిటీ జనం ఆమోదిస్తే వచ్చిందే తప్ప ఆ నటుల వ్యక్తిగత గొప్పతనంతో రాలేదని సీనియర్ నటులు, ప్రముఖ రచయిత గొల్లపూడి మారుతీరావు అన్నారు. ఆడియన్స్ ఆమోదిస్తే వచ్చిన పాపులారిటీని మిగతా రంగాల్లోకి యథాతథంగా అనువదించడానికో, తర్జుమా చేయడానికో ప్రయత్నిస్తే ప్రయోజనం లేదన్నారు. నటుడి పాపులారిటీ మదుపుగా మారాలంటే రాజకీయాల్లో వారేం చేయగలరనేదే కీలకమవుతుందన్నారు. రాజకీయనేతలకు ఉండాల్సిన బ్యాలెన్స్ విషయంలో కళాకారులకు ఇబ్బంది ఎదురవుతుందని, మహానటుడు ఎన్టీ ఆర్ కూడా అక్కడే దెబ్బతిని ఉండొచ్చని అంటున్న గొల్లపూడి అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

మీ ముక్కుసూటితనంతో మీకు ఇబ్బందులు కలగలేదా?

ఆలిండియా రేడియోలో ఆఫీసర్‌గా ఎదిగాను. టైమ్ అంటే ఎంత వాల్యూ నో నాకు వృత్తే తెలిపింది. ఫలానా గంటకు, ఫలానా నిమిషానికి సౌండ్ రికార్డింగ్ అంటే ఆపడానికి లేదు. కానీ సినిమా ఫీల్డులో ఎవరైనా పరిచయం కొద్దీ జోకులేసినా భరించేవాడిని కాదు. ఎందుకంటే నేను గౌరవాన్ని ఆస్వాదించేవాడిని. కెమెరా ముందు నిల్చోగానే నేను ఒక స్టార్‌ని అనే ఫీలింగ్ వచ్చేసేది. అందుకే ఎవరైనా తేడాగా వ్యవహరిస్తే సహించేవాడిని కాదు. నా ముక్కుసూటితనంతో కొంత నష్టపోయి ఉంటాను.

ఎన్టీఆర్ మరణం, ఆ సందర్భంపై మీ స్పందన?

ఆయన వ్యక్తిగత జీవితం, దాని ప్రతిఫలనాలు, కుటుంబంలో వచ్చిన విభేదాలు ఇవేవీ నాకు తెలీవు. కానీ ఆయన అలాంటి పరిస్థితుల్లో గద్దె దిగడం చూస్తే ఆయన మ్యాన్ ఆఫ్ ఈగో. ఈగో ఇన్‌ది రైట్ సెన్స్. నటుడిగా మకుటం లేని మహారాజు. నడిస్తే మహారాజులాగే నడిచేవాడు.



మనసులో మాట

అల్లుడి నుంచే అలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఎన్టీఆర్ ఊహించి ఉంటారా?

నిజంగా ఈ విషయంపై నాకు అవగాహన లేదు. కానీ ఒక విషయం చెప్పగలను. ఆయన రాజకీయాల్లో పెరిగిన వ్యక్తి కాదు. ప్రధానంగా ఆయన నటుడు. గొప్ప కళాకారుడు. వ్యక్తిగతమైన డిగ్నిటీని రాజకీయం కోసం వదులుకునే వ్యక్తి కాదాయన. తనకు ఒక అడ్వాంటేజ్, మరొక డిసడ్వాంటేజ్ కూడా ఉండేది. అంత పెద్ద మెజారిటీ వచ్చినప్పుడు వారు చేసే పనులపై వారే పరిమితి విధించుకోవాలి. లేకుంటే వారిని ఎవరూ కరెక్ట్ చేయలేరు. ఒక ఎంజీఆర్, ఒక ఎన్టీఆర్, ఒక రాజీవ్ గాంధీ.. ఎవరూ ఊహించలేని మ్యాడ్ మెజారిటీ సంపాదించిన నేతలు వీరు. కానీ రామారావు తాననుకున్న మంచిపనులన్నీ చేశారు. కళాకారుడు రాజకీయాల్లోకి ప్రవేశించడం వల్ల రాజకీయాలకు ప్రయోజనం కలుగుతుందేమో కానీ, రాజకీయనేతకు ఉండాల్సిన బ్యాలెన్స్ కళాకారుడికి ఒక్కొక్కప్పుడు ఇబ్బంది అవుతుందా అనిపిస్తుంటుంది.

చిరంజీవి ఇంకా చాలామంది నటులు రాజకీయాల్లోకి వచ్చినా, ఎన్టీఆర్‌లాగా పాపులర్ కాలేకపోయారెందుకు?

వీళ్లది డిఫరెంట్ ప్లేన్ అంటాను. చిరంజీవి పాపులారిటీ మామూలిది కాదు. ఆయన సినిమాల్లోనే నేను ఎక్కువగా నటించాను. నాకు మంచిమిత్రుడు. కానీ, ఎన్టీఆర్‌కి జై అన్నట్లుగా ఏఎన్నార్‌కి జై అనరు. ఆయన పాపులారిటీ వేరు. ఆడియెన్స్ కూడా వేరు. ఇదే వీరికీ వర్తిస్తుంది.



ఇప్పుడు పవన్ కల్యాణ్ రజనీకాంత్, కమల్ హసన్ కూడా రాజకీయాల్లేకి వచ్చేశారు కదా?

పవన్‌కల్యాణ్, రజనీకాంత్, కమల్ హసన్ రాజకీయాల్లోకి వచ్చారు కానీ వారు ఏం చేయగలరో ఇప్పటికి మన ఊహకు అందదు. చేయగలిగితే మంచిదే. సరైన ఆలోచన ఉన్నవారు ఇవ్వాళ రాజకీయాల్లోకి రావాలి. అంతవరకే మనం కోరుకోగలం. ఒక వ్యక్తి వైయక్తిక ప్రజాదరణను ఒక సగటు మనిషి ఎలా జడ్జ్ చేయగలరు? అతడి పాపులారిటీ ఒక నటుడి పాపులారిటీగా మదుపుగా మారగలదా. ఇప్పుడు తానేం చెబుతున్నాడో అది సరిపోతుందా, ఆ మాత్రం ఇంకో రాజకీయ నేత కూడా చెప్పవచ్చు కదా.

రాజకీయాల్లోకి నటులు ఎందుకిలా ప్రవేశిస్తున్నారు?

ఇవాళ ఉన్న మాధ్యమాల్లో అతి పాపులర్ మాధ్యమం సినిమా. నేను గొప్ప రచన చేస్తే మీరో మరొకరో చదువుకుని ఆనందిస్తారు. ఒక మంచి సినిమాలో నటిస్తే కోట్ల మంది చూసి ఆనందిస్తారు. ఆ పాపులారిటీ, ఆ కీర్తి ఆడియన్స్ ఆమోదిస్తే వచ్చిన పాపులారిటీ. దాన్ని మిగతా ఏరియాల్లోకి అనువదించడానికో, తర్జుమా చేయడానికో కొందరు ప్రయత్నిస్తారు.

సినిమారంగంలో పెడధోరణులు, వదంతులు, విమర్శలపై మీ అభిప్రాయం?

ఇవన్నీ వేరువేరు కోణాలు. ఉదాహరణకు మీరు కోటు వేసుకుంటే అందంగా ఉన్నారు. అదే సమయంలో మన సంస్కృతికి దూరంగా ఉన్నారు. మీరు కోటేసుకుంటే ఇక్కడ మనిషిగా కనిపించటంలేదు. ఇవన్నీ ఒకే అంశంపై మూడు నాలుగు కోణాలు. ఇటీవల రాంగోపాల్ వర్మ వ్యాఖ్యలపై మహిళలు తిరగబడ్డారు. అది కూడా ఒక ధోరణి. యాంగిల్.

తెలుగు సమాజానికి మీరిచ్చే సందేశం?

మనం ఎంత గొప్ప పనులు చేసినా, ఎంత పురోగతి సాధించినా, ఎన్ని తెలివి తేటలతో కొత్త ప్రయోగాలు చేయగలిగినా, సంప్రదాయ వైభవం అనే పునాదిని కాపాడుకుంటూ వెళ్లగలిగితే ఆ మేరకు మన విజయాలు, పురోగతి ఎక్కువ ఉపయోగపడతాయని నా ఫీలింగ్. అమ్మని అమ్మగారూ అని పిలవడం, నీ భార్యను చక్కగా గౌరవించడం, మీ పిల్లలు మిమ్మల్ని చూడగానే కాళ్లకు నమస్కరించడం వీటికీ సంప్రదాయానికి ఏమీ సంబంధం లేదు. ఇవ్వాళ మార్వాడీలను చూస్తుంటే రోడ్డు మీద వెళుతూ కూడా నమస్కారం పెడతారు. మిమ్మల్ని చూడగానే గౌరవించాలనుకోవడం ఎంత చక్కటి ఆలోచన. ఆ వచ్చాడ్రా మళ్లీ వీడు అనుకోవడానికి, చూడగానే నమస్కారం పెట్టడానికీ ఎంత తేడా ఉంది. మనిషిని చూడగానే నమస్కరించడం అనే భావన ఎంత గొప్పదో కదా.

(ఇంటర్వ్యూ పూర్తి పాఠం కింది లింకుల్లో...)
https://goo.gl/QWReC9
https://goo.gl/8HTHP2

వివాహ వయస్సులో వెనకడుగు

శాసనాలు చేసేవారు బాలికలపట్ల వివక్షతో కూడిన భావజాలంతో ఉంటే బాలికలకు అనుకూలమైన చట్టాలు వచ్చేది ఎప్పుడు? బాలికలను చిన్న వయస్సులో వివాహ బలిపీఠం బారినుండి కాపాడటం అత్యంత ఆవశ్యం.

సందర్భం



అచ్యుతరావు

మా సంస్థ లక్ష అమ్మాయిల సంతకాలు సేకరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు రాష్ట్ర గవర్నర్ గారికి ఆ సంతకాలు సమర్పించడానికి సహకరించాల్సిందిగా నాకు అత్యంత సన్నిహితుడైన ఓ ఎంపీ గారిని కోరగా, అమ్మాయిల వివాహ వయస్సు 21కి మార్చాలా, పురుషులపై అమ్మాయిలు చేస్తున్న అకృత్యాలు చాలవా అంటూ హేళనగా మాట్లాడారు. సరే పురుషుల అభిప్రాయం దాదాపు ఇలానే ఉంటుందనుకుని, ఒక రాజ్యాంగ సంస్థకు అధినేతగా ఉన్న ఓ మహిళా నాయకురాలిని అడిగాను 'తల్లీ, అమ్మాయిల కనీస వివాహ వయస్సు 21 సంవత్సరాలకు మార్చాలని లక్ష సంతకాలు సేకరించాం తీసుకుంటారా' అనగానే వెంటనే వచ్చిన సమాధానం 'నాకు వల్లమాలిన పనులున్నాయి కానీ మరి పురుషుల కనీస వివాహ వయస్సు 30 ఏళ్లకు చేయాలంటారా' అని ప్రశ్నించారు.

ఈపై రెండు ఉదాహరణలు ఎందుకిచ్చానంటే ఒకరు పార్లమెంటులో చట్టం చేయగలిగిన వ్యక్తి, మరొకరు స్త్రీల సమస్యలను ఎత్తిచూపి పరిష్కారం చూపగలిగిన వ్యక్తి, వీరి భావజాలమే ఇలా ఉంటే ఇక సామాన్యుల సంగతి ఏంటి? పురుషుల కన్నా స్త్రీల వయస్సు పెళ్లి విషయంలో కచ్చితంగా తక్కువకే ఉండాలా? ఇది ఏ శాస్త్ర ప్రకారం? ఇది పురుషాధిక్య సమాజంలో కరడుగట్టిన భావజాలం తప్ప ఎలాంటి శాస్త్రీయత లేదు, పైగా వివాహ వయస్సులో స్త్రీ, పురుషులకు తేడా ఉండాలన్నది అశాస్త్రీయమైన పురుషాధిక్య భావజాలం తప్ప మరోటి కాదు.

1929లో బ్రిటిష్ ఇండియా పార్లమెంట్‌లో రావ్ సాహెబ్ హరవిలాస్ శారద.. కనీస వివాహ వయస్సు అమ్మాయిలకు 14 సంవత్సరాలు, అబ్బాయిలకు 16 సంవత్సరాలు ప్రవేశ పెట్టకముందు, అసలు కనీస వివాహ వయస్సు అనేదే లేకుండా అష్ట వర్షాత్, భావేత్ కన్య అంటే 8 సంవత్సరాల అమ్మాయిని కన్యగా భావించి పెళ్లిళ్లు చేయాలన్నది నాటి ఆచారంగా ఉండేది. అలాగే 8 ఏళ్లను గర్భాష్టకాలుగా అంటే తల్లి కడుపులో బిడ్డ పడ్డప్పటినుండి లెక్కించి అంటే 7 సంవత్సరాల వయస్సును 8 ఏళ్లుగా పరిగణించవచ్చని సెలవిచ్చారు.

ఇది సైన్స్ శాస్త్ర సాంకేతిక విద్యారంగాల్లో ఎలాంటి అభివృద్ధిలేని రోజులనాటి మాట, అలాగే స్త్రీకి ఎలాంటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేని సమాజంలో భావన, కానీ నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి అంటున్నారు, స్త్రీ పురుషులకు లింగభేదం లేదు అంటున్నారు. స్త్రీ జనోద్ధరణ, స్త్రీ విద్యను ప్రోత్సహిద్దామని, ఆకాశంలో సగం అవకాశాల్లో సగం లింగ భేదాలు లేవు అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. కానీ అసలు విషయానికి వచ్చేసరికి లింగ



వివక్షతో పెళ్లిళ్ల కనీస వయసును అమ్మాయిలకు 18 సంవత్సరాలుగా, అబ్బాయిలకు 21 సంవత్సరాలుగా నిర్ణయించుకున్నాం. కానీ దీనికేమైనా శాస్త్రీయత ఉందా, 18 సంవత్సరాలకు పెళ్లైతే కనీసం గ్రాడ్యుయేషన్ విద్య అయినా బాలికలు పూర్తి చేసుకోగలుగుతున్నారా? గ్రాడ్యుయేషన్ వరకైనా చదవంది తమ జీవితంలో వచ్చే విపత్కర పరిస్థితుల్లో, సొంత కాళ్లపై ఆర్థికంగా నిలబడగలరా? ఇక వ్యక్తిగత సమస్యలకు వస్తే 18 ఏళ్ల వయస్సులో లైంగిక సంపర్కానికి మానసికంగా సంసిద్ధులై ఉండరని మానసిక నిపుణులు చెబుతుంటే, ఈ వయసులో పెళ్లైతే గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్‌లు అధికమని గైనకాలజిస్టులు చెబుతున్నారు. 18 ఏళ్లకు పెళ్లైతే వెంటనే పిల్లలు పుట్టిన పిల్లల్లో 47 శాతం మంది పురిటిలోనే చనిపోతున్నారని, 69 శాతం మంది తల్లులు ప్రసవ సమయంలో చనిపోతున్నారని.. ఇది అన్ని అభివృద్ధి చెందని, చెందుతున్న దేశాల్లో జరుగుతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నెత్తీ నోరూ బాదుకుంటున్నది. అలాగే చిన్న వయసులో పెళ్లై కాపురానికి వెళ్లిన బాలికలపై లైంగిక దాడులు అధికంగా ఉన్నట్లు మన దేశ నేరాల నమోదు సంస్థ తేటతెల్లం చేసింది. అలాగే 21 ఏళ్ల లోపు జరిగిన పెళ్లిళ్లలో విడాకులు అధిక శాతంగా ఉన్నాయని కేంద్ర మహిళా కమిషన్ స్పష్టం చేసింది.

ఇన్ని అనర్థాలకు కారణమవుతూ, బాలికల జీవితంలో అడ్డంకులు కల్పించే కనీస వివాహ వయస్సును 18 నుంచి 21 ఏళ్లకు ఎందుకు మార్చకూడదు? బాలికలకు 18, బాలురకు 21 అని లింగ వివక్షను ఇంకా ఎంతకాలం కొనసాగిద్దాం? నేటి సమాజంలో సహితం కొనసాగుతున్న వందేళ్ల కిందినాటి 'అష్ట వర్షాత్ భావేత్ కన్య'లాంటి భావనలు మన మనస్సులోనుంచి ఎప్పుడు తొలగిపోతాయి?

శాసనాలు చేసేవారు బాలికలపట్ల వివక్షతకు కూడిన భావజాలంతో ఉంటే బాలికలకు అనుకూలమైన చట్టాలు వచ్చేది ఎప్పుడు? అమ్మాయిలకు, అబ్బాయిలకు వివాహ వయస్సులో తేడా ఉండాలన్న అశాస్త్రీయ, పురుషాధిక్య భావజాల వైఖరిని పక్కన పెట్టి బాలికల మేలు కోరి వారు ఇటు ఆర్థిక స్వావలంబన ఆరోగ్య ఆలోచన పరిపుష్టి కలిగాకే వివాహాలు జరిగేలా అమ్మాయిల కనీస వయస్సు 18 ఏళ్ల నుండి 21 ఏళ్లకు మార్చాలన్న బాలల హక్కుల సంఘం వాదనను బలపరచి బాలికలను చిన్న వయస్సులో వివాహ బలిపీఠం బారినుండి కాపాడండి.

వ్యాసకర్త గౌరవ అధ్యక్షుడు, బాలల హక్కుల సంఘం । 93910 24242

కల్తీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోండి: జూలకంటి



సాక్షి, హైదరాబాద్: మిర్యాలగూడ, దామరచెర్ల ప్రాంతంలో అంకుర్ కంపెనీ ఇచ్చిన విత్తనాలతో వేసిన వరి పొట్ట దశకొచ్చినా గింజ రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి నేతృత్వంలోని రైతుల బృందం సచివాలయంలో మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరిని కలసి సమస్యను విన్నవించారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ.. దీనిపై గతంలో వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ విత్తనాల కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎకరాకు రూ. 30వేల నష్ట పరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పలు విమానాలు రద్దు

శంషాబాద్: డైరెక్టర్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఆదేశాల మేరకు ఇండిగో, గోఎయిర్ ఎయిర్‌లైన్స్ సంస్థలకు సంబంధించిన పలు దేశీయ విమాన సర్వీసులు మంగళవారం రద్దయ్యాయి. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, త్రివేండ్రం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ఏడు ఇండిగో విమానాలతోపాటు ఢిల్లీ నుంచి హైదరాబాద్ రావాల్సిన గోఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన విమానం కూడా రద్దయింది. దీంతో ముందుగా ఆయా విమానాల్లో బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆయా నగరాల నుంచి రాకపోకలు సాగించే ఇండిగో, గోఎయిర్‌లైన్స్‌కు చెందిన మిగతా విమానాలు యథాతథంగా నడవటంతో ప్రయాణికులను వాటిలో సర్దుబాటు చేసినట్లు విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి.

సీఎంకు నా బాధ చెప్పుకోవాలి!

టీఆర్‌ఎస్ నేతలు నా భూమి కబ్జా చేశారు

అసెంబ్లీ చుట్టూ తిరుగుతున్న 70 ఏళ్ల వరంగల్ వృద్ధురాలు



సాక్షి, హైదరాబాద్: తన అధీనంలో ఉన్న భూమిని కొంతమంది టీఆర్‌ఎస్ నేతలు కబ్జా చేశారంటూ వరంగల్ జిల్లాకు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు రెండు రోజులుగా అసెంబ్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావును కలవాలని పోలీసులను అభ్యర్థిస్తూ ఉస్మానియా గేటు బస్టాండులో నిరీక్షిస్తోంది. వరంగల్ జిల్లా కేంద్రం శివారులోని జక్కులొద్ది గ్రామానికి చెందిన వెంకటమ్మ, తన తాతముత్తాతల నుంచి అదీనంలో ఉన్న టెనెన్సీ భూములను టీఆర్‌ఎస్ నేతలు ఆక్రమించుకున్నారని నాలుగేళ్లుగా పోరాటం చేస్తోంది. దీనిపై ఎంఆర్‌వో నుంచి ఉపముఖ్యమంత్రి వరకు అందరికీ ఫిర్యాదు చేసింది. హైకోర్టులో కేసు కూడా తనకే మద్దతుగా వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తోంది. ఈ విషయంపై సీఎం కేసీఆర్‌కే విన్నవించుకునేందుకు వచ్చానని మంగళవారం అసెంబ్లీ గేటువద్ద పోలీసులతో మొరపెట్టుకుంటూ 'సాక్షి'కి కనిపించింది. పాస్‌లేకుండా తాము పంపించలేమని పోలీసులు చెప్పడంతో కన్నీరుమున్నీరైంది. వెంకటమ్మతో సాక్షి మాట్లాడగా, సీఎం ఇంటి వద్దకు వెళ్లి కలిసేందుకు ప్రయత్నించానని, అయితే బలవంతంగా పోలీసులు రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి దింపారని తెలిపింది. రెండు రోజుల నుంచి అసెంబ్లీ దగ్గరే ఉంటున్నానని చెప్పింది. తనకు జరిగిన అన్యాయంపై ఎమ్మెల్యే కొండా సురేఖకు విన్నవించుకుందామని వెళితే పట్టించుకోలేదని వెంకటమ్మ ఆరోపించింది. సీఎం మాత్రమే తనకు న్యాయం చేస్తారని, ఆయనను కలిసిన తర్వాతే ఇంటికి వెళ్తానని వెంకటమ్మ చెబుతోంది.

బీసీలకు రూ.10వేల కోట్లు కేటాయించండి

ఆర్థిక మంత్రి ఈటలకు ఆర్.కృష్ణయ్య బృందం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత బడ్జెట్‌లో బీసీలకు రూ.10వేల కోట్లు కేటాయించాలని, రూ.20వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ ఇటీవల బీసీ డిక్లరేషన్ సందర్భంగా అంగీకరించిన డిమాండ్లకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరపాలని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను కృష్ణయ్య బృందం కలిసి బీసీల సమస్యలపై చర్చలు జరిపారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు ఏటా రూ.2వేల కోట్లు కేటాయించాలని, కుల వృత్తులను కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. బీసీ విద్యార్థుల పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం గరిష్ట ఆదాయ పరిమితి రూ.4 లక్షలకు పెంచాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు బాలురకు 150, బాలికలకు 250 చెల్లించాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకునే దంపతులకు రెండు లక్షల పారితోషకం ఇవ్వాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను 250 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, బిక్షపతి, భూపేశ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

16 లక్షల గొర్రె పిల్లలు పుట్టాయి: తలసాని



సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపకం పథకంతో రాష్ట్రంలోని గొల్ల, కుర్మలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50.44 లక్షల గొర్రెలను పంపిణీ చేశామని చెప్పారు. 2.40 లక్షల మంది లబ్ధి పొందారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసిన గొర్రెలు మరో 16 లక్షల పిల్లలను పెట్టాయని తెలిపారు. వీటితోనే వందల కోట్ల సంపద వచ్చిందని చెప్పారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాలలో మంత్రి తలసాని ఈ విషయం చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీలలో ప్రజలకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వైద్య, ఆరోగ్య మంత్రి సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్‌కుమార్, వి.శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఇప్పటికే 19,044 వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరారంలో ఆసిఫ్‌నగర్ కాలువ విస్తరణ పనులకోసం రూ.6.57 కోట్లను మంజూరు చేస్తామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని నీటిపారుదల మంత్రి టి.హరీశ్‌రావు చెప్పారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి త్వరలోనే ప్రత్యేక కోర్టు ఏర్పాటవుతుందని న్యాయ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. టీఆర్‌ఎస్ సభ్యుడు వి.శ్రీనివాస్‌గౌడ్ ఈ అంశంపై ప్రశ్న అడిగారు. మిగిలిన ప్రశ్నలను వాయిదా వేస్తున్నట్లుగా స్పీకర్ మధుసూదనాచారి ప్రకటించారు. తెలంగాణలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలపై బీజేఎల్పీ నేత జి.కిషన్‌రెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు.

భూ సేకరణను నిలిపేయండి

సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారి విస్తరణపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా భూ సేకరణ నోటిఫికేషన్లు జారీ చేయడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. కేంద్రం తన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకునేంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. భూ సేకరణను వెంటనే నిలిపేయాలని, భూముల స్వాధీన ప్రక్రియ కూడా చేపట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. మంగళవారం ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన వెంకటేశ్వరరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది బి.రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ, గిరిజన ప్రాంత పరిధిలోని భూముల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇచ్చాయని, తెలంగాణ ప్రభుత్వం భూములను స్వాధీనం విషయంలో ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని తెలిపారు. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, సమన్వయ లోపం వల్లే రెండు నోటిఫికేషన్లు వచ్చాయని, వివాదమంతా రెండు గ్రామాలకు సంబంధించినది మాత్రమేనని తెలిపారు. కేంద్రం తన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఉందన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, కేంద్రం తన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకునేంత వరకు జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి ఎలాంటి భూ సేకరణ చేయడానికి వీల్లేదని ఆదేశించింది.

అవమానించాడనే అంతం చేశారు..

సుధీర్ హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

- పరారీలోనే మరో ఇద్దరు నిందితులు
- వేటకొడవళ్లు, 3 మొబైల్స్, బుల్లెట్ వాహనం స్వాధీనం

హైదరాబాద్: 'అందరి ముందూ అవమానించాడు.. జనమంతా చూస్తుండగా చేయి చేసుకున్నాడు.. ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడాడు.. ఈ అవమానం భరించలేక అంతం చేయాలని నిర్ణయించుకున్నాం.. నలుగురు స్నేహితులం కలసి పరీక్ష రాయడానికి వెళ్తున్న సుధీర్‌ను నడిరోడ్డుపై వేటకొడవళ్లతో నరికి హత్యచేశాం..'సుధీర్ హత్య కేసులో కూకట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితులు వెల్లడించిన విషయాలివీ. సోమవారం కూకట్‌పల్లిలో దారుణ హత్యకు గురైన ఇంటర్ విద్యార్థి సుధీర్ కేసులో ఐదుగురు నిందితుల్లో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. మంగళవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ ఎస్.భుజంగరావు, సీఐ వడ్డే ప్రసన్నకుమార్ వివరాలు వెల్లడించారు.

హత్యకు దారి తీసిన గొడవ..

ఇంటర్ చదువుతున్న మూసాపేటకు చెందిన ఎలగల సుధీర్(19) ఈ నెల 9న స్థానిక సభ్యత గ్రౌండ్‌లో అదే ప్రాంతానికి చెందిన ఇప్పలి కృష్ణ స్నేహితులతో గొడవ పడ్డాడు. సుధీర్‌ను కృష్ణ ప్రశ్నించడంతో.. వారిద్దరి మధ్యా వాగ్వాదం జరిగింది. సుధీర్.. కృష్ణపై చేయి చేసుకున్నాడు. గొడవ విషయాన్ని సుధీర్ సోదరుడు ప్రసాద్‌కు చెప్పాడు. అదే రోజు సాయంత్రం కృష్ణ స్నేహితులైన జిల్లా మహేశ్, నవీన్.. సుదీర్, ప్రసాద్‌లకు గొడవ జరిగింది. అందరూ చూస్తుండగానే మహేశ్, నవీన్‌ను ప్రసాద్, సుదీర్ కొట్టారు. రాత్రి 9 గంటల సమయంలో మల్లన్న ఆలయం సమీపంలోకి వెళ్లిన మహేశ్‌కు అక్కడే ఉన్న సుధీర్, ప్రసాద్‌కు మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో తనపై దాడికి పాల్పడిన సుధీర్‌ను అంతం చేయాలని మహేశ్ నిశ్చయించుకున్నాడు. స్నేహితులు కృష్ణ, నవీన్, తేజతో కలసి పథకం వేశాడు. 2 వేటకొడవళ్లను కొనుగోలు చేసి.. వాటిని తేజ హోండా యాక్టివాలో దాచిపెట్టారు. సుధీర్ కదలికలు తెలుసుకోడానికి అదే ప్రాంతానికి చెందిన బైరెడ్ల శివ సహకారం తీసుకున్నారు. సోమవారం ఉదయం సుధీర్ పరీక్ష రాసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరి వసుంధర ఆస్పత్రి రోడ్డులో వస్తున్నాడని సమాచారం అందించాడు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ భుజంగరావు, సీఐ ప్రసన్నకుమార్‌లు. చిత్రంలో నిందితులు

కాపు కాసి.. దాడి చేసి..

దీంతో మహేశ్, మిగతా ముగ్గురు జాతీయ రహదారి పక్కనే ఉన్న సాగర్ హోటల్ వద్ద కాపు కాశారు. సుధీర్ రావడంతో అతడిని బైక్‌పై నుంచి లాగి కత్తులతో దాడి చేయడంతో రక్తపుమడుగులో కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు ప్రభాకర్, అంజి నిందితులను పట్టుకునేందుకు యత్నించగా ముగ్గురు పారిపోగా నవీన్ పోలీసులకు చిక్కాడు. అతని ద్వారా మిగతా నిందితుల సమాచారం, సంఘటనకు గల కారణాలను తెలుసుకున్న పోలీసులు.. నిందితులు జిల్లా మహేశ్, శివను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి బుల్లెట్ వాహనం, 2వేటకొడవళ్లు, 3 మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితుల్లో ఇప్పలి కృష్ణ, తేజ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ట్రాఫిక్ పోలీసులకు కమిషనర్ చేతుల మీదుగా రివార్డును అందజేయనున్నట్లు ఏసీపీ భుజంగరావు తెలిపారు.

పట్టణాభివృద్ధికి మరిన్ని నిధులు

టీయూఎఫ్‌ఐడీసీ నుంచి నిధులు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టేందుకు తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్‌ఐడీసీ) ద్వారా మరిన్ని నిధులు అందిస్తామని పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో మంగళవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పట్టణాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని తెలిపారు. 39 శాతం రాష్ట్ర జనాభా పట్టణ ప్రాంతాల్లో ఉందని, త్వరలో కొత్త పురపాలికల ఏర్పాటుతో ఇది 45 శాతానికి పెరగనుందన్నారు. పట్టణాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. పట్టణాల్లోని మౌలిక వసతులు మెరుగుపడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కొత్త జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణాలను ప్రణాళికాబద్ధంగా పక్కా రోడ్ల మ్యాపుతో అభివృద్ధి చేయాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్లకు సూచించారు. పట్టణాలకు టీయూఎఫ్ ఐడీసీ ద్వారా ఇస్తున్న నిధులు నిర్ణీత గడువులోగా వినియోగించుకునే విధంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సిద్దిపేటని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని మిగిలిన పట్టణాలను అభివృద్ధి చేయాలని సూచించారు. పట్టణాల్లోని జంక్షన్ టు జంక్షన్ రోడ్ల అభివృద్ధి, మోడల్ మార్కెట్లు, ఫుట్‌పాత్‌లు, బస్ బేలు, మురికి కాలువల అభివృద్ధి,శ్మశాన వాటికలు, పార్కుల నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వీటిని పూర్తి చేస్తే పట్టణాల్లో గుణాత్మక మార్పు వస్తుందన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్

ఒక్కో పట్టణాన్ని దత్తత తీసుకోండి..

జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఒక్కో పట్టణాన్ని దత్తత తీసుకోవాలని కేటీఆర్ కోరారు. కలెక్టర్లు జిల్లా స్థాయిలో పర్యవేక్షిస్తే పట్టణాల అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయన్నారు. ప్రస్తుతం ఇస్తున్న టీయూఎఫ్‌ఐడీసీ నిధులు పురపాలికలకు మార్గాల్లో వచ్చే నిధులకు అదనంగా వచ్చే నిధులని మంత్రి తెలిపారు. వీటితో చేపట్టే పనులను పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఈ నిధులతో చేపట్టే పనులను గుర్తించి, ఆ వివరాలను నెలాఖరులోగా అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షించాలన్నారు. పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలన్నారు.

ఉపాధ్యాయుల భాగస్వామ్యం అవసరం

ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాభివృద్ధిలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం అవసరమని నీటి పారుదల మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో (టీయూటీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలు – విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 'పాఠశాల విద్య – సంస్కరణ'లు అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమానికి తొలి అడుగులు వేసింది తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) అని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో టీయూటీఎఫ్ వీరోచితంగా పాల్గొందని అందుకే ఆ సంఘం మీద ప్రభుత్వానికి ఎనలేని గౌరవమన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు అందజేశామన్నారు. ఉపాధ్యాయ నియామకాలు – బదిలీలు జూన్ లోపల పూర్తి చేసేలా విద్యామంత్రి చర్యలు చేపడుతున్నారన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంపై సమస్యల పరిష్కారానికి తాము సిద్ధంగా ఉన్నామని, అయితే అది పార్లమెంట్‌లో చట్టం కావాల్సి ఉందన్నారు. 60 ఏళ్ల పరిష్కారం కానీ తాగు, సాగునీరు, విద్యుత్ వంటి సమస్యలన్నింటికి శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రం సాధించని విధంగా 18 శాతం వృద్ధి రేటును ఒక తెలంగాణ సాధించిందని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతాయి: ఈటల

రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూళ్లు ఎన్ని పెట్టినా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతాయని రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితులు ఆశాజనకంగా లేకపోయినా అవి మూతపడకుండా ఉండేందుకు టీయూటీఎఫ్ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. ఈ సదస్సు ద్వారా వచ్చిన డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్ రెడ్డి, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వి.శ్రీనివాస్ గౌడ్, ఎ.రవీందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, టీయూటీఎఫ్ అధ్యక్ష–ప్రధాన కార్యదర్శులు సి. స్వామిరెడ్డి, డి. మల్లారెడ్డి, ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ కారం రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీతన్నల నాడి ఎలా పడదాం!

- గీత కార్మిక సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- అసెంబ్లీ లాబీలో గౌడ ప్రజాప్రతినిధులతో ఉపసంఘం భేటీ
- రూ.500 కోట్లతో 'గీత' కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న నేతలు
- గీత పన్ను రద్దు, నీరా ఉత్పత్తులకు ప్రోత్సాహం

సాక్షి, హైదరాబాద్: మత్స్య, గొల్లకుర్మల తరహాలోనే గీత కార్మికులను ప్రసన్నం చేసుకోడానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాజ్యాధికారంలో గీత కార్మిక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చినా టీఆర్‌ఎస్‌కు ఆ వర్గం దూరంగానే ఉండటంతో వారు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కోరుతున్నారో క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, జోగు రామన్న, పద్మారావుగౌడ్‌లతో మంత్రివర్గ ఉప సంఘాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేశారు. గౌడ కుటుంబాలు, కుల సంఘం నాయకులు, ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి గీత సామాజిక వర్గం సమస్యలు, పరిష్కార మార్గాలతో సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. అందులో భాగంగానే మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో గౌడ సామాజిక వర్గ ప్రజా ప్రతినిధులు ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, బాలసాని లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో ఉపసంఘం తొలి విడత సమావేశమై గంటన్నరపాటు చర్చించింది.

గీత కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు

తాటి చెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తూ 2017లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ జీవోను సవరించి 2014 జూన్ 2 తరవాత మరణించిన వారి కుటుంబాలకూ ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయాలని ప్రజాప్రతినిధులు ఉపసంఘం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రతి చెట్టుకు రూ. 25, మున్సిపాలిటీల్లో రూ. 50 చొప్పున గీత పన్ను విధానం అమల్లో ఉందని, దాన్ని రద్దు చేయాలని గౌడ ప్రజాపతినిధులు సూచించారు. గీత కార్మిక కార్పొరేషన్‌కు రూ. 500 కోట్ల నిధులిచ్చి గీత వృత్తిని ఆధునీకరించటంతో పాటు నీరా ఉత్పత్తులను ప్రోత్సహించటానికి పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. గీత భవన్ కోసం 10 ఎకరాల స్థలం, నిర్మాణానికి రూ. 25 కోట్లు కేటాయించాలన్నారు. త్వరలోనే క్షేత్ర స్థాయిలో గీత కార్మిక సంఘం నేతలు, కుటుంబాలతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై అభిప్రాయాలు సేకరించనుంది. 3, 4 వారాల్లో పూర్తి సమాచారంతో నివేదిక రూపొందించి సీఎంకు అందజేయనుంది. తర్వాత గీత కార్మిక సంక్షేమంపై కేసీఆర్ కార్యాచరణ ప్రకటించనున్నారు.

సేవలు కాదు వితరణలు

- దేవుడి కైంకర్యాల్లో ఆర్జిత 'సేవలు' పదం మార్పు!
- దానిపై జీఎస్టీ విధిస్తున్నారని అధికారుల ఫిర్యాదు
- పేరు మారిస్తే పన్ను తప్పించుకోవచ్చని ప్రతిపాదన
- సానుకూలంగా పరిశీలిస్తున్న దేవాదాయశాఖ

సాక్షి, హైదరాబాద్: దేవాలయాల్లో నిర్వహించే ప్రత్యేక పూజాదికాలను ఆర్జిత సేవలుగా పేర్కొంటారు. తోమాల సేవ, ఊంజల్ సేవ, పవళింపు సేవ.. ఇలా వాటికి ఎన్నో పేర్లు. ఈ పేర్లలో 'సేవ'అన్న పదం ఉండటమే కొంపముంచిందని దేవాదాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ 'సేవ'లను సర్వీస్ (సేవ)గా పరిగణిస్తూ వాటి రూపంలో వచ్చే ఆదాయాన్ని వస్తుసేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోకి కేంద్రం తెచ్చింది. దీంతో ఇప్పుడు వాటి పేర్లు మార్చి సేవ అన్న పదం లేకుండా చూడాలని ప్రధాన దేవాలయాల అధికారులు దేవాదాయశాఖ దృష్టికి తెచ్చారు. దీనికి చిలుకూరు లాంటి కొన్ని 'ప్రైవేటు'నియంత్రణలోని దేవాలయాల నిర్వాహకులు కూడా జత కలిశారు. దీంతో సేవ అన్న పదం బదులు వితరణ అన్న పదంగాని ఆ అర్థం వచ్చే మరేదైనా పదం గాని జోడించాలని సూచించారు. దీన్ని దేవాదాయ శాఖ కూడా సానుకూలంగానే స్పందిస్తోంది. త్వరలో పేర్లను అధికారికంగా మార్చనున్నట్టు సమాచారం. మరోవైపు, దేవాలయాలను జీఎస్టీ పరిధి నుంచి తప్పించాలని కొన్ని దేవాలయాల నిర్వాహకులు ఉన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయాలని నిర్ణయించారు.

జీఎస్టీతో కుదేలు..

గత సంవత్సరం జూన్ కంటే ముందు దేవాలయాలపై పన్ను లేదు. జీఎస్టీ అమలులోకి రావటంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ప్రసాదాల తయారీ కోసం కొనే వస్తువులపై 18 శాతం జీఎస్టీ పడుతోంది. దేవాలయాల్లో ఆర్జిత సేవలపై అంతే మొత్తాన్ని విధిస్తున్నారు. ఇప్పటికే ఆలయాల ఆదాయంలో 12 శాతం దేవాదాయశాఖకు, 3 శాతం అర్చక సంక్షేమ నిధికి, మరో 3 శాతం సర్వశ్రేయోనిధికి దేవాలయాలు జమ కడుతున్నాయి. ఇప్పుడు జీఎస్టీ కూడా తోడవటంతో ఆదాయం సరిపోక కొన్ని చోట్ల జీతాలకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోందని దేవాలయ కార్యనిర్వహణాధికారులు గగ్గోలు పెడుతున్నారు. చివరకు కొన్ని దేవాలయాల్లో ప్రసాదం ధరలను 30 శాతం వరకు పెంచేశారు. ఇప్పుడు ఆర్జిత సేవలపై జీఎస్టీ భారం ఎంత ఉందో అంతమేర వాటి ధరలను కూడా పెంచుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రభుత్వానికి అనుమతి కోరుతూ ప్రతిపాదనలు అందాయి. వెరసి జీఎస్టీ భారం భక్తులపై మోపుతుండటంతో వారి నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. చాలాచోట్ల భక్తులు ఆలయ కార్యనిర్వహణాధికారులతో వాగ్వాదాలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో దేవాలయాలను జీఎస్టీ పరిధి నుంచి తప్పించాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఈ లోపు జీఎస్టీ భారం నుంచి తప్పించుకునేందుకు ఆర్జిత సేవ పేరు మార్చాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రసాదాలకు కూడా వితరణ, చందా అర్థం వచ్చేలా పేర్లు మార్చాలంటున్నారు. పులిహోర వితరణ/పులిహోర చందా... ఇలాంటి పేరుండాలని వారు సూచించారు.

యూఎల్‌సీ ఎల్‌ఆర్‌ఎస్ మేళా



యూఎల్‌సీ భూముల్లోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి

- జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయాల్లో 16, 17 తేదీల్లో మేళా!
- ఇప్పటివరకు అందిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 71,808
- షార్ట్‌ఫాల్స్ సమర్పించని పెండింగ్ దరఖాస్తులు 14,646

సాక్షి, హైదరాబాద్: అర్బన్‌లాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూముల్లోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఈ నెల 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీహెచ్‌ఎంసీకి అందిన 71,808 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో దాదాపు 36 వేలు పెండింగ్‌లో పడ్డాయి. వీటిలో 14,646 దరఖాస్తులు యూఎల్‌సీ భూముల్లోవే. వీటికి సంబంధించి ప్రజలకు సరైన సమాచారం, స్పష్టత లేకపోవడంతో షార్ట్‌ఫాల్స్ (అవసరమైన పత్రాలు)ను సమర్పించ లేకపోయారు. గత నెల 28 వరకే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి గడువునిచ్చిన ప్రభుత్వం దాన్ని ఈ నెలాఖరు వరకు పొడిగించడం తెలిసిందే. అయినప్పటికీ, ఇంకా షార్ట్‌ఫాల్స్ జత చేయడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు ప్రజలకు అవగాహన లేకే యూఎల్‌సీ భూముల్లోని వాటికి అవసరమైన షార్ట్‌ఫాల్స్ సమర్పించడం లేదని గుర్తించారు. వారికి తగిన అవగాహన కల్పించేందుకు, అవసరమైన పత్రాలు జత చేసేలా చూసేందుకు ఈ నెల 16, 17 తేదీల్లో యూఎల్‌సీ షార్ట్‌ఫాల్స్‌పై మేళా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేళా తేదీల్ని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

పక్కా జాబితాలతో సత్వర పరిష్కారం

యూఎల్‌సీ భూములకు సంబంధించి జీహెచ్‌ఎంసీ పరిధిలోని మూడు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో చర్చించి యూఎల్‌సీ భూములకు సంబంధించిన లేఔట్లు, సర్వే నంబర్లు.. ఆయా సర్వే నంబర్లలో ఏయే రకాల భూములున్నదీ పూర్తి వివరాలతో కూడిన మ్యాపుల్ని జీహెచ్‌ఎంసీ అధికారులు సేకరించారు. ఆయా సర్వే నంబర్లలో కొన్ని ప్లాట్లకు యూఎల్‌సీ క్లియరెన్స్ అవసరం కాగా, కొన్ని ప్లాట్లు అసలు యూఎల్‌సీ లోనే లేవు. అయితే ఆ విషయం అటు ప్రజలకే కాక ఇటు అధికారులకు కూడా తెలియకపోవడంతో యూఎల్‌సీలో లేనివాటిని కూడా పరిష్కరించలేదు. ప్రస్తుతం రెవెన్యూ మండలాల వారీగా ఏ సర్వే నంబర్లలో ఏయే లేఔట్లు /ప్లాట్లు యూఎల్‌సీ పరిధిలో లేవో, ఏవి ఉన్నాయో అధికారుల వద్ద జాబితాలు న్నాయి. వాటి గురించి ప్రజలకు కూడా తెలియజేయనున్నారు. తద్వారా యూఎల్‌సీ పరిధిలో లేని దరఖాస్తుల్ని పరిష్కరించనున్నారు.

మేళాల్లో ప్రజలకు అవగాహన

యూఎల్‌సీ భూముల కోసం నిర్వహించనున్న ప్రత్యేక ఎల్‌ఆర్‌ఎస్ మేళాల్లో సంబంధిత దరఖాస్తుదారులకు అన్ని వివరాలు స్పష్టంగా అర్థమయ్యేలా వివరిస్తామని టౌన్‌ప్లానింగ్ విభాగం అడిషనల్ డైరెక్టర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. మరికొన్ని లేఔట్లు /ప్లాట్లు యూఎల్‌సీ పరిధిలో ఉండగా, సంబంధిత జీవో ద్వారా క్లియరెన్స్ పొందిన వారు కూడా సదరు జీవో ప్రతుల్ని దరఖాస్తులతోపాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేదని శ్రీనివాసరావు తెలిపారు. అలాంటి వారు సంబంధిత జీవో ప్రతుల్ని సమర్పిస్తే వారి దరఖాస్తుల్ని పరిష్కరించనున్నారు. మరికొందరు యూఎల్‌సీ భూముల్లోని లేఔట్లకు రెవెన్యూ శాఖ నుంచి క్లియరెన్స్ పొందలేదు. అలాంటి వారు నిర్ణీత ఫీజు చెల్లించి, క్లియరెన్స్ తెచ్చుకుంటే వారి దరఖాస్తుల్ని కూడా పరిష్కరించనున్నారు. ఈ అంశాల్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు యూఎల్‌సీ భూములకు సంబంధించే రెండు రోజులు ప్రత్యేక ఎల్‌ఆర్‌ఎస్ మేళాలు నిర్వహించనున్నారు.

అరాచక శక్తులను సహించేది లేదు

కాంగ్రెస్ అరాచకాలు పరాకాష్టకు చేరాయి: సీఎం కేసీఆర్

వాళ్లకు ఇంత అసహనం ఎందుకు? • ఓర్వలేక నాపైనా విష ప్రచారం
అన్ని ఎన్నికల్లో ఓడిపోతున్నారు • అందుకే ఈ అసహనం.. కక్ష
మేం ప్రజలకు జవాబుదారీ • కాంగ్రెస్ సభ్యులపై నిర్ణయం సరైన చర్యే
నిన్నటి ఘటన బాధాకరం: అక్బర్ • జానా సస్పెన్షన్ సరికాదు: కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అరాచక శక్తులు ఏ రూపంలో ఉన్నా సహించేది లేదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. కాంగ్రెస్ అరాచకాలు పరాకాష్టకు చేరుకున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజలు అన్నీ చూస్తున్నారని, అంతిమంగా వారే న్యాయ నిర్ణేతలని పేర్కొన్నారు. మంగళవారం సస్పెన్షన్ తర్వాత కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి బయటికి వెళ్లిన అనంతరం సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడారు. ''గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిన ఘటన బాధాకరం, దురదృష్టకరం. ఇలాంటి పరిస్థితులు మన అసెంబ్లీలో వస్తాయని ఊహించలేదు. నిర్ణయం కఠిన తరమేగానీ తప్పదు. మేం కొడదామనుకున్నది గవర్నర్‌నుగానీ మండలి చైర్మన్‌కు తగిలింది అన్నారు. కాంగ్రెస్ వారికి ఇంత అసహనం ఎందుకు? కాంగ్రెస్ అరాచకాలకు ఇది పరాకాష్ట. తెలంగాణ రాష్ట్ర ప్రకటన వచ్చిన ఐదో రోజు నుంచే ఇది మొదలైంది. నేను ప్రధానిని కలిసేందుకు వెళ్తే... ఇక్కడ నా దిష్టిబొమ్మలు తగులబెట్టారు. టీఆర్ఎస్ జెండా గద్దెలు కూల్చారు. ఎన్నికలు అయ్యాక ప్రజల దీవెనతో మా ప్రభుత్వం వచ్చింది. అయినా కాంగ్రెస్ వారు ఇదే తీరుగా వ్యవహరించారు. ప్రభుత్వం ఉండదు కూలిపోతది అన్నరు. ప్రభుత్వం గురించి చెప్పేది ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు కాదు.. ప్రజలు. నాలుగేళ్లగా ఎన్నో ఎన్నికలు జరిగాయి. కొన్నింట్లో ప్రతిపక్షం డిపాజిట్లు సైతం కోల్పోయింది. రెండు లోక్‌సభ, అసెంబ్లీ, కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు చూశారు. అచ్చంపేట మున్సిపాలిటీలో అన్ని పార్టీలు కలిసి పోటీ చేస్తే మొత్తం అన్ని సీట్లలో ఓడిపోయారు. అందుకే అసహనం, కక్ష. చివరికి నా మీద, నా ఆరోగ్యంపైనా ఏదో ప్రచారం చేస్తున్నారు. అమెరికాకు వెళ్తున్నాని, జబ్బు తగ్గదని ఇక రానని ప్రచారం చేశారు. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. మేం ప్రజలకు జవాబుదారులం. స్పీకర్ నిర్ణయానికి ధన్యవాదాలు. నాలుగేళ్లగా రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయి. ఓర్వలేక ఏదో చేయాలని చూస్తున్నారు. నేరస్తులు, అరాచక శక్తులను సహించేది లేదు. రాజకీయ నేతల ముసుగులో ఎవరైనా ఏదైనా చేస్తామంటే కుదరదు. అరాచక శక్తుల పీచమణచడంలో వెనకడుగు వేసే ప్రసక్తేలేదు. మీ సమక్షంలో బీఏసీలో మాట్లాడితే.. ఏ అంశాలను ప్రతిపాదించినా చర్చిస్తామని చెప్పాం. గత సమావేశాలలో సభా సమయాన్ని మించి చర్చించాం. అలాంటప్పుడు గొడవకు ఆస్కారం ఎక్కడిది? మీ సమక్షంలో ఒకటి చెబుతారు. మళ్లీ ఇక్కడ అరాచకం చేస్తారు. చిన్న చిన్న విషయాలను వదిలేశాం. ఇప్పుడు శాసనమండలి చైర్మన్‌పై దాడి చేశారు. పైగా చైర్మన్ నాటకాలాడుతున్నారని అంటారు. ఏం అవసరం? కాంగ్రెస్ వాళ్లు ముందే నిర్ణయించుకున్నారు. దీనిపై మాకు సమాచారం ఉంది. సభలో మాకు లాభం లేదు అని బయటికి వెళ్తున్నారు. రాజ్యాంగబద్ధమైన గవర్నర్‌గారి ప్రసంగ సమయంలో మర్యాద పాటిస్తారని అనుకున్నాం. హుందాతనం ఉండాలంటే.. అరుపులు, పెడబొబ్బలు, కళ్లద్దాలు, కాగితాలు.. వీళ్ల సభ హుందాతనం కాపాడరు. అంతిమ నిర్ణేతలు ప్రజలు. మేం కరెక్టుగా వెళ్తున్నామనే అనుకుంటున్నాం. సభ తీసుకున్న నిర్ణయం సరైన చర్యే అని భావిస్తున్నాం''అని సీఎం అన్నారు. జానారెడ్డిపై సస్పెన్షన్‌పై బీజేఎల్పీ నేత జి.కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా సీఎం స్పందించారు. ''జానారెడ్డిని నేనే ఎక్కువ గౌరవించా. పెద్దలు జానారెడ్డి అని సంబోధించా. క్లిప్పింగ్స్ చూసి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు అప్పగించాం. సందర్భం దొరికింది కాబట్టి సిద్ధాంతాలేవీ లేకుండా కలిసిపోదామంటే మీ ఇష్టం. సభ అంటే మీరేనా? అధికారపక్ష సభ్యులు లేరా? అయినా సభ నిర్ణయం తీసుకున్నది. అయిపోయింది. దీనిపై ఇంకా చర్చ ఎందుకు'' అని ప్రశ్నించారు.



మంగళవారం సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నిరసన.. హింసకు దారితీయొద్దు: అక్బరుద్దీన్, ఎంఐఎం



చట్టాలను రూపొందించే వారు చట్టసభల గౌరవం కాపాడాలి. అసెంబ్లీలో సోమవారం బ్లాక్‌డే. సీఎం చెప్పింది కరెక్టు. నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంది. కానీ నిరసన.. హింసకు దారితీయొద్దు. నిన్న హద్దులు దాటారు. తప్పు చేసి దబాయిస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇది చాలా బాధాకరం. కాంగ్రెస్ సభ్యులపై నిర్ణయం సరైనదే. అయితే నిర్ణయం తీసుకునేముందు రాజకీయ పార్టీలకు చెబితే బాగుంటుంది. కాంగ్రెస్ నిస్పృహ (ప్రస్టేటెడ్) పార్టీ. దేశమంతటా ఓడిపోతోంది. అందుకే ఆ పార్టీ నేతలు ఇలా చేస్తున్నారు. చట్టసభ సభ్యులు రౌడీల్లా వ్యవహరించవద్దు.

జానా సస్పెన్షన్ సరికాదు: జి.కిషన్‌రెడ్డి, బీజేఎల్పీ నేత



గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిన సంఘటన దురదృష్టకరం. కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేసే ముందు మాట్లాడితే బాగుండేది. పార్లమెంటు వ్యవస్థలో ఎవరూ అలా చేయవద్దు. ప్రతిపక్ష నేత జానారెడ్డిపై సస్పెన్షన్ వేటు సరికాదు. నాలుగేళ్లగా జానారెడ్డి సభలో ఉండే తీరును చూస్తున్నాం. సోమవారం కూడా ఆయన కుర్చీలో నుంచి లేవలేదు. నినాదాలు చేయలేదు. సభలో సీఎం తర్వాత ప్రతిపక్ష నేత ముఖ్యమైనవారు. అకారణంగా చర్య తీసుకోవడం దురదృష్టకరం. పార్లమెంటులో టీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు పెడుతున్నారు. ఇక్కడ ఎందుకు ఇలా? ఇతర పార్టీల వాదన వినడానికి సిద్ధంగా లేకపోతే ఎలా? ఇంత అసహనమా?

నన్నెందుకు సస్పెండ్ చేశారు?

సీఎల్పీ నేత జానారెడ్డి నిలదీత

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ నుంచి తననెందుకు సస్పెండ్ చేశారో చెప్పాలని సీఎల్పీ నేత కె.జానారెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ శాసనసభాపక్ష నాయకుడినైన తనను సస్పెండ్ చేయడం కన్నా ఘోరం మరోటి లేదని వ్యాఖ్యానించారు. మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీని ఎందుకు సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీలో జరిగిన ఘటనలో తన పాత్ర ఏమీ లేదని, అప్పుడు జరిగిన అల్లరిలో తానేమీ పాల్గొనలేదన్నారు. పోడియంలోకి వెళ్లి నిరసన తెలిపినందుకే సస్పెండ్ చేస్తారా అని నిలదీశారు. ఈ విషయంలో మా వాదనను వినిపించే అవకాశం కూడా ఇవ్వకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రభుత్వం ప్రవర్తించిందన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనకు సంకేతంగా ఈ సభ నిలవబోతోందని వ్యాఖ్యానించారు. తమ పార్టీ సభ్యుల పట్ల ప్రభుత్వ తీరును ఇతర పార్టీలు కూడా ఖండించాలని కోరారు.

సభ్యుల ప్రవర్తనపై కఠినంగా ఉండాల్సిందే



కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో సభ్యుల ప్రవర్తనపై కఠినంగా ఉండాల్సిందేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు వ్యాఖ్యానించారు. మంగళవారం శాసన మండలి లాబీల్లో తనను కలసిన విలేకరులతో కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వం రద్దు, ఇతర సభ్యులపై సస్పెన్షన్ వేటు అంశాలపై ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ ప్రవర్తించిన తీరుకు సంబంధించిన వీడియో క్లిప్పింగులు చూసిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు శిక్షలు కఠినంగా ఉండాల్సిందేనని పేర్కొన్నారు. నేరానికి పాల్పడినవారే కాదు, దానికి ప్రోత్సహించిన వారూ శిక్షార్హులేనన్నారు. అనుచితంగా వ్యవహరించిన సభ్యుల సభ్యత్వంపై వేటు పడితే, అందుకు ప్రోత్సహించిన వారిపై బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేదాకా వేటు పడిందన్నారు. ఈ తరహా చర్యలు తీసుకోవడం దేశంలో కొత్తేమీ కాదన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ అసెంబ్లీల్లో అనుచితంగా ప్రవర్తించిన సభ్యులపై కఠిన చర్యలు తీసుకున్నారని తెలిపారు.

సభ్యత్వ రద్దు అప్రజాస్వామికం: కుంతియా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వ రద్దు, సస్పెన్షన్ల వ్యవహారాన్ని ఏఐసీసీ ఖండించింది. ఏఐసీసీ కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయడం దురదృష్టకరం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌ల సభ్యత్వ రద్దు అప్రజాస్వామికం. కాంగ్రెస్ హయాంలో హరీశ్‌రావు అసెంబ్లీలో వ్యవహరించిన తీరు, పార్లమెంటులో టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి వెళ్లి గందరగోళం చేసినప్పుడు లేని తప్పు.. అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తే వచ్చిందా? టీఆర్ఎస్ నేతలు తమను తాము ప్రజాస్వామికవాదులు అనుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినంత మాత్రానా ఆందోళనలు ఆగవు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పోరాడుతుంది. సభలో ఏం జరిగిందో ఫుటేజీ బయటపెట్టాలి. ప్రజాస్వామ్యయుత పార్టీలన్నీ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించాలి' అని అన్నారు.

కేసీఆర్ అహంకారానికి పరాకాష్ట : చాడ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యులపై అనర్హత వేటు వేయడం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అహంకారానికి, అప్రజాస్వామిక పోకడలకు పరాకాష్ట అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో టీఆర్ఎస్ అరాచక, నియంతృత్వ పోకడలను అనుసరిస్తుందన్నారు. మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ వంటివారు గతంలో మైకులు విసిరితే వారించామని, ఇప్పుడు కూడా అలాంటి భౌతికదాడులను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసే సమయంలో వారితోపాటుగా కమిటీ వివరణను తీసుకోవాలన్నారు. జానారెడ్డి లాంటి సీనియర్ ప్రతిపక్షనేతను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. ఢిల్లీలో టీఆర్ఎస్ ఎంపీలతో నిరసన తెలియజేస్తూ, ఇక్కడేమో నీతిమంతుడైనట్టుగా కేసీఆర్ మాట్లాడటం దారుణమన్నారు.

వై.ఎస్‌ను చూసి నేర్చుకోండి

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించిన తీరును చూసి సీఎం కేసీఆర్ నేర్చుకోవాలని చాడ సూచించారు.

పెన్ను ఉందా.. అందులో కత్తి ఉందా?

మండలి సమావేశాలకు వెళ్లిన జర్నలిస్టులకు పోలీసుల ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: మీ దగ్గర పెన్ను ఉందా? అందులో ఏమైనా కత్తి పెట్టుకొచ్చారా.. మీ దగ్గర దువ్వెన ఉందా? దువ్వెనలో కత్తి ఉందా.. మీ దగ్గర సిగరెట్ ఉందా? అగ్గిపెట్టె కూడా ఉందా.. అంటూ శాసన మండలి బడ్జెట్ సమావేశాలను మంగళవారం కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులను భద్రతా సిబ్బంది ప్రశ్నించారు. మండలి ప్రవేశ ద్వారం వద్ద జర్నలిస్టులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన పోలీసులు అనంతరం లోపలికి అనుమతించే సమయంలో ఇలా ప్రశ్నలు అడిగారు. దీంతో కొందరు జర్నలిస్టులు పోలీసుల తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

పాత భవనంలో మండలి సమావేశం..

రాష్ట్ర శాసన మండలి సమావేశాలు తొలిసారిగా మండలి పాత భవనంలో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో మండలి సమావేశాలకు ఉపయోగించిన భవనాన్ని రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి కేటాయించిన విషయం తెలిసిందే. ఏపీ శాసనసభ, మండలి సమావేశాలను అమరావతికి తరలించిన నేపథ్యంలో ఆ రాష్ట్రానికి కేటాయించిన శాసనసభ, మండలి భవనాలను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించారు.

గవర్నర్ ప్రసంగం వాస్తవ దూరం

ప్రభుత్వ విధానాలపై రామచందర్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నెలకొందని, పోలీసు రాజ్యం నడుస్తోందని బీజేపీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు విమర్శించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం వాస్తవ దూరమని ఆరోపించారు. ఆయన ప్రసంగంలో డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రస్తావన లేకపోవడంపై ఆక్షేపించారు. ప్రజలను అణచివేస్తున్నారని, ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయరంగం బాగుంటే ఈ మూడేళ్లలో 3 వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పాలని ప్రశ్నించారు. మహారాష్ట్రలో రైతులు ర్యాలీగా వస్తే వారి డిమాండ్లను అక్కడి బీజేపీ ప్రభుత్వం నెరవేర్చిందని.. ప్రశ్నించిన రైతులకు బేడీలు వేసిన చరిత్ర మాత్రం ఈ ప్రభుత్వానిదేనన్నారు. పథకాలు ప్రకటించడంలో తెలంగాణ మొదటిస్థానంలో నిలిచిందని ఎద్దేవా చేశారు.

ప్రజలకు అందుబాటులో లేరనిపిస్తోంది

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అక్బరుద్దీన్ ఒవైసీ హితవు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అందుబాటులో లేరని అనిపిస్తోందని, ఇప్పటికైనా ఆయన ప్రజల మధ్యకు రావాల్సిన సమయం ఆసన్నమైందని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ మరింత దగ్గర కావాలని ముఖ్యమంత్రికి హితవు పలికారు. 2019లో తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తమ అభిలాష అని ఒవైసీ స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీఆర్ఎస్, ఎంఐఎం అధికారంలోకి రావడం ఖాయం. రెండు పార్టీల విజయం ఖాయం. 70 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తూ వస్తోంది. అధికారంపై కాంగ్రెస్ పగటి కలలు కంటోంది. ఎవరు ఏ కలలుకన్నా టీఆర్ఎస్, ఎంఐఎం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. బంగారు తెలంగాణ సాధించడం ఖాయం. 2019లో తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నా. అయితే ఆయన ప్రజలకు అందుబాటులో లేరు. ఆయన పక్కన ఉండే వారు ఆయనకు ఈ విషయం చెప్పలేరు. అయితే నేను దోస్త్‌గా చెబుతున్నా.. ఆయన ప్రజలకు మరింత సమయం ఇవ్వాలి. ప్రజల మధ్యన ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. ఆయన ప్రజల మధ్యకు రావాలి'అని అక్బరుద్దీన్ సూచించారు. మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన థర్డ్ ఫ్రంట్‌ను తమ పార్టీ స్వాగతిస్తోందని చెప్పారు. '2019 సాధారణ ఎన్నికల్లో థర్డ్ ఫ్రంట్ కీలకపాత్ర పోషించాలి. పూర్తిస్థాయి ప్రభుత్వం ఏర్పాటు చేయకున్నా దేశ రాజకీయాల్లో తెలంగాణ కింగ్‌మేకర్ పాత్ర పోషిస్తుంది'అని జోస్యం చెప్పారు.

రాజీనామాల యోచనలో కాంగ్రెస్?

కోమటిరెడ్డి, సంపత్ విషయంలో ప్రభుత్వ వైఖరిని బట్టి నిర్ణయం

- ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు, సస్పెన్షన్‌పై పోరుబాట
- భవిష్యత్ కార్యాచరణపై సీఎల్పీ సమావేశంలో చర్చ
- రాష్ట్రపతికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు
- జాతీయస్థాయిలో చర్చనీయాంశం చేసేలా వ్యూహం

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లకు మద్దతుగా మూకుమ్మడి రాజీనామాలు చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఈ అంశంపై మంగళవారం జరిగిన సీఎల్పీ సమావేశంలో తీవ్ర చర్చ జరిగింది. ఇద్దరు సభ్యులకు మద్దతుగా రాజీనామాలు సమర్పిస్తే ఎలా ఉంటుంది? ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధపడుతుందా? అన్న కోణంలో చర్చ జరిగింది. కానీ ఏకాభిప్రాయం రాకపోవడంతో ప్రస్తుతానికి నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. ముందు ఆ ఇద్దరు సభ్యుల విషయంలో ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో స్పష్టమయ్యాక అవసరమైతే మూకుమ్మడి రాజీనామాలకు వెళ్దామన్న అభిప్రాయాన్ని నేతలు వ్యక్తం చేశారు. మొత్తమ్మీద తమ ఎమ్మెల్యేలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జాతీయ స్థాయిలో చర్చనీయాంశం చేసే దిశలో కాంగ్రెస్ పకడ్బందీ వ్యూహం రచిస్తోంది. దీనిపై రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేయాలని, పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావనకు తీసుకురావాలని యోచిస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే విషయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లిన టీపీసీసీ.. ప్లీనరీ సమావేశాలకు వెళ్లి ఢిల్లీ పెద్దలతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయాలని నిర్ణయించింది.

కుంతియాతో మంతనాలు

ఇద్దరు సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటు ఇతర సభ్యులను సస్పెండ్ చేస్తూ అధికార పక్షం నిర్ణయం తీసుకున్న తర్వాత అసెంబ్లీ లాబీల్లోని సీఎల్పీ నేత జానారెడ్డి చాంబర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. తర్వాత సీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియాతో పీసీసీ చీఫ్ ఉత్తమ్, జానారెడ్డి మాట్లాడారు. సభ్యుల సలహాలను తీసుకున్న తర్వాత ఈ అంశాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇద్దరు సభ్యుల సభ్యత్వాన్ని రద్దు అంశాన్ని.. రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత చర్చనీయాంశం చేయాలని నిర్ణయించారు. అధికార పక్షం అనుకున్నదే తడవుగా ప్రతిపక్ష సభ్యులను సభ నుంచి గెంటేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని, ఈ విషయాన్ని దేశంలోని అన్ని రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఏఐసీసీ ప్లీనరీలో దీనిపై చర్చించి.. భవిష్యత్తులో ఏ రాష్ట్రంలోనూ, ఏ పార్టీ ఇలాంటి నిర్ణయం తీసుకోకుండా తీర్మానాన్ని ఆమోదింపజేయాలని నిర్ణయించారు.

క్షేత్రస్థాయి ఆందోళనలు

పార్టీ కేడర్‌ను ఇదే అదనుగా సమాయత్తం చేసే కార్యాచరణను సీఎల్పీ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని మండల కేంద్రాల్లో, నియోజకవర్గాల్లో కేసీఆర్ దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల కాంగ్రెస్ కేడర్ ఆందోళనకు దిగింది. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గాంధీభవన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమం రసాభాసగా మారింది.

అధ్యక్షా.. మీకిది తగునా?

- 'దుర్మార్గం'అనడంలో మీ ఆంతర్యమేంటి?
- అనర్హత వేటు కోసం మేమిచ్చిన పిటిషన్‌ను నాలుగేళ్లుగా పట్టించుకోలేదు
- నిన్న జరిగిన దానికి మాత్రం వెంటనే చర్యలు తీసుకుంటారా?
- స్పీకర్ హోదాకే అప్రతిష్ట తెచ్చారంటూ ఉత్తమ్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసన సభాధిపతి ఎస్.మధుసూదనాచారి తమ పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ బహిరంగ ఆక్షేపణలు చేస్తోంది. సోమ, మంగళవారాల్లో అసెంబ్లీలో జరిగిన ఘటనల నేపథ్యంలో స్పీకర్ బాధ్యతలో ఉన్న వ్యక్తి నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా.. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం సభ ప్రారంభం కాగానే తమను ఉద్దేశిస్తూ స్పీకర్ 'దుర్మార్గం'అనే పదాన్ని ఉపయోగించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాకు హక్కులే లేవా..?

గవర్నర్ ప్రసంగం సందర్భంగా తమ సభ్యుల వ్యవహారశైలిపై అధికార పక్షం స్పందించిన తీరును అమలు చేసే విషయంలో స్పీకర్ మధుసూదనాచారి తమ హక్కులను కాపాడలేదని కాంగ్రెస్ వాదిస్తోంది. దీనిపై టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సభలోకి వస్తూనే కాంగ్రెస్ సభ్యులు దుర్మారంగా వ్యవహరించారనడంలో స్పీకర్ ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సభ్యులందరూ స్పీకర్‌కు ఒకటేనన్న విషయాన్ని విస్మరించారన్నారు. 'సస్పెన్షన్ ప్రతిపాదనలో నా పేరు చదివినప్పుడు ఎందుకు సస్పెండ్ చేశారని స్పీకర్‌ను అడిగా. కనీసం నా అరుపులను పట్టించుకోలేదు. 20 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉన్న నన్ను పట్టించుకోలేదు. మేం వెళ్లిపోయిన తర్వాత సీఎం చేత మమ్మల్ని తిట్టించి మరోసారి అవమానపరిచారు. స్పీకర్‌గా ఇది మీకు తగునా?' అని ప్రశ్నించారు.

జరిగిందేంటో ప్రజలకు చూపండి

అసలేం జరిగిందో ప్రజలకు, సభకు వీడియోలు చూపించాలని అడిగినా చూపించలేదని ఉత్తమ్ ఆరోపించారు. కనీస విచారణ జరపకుండా తమను సభ నుంచి గెంటివేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారని, వారిపై అనర్హత వేటు వేయాలని తామిచ్చిన పిటిషన్లను నాలుగేళ్లుగా పెండింగ్‌లో పెట్టుకున్న స్పీకర్.. సోమవారం ఘటన జరగ్గానే మంగళవారం చర్యలకు ఎలా ఉపక్రమించారని ప్రశ్నించారు. స్పీకర్‌కు లేని అధికారాలను ఆయన సంక్రమింపజేసుకుంటున్నారని, హరీశ్ మూవ్ చేస్తే స్పీకర్ పాస్ చేసేలా వ్యవహరిస్తూ ఆ పదవిని అప్రతిష్టపాలు చేస్తున్నారని మండిపడ్డారు.

కేసీఆర్ హటావో.. తెలంగాణ బచావో

టీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పోరుబాట

- గాంధీభవన్‌లో కోమటిరెడ్డి, సంపత్‌ల 'ప్రజాస్వామ్య పరిరక్షణ నిరాహార దీక్ష'
- ఉత్తమ్, జానా, ఇతర నేతల సంఘీభావం
- స్వామిగౌడ్‌పై దాడి జరిగిందన్నది ఓ నాటకం: ఉత్తమ్
- అదే నిజమైతే సంబంధిత వీడియోలు విడుదల చేయలేదేమని నిలదీత
- కేసీఆర్‌లా దొంగ దీక్ష చేయను: కోమటిరెడ్డి
- ప్రజలే కేసీఆర్‌కు బుద్ధి చెబుతారు: సంపత్

సాక్షి, హైదరాబాద్: శాసనసభ నుంచి కాంగ్రెస్ సభ్యుల బహిష్కరణ, సస్పెన్షన్ వేటుపై ఆ పార్టీ భగ్గుమంది. అధికారపక్షం తీరును తప్పుబడుతూ పోరాటానికి దిగింది. 'కేసీఆర్ హటావో.. తెలంగాణ బచావో'అంటూ నినదించింది. శాసన సభ్యత్వంపై వేటుపడిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లు మంగళవారం సాయంత్రం గాంధీభవన్‌లో 'ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష' పేరుతో 48 గంటల నిరాహార దీక్షకు దిగారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత కె.జానారెడ్డితో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు సంఘీభావం ప్రకటించారు. దీంతో నల్లగొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గాంధీభవన్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు టీఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజు అని, వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రజాగ్రహాన్ని చూడకతప్పదని పేర్కొన్నారు.

పోరాటం మొదలైంది: ఉత్తమ్

అధికార పార్టీ హామీల అమల్లో విఫలమైందని.. దానిపై నిలదీసినందుకే ప్రతిపక్ష సభ్యులను అసెంబ్లీ నుంచి బయటికి పంపిందని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ''ఇష్టమున్నట్లు నాటకాలు ఆడుకోవచ్చనే ఉద్దేశంతోనే.. అకారణంగా ఇద్దరి సభ్యత్వాలను రద్దు చేశారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఇక ప్రజలకు, కేసీఆర్ కుటుంబానికి మధ్య పోరాటం మొదలైనట్లే. స్వామిగౌడ్ మీద దాడి జరిగిందని ఒక డ్రామాకు తెరలేపారు. ఆయనపై దాడి జరిగిందనేది నాటకం. అదే నిజమైతే దాడి జరిగిందంటున్న వీడియోలను ఎందుకు విడుదల చేయలేదు..''అని నిలదీశారు. ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని స్పీకర్.. ఎలాంటి కారణాలు లేకుండా ఇద్దరు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. 'కేసీఆర్ హటావో.. తెలంగాణ బచావో' అని పిలుపునిచ్చారు.

టీఆర్ఎస్‌కు చరమగీతమే..

ప్రజా సమస్యలపై నిలదీస్తున్నామనే.. కాంగ్రెస్ సభ్యులను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేశారని సీఎల్పీ నేత జానారెడ్డి మండిపడ్డారు. టీఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని చెప్పారు. దేశంలో ఏ శాసనసభలోనూ ఇలా సభ్యత్వాలను రద్దు చేయలేదని మల్లుభట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాంగ్రెస్ దీక్షకు అందరూ సంఘీభావం తెలపాలని కోరారు. శాసనసభలో ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకు ఉందని ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ చెప్పారు. గవర్నర్ ప్రసంగంలో దళిత సీఎం, మూడెకరాల భూమి, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ వంటి అంశాలు లేకపోవడంతో నిరసన తెలిపామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్, కేసీఆర్ కొట్టుకుపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎం కావడంతోనే తెలంగాణలో ప్రమాదంలో పడిందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. చేయని తప్పుకు కోమటిరెడ్డి, సంపత్‌లపై అనర్హత వేటు వేయించారన్నారు.



మంగళవారం గాంధీభవన్‌లో కోమటిరెడ్డి, సంపత్‌ల నిరాహారదీక్షలో మాట్లాడుతున్న జానారెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ నేతలు షబ్బీర్, భట్టి, ఉత్తమ్, జీవన్‌రెడ్డి తదితరులు

ప్రాణం పోయినా సరే.. కేసీఆర్ ఓటమే నా లక్ష్యం

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని.. దానిని దేశానికి తెలియజెప్పేందుకే దీక్ష చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ''ప్రాణం పోయినా సరే వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించడమే నా లక్ష్యం. తెలంగాణ కోసం మంత్రి పదవి త్యాగం చేశాను. కేసీఆర్ లాగా దొంగ దీక్ష చేయం. స్వామిగౌడ్‌కు గాయాలయ్యాయనేది కట్టు కథ. పొద్దున ఒక కన్నుకు సాయంత్రం ఇంకో కన్నుకు చికిత్స చేయించుకుంటున్నారు. సభలో నిరసన తెలిపిన దృశ్యాలు చూపుతున్నారుగానీ.. స్వామిగౌడ్‌కు అయిన గాయాలు ఎందుకు చూపట్లేదు. ప్రజా సమస్యలు, రాజకీయ హత్యలపై నిలదీస్తామనే మమ్మల్ని బహిష్కరించారు..''అని పేర్కొన్నారు. అసెంబ్లీలో సభ్యత్వం రద్దు చేసినా.. తమకు నాలుగు కోట్ల మంది ప్రజల గుండెల్లో సభ్యత్వం ఉందని సంపత్ పేర్కొన్నారు. ఆ నాలుగు కోట్ల మంది ప్రజలే కేసీఆర్‌కు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

దాడి బూటకం.. కేసీఆర్ నాటకం

అసెంబ్లీలో జరిగిందంటున్న దాడి బూటకమని.. అంతా కేసీఆర్ ఆడుతున్న నాటకమని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కాంగ్రెస్ సభ్యులపై బహిష్కరణ, సస్పెన్షన్ వేటు అనంతరం సీఎల్పీ నేత జానారెడ్డి, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్, భట్టి, జీవన్‌రెడ్డి తదితరులు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్షమైన మమ్మల్ని బయటకు పంపించాక ఇక అసెంబ్లీ ఎందుకని.. ప్రగతిభవన్‌కో, ఫామ్‌హౌజ్‌కో మార్చుకోవాలని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఆందోళన చేయవచ్చని, కేసీఆర్ కుమార్తె స్పీకర్ మొహంపై ప్లకార్డులు పెట్టినా ఏమీ కాదని... తాము మాత్రం పోడియంలోకి వెళితే సభ నుంచి బయటకు పంపిస్తారా అని ప్రశ్నించారు. గతంలో బెంచీలపై నుంచి, మార్షల్స్ భుజాల మీద నుంచి దూకి గవర్నర్‌పై దాడికి పాల్పడ్డ మంత్రి హరీశ్‌రావు.. ఇప్పుడు తమను సస్పెండ్ చేస్తూ తీర్మానం పెట్టడం హాస్యాస్పదమని పేర్కొన్నారు.

రూ.1.83 లక్షల కోట్లు!

రేపే అసెంబ్లీలో 2018–19 వార్షిక బడ్జెట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఐదోసారి భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఇంచుమించుగా రూ.1.83 లక్షల కోట్ల బడ్జెట్‌కు రూపకల్పన చేసింది. సాధారణ ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న పూర్తిస్థాయి బడ్జెట్ కావటంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ గురువారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.1.49 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టింది. వివిధ పథకాలు, అభివృద్ధి పనులకు వెచ్చించే ప్రగతి పద్దుకు రూ.88,038 కోట్లు, ప్రభుత్వ విభాగాలు కార్యకలాపాలు, ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల నిర్వహణకు రూ.61,607 కోట్లు కేటాయించింది. ఈసారి రెండు భారీ పథకాలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. దీంతో ప్రగతి పద్దు రూ.లక్ష కోట్లు దాటే అవకాశాలున్నాయి. ద్రవ్యలోటు ఉన్నప్పటికీ ఈ ఏడాది కూడా రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. రైతు లక్ష్మి, రైతన్నకు బీమా పథకాలను ఈసారి బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించనుంది. ఖరీఫ్ నుంచే ఎకరానికి రూ.8 వేల చొప్పున వ్యవసాయానికి పెట్టుబడి సాయం పథకాన్ని అమలు చేస్తామని సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఇప్పటికే ప్రకటించారు. 'రైతు లక్ష్మి'పేరుతో బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి పెద్దపీట వేయనుంది. ఈ పథకానికి దాదాపు రూ.11 వేల కోట్లు కేటాయించనుంది. దీంతోపాటు 70 లక్షల మంది రైతులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించింది. నిరుడు సాగునీటి రంగానికి రూ.25 వేల కోట్లు కేటాయించగా.. ఈసారి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.30 వేల కోట్లు కేటాయించే అవకాశాలున్నాయి.

జాబ్ పాయింట్



తెలంగాణ పోస్టల్ సర్కిల్ — 1058 ఖాళీలు

తెలంగాణ పోస్టల్ సర్కిల్‌లోని జనరల్ పోస్ట్ ఆఫీస్ (జీపీవో) తోపాటు వివిధ హెడ్ పోస్టాఫీస్ (హెచ్‌వో), సబ్ పోస్టాఫీస్ (ఎస్‌వో), బ్రాంచ్ ఆఫీస్ (బీవో)ల్లోని 1,058 గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్). ఇందులో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బీపీఎం), మెయిల్ డెలివరర్ (ఎండీ), మెయిల్ క్యారియర్ (ఎంసీ), మెయిల్ ప్యాకర్ (ఎంపీ), మెయిల్ మ్యాన్ కేటగిరీ పోస్టులున్నాయి.
- **మొత్తం ఖాళీలు:** 1,058 (అన్‌రిజర్వ్‌డ్-559+ఓబీసీ-247+ఎస్సీ-133+ఎస్టీ-76+దివ్యాంగ (పీహెచ్)-43). దివ్యాంగ కేటగిరీలో పీహెచ్ (హెచ్ హెచ్)-14, పీహెచ్ (వోహెచ్)-15, పీహెచ్ (వీహెచ్)-14 ఉన్నాయి.
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఏదైనా ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన కంప్యూటర్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి బేసిక్ కంప్యూటర్ ట్రెనింగ్ సర్టిఫికెట్ (కనీసం 60 రోజుల శిక్షణకు తగ్గకుండా) ఉండాలి లేదా పదోతరగతి/అంతకంటే ఎక్కువ విద్యలో కంప్యూటర్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. తొలి ప్రయత్నంలోనే పదోతరగతి ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఉన్నతవిద్య (ఇంటర్/డిగ్రీ/..) అభ్యర్థులకు ఎలాంటి అదనపు వెయిటేజీ ఉండదు.
- **దరఖాస్తు రుసుం:** ఓసీ/ఓబీసీ-రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు. ❖ **వయసు:** 2018, మార్చి 9 నాటికి 18-40 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** పదోతరగతి మార్కుల మెరిట్ ఆధారంగా. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 4, 2018.
- **వెబ్‌సైట్:** www.indiapost.gov.in, http://appost.in/gdsonline

ఎయిమ్స్ జోధ్‌పూర్ — 755 ఖాళీలు

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) శాఖ.. వివిధ విభాగాల్లోని 755 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ (ఏఎన్ఎస్)-28; సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ గ్రేడ్ 1)-127; నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ గ్రేడ్ 2)-600.
- **వేతనశ్రేణి:** అసిస్టెంట్ నర్సింగ్. సూపరింటెండెంట్-రూ.15,600-రూ.39,100; సీనియర్ నర్సింగ్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్-రూ.9,300-రూ.34,800.
- **అర్హతలు:** ఏఎన్ఎస్‌కు నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ (పోస్ట్ సర్టిఫికెట్)/రెండేళ్ల బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్)/తత్సమాన విద్యతోపాటు ఏదైనా 200 పడకల ఆస్పత్రి/హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో కనీసం ఆరేళ్ల అనుభవం ఉండాలి. ఇందులో మూడేళ్ల పాటు వార్డ్ ఇన్‌చార్జ్/సూపర్‌వైజరీ కెపాసిటీ హోదాలో పనిచేసి ఉండాలి. ఎంఎస్సీ (నర్సింగ్) ఉత్తీర్ణత అభిలషణీయం; సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌కు నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్ట్ సర్టిఫికెట్)/బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్)/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే ఏదైనా 200 పడకల ఆస్పత్రి/హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టాఫ్ నర్స్ గ్రేడ్ 2 హోదాలో కనీసం మూడేళ్ల అనుభవం; నర్సింగ్ ఆఫీసర్‌కు బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ (నర్సింగ్/పోస్ట్ సర్టిఫికెట్)/బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్)/డిప్లొమా (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ). అలాగే ఏదైనా 50 పడకల ఆస్పత్రిలో కనీసం రెండేళ్ల అనుభవం. అలాగే అన్ని పోస్టుల అభ్యర్థులకూ స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్స్, మిడివైఫ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.
- **వయసు:** అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్‌కు 25-40 ఏళ్ల లోపు; సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌కు 21-35 ఏళ్ల లోపు; నర్సింగ్ ఆఫీసర్‌కు 18-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఏఎన్ఎస్‌కు అభ్యర్థుల సంఖ్యను బట్టి రాతపరీక్ష/ఇంటర్వ్యూ; మిగిలిన పోస్టులకు రాతపరీక్ష.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన నాటి నుంచి 30 రోజుల్లోపు.
- **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

బీఈసీఐఎల్ — 131 ఖాళీలు

నోయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) కార్పొరేట్ ఆఫీస్.. 131 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** పేషెంట్ కేర్ మేనేజర్ (పీసీఎం)-35; పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ (పీసీసీ)-96.
- **వేతనం:** పీసీఎం-రూ.30,000; పీసీసీ-రూ.17,916. ❖ **అర్హతలు:** పీసీఎంకు డిగ్రీ (లైఫ్‌సైన్సెస్)తోపాటు హాస్పిటల్/హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో పీజీ. అలాగే సంబంధిత రంగంలో ఏదైనా హాస్పిటల్‌లో కనీసం ఏడాది అనుభవం; పీసీసీకి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. లైఫ్‌సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది. అలాగే ఏదైనా ఆసుపత్రిలో కనీసం ఏడాది అనుభవం ఉండాలి.
- **వయసు:** ఉద్యోగంలో చేరే నాటికి పీసీఎంకు 40 ఏళ్లు; పీసీసీకి 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు. ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** ఏప్రిల్ 9, 2018.
- **వెబ్‌సైట్:** www.becil.com

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ — 109 ఖాళీలు

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్).. 109 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** సైంటిస్ట్ 'బి'. ❖ **వేతనం:** రూ.79,929.
- **మొత్తం ఖాళీలు:** 109 (అన్‌రిజర్వ్‌డ్-50+ఓబీసీ-32+ఎస్సీ-18+ఎస్టీ-9).
- **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్ ఇంజనీరింగ్-31, మెటలర్జికల్ ఇంజనీరింగ్-10, సివిల్ ఇంజనీరింగ్-8, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-10, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-17, కెమికల్ ఇంజనీరింగ్-12, ఫుడ్ టెక్నాలజీ-5, మైక్రోబయాలజీ-13, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ అండ్ ఫైబర్ సైన్స్-3.
- **అర్హతలు:** మైక్రోబయాలజీకి కనీసం 60 శాతం (ఎస్సీ/ఎస్టీ-50 శాతం) మార్కులతో సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ/తత్సమాన విద్య; మిగిలిన వాటికి సంబంధిత విభాగాన్ని బట్టి కనీసం 60 శాతం (ఎస్సీ/ఎస్టీ-50 శాతం) మార్కులతో బీఈ/బీటెక్. ❖ **ఎంపిక:** ఆన్‌లైన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.750; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ/మాజీ సైనికోద్యోగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తుల ప్రారంభం:** మార్చి 16, 2018.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 2, 2018.
- **వెబ్‌సైట్:** www.bis.org.in

ఇస్రో-స్పేస్ అప్లికేషన్ సెంటర్ — 80 ఖాళీలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్: ఇస్రో)కు అనుబంధంగా అహ్మదాబాద్‌లో ఏర్పాటుచేసిన స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ).. 80 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌డీ'-3; సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'-1; టెక్నీషియన్ 'బి'-73 (ఫిట్టర్-14+మెషినిస్ట్-4+టర్నర్-1+ఎలక్ట్రానిక్స్-34+ఎలక్ట్రీషియన్-2+ఎల్ఏసీపీ/ఏవోసీపీ-4+డిజిటల్ ఫొటోగ్రాఫర్-1+ఆర్ఏసీ-2+ఐటీ/ఐసీటీఎస్ఎం/ఐటీఈఎస్ఎం-9+సీహెచ్ఎన్ఎం-2); కేటరింగ్ అటెండెంట్ 'ఎ'-1; కుక్-2.
- **వేతనశ్రేణి:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌డి'-రూ.67,700-రూ.2,08,700; సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'-రూ.44,900-రూ.1,42,400; టెక్నీషియన్ 'బి'-రూ.21,700-రూ.69,100; కేటరింగ్ అటెండెంట్ 'ఎ'-రూ.18,000-రూ.56,900; కుక్-రూ.19,900-రూ.63,200.
- **అర్హతలు:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌డి'కి.. ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో బీఈ/బీటెక్+ఎంఈ/ఎంటెక్‌తోపాటు పీహెచ్‌డీ (ఎలక్ట్రానిక్స్/వీఎల్ఎస్ఐ/మైక్రోవేవ్); సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ'కు బీఎస్సీ (మల్టీమీడియా/యానిమేషన్); టెక్నీషియన్ 'బి' పోస్టులకు పదోతరగతి/తత్సమాన విద్యతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ/ఎన్‌టీసీ/ఎన్ఏసీ; కేటరింగ్ అటెండెంట్ 'ఎ', కుక్‌కు పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. కుక్ పోస్టులకు అదనంగా ఏదైనా హోటల్/క్యాంటీన్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం. ❖ **వయసు:** సైంటిఫిక్ అసిస్టెంట్ 'ఎ', టెక్నీషియన్ 'బి', కుక్ పోస్టులకు 18-35 ఏళ్ల లోపు; కేటరింగ్ అటెండెంట్ 'ఎ'కు 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌డి'కి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు. ❖ **ఎంపిక:** సంబంధిత పోస్టులను అనుసరించి రాతపరీక్ష, స్కిల్ టెస్ట్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 2, 2018.
- **వెబ్‌సైట్:** www.sac.gov.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ — 54 ఖాళీలు

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ స్టేషన్స్‌లో 54 గ్రూప్ 'సి' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

- **పోస్టు-ఖాళీలు:** మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-12, హౌస్ కీపింగ్ స్టాఫ్ (హెచ్‌కేఎస్)-8, మెస్ స్టాఫ్-16, లాండ్రీమ్యాన్-2, కుక్ (ఆర్డినరీ గ్రేడ్)-6, కార్పెంటర్-3, పెయింటర్-2, వల్కనైజర్-1, ఎల్‌డీసీ-4.
- **అర్హతలు:** ఎల్‌డీసికి ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యతోపాటు టైపింగ్, మిగిలిన పోస్టులకు పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే కార్పెంటర్, పెయింటర్‌కు అదనంగా సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ, కుక్ పోస్టుకు అదనంగా కేటరింగ్‌లో డిప్లొమా ఉండాలి.
- **వయసు:** 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్/ప్రాక్టికల్/ఫిజికల్ టెస్ట్.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. ❖ **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు (ఏప్రిల్ 9, 2018). ❖ **వెబ్‌సైట్:** www.indianairforce.nic.in

యూపీఎస్సీ — 16 ఖాళీలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖల పరిధిలోని 16 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** ట్రాన్స్‌లేటర్-2 (బర్మీస్-1+పర్షియన్-1); లీగల్ ఆఫీసర్ గ్రేడ్ 3-5; పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)-4; స్టోర్స్ ఆఫీసర్(ఎస్‌వో)-4; సీనియర్ లెక్చరర్-1 (టెక్స్‌టైల్ ప్రాసెసింగ్).
- **వేతనశ్రేణి:** సీనియర్ లెక్చరర్‌కు రూ.15,600-రూ.39,100; లీగల్ ఆఫీసర్-రూ.67,700-రూ.2,08,700. స్టోర్స్ ఆఫీసర్‌కు పే స్కేల్ లెవెల్ 7, మిగిలిన పోస్టులకు పే స్కేల్ లెవెల్ 10 ప్రకారం వేతనశ్రేణి ఉంటుంది.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/డిప్లొమా ఇన్ ఫారెన్ లాంగ్వేజ్ (బర్మీస్/పర్షియన్)/మాస్టర్ డిగ్రీ ఇన్ లా (ఇంటర్నేషనల్ లా/ఇంటర్నేషనల్ రిలేషన్స్/ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్)/డిగ్రీ (లా/ఇంజనీరింగ్/సైన్స్/టెక్స్‌టైల్ ప్రాసెసింగ్/టెక్స్‌టైల్ కెమిస్ట్రీలో బీఈ/బీటెక్/డిగ్రీ/పోస్ట్ డిప్లొమా. అలాగే నిబంధనల మేర సంబంధిత రంగంలో అనుభవం తదితర అర్హతలు ఉండాలి.
- **వయసు:** స్టోర్స్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.25; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** మార్చి 29, 2018.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in, www.upsconline.nic.in

నాబార్డ్ — 92 ఖాళీలు

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్).. రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంకింగ్ సర్వీస్ (ఆర్‌డీబీఎస్)లోని 92 గ్రేడ్ 'ఎ' కేటగిరీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అసిస్టెంట్ మేనేజర్.
- **వేతనశ్రేణి:** రూ.28,150-రూ.55,600.
- **విభాగాల వారీ ఖాళీలు:** జనరల్-46, ఏనిమల్ హజ్బెండరీ-5, చార్టర్డ్ అకౌంటెంట్-5, ఎకనమిక్స్-9, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్-2, ఫుడ్ ప్రాసెసింగ్/ఫుడ్ టెక్నాలజీ-4, ఫారెస్ట్రీ-4, ల్యాండ్ డెవలప్‌మెంట్ (సాయిల్ సైన్స్)/అగ్రికల్చర్-8, మైనర్ ఇరిగేషన్ (వాటర్ రీసోర్సెస్)-6, సోషల్ వర్క్-3.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి కనీసం 50 శాతం (ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ-45 శాతం) మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో బ్యాచిలర్ డిగ్రీ/పీజీ/పీజీ డిప్లొమా/ఎంబీఏ/పీహెచ్‌డీ.
- **వయసు:** 2018, మార్చి 1 నాటికి 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ.
- **ప్రిలిమినరీ పరీక్ష విధానం:** దీన్ని ఆన్‌లైన్‌లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల్లో ఒక్కోదాన్నుంచి 20 చొప్పున 80 ప్రశ్నలు; ఇంగ్లిష్ లాంగ్వేజ్, ఎకనమిక్స్ అండ్ సోషల్ ఇష్యూస్ (విత్ ఫోకస్ ఆన్ రూరల్ ఇండియా), అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (విత్ ఫోకస్ ఆన్ రూరల్ ఇండియా) విభాగాల్లో ఒక్కోదాన్నుంచి 40 చొప్పున 120 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు.
- **మెయిన్ ఎగ్జామినేషన్:** ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో డిస్క్రిప్టివ్ విధానంలో 100 మార్కులకు ప్రశ్నలిస్తారు. జనరల్ ఇంగ్లిష్ కంప్రెజ్ ఎస్సే రైటింగ్, కాంప్రెహెన్షన్, రిపోర్ట్ రైటింగ్, పారాగ్రాఫ్ రైటింగ్, లెటర్ రైటింగ్, ఎస్సే-40 మార్కులకు, ప్రెస్సీస్-20 మార్కులకు, క్వశ్చన్ ఆన్ ప్రెస్సీస్ పారా-20 మార్కులకు, రిపోర్ట్/లెటర్ రైటింగ్-20 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నర. పేపర్-2లో సంబంధిత విభాగాలకు సంబంధించి 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. వ్యవధి గంటన్నర.
- **ఇంటర్వ్యూ:** మెయిన్స్‌లో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన మెరిట్ జాబితా అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇది 25 మార్కులకు ఉంటుంది. ❖ **దరఖాస్తు రుసుం:** ఎస్సీ/ఎస్టీ-రూ.150 (ఇంటిమేషన్ చార్జీలు మాత్రమే); మిగిలిన కేటగిరీలకు రూ.800(అప్లికేషన్ ఫీ-రూ.650+ ఇంటిమేషన్ చార్జీ-150).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 2, 2018.
- **వెబ్‌సైట్:** www.nabard.org



ఐఐటీ పాలక్కాడ్ — 34 ఖాళీలు

కేరళలోని పాలక్కాడ్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ).. వివిధ విభాగాల్లోని 34 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** డిప్యూటీ రిజిస్ట్రార్-1; అసిస్టెంట్ రిజిస్ట్రార్-3; టెక్నికల్ ఆఫీసర్ (టీవో)/కంప్యూటర్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ (సీఎస్ఏ)-1; జూనియర్ సూపరింటెండెంట్-6; జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్ (లైబ్రరీ)/సీనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్-2; జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-6; జూనియర్ టెక్నీషియన్ (జేటీ)-7; జూనియర్ అసిస్టెంట్ (జేఏ)-8.
- **వేతనశ్రేణి:** డిప్యూటీ రిజిస్ట్రార్-రూ.78,800-రూ.2,09,200; అసిస్టెంట్ రిజిస్ట్రార్, టీవో/సీఎస్ఏ-రూ.56,100-రూ.1,77,500; జేటీ, జేఏ-రూ.21,700-రూ.69,100; మిగిలిన పోస్టులకు రూ.35,400-రూ.1,12,400.
- **వయసు:** డిప్యూటీ రిజిస్ట్రార్‌కు 50 ఏళ్లు; అసిస్టెంట్ రిజిస్ట్రార్, టీవో/సీఎస్ఏ-45 ఏళ్లు; జేటీ, జేఏ-27 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** టెస్ట్/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 11, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 16, 2018.
- **వెబ్‌సైట్:** https://iitpkd.ac.in

సాక్షి బిజినెస్
బుధవారం 14-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 10.30కి)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
61 ▼	5 ▲
33,857	10,427

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	7,539	▽	49
డోజోన్స్	25,120	▽	58
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,136	▽	79
డాక్స్	12,200	▽	219
షాంఘై	3,311	▽	15
నికాయ్	21,968	▲	144

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో (చివరి మూడు 12వ ముగింపు)

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.68	65.81
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.62	91.80
€	యూరో	ఎస్‌బీఐ	81.28	81.44
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.93	62.06
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.05	52.15
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.14	50.24
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.72	18.62
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.09	18.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.26	11.78

ఎస్‌బీఐ కనీస బ్యాలెన్స్ చార్జీల తగ్గింపు

- 75 శాతం మేర తగ్గుదల
- ఇకపై నగరాల్లో నెలకు రూ. 15, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి



ముంబై: ఖాతాదారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కనీస బ్యాలెన్స్ పెనాల్టీ చార్జీలను 75 శాతం మేర తగ్గించింది. దీంతో ఇకపై నగరాల్లో నెలకు సగటు బ్యాలెన్స్ పరిమితులను పాటించని పక్షంలో రూ. 15 (పన్నులు అదనం), సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ. 12, గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ. 10 విధించనుంది. ప్రస్తుతం మెట్రోలు, అర్బన్ ప్రాంతాల్లో ఈ చార్జీలు గరిష్టంగా నెలకు రూ. 50 (పన్నులు అదనం), సెమీ అర్బన్.. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 40గా ఉన్నాయి. కొత్త మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, పెనాల్టీ చార్జీలను తగ్గించినప్పటికీ కనీస బ్యాలెన్స్ పరిమితులను మాత్రం ఎస్‌బీఐ యథాతథంగానే ఉంచింది. దీని ప్రకారం ఇకపై కూడా మెట్రో నగరాల్లో కనీస నెలవారీ బ్యాలెన్స్ పరిమితి రూ. 3,000 గాను, సెమీ అర్బన్ ఖాతాల్లో రూ. 2,000, గ్రామీణ ప్రాంతాల ఖాతాల్లో రూ. 1,000గాను కొనసాగుతుంది. కనీస బ్యాలెన్స్ నిబంధనలను అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా పెనాల్టీ చార్జీలు విధిస్తూ.. భారీ లాభాలు గడిస్తోందంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఎస్‌బీఐ తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

పెనాల్టీ చార్జీల తగ్గింపుతో బ్యాంకు ఫీజు ఆదాయం కొంత మేర తగ్గనుంది. 'ఖాతాదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం చార్జీలను తగ్గించడం జరిగింది. కస్టమర్స్ ప్రయోజనాలే మా ప్రధాన లక్ష్యం' అని ఎస్‌బీఐ ఎండీ (రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) పి.కె. గుప్తా తెలిపారు. దాదాపు అయిదేళ్ల విరామం అనంతరం గతేడాది ఏప్రిల్‌లో కనీస నెలవారీ బ్యాలెన్స్ చార్జీలను మళ్లీ ప్రవేశపెట్టింది. ఆ తర్వాత అక్టోబర్‌లో వీటిని కొంత సవరించింది. ఏప్రిల్–నవంబర్‌లో ప్రధానంగా ఇలాంటి చార్జీల ద్వారానే ఎస్‌బీఐ ఏకంగా రూ. 1,772 కోట్లు ఆర్జించినట్లు ఆర్థిక శాఖ గణాంకాల్లో వెల్లడైంది. ఇది బ్యాంకు రెండో త్రైమాసికం లాభం కన్నా అధికం కావడం గమనార్హం. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ తాజా చర్య తీసుకుంది. ఎస్‌బీఐకి 41 కోట్ల పొదుపు ఖాతాలు ఉన్నాయి. వీటిలో 16 కోట్లు ప్రధానమంత్రి జన ధన యోజన/ బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్స్, పింఛనర్లు మొదలైన వర్గాలకు చెందినవి. వీటిపై కనీస బ్యాలెన్స్ చార్జీలు లేవు. దీంతో ప్రస్తుత సవరణతో దాదాపు 25 కోట్ల ఖాతాదారులకు ప్రయోజనం చేకూరనుంది. కనీస బ్యాలెన్స్ చార్జీల బాదరబందీ లేకుండా సేవింగ్స్ ఖాతా నుంచి కావాలంటే ప్రాథమిక సేవింగ్స్ ఖాతా (బీఎస్‌బీడీ)కి కూడా బదలాయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు గుప్తా వివరించారు.

ఎస్‌బీఐలో 41.2 లక్షల ఖాతాలు క్లోజ్

ఇండోర్: ప్రభుత్వరంగ ఎస్‌బీఐ కనీస నిల్వలేమి కారణంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఏకంగా 41.2 లక్షల సేవింగ్స్ బ్యాంకు ఖాతాలను మూసేసింది. కనీస బ్యాలెన్స్‌ల నిర్వహణలో విఫలమైతే చార్జీల విధింపును గతేడాది ఏప్రిల్ నుంచి బ్యాంకు ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అలాగే, ఏప్రిల్ నుంచి ఎస్‌బీఐలో అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకుల విలీనం జరిగిన విషయం గమనార్హం. కనీస నిల్వ లేని కారణంగా వాటికి నిధులు కేటాయింపులు చేయాల్సి ఉండటంతో 41.16 లక్షల ఖాతాలను మూసేసినట్టు సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తుకు ఎస్‌బీఐ సమాధానం ఇచ్చింది.

ఈ నెల 16 నుంచి హెచ్‌ఏఎల్ ఐపీఓ

- 20న ముగింపు
- ధర శ్రేణి రూ.1,215–1,240
- రిటైల్ ఇన్వెస్టర్లకు, ఉద్యోగులకు రూ.25 డిస్కౌంట్
- ఇష్యూ సైజ్ రూ.4,230 కోట్లు



ముంబై: హెలికాప్టర్లు, తేలిక రకం యుద్ధ విమానాలు తయారు చేసే ప్రభుత్వ రంగ సంస్థ, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఈ నెల 16(ఈ శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నది. ఈ మహారత్న కంపెనీలో ప్రభుత్వం 10.20 శాతం వరకూ వాటాను ఐపీఓ ద్వారా విక్రయించనున్నది. ఈ ఐపీఓ ధర శ్రేణిని రూ.1,215–1,240గా కంపెనీ నిర్ణయించింది. ఈ నెల 20న ముగిసే ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.4,230 కోట్లు సమీకరిస్తుందని అంచనా. కనీసం 12 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రిటైల్ ఇన్వెస్టర్లకు, ఉద్యోగులకు ఆఫర్ ధరలో రూ. 25 తగ్గింపునిస్తోంది.

ఈ ఐపీఓలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) విధానంలో రూ.10 ముఖ విలువ గల 3.41 కోట్ల షేర్లను విక్రయిస్తారు. వీటిల్లో 6.6 లక్షల షేర్లను ఉద్యోగులకు కేటాయించారు. ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా ఈ కంపెనీలో వాటా విక్రయం జరుగుతోంది. ఈ ఐపీఓకు లీడ్ మేనేజర్లుగా ఎస్‌బీఐ క్యాప్స్, యాక్సిస్ క్యాపిటల్ సంస్థలు వ్యవహరిస్తున్నాయి.

రూ.68,000 కోట్ల ఆర్డర్ బుక్...

ఈ కంపెనీ అమ్మకాల్లో 91 శాతానికి పైగా రక్షణ రంగం నుంచే వస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ రూ.18,600 కోట్ల ఆదాయంపై రూ.3,580 కోట్ల నికర లాభం సాధించింది. 1940లో కార్యకలాపాలు ప్రారంభించిన ఈ కంపెనీ ప్రస్తుతం 27 రకాల హెలికాప్టర్లను, తేలిక రకం యుద్ధ విమానాలను తయారు చేస్తోంది. వైమానిక రంగంలో ప్రపంచంలోనే 39వ అతి పెద్ద కంపెనీ ఇది. కాగా తమ ఆర్డర్ బుక్ రూ.68,000 కోట్లుగా ఉందని, రానున్న మూడేళ్లలో ఈ ఆర్డర్లను తీర్చాలని కంపెనీ తాత్కాలిక చైర్మన్ వీఎమ్ చమోలా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ.5,300 కోట్ల ఆదాయం సాధించామని పేర్కొన్నారు.

బ్రాడ్‌కామ్ డీల్‌కు ట్రంప్ బ్రేకులు..

- క్వాల్‌కామ్‌ను టేకోవర్ చేసే ప్రయత్నాలకు గండి
- జాతీయ భద్రతా కారణాల సాకు
- 117 బిలియన్ డాలర్ల డీల్



వాషింగ్టన్: చిప్ తయారీ దిగ్గజం క్వాల్‌కామ్‌ను టేకోవర్ చేసేందుకు సింగపూర్ సంస్థ బ్రాడ్‌కామ్ చేస్తున్న ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి. జాతీయ భద్రతా కారణాల రీత్యా ఈ డీల్‌కు అనుమతివ్వడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. ఒకవేళ క్వాల్‌కామ్‌ను గానీ బ్రాడ్‌కామ్ టేకోవర్ చేసిన పక్షంలో ఆ సంస్థ అమెరికా భద్రతకు ముప్పు తెచ్చిపెట్టే విధమైన చర్యలు తీసుకోవచ్చంటూ విశ్వసనీయ ఆధారాలు ఉన్నాయంటూ ట్రంప్ వివరించారు. వాటి ఆధారంగానే టేకోవర్ డీల్‌కు అనుమతులు నిరాకరిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 'ప్రతిపాదిత టేకోవర్ ఒప్పందాన్ని తక్షణమే శాశ్వతంగా పక్కన పెట్టాలి' అని బ్రాడ్‌కామ్, క్వాల్‌కామ్‌లను ట్రంప్ ఆదేశించారు. క్వాల్‌కామ్‌ను బ్రాడ్‌కామ్ టేకోవర్ చేయడం నిషిద్ధమని, అలాగే ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ విలీనం చేసుకోవడం, కొనుగోలు చేయడాన్ని కూడా నిషేధిస్తున్నట్లు సంబంధిత ఉత్తర్వుల్లో ట్రంప్ స్పష్టం చేశారు.

దాదాపు 117 బిలియన్ డాలర్ల ఈ డీల్ గానీ సాకారమైన పక్షంలో ఇంటెల్, శాంసంగ్ తర్వాత ప్రపంచంలోనే మూడో అతి పెద్ద మైక్రో చిప్ తయారీ సంస్థ ఆవిర్భవించేది. అంతే కాకుండా టెక్నాలజీ రంగంలో ఇదే అత్యంత భారీ డీల్‌గా కూడా నిల్చేది. అయితే, అమెరికన్ చిప్ తయారీ దిగ్గజం క్వాల్‌కామ్ గానీ ఆసియా సంస్థ బ్రాడ్‌కామ్ చేతుల్లోకి వెళ్లిపోయిన పక్షంలో .. మొబైల్ టెక్నాలజీలో అమెరికా ఆధిపత్యానికి గండిపడుతుందనే ఆందోళనలు నెలకొన్నాయి. మరోవైపు, అమెరికా అధ్యక్షుడి ఆదేశాలను పరిశీలిస్తున్నట్లు బ్రాడ్‌కామ్ పేర్కొంది. క్వాల్‌కామ్‌ను కొనుగోలు చేయడం వల్ల అమెరికా భద్రతకు ముప్పు తెచ్చిపెడుతుందన్న ఆందోళనలను ఖండించింది.

గ్రామీణ బ్యాంకులపై ప్రై'వేటు'!

ప్రైవేటీకరణ దిశగా కేంద్రం సన్నాహాలు...

- ప్రైవేటు సంస్థలకు నేరుగా వాటా విక్రయం..!
- వాటాకు అనుగుణంగా బోర్డ్ మెంబర్లలో సభ్యత్వం కూడా..
- పబ్లిక్ ఇష్యూలకూ సన్నాహాలు...
- వాటాలను పూర్తిగా కోల్పోనున్న రాష్ట్ర ప్రభుత్వాలు





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్యాంకుల ప్రైవేటీకరణ దిశగా కేంద్రం చకచకా పావులు కదుపుతోంది. ఈ ప్రక్రియను ముందుగా గ్రామీణ బ్యాంకులతో మొదలుపెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా గ్రామీణ బ్యాంకుల్లో 49 శాతం వరకూ వాటాలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. అంతేకాకుండా 3–4 నెలల్లో ప్రారంభ పబ్లిక్ ఆఫర్(ఐపీఓ) ద్వారా స్టాక్ మార్కెట్ల నుంచి నిధులను సమీకరించనున్నామని.. దీనికి సిద్ధంగా ఉండాలని గ్రామీణ బ్యాంకులకు నాబార్డ్ ఉత్తర్వులను కూడా జారీచేయడం గమనార్హం. అయితే, ఈ ప్రైవేటీకరణపై ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ చర్యలతో గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు ఉద్దేశం, లక్ష్యం నీరుగారడం ఖాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్న, సన్నకారు రైతులు, చేతివృత్తులు, దారిద్ర రేఖకు దిగువనున్న ప్రజలకు బ్యాంక్ సేవలు అందించడమే లక్ష్యంగా గ్రామీణ బ్యాంక్‌లు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ (ఏపీజీవీబీ), తెలంగాణ (టీజీబీ), ఆంధ్ర ప్రగతి (ఏపీజీబీ), చైతన్య గోదావరి (సీజీజీబీ), సప్తగిరి (ఎస్‌జీబీ) గ్రామీణ బ్యాంక్‌లున్నాయి. వీటికి 2,160 బ్రాంచీలున్నాయి. ఇందులో తెలంగాణలో 960 శాఖలు, మిగిలినవి ఏపీలో ఉంటాయి. ఏపీజీవీబీ, టీజీబీలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఏపీజీబీకి సిండికేట్ బ్యాంక్, సీజీజీబీకి ఆంధ్రా బ్యాంక్, ఎస్‌జీబీకి ఇండియన్ బ్యాంక్‌లు స్పాన్సర్ బ్యాంక్‌లుగా ఉన్నాయి. గ్రామీణ బ్యాం కుల్లో కేంద్రం 50%, స్పాన్సర్ బ్యాంక్‌లు 35%, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు 15% వాటాలు ఉంటాయి.

రాష్ట్ర ప్రభుత్వాల వాటా గోవిందా..

దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికీ బ్యాంకింగ్ సేవలందాలన్న లక్ష్యాన్ని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరిట నీరుగారుస్తుందని తెలంగాణ రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీఆర్ఆర్‌బీఈఏ) జనరల్ సెక్రటరీ ఎస్. వెంకటేశ్వర్ రెడ్డి 'సాక్షి బిజినెస్ బ్యూరో'కు తెలిపారు. 49% వరకు వాటాను ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థలు కొనుగోలు చేసే వీలు కల్పిస్తూ చట్ట సవరణ కూడా చేశారు. పైగా వాటా విక్రయం తర్వాత కేంద్రం, స్పాన్సర్ బ్యాంక్‌ల వాటా 51%కి తగ్గకూడదనే నిబంధనను పెట్టారు. అంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పుడున్న 15% వాటా చేజారుతుందన్నమాట. రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో ఉండే ఏకైక వాణిజ్య బ్యాంక్‌లు గ్రామీణ బ్యాంక్‌లే. ఈ ప్రైవేటీకరణతో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేకుండా పోతుందని బ్యాంకింగ్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

రుణ, పొదుపు నిష్పత్తి ఇక్కడే సమానం..

ఏపీ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ల్లో 8,600 మంది ఉద్యోగులున్నారు. వీళ్లే కాకుండా 2,400 దినసరి కూలీలు పనిచేస్తుంటారు. తెలుగు రాష్ట్రాల్లో గ్రామీణ బ్యాంక్‌ల్లో 1.1 కోట్ల మంది ఖాతాదారులుంటారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రాలతో పోల్చినా గ్రామీణ బ్యాంక్‌ల రుణ, పొదుపు నిష్పత్తి దక్షిణాది రాష్ట్రాల్లో సరిసమానంగా, ఉత్తరాదిలో 40–45% వరకు ఉంటుందని వెంకటేశ్వర్ రెడ్డి చెప్పారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో డిపాజిట్లు, రుణం సమానంగానే ఉంటాయి. ఏపీ, తెలంగాణల్లో రూ.33 వేల కోట్ల డిపాజిట్లుంటే రుణాలు రూ.33–34 వేల కోట్లుగా ఉన్నట్లు వివరించారు.

ఏపీజీవీబీ ఐపీఓ బాటలో ఎస్‌బీఐ...

లాభాల్లో ఉన్న గ్రామీణ బ్యాంకుల్లో వాటాలను కొనుగోలు చేసేందుకు సూక్ష్మ రుణ సంస్థలు (ఎంఎఫ్ఐ), బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) ఉత్సాహంగా ఉన్నట్లు సమాచారం. కేరళ గ్రామీణ బ్యాంక్‌లో ముత్తూట్ ఫైనాన్స్ కొంత వాటా కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఐపీఓ ద్వారా సుమారు రూ.800 కోట్ల సమీకరించేందుకు ఎస్‌బీఐ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

వాటాలను బట్టి బోర్డు మెంబర్లు: ప్రస్తుతం గ్రామీణ బ్యాంక్‌ల్లో 9 మంది చొప్పున బోర్డ్ మెంబర్లు ఉన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి, స్పాన్సర్ బ్యాంక్‌ల నుంచి ముగ్గురు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), నాబార్డ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉంటారు. అయితే నిధుల సమీకరణలో 10 శాతం వాటాను కొనుగోలు చేసిన ప్రైవేటు కంపెనీలకు నుంచి బోర్డ్ మెంబర్లలో ఒకరికి, 10–25 శాతం వరకు కొనుగోలు చేస్తే ఇద్దరు, 25 శాతం పైనైతే ముగ్గురు సభ్యులు బోర్డ్ మెంబర్లలో చేరే వీలు కల్పించారు.

లాభాల్లోనే 50 బ్యాంక్‌లు..

దేశంలో ఉన్న మొత్తం 56 గ్రామీణ బ్యాంక్‌లకు గాను 50 బ్యాంక్‌లు లాభాల్లోనే ఉన్నాయి. కశ్మీర్‌లోని ఇలాఖీ దెహాతీ (ఈడీ), నాగాలాండ్, మణిపూర్ గ్రామీణ బ్యాంక్‌లు, బెంగాల్‌లోని భంగియ గ్రామీణ వికాస్ (బీజీవీబీ), మధ్యప్రదేశ్‌లోని మధ్యాంచల్ గ్రామీణ బ్యాంక్, ఒడిశాలోని ఉత్కల్ గ్రామీణ బ్యాంక్‌లు మాత్రమే నష్టాల్లో ఉన్నాయి. 50 బ్యాంక్‌లు కలిపి రూ.4,096 కోట్ల స్థూల లాభాలు చూపించాయి. రూ.2,573 కోట్ల నికర లాభాలను ఆర్జించాయి. వివిధ పన్నుల రూపంలో రూ.1,414 కోట్లు చెల్లించాయి.

దేశంలో గ్రామీణ బ్యాంక్‌ల ముఖ చిత్రమిది

మొత్తం బ్యాంక్‌లు	56
బ్రాంచీలు	21,398
ఖాతాలు	23 కోట్లు
డిపాజిట్లు	రూ.3.72లక్షల కోట్లు
రుణాలు	2.28 లక్షల కోట్లు
రిజర్వ్ నిధులు	రూ.23 వేల కోట్లు
నికర ఎన్‌పీఏ	4.41 శాతం
మొత్తం ఉద్యోగులు	86,555

ఎగవేతదారులకు 'బొమ్మ' పడుద్ది..!

- ఫొటోలను పత్రికల్లో ప్రచురించండి...
- బ్యాంకులను కోరిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ: ఉద్దేశపూర్వక రుణ ఎగవేతలు పెరుగుతుండటంతో వాటికి కళ్లెం వేసే దిశగా సంబంధిత ఖాతాదారుల ఫొటోలను పత్రికల్లో ప్రచురించడం ద్వారా దారికి వచ్చేలా చేయాలని బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం కోరింది. 'నేమ్ అండ్ షేమ్' కార్యక్రమం కింద ఎగవేతదారుల ఫొటోలను ప్రచురించేందుకు బోర్డుల అనుమతి తీసుకోవాలని అన్ని ప్రభుత్వరంగ బ్యాంకులకు కేంద్ర ఆర్థిక శాఖ లేఖలో సూచించినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఓ విధానాన్ని రూపొందించి బోర్డు అనుమతి పొందాలని కోరింది. చెల్లించగలిగే సామర్థ్యం ఉన్నప్పటికీ తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించని ఖాతాల సంఖ్య గత డిసెంబర్ నాటికి 9,063కు చేరింది. ప్రభుత్వరంగ బ్యాంకులకు ఉద్దేశపూర్వక రుణ ఎగవేతల మొత్తం రూ.1,10,050 కోట్లుగా ఉన్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా ఇటీవలే లోక్‌సభకు వెల్లడించారు. నీరవ్ మోదీ స్కామ్ నేపథ్యంలో రూ.50 కోట్లకు మించి రుణాలు తీసుకున్న వారి పాస్‌పోర్ట్ వివరాలను సమీకరించాలని ప్రభుత్వరంగ బ్యాంకులను కేంద్రం ఇటీవలే ఆదేశించిన విషయం తెలిసిందే. పారదర్శక, బాధ్యతాయుత బ్యాంకింగ్ అన్నది తమ తదుపరి లక్ష్యమని, పాస్‌పోర్ట్ వివరాలు తీసుకోవడం ద్వారా మోసం బయట పడితే సత్వరమే చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఈ చర్య వెనుక ఉద్దేశాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సెక్రటరీ రాజీవ్ కుమార్ తెలిపారు.

ఎల్‌వోయూల జారీపై నిషేధం

- బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశం
- పీఎన్‌బీ స్కామ్ ప్రభావం



ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ. 13,000 కోట్ల మేర లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ) కుంభకోణం దరిమిలా రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు ఎల్‌వోయూలు జారీ చేయడాన్ని నిషేధించింది. వాణిజ్య రుణాలకు సంబంధించి బ్యాంకులు.. ఎల్‌వోయూలు, లెటర్స్ ఆఫ్ కంఫర్ట్ (ఎల్‌వోసీ)ల జారీ చేయడాన్ని నిలిపివేయాలని నిర్ణయించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని వివరించింది. మార్గదర్శకాలను పునఃసమీక్షించిన అనంతరం.. కేటగిరీ–1 బ్యాంకులు ఎల్‌వోయూలు/ఎల్‌వోసీలు జారీ చేసే విధానాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. అయితే, దిగుమతులకు సంబంధించి వివిధ సంస్థల రుణ అవసరాల కోసం లెటర్స్ ఆఫ్ క్రెడిట్, బ్యాంక్ గ్యారంటీల జారీని బ్యాంకులు యథాప్రకారం కొనసాగించవచ్చని పేర్కొంది. పీఎన్‌బీ అధికారులతో కుమ్మక్కై తీసుకున్న ఎల్‌వోయూల ఆధారంగా వజ్రాభరణాల వ్యాపారులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ.. దాదాపు రూ. 13,000 కోట్ల కుంభకోణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రస్తుతం సీబీఐ, ఈడీ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. ఆర్‌బీఐ తాజా నిబంధనలతో ఎక్కువగా ఎల్‌వోయూలమీదే ఆధారపడే వ్యాపార సంస్థలపై ప్రతికూల ప్రభావం పడనుంది. అయితే, బ్యాంక్ గ్యారంటీలు, లెటర్ ఆఫ్ క్రెడిట్ విధానం యథాప్రకారం కొనసాగనున్నందున వాణిజ్యంపై పెద్దగా ప్రభావం ఉండబోదని ఎగుమతిదారుల సమాఖ్య ఎఫ్ఐఈవో డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. ఎల్‌వోయూలను ఎక్కువగా వజ్రాభరణాల రంగంలోని పెద్ద సంస్థలే ఉపయోగిస్తాయని ఆయన తెలిపారు. మరోవైపు, నీరవ్ మోదీ 2011 మార్చి 10న ముంబైలోని పీఎన్‌బీ బ్రాడీ హౌస్ శాఖ నుంచి తొలిసారిగా ఎల్‌వోయూ తీసుకున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభకు తెలిపారు. ఆ తర్వాత 74 నెలల వ్యవధిలో ఏకంగా 1,212 ఎల్‌వోయూలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కాల్ డ్రాప్స్‌పై టెల్కోలకు షోకాజ్ నోటీసులు

వారాంతంలోగా వివరణనివ్వాలని ట్రాయ్ ఆదేశాలు



న్యూఢిల్లీ: కాల్ డ్రాప్స్ సమస్య పరిష్కారానికి సంబంధించి కొత్త నాణ్యతా ప్రమాణాలను అమలు చేయడంలో విఫలమైనందుకు గాను కొన్ని టెల్కోలకు టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ వారాంతంలోగా వివరణనివ్వాలని ఆదేశించింది. ట్రాయ్ చైర్మన్ ఆర్ఎస్ శర్మ ఈ విషయాలు వెల్లడించారు. అయితే, ఏయే కంపెనీలకు నోటీసులు ఇచ్చినదీ వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. గతేడాది అక్టోబర్–డిసెంబర్ మధ్య కాలంలో కొన్ని నిర్దిష్ట సర్కిల్స్‌లో సర్వీసుల నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి ఈ నోటీసులు ఇచ్చినట్లు శర్మ చెప్పారు. ఆయా ఆపరేటర్ల వివరణను బట్టి చర్యలు ఉంటాయని ఆయన వివరించారు. కాల్ డ్రాప్స్ నివారించేందుకు ఉద్దేశించిన కఠిన నిబంధనలు 2017 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వీటి ప్రకారం టెలికం సర్కిల్ స్థాయిలో కాకుండా కాల్ డ్రాప్స్ సమస్యను మొబైల్ టవర్ స్థాయిలో పరిశీలిస్తారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలిన పక్షంలో ఆపరేటర్లకు గరిష్టంగా రూ. 10 లక్షల దాకా జరిమానా విధించే అవకాశం ఉంది.

హీరో ప్యాషన్ ప్రో, ఎక్స్‌ప్రో... 2018 ఎడిషన్స్



ప్రారంభ ధర రూ.53,189

న్యూఢిల్లీ: దేశీ దిగ్గజ టూవీలర్ల తయారీ కంపెనీ 'హీరో మోటోకార్ప్' తాజాగా 2018 ప్యాషన్ ప్రో, ప్యాషన్ ఎక్స్‌ప్రో మోటార్‌సైకిళ్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.53,189, రూ.54,189గా ఉన్నాయి. అన్ని ధరలు ఎక్స్‌షోరూమ్ ఢిల్లీవి. 100–110 సీసీ మోటార్‌సైకిల్ విభాగంలో మార్కెట్ వాటాను మరింత పెంచుకోవాలనే లక్ష్యంతో కంపెనీ ఈ బైక్స్‌ను ఆవిష్కరించింది. వీటిల్లో బీఎస్–4 నిబంధనలకు అనువైన 110 సీసీ ఇంజిన్లను అమర్చినట్లు కంపెనీ తెలిపింది.

జోరుగానే భారత్ వృద్ధిరేటు..!

2018లో ఊహించినదానికన్నా అధికంగానే! ● డెలాయిట్ తాజా నివేదికలో విశ్లేషణ



న్యూఢిల్లీ: భారత్ వృద్ధి వేగం 2018లో ఊహించిన దానికన్నా వేగంగా నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ–డెలాయిట్ తన తాజా నివేదికలో పేర్కొంది. గ్రామీణ డిమాండ్ పునరుద్ధరణ, మౌలిక రంగంలో వ్యయాల పెంపు వంటి అంశాలు ఇందుకు కారణంగా పేర్కొంది. రుణ ఇబ్బందులు పెరిగినా, అమెరికా వంటి దేశాలు రక్షణాత్మక వాణిజ్య విధానాలు అనుసరించినా భారత్ వృద్ధి వేగవంతంగానే ఉంటుందన్న అభిప్రాయాన్ని డెలాయిట్ వ్యక్తం చేసింది. క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల, అలాగే మార్కెట్లలో ఒడిదుడుకులు కూడా వృద్ధి పురోగతిపై ప్రభావం చూపబోవని అభిప్రాయపడింది. 'వాయిస్ ఆఫ్ ఆసియా' పేరుతో విడుదలైన ఈ నివేదికలో మరిన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- దేశీయ పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. ఇది వృద్ధి ఊపందుకోడానికి దోహదపడే అంశం.
- వృద్ధి రికవరీ బాగుంది. అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో 7.2 శాతం వృద్ధి నమోదయ్యింది. ఇది ఐదు నెలల గరిష్టస్థాయి. వ్యవసాయం, తయారీ, నిర్మాణ రంగాలు బాగున్నాయని గణాంకాలు పేర్కొంటున్నాయి.
- డీమోనిటైజేషన్, జీఎస్‌టీ ప్రారంభ కష్టాలు వంటి అంశాలు వృద్ధిని బలహీనపరిచాయి. అయితే ఆయా సమస్యలు ప్రస్తుతం తొలగిపోతున్నాయి. ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు వృద్ధిని సరైన దిశకు నడిపిస్తున్నాయి.
- భారత్‌కు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు స్థిరంగా పెరుగుతున్నాయి. 2017 మూడవ త్రైమాసికంలో వృద్ధి బాగుంది. 2018లో కూడా4 వృద్ధి పురోగతి కొనసాగే వీలుంది. 6.8 శాతం నంచి 6.9 శాతం శ్రేణిలో వృద్ధి నమోదయ్యే వీలుంది.
- దేశీయంగా డిమాండ్ బాగుంది. వినియోగం పెరుగుతోంది. చిన్న తరహా పరిశ్రమలు పుంజుకుంటున్నాయి.
- అందరికీ ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకురావడం, డిజిటల్ ఇండియాకు చేయూత వంటివి వృద్ధికి దోహదపడే అంశాలు.

అంతర్జాతీయ వృద్ధి 3.7 శాతం.

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 75 శాతానికిపైగా పురోగమన దశలో ఉంది. 2017లో 3.6 శాతం వృద్ధి నమోదయితే, 2018లో ఇది 3.7 శాతానికి చేరే అవకాశం ఉంది. 2016లో ఈ రేటు 3.2 శాతం.

వేదాంత బోర్డులోకి సిన్హా



న్యూఢిల్లీ: మైనింగ్ దిగ్గజం వేదాంత తాజాగా యూకే సిన్హాను కంపెనీ బోర్డులోకి తీసుకుంది. ఈయన అదనపు నాన్ ఎగ్జిక్యూటివ్ స్వతంత్ర డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. యూకే సిన్హా 2021 ఆగస్ట్ 10 వరకు పదవిలో కొనసాగుతారని వేదాంత బీఎస్‌ఈకి తెలిపింది. యూకే సిన్హా 2011 ఫిబ్రవరి నుంచి 2017 మార్చి వరకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్‌గా పనిచేశారు. ఇక సెబీలోకి వెళ్లకముందు యూటీఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ చైర్మన్, ఎండీగా వ్యవహరించారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీలో 4 శాతం వాటా విక్రయం

ఐపీఓ ద్వారా విక్రయించనున్న హెచ్‌డీఎఫ్‌సీ

న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎమ్‌సీ)లో 4 శాతం వాటాను హెచ్‌డీఎఫ్‌సీ కంపెనీ ఐపీఓ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) ద్వారా విక్రయించనున్నది. హెచ్‌డీఎఫ్‌సీ డైరెక్టర్ల బోర్డ్ నియమించిన డైరెక్టర్ల కమిటీ ఈ వాటా విక్రయానికి ఆమోదం తెలిపిందని హెచ్‌డీఎఫ్‌సీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. ఒక్కొక్కటి రూ.5 విలువ గల 4.08 శాతం వాటాకు సమానమైన 85,92,970 షేర్లను ఐపీఓ ద్వారా విక్రయించనున్నామని పేర్కొంది. హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీ ఐపీఓకు గత ఏడాది నవంబర్‌లోనే హెచ్‌డీఎఫ్‌సీ ఆమోదం తెలిపింది. గత ఏడాది మార్చి నాటికి హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీలో హెచ్‌డీఎఫ్‌సీకి 59.99 శాతం వాటా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్ నాటికి ఈ వాటా 57.36 శాతానికి తగ్గింది. ఒకటి లేదా వివిధ దఫాలుగా వాటా విక్రయం ద్వారా ఈ వాటాను కనీసం 50.01 శాతానికి తగ్గించుకోవాలని హెచ్‌డీఎఫ్‌సీ నిర్ణయించింది.

చివరి వరకూ నిలవని లాభాలు

మిశ్రమంగా ముగిసిన మార్కెట్ • ఉత్సాహాన్నిచ్చిన గణాంకాలు

- బలహీనంగా అంతర్జాతీయ సంకేతాలు
- కోలుకున్న బ్యాంక్ షేర్లు
- ఇది ట్రెండ్ రివర్సల్ కాదంటున్న నిపుణులు
- చివర్లో లాభాల స్వీకరణ
- 61 పాయింట్ల నష్టంతో 33,857కు సెన్సెక్స్
- 5 పాయింట్ల లాభంతో 10,427కు నిఫ్టీ



స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్‌ఈ	4,469
ఎన్‌ఎస్‌ఈ (నగదు)	44,692
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	8,95,731
ఎఫ్‌ఐఐ	7,028
డీఐఐ	1,613

చివర్లో అమ్మకాలు.. ఆరంభ లాభాలను హరించివేశాయి. రిటైల్ ద్రవ్యోల్బణ, ఐఐపీ గణాంకాలు అంచనాలను మించిన, అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే ఉండడంతో మంగళవారం స్టాక్ సూచీలు మిశ్రమంగా ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 61 పాయింట్ల నష్టంతో 33,857 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 5 పాయింట్ల లాభంతో 10,427 పాయింట్ల వద్ద ముగిశాయి. కొన్ని బ్యాంక్, ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం, టీసీఎస్ 5 శాతం పతనం కావడం ప్రతికూల ప్రభావం చూపించాయి. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు మంగళవారం రాత్రి(భారత కాలమానం ప్రకారం) వెలువడనున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు నిర్ణయానికి ఈ గణాంకాలు కీలకం కావడంతో ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. దీంతో మన మార్కెట్లో ఒడిదుడుకులు చోటుచేసుకున్నాయి.

గణాంకాల ఉత్సాహం...

ఈ ఏడాది జనవరిలో 5.2 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం గత నెలలో 4.4 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణం తగ్గడం ఇది వరుసగా రెండో నెల. గత ఏడాది డిసెంబర్లో 7.1 శాతంగా ఉన్న పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) ఈ ఏడాది జనవరిలో 7.5 శాతానికి ఎగసింది. ఐఐపీ పెరగడం ఇది వరుసగా మూడో నెల.

354 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్

ఆసియా మార్కెట్లు బలహీనంగా ఉండటంతో సెన్సెక్స్ 33,818 పాయింట్ల వద్ద నష్టాల్లో ఆరంభమైంది. సోమవారం మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడిన ఐఐపీ, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనాలను మించడంతో కొనుగోళ్లు జోరుగా సాగాయి. దీంతో సెన్సెక్స్ కీలకమైన 34,000 పాయింట్లను దాటేసింది. ఇంట్రాడేలో 159 పాయింట్ల లాభంతో 34,077 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత ఆర్థిక రంగ, ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో నష్టాల్లోకి జారిపోయింది. ఒక దశలో 195 పాయింట్ల నష్టంతో 33,723 పాయింట్ల కనిష్ట స్థాయిని తాకింది. మొత్తం మీద రోజంతా 354 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇక నిఫ్టీ ఒక దశలో 57 పాయింట్లు లాభపడగా, మరో దశలో 44 పాయింట్లు నష్టపోయింది. ద్రవ్యోల్బణం తగ్గడం, ఐఐపీ అంచనాలను మించి పెరగడంతో మార్కెట్లో సానుకూల వాతావరణం కనిపించిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అయితే ఐటీ షేర్లలో అమ్మకాలు, బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఆ లాభాలు చివరి వరకూ నిలవలేకపోయాయని వివరించారు. బలహీనంగా ఉన్న ఆసియా మార్కెట్లు కారణంగా మన మార్కెట్లో ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయని, రిటైల్ ద్రవ్యోల్బణం, ఐఐపీ గణాంకాలు అంచనాలను మించడం దేశీయ సెంటిమెంట్‌కు ఒకింత జోష్‌నిచ్చాయని బీఎన్‌పీ పారిబా మ్యూచువల్ ఫండ్ డిప్యూటీ సీఈఓ ఆనంద్ షా చెప్పారు.

ఐటీ షేర్లకు నష్టాలు...

టీసీఎస్ నష్టపోవడంతో పాటు డాలర్‌తో రూపాయి మారకం పెరగడం కూడా ప్రభావం చూపడంతో ఐటీ షేర్లు నష్టపోయాయి., హెచ్‌సీఎల్ టెక్ 0.8 శాతం, ఇన్ఫోసిస్ 0.4 శాతం చొప్పున నష్టపోయాయి. గీతాంజలి జెమ్స్ షేర్లు మరో 5 శాతం క్షీణించి రూ.14.30 వద్ద ముగిశాయి. ఎఫ్‌ఎమ్‌సీజీ దిగ్గజం ఐటీసీ అర శాతం, ప్రైవేట్ బ్యాంక్‌లు కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు 1.4 శాతం వరకూ పతనమయ్యాయి.

కోలుకున్న బ్యాంక్ షేర్లు...



రూ.7,000 కోట్ల మొండి బకాయిల రికవరీ అయ్యాయన్న వార్తల కారణంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా 14 శాతం లాభపడింది. రుణ కుంభకోణ మొత్తాలకు సంబంధించి సెటిల్మెంట్ జరుగుతుందనే అంచనాలతో పంజాబ్ నేషనల్‌బ్యాంక్ 4 శాతం లాభంతో రూ.98 వద్ద ముగిసింది. ఈ రెండుఅంశాలు ఇతర ప్రభుత్వరంగ బ్యాంక్‌లపై సానుకూల ప్రభావం చూపించాయి. సోమవారం 6 శాతం నష్టపోయిన ఆంధ్రా బ్యాంక్ షేర్ మంగళవారం కోలుకొని 11 శాతం ఎగసింది. యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓబీసీ, సిండికేట్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, పీఎన్‌బీలు 3-7 శాతం రేంజ్‌లో పెరిగాయి. ఇటీవలి వరకూ పతన బాటలో ఉన్న బ్యాంక్ షేర్లు తాజాగా లాభపడడం ట్రెండ్ రివర్సల్‌గా పరిగణించవద్దని నిపుణులు పేర్కొన్నారు. ఒక్కరాత్రిలో ఫండమెంటల్స్ ఏమీ మారలేదని, ఈ షేర్లకు దూరంగా ఉంటేనే మంచిదని సూచించారు.

టీసీఎస్ షేర్లు విక్రయించిన టాటా సన్స్



టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)లో 1.63 శాతానికి సమానమైన షేర్లను ప్రమోటర్ సంస్థ టాటా సన్స్ విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ షేర్ల విక్రయం జరిగింది. ఈ షేర్ల విక్రయ విలువ దాదాపు రూ.9,000 కోట్లు. ఎన్‌ఎస్‌ఈ బల్క్ డీల్ డేటా ప్రకారం 2.06 కోట్ల షేర్లను రూ.2,876 ధరకు, 1.06 కోట్ల షేర్లను రూ.2,872 ధరకు విక్రయించారు. మొత్తం 3.12 కోట్ల షేర్ల విక్రయం ద్వారా టాటా సన్స్‌కు రూ.8,990 కోట్లు లభించాయి. ఈ షేర్ల విక్రయం అనంతరం టీసీఎస్‌లో టాటా సన్స్ వాటా 72 శాతానికి తగ్గుతుంది. ఈ షేర్ల విక్రయం ద్వారా సమీకరించిన మొత్తాన్ని టాటా గ్రూప్ కంపెనీ టాటా టెలిసర్వీసెస్‌కు భారీగా ఉన్న రూ.40,000 కోట్ల రుణ భారాన్ని తగ్గించుకునేందుకు వినియోగిస్తారని సమాచారం. ఈ షేర్ల విక్రయం నేపథ్యంలో బీఎస్‌ఈలో టీసీఎస్ షేర్ 5.2 శాతం నష్టపోయి రూ.2,892 వద్ద ముగిసింది. మార్కెట్లో బాగా నష్టపోయిన షేర్ ఇదే. దీంతో ఈ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.30,513 కోట్లు తగ్గి రూ.5,53,698 కోట్లకు చేరింది. గత మూడేళ్లలో శాతం పరంగా ఈ షేర్ అత్యధికంగా నష్టపోవడం ఇదే. సెన్సెక్స్, నిఫ్టీల్లో బాగా నష్టపోయిన షేర్ కూడా ఇదే.

గీతాంజలి జెమ్స్‌కు ఎన్‌ఎస్‌ఈ జరిమానా

- మరో 23 కంపెనీలపై కూడా
- క్యూ3 ఫలితాలు దాఖలు చేయనందుకు



ముంబై: గీతాంజలి జెమ్స్ సహా మరో 23 కంపెనీలపై నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ జరిమానాలు విధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను దాఖలు చేయనందుకు గాను ఎన్‌ఎస్‌ఈ ఈ జరిమానాలు విధించింది. ఆర్థిక ఫలితాల దాఖలుకు సంబంధించి నియమనిబంధనలు పాటించకపోతే, ఎన్‌ఎస్‌ఈ మరిన్ని చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. క్యూ3 ఆర్థిక ఫలితాలు దాఖలు చేయనందుకు ఎన్‌ఎస్‌ఈ జరిమానా విధించిన కంపెనీల జాబితాలో.. ఏబీజీ షిప్‌యార్డ్, ఆమ్‌టెక్ ఆటో, డిఎస్ కులకర్ణి డెవలపర్స్, ఎడ్యుకాంప్ సొల్యూషన్స్, శ్రీ రేణుక షుగర్స్, స్టెర్లింగ్ బయోటెక్ తదితర కంపెనీలున్నాయి.

భారీ నష్టాల పీఎస్‌యూల్లో ఎయిరిండియా, బీఎస్‌ఎన్‌ఎల్

- లాభసాటి సంస్థల్లో ఇండియన్ ఆయిల్, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా
- 2016–17లో ప్రభుత్వ రంగ సంస్థలపై అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ దిగ్గజాల్లో ఇండియన్ ఆయిల్, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా మెరుగైన పనితీరు కనపర్చాయి. అత్యధిక లాభాలు ఆర్జించిన టాప్ 3 సంస్థలుగా నిల్చాయి. మరోవైపు బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిరిండియా, ఎంటీఎన్‌ఎల్ మాత్రం భారీ నష్టాలతో అధ్వాన్న పనితీరు చూపాయి. 2016–17 ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్‌ఈ) పనితీరుపై కేంద్రం నిర్వహించిన ఒక సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మంగళవారం దీన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టారు. సర్వే నివేదిక ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం నష్టాలు నమోదు చేసిన 82 కంపెనీల మొత్తం నష్టాల్లో టాప్ 10 సంస్థల వాటా ఏకంగా 84 శాతం మేర ఉంది. ఇక ఈ టాప్ 10 సీపీఎస్‌ఈల నష్టాల్లోనూ బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిరిండియా, ఎంటీఎన్‌ఎల్ వాటానే 56 శాతంగా ఉంది.

లాభాల్లోకి హెచ్‌పీసీఎల్, ఎంఆర్‌పీఎల్..

2016–17లో అత్యధికంగా లాభాలు ఆర్జించిన అగ్రశ్రేణి 10 కంపెనీల మొత్తం లాభాల్లో ఇండియన్ ఆయిల్ వాటా సుమారు 20 శాతం, ఓఎన్‌జీసీ 18 శాతం, కోల్ ఇండియా వాటా సుమారు 15 శాతం ఉంది. టాప్ 10 లాభసాటి సీపీఎస్‌ఈల జాబితాలో కొత్తగా హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్), మంగళూర్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ (ఎంఆర్‌పీఎల్) వచ్చి చేరాయి. అయితే, హిందుస్తాన్ ఫెర్టిలైజర్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాత్రం లిస్టులో స్థానం కోల్పోయాయి. 174 లాభసాటి సీపీఎస్‌ఈల మొత్తం లాభాల్లో టాప్ 10 కంపెనీల లాభాల వాటా సుమారు 64 శాతంగా ఉంది. 2015–16లో నష్టాలు నమోదు చేసిన హిందుస్తాన్ కేబుల్స్, భెల్, ఓఎన్‌జీసీ విదేశ్ సంస్థలు మళ్లీ గత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లోకి మళ్లాయి. అయితే వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, ఎస్‌టీఎస్‌ఎల్, ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ తదితర సంస్థలు టాప్ 10 నష్టాల సీపీఎస్‌ఈల జాబితాలో చేరాయి. 2016– 17లో మొత్తం 257 పీఎస్‌యూల నికర లాభం రూ. 1,27,602 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ. 1,14,239 కోట్లతో పోలిస్తే 11.7 శాతం వృద్ధి నమోదైంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,400	▼	30
బంగారం (99.5, 10గ్రా)	30,250	▼	30
వెండి (కిలో)	38,345	▲	10
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	28,970	▼	40
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,420	▼	40
బంగారం (22 క్యారెట్లు)	28,970	▼	40
వెండి (కిలో)	41,400		0
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,300		
బంగారం (22 క్యారెట్లు)	29,030		
వెండి (కిలో)	39,600		
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,160	▲	27
బంగారం (22 క్యారెట్లు)	28,980	▼	130
వెండి (కిలో)	39,900	▼	1800
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,400		
బంగారం (22 క్యారెట్లు)	29,000		
వెండి(కిలో)	39,500		
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,320	▼	50
బంగారం (22 క్యారెట్లు)	28,970	▼	40
వెండి (కిలో)	39,450	▲	50

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.00కు	సోమవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	60.52	$61.36
బ్రెంట్	64.45	$64.95

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 14-3-2018

విశాఖ	332-00
చిత్తూరు	362-00
వరంగల్	332-00
ముంబై	370-00
చెన్నై	370-00
విజయవాడ	322-00
గోదావరి	322-00
నమక్కల్	360-00
13-3-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	330-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	365-00
కోల్‌కతా	360-00
ఢిల్లీ	310-00

పార్లమెంట్‌లో బిజినెస్

ఆరేళ్లలో నీరవ్ మోదీకి 1,212 ఎల్‌ఓయూలు



పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో దాదాపు 13,000 కోట్ల కుంభకోణానికి పాల్పడిన నీరవ్‌మోదీ మొత్తం ఆరేళ్లలో 1,213 మోసపూరిత లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్స్ (ఎల్‌ఓయూ)లు పొందాడు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ రాజ్యసభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలియజేశారు. దీని ప్రకారం 2011 మార్చి 10న ముంబైలోని పీఎన్‌బీ బ్రాడీ హౌస్ బ్రాంచీలో మొదటి గ్యారెంటీ పొందాడు. 2017 మే 23న చివరి ఎల్‌ఓయూ జారీ అయ్యింది. అవినీతి పరులైన ఉద్యోగులు ఇందులో కీలక పాత్ర పోషించారు.

ఎస్‌డబ్ల్యూఐఎఫ్‌టీ మెస్సేజ్‌లపై పీఎన్‌బీ దృష్టి

ఎస్‌డబ్ల్యూఐఎఫ్‌టీ (సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్) మెస్సేజ్‌ల ప్లాట్‌ఫామ్ దుర్వినియోగం కావడంపై పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) బ్యాంక్ దృష్టి సారిస్తోంది. దాదాపు 13 వేల కోట్ల కుంభకోణానికి ఎస్‌డబ్ల్యూఐఎఫ్‌టీ మెస్సేజ్‌లనే నీరవ్‌మోదీ అతని అనుచరులు వినియోగించుకున్నారని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆయా అంశాలన్నింటినీ ఆర్‌బీఐకి పంజాబ్ నేషనల్ బ్యాంక్ నివేదించినట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి శివ్ ప్రతాప్ శుక్లా రాజ్యసభకు ఒక లిఖిత పూర్వక సమాధానంతో తెలిపారు. ఎల్‌ఓయూఎస్/ ఎఫ్‌ఎల్‌సీల మోసపూరిత జారీలు, ఇందుకు సంబంధించిన అంశాలు పీఎన్‌బీ కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలో లావాదేవీలు నమోదుచేయకుండా ఈ సమాచారాన్ని విదేశీ బ్యాంకులకు చేరవేయడానికి ఎస్‌డబ్ల్యూఐఎఫ్‌టీ మెస్సేజ్‌లను నిందితులు వినియోగించుకున్నట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.

ఎన్‌సీఎల్‌టీ పరిశీలనలో 9,000కుపైగా కేసులు

2018 జనవరి 31 నాటికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) పరిశీలనలో మొత్తం 9,073 కేసులు ఉన్నట్లు కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయమంత్రి పీపీ చౌదరి రాజ్యసభకు ఒక లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. వీటిలో దాదాపు 2,500 కేసులు దివాలా సంబంధమైనవి ఉన్నట్లు వివరించారు. 1,630 కేసులు కంపెనీల విలీనాలకు సంబంధించినవని తెలిపారు. 2013 కంపెనీల చట్టం కింద ఎన్‌సీఎల్‌టీ ఏర్పాటయ్యింది.

రూ.3,900 కోట్ల బినామీ ఆస్తుల జప్తు



ఫిబ్రవరి చివరినాటికి ఆదాయపు పన్ను శాఖ 1,600 బినామీ లావాదేవీలను గుర్తించిందని ఆర్థికశాఖ సహాయమంత్రి శివ్ ప్రతాప్ శుక్లా రాజ్యసభకు తెలిపారు. ఇందుకు సంబంధించి 1,200 కేసుల్లో రూ. 3,900 కోట్లకు పైగా విలువైన బినామీ ఆస్తులను జప్తు (ప్రొవిజనల్‌గా) చేసినట్లు కూడా ఆయన ఈ సందర్భంగా తెలిపారు. డీమోనిటైజేషన్ కాలంలో డిపాజిట్ల విషయంలో తగిన విధమైన పొసగని పన్ను ప్రొఫైల్స్ ఉన్న దాదాపు 22.69 లక్షల మందిని ఆదాయపు పన్ను శాఖ గుర్తించిందని మరో ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

హెచ్‌డీఎఫ్‌సీ కార్డులపై క్రిప్టోకరెన్సీ సేవలు బంద్

ముంబై: మీరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కస్టమరా? అయితే ఇక మీరు మీ బ్యాంక్ కార్డుల ద్వారా క్రిప్టోకరెన్సీ సంబంధిత లావాదేవీలు నిర్వహించడం వీలుపడదు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజాగా తన క్రెడిట్, డెబిట్, ప్రిపెయిడ్ కార్డులపై క్రిప్టోకరెన్సీల కొనుగోలు, ట్రేడింగ్ సర్వీసులను బ్లాక్ చేస్తున్నట్లు ప్రకటించింది. క్రిప్టోకరెన్సీలపై అంతర్జాతీయంగా భయాలు పెరుగుతోన్న నేపథ్యంలో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా క్రిప్టోకరెన్సీపై హెచ్చరికలు జారీచేసిన విషయం తెలిసిందే. కాగా భారత్‌లో క్రిప్టోకరెన్సీలకు చట్టబద్ధత లేదు.

వొడాఫోన్‌కు 10 లక్షల మంది ఎయిర్‌సెల్ కస్టమర్లు

చెన్నై: ఎయిర్‌సెల్ కస్టమర్లు వొడాఫోన్ నెట్‌వర్క్‌కు ఎక్కువగా బదిలీ అవుతున్నారు. ఇప్పటిదాకా 10 లక్షలకుపైగా ఎయిర్‌సెల్ కస్టమర్లు తమ నెట్‌వర్క్‌కు మారిపోయారని వొడాఫోన్ తెలియజేసింది. వినియోగదారుల సౌలభ్యం కోసం రిటైల్ టచ్ పాయింట్లలో వారంలో ఏడు రోజులూ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని పేర్కొంది. కాగా పరిశ్రమలోని గట్టి పోటీ, తీవ్ర రుణ భారం కారణంగా కార్యకలాపాలు నిర్వహించలేమని ఎయిర్‌సెల్ దివాలా పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

2025 కల్లా ప్రతి ఐదు లావాదేవీల్లో నాలుగు డిజిటలే!!

ఏసీఐ వరల్డ్‌వైడ్, ఏజీఎస్ ట్రాన్స్‌యాక్ట్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: భారత్‌లో డిజిటల్ ట్రాన్సాక్షన్ల విలువ 2025 కల్లా ఏడాదికి లక్ష కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా. పెద్ద నోట్ల రద్దు, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం వంటి అంశాలు దీనికి కారణంగా నిలుస్తాయని ఏసీఐ వరల్డ్‌వైడ్, ఏజీఎస్ ట్రాన్స్‌యాక్ట్ టెక్నాలజీస్ సంయుక్త నివేదిక పేర్కొంది. ప్రతి ఐదు లావాదేవీల్లో నాలుగు డిజిటల్ రూపంలో ఉంటాయని తెలిపింది. ప్రస్తుతం ఇండియాలో డిజిటల్ ట్రాన్సాక్షన్లు నిర్వహించే యూజర్ల సంఖ్య 9 కోట్లకు దగ్గరగా ఉందని, ఇది 2020 కల్లా 30 కోట్లకు చేరొచ్చని పేర్కొంది. 'డిజిటల్ ట్రాన్సాక్షన్లు జోరు మీదున్నాయి. బలమైన వృద్ధి గణాంకాలు నమోదవుతున్నాయి. భవిష్యత్‌లోనూ ఇదే ట్రెండ్ కొనసాగాలంటే సౌకర్యవంతమైన, నమ్మదగిన టెక్నాలజీ అవసరం' అని ఏసీఐ వరల్డ్‌వైడ్ వైస్ ప్రెసిడెంట్ మనీశ్ పటేల్ పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలు పెరిగేకొద్ది కంపెనీలకు సైబర్ సెక్యూరిటీ వ్యయాలు కూడా పెరుగుతాయని నివేదిక పేర్కొంది. భారత్‌లో సైబర్ దాడుల వ్యయాలు 2025 కల్లా వార్షికంగా 20 బిలియన్ డాలర్లకు చేరొచ్చని తెలిపింది. ఇక స్మార్ట్‌ఫోన్ యూజర్ల సంఖ్య 2020 నాటికి రెట్టింపుతో 50 కోట్లకు చేరొచ్చని అంచనా వేసింది.

2018లో రేటు పెరుగుదల లేనట్లే!

విశ్లేషకుల అభిప్రాయం



ముంబై: ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ, 2018లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకులకు తానిచ్చే రుణ రేటు- రెపో (ప్రస్తుతం 6 శాతం)ను తగ్గించే అవకాశాలు కనిపించడం లేదని పలువురు విశ్లేషిస్తున్నారు.

- బడ్జెట్‌లో ఆహార ధాన్యాలకు కనీస మద్దతు ధర పెంపు - ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే 2018–19 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీసే అవకాశం ఉందని జపాన్ బ్రోకరేజ్ సంస్థ- నొమురా అభిప్రాయపడింది.
- పారిశ్రామిక వృద్ధి రేటు మెరుగుపడిన నేపథ్యంలో వచ్చే ఆరు నెలల్లో ఆర్‌బీఐ రేటు తగ్గింపునకు అవకాశం లేదని దేశీయ క్రెడిట్ రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ పేర్కొంది. వినియోగ డిమాండ్, గృహ అద్దె అలవెన్సులు, క్రూడ్ ధరల పెరుగుదల వంటి అంశాల వల్ల రిటైల్ ద్రవ్యోల్బణం 2018–19లో సగటున 4.6 శాతం నమోదయ్యే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా వేస్తోంది.
- సింగపూర్ బ్యాంక్ డీబీఎస్ కూడా రేటు తగ్గింపునకు అవకాశం లేదని తన తాజా విశ్లేషణలో వివరించింది.

రేటు పావుశాతం పెరగవచ్చు: కేర్ రేటింగ్స్

కాగా రెపోను 2018లో పావుశాతం పెంచే అవకాశం ఉందని కేర్ రేటింగ్స్ తన తాజా నివేదికలో పేర్కొంది. ద్రవ్యోల్బణం అధిక శ్రేణికి పెరిగే అవకాశం ఉండడమే దీనికి కారణమని పేర్కొంది. ప్రభుత్వ ఆదాయ వ్యయాలకు సంబంధించిన నికర వ్యత్యాసమైన ద్రవ్యలోటు పెరుగుతోందని, చమురు ధరల తీవ్రత, వ్యవసాయ వృద్ధి తగ్గడం వంటివి ధరల పెరుగుదలకు దారితీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. 2 శాతం ప్లస్, 2 శాతం మైనస్‌తో 4 శాతం వద్ద ద్రవ్యోల్బణం ఉండాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం. అయితే ఈ శ్రేణికి మించి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని కేర్ తన నివేదికలో వెల్లడించింది.

బీఓఏఎంఎల్ భిన్నం...

కాగా, ఆగస్టులో పాలసీ రేటును పావుశాతం తగ్గిస్తుందని అంతర్జాతీయ బ్యాంకింగ్ సేవల దిగ్గజం- బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిలించ్ (బీఓఏఎంఎల్) అంచనావేస్తోంది. 'ద్రవ్యోల్బణం పెరిగినా... ఆర్‌బీఐ ఫ్రేమ్‌వర్క్ రేంజ్‌లోనే కొనసాగే అవకాశం ఉంది. ఇదే రేటు తగ్గింపు నిర్ణయానికి దోహదపడే కారణమవుతుందని భావిస్తున్నాం''అని తన నివేదికలో పేర్కొంది.

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	403.95	406.1
ADANI PORT	385.2	386.6
AMBUJA CEME	238.8	240.85
ASIAN PAINT	1140.3	1131.5
AXIS BANK L	531.5	519.2
BAJAJ AUTO	2971.75	2957.75

BAJAJ FINAN	1680.7	1665.25
BHARTI AIRT	426.3	421.55
BOSCH LIMIT	18487.9	18247.45
BHARAT PETR	466.65	446.75
CIPLA LTD	578.75	580.65
COAL INDIA	294.85	297.65
EICHER MOTO	28849.35	28316.9
GAIL (INDIA	455.95	446.45
HCL TECHNOL	957	967.65
HDFC LTD	1868.5	1858.05

HDFC BANK L	1860.25	1867.25
HERO MOTOCO	3701.2	3694.5
HINDALCO I	226.15	227.65
HINDUSTAN P	382.95	366.75
HINDUSTAN U	1320.55	1324.2
INDIABULLS	1231.8	1210.45
ICICI BANK	304.35	300.65
INDUSIND BA	1729.5	1735.3
BHARTI INFR	349	339.5
INFOSYS LIM	1183.8	1185.75

INDIAN OIL	407.85	400.65
ITC LTD	269.45	270.1
KOTAK MAHIN	1083.9	1100.6
LARSEN & TO	1302.75	1310.05
LUPIN LIMIT	780.6	769.8
MAHINDRA &	733	737.1
MARUTI SUZU	8756.05	8810.3
NTPC LTD	169.4	171.15
OIL AND NAT	183.6	183.85
POWER GRID	195.05	195

RELIANCE IN	931.85	930.3
STATE BANK	254.7	252.85
SUN PHARMAC	523.3	512.65
TATA MOTORS	353.15	352.6
TATA STEEL	628.85	622.9
TATA CONSUL	2886.8	3052.15
TECH MAHIND	619.15	619.55
ULTRATECH C	4170	4176
UPL LIMITED	722.8	717.95
VEDANTA LIM	321.05	317.4

WIPRO LTD	296.6	290.7
YES BANK LI	312.8	311.15
ZEE ENTERTA	579.15	576.25

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1410.8	1433.6
ACC LIMITED	1575.35	1559.9
ASHOK LEYLA	149.9	145.4
BAJAJ FINSE	5098.4	5040.05
BANK OF BAR	141.55	132.1

BHARAT ELEC	151.55	150.15
BHEL	86.9	86.95
BRITANNIA I	4869.95	4866.8
CADILA HEAL	390.45	389.3
COLGATE PAL	1044.9	1043.95
CONTAINER C	1241.4	1238.25
CUMMINS IND	773.75	776.2
DABUR INDIA	325.15	327.75
DLF LIMITED	219.9	217.7
AVENUE SUPE	1337.9	1315.65
EMAMI LIMIT	1063.15	1061.55

GLAXOSMITHK	2269.3	2256.15
GLENMARK PH	538.15	536.65
GODREJ CONS	1092.45	1078.6
GLAXOSMITHK	6625.45	6836.65
HAVELLS IND	514.3	505.2
HINDUSTAN Z	319	318.85
ICICI PRU L	385.45	385.9
IDEA CELLUL	80.65	78.5
INTERGLOBE	1301.6	1276.7
JSW STEEL L	303.5	297.85
LIC HOUSING	513.05	492.55

MARICO LIMI	309.55	309.45
UNITED SPIR	3081.4	3134.1
MOTHERSON S	318.8	319.2
MRF LTD	71717.3	71094.2
NHPC LTD	27	26.65
NMDC LTD.	124.2	123.75
ORACLE FIN	3932.1	3934.35
OIL INDIA L	327.2	326.7
PIRAMAL ENT	2481.9	2415.55
PETRONET LN	239.35	231
POWER FIN C	89.85	88.25
P&G HYGIENE	9435.6	9402.45

PIDILITE IN	899.85	890.25
PUNJAB NATI	97.95	94.6
RURAL ELEC	130.25	126.45
STEEL AUTHO	72.6	72.35
SHREE CEMEN	16795.55	16151.5
SIEMENS LTD	1118.95	1106.85
SHRIRAM TRA	1356.5	1343.7
SUN TV NETW	900.25	893
TATA POWER	81.35	80.85
TITAN COMPA	851.95	829.1
TORRENT PHA	1305.5	1311.85

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.66	8.25
Alphageo	762.15	748.55
Alu Flouride	107.85	107.7
Amar Raja Bat	802	812.95
And Bank	39.45	35.85
And Cemen	9.9	9.7
And Paper	301.45	297.8
And Petro	56.95	58.9
Anjani Portl	183.85	178
Aries Agro Ltd	200.15	190.65
Aurobindo Ph	581.6	582

Avantel Soft	573.9	546.6
Avanti Feeds	2450.4	2281.7
AvonOrg	10.3	9.81
BKV Industrs	1.6	1.57
BN Rathi Sec	39.7	39.55
Balaji Amin	584.95	572.5
Bambino Agro	227.6	225.05
Bartronics	11.82	12.03
Bhagira Chem	283.3	282
Bhagya Nag	48.25	45.3
Bhagya Wood	26	26
Brilliant Sec	9.13	8.7
CIL Securi	26.85	26.9
Color Chip	35.75	35.65
Combat Drugs	23.5	24.7
Cont Coffee	292	287.6
CoroFert	505.95	506.65

Cosboard Ind	31	31.2
Country Club	13.75	13.43
Cubex Tub	23.8	22.7
Cybermate	3.1	3.03
DR Reddy	2181.4	2147.1
Danlaw Tec	74	73.7
DecCement	547.95	539
Divi's Lab	1047	1010.7
Divya Granit	94	94.95
Dolphin Medi	1.19	1.14
Dredgin Corp	666.3	666.15
Empee Sugars	3.49	3.55
Everest Org	138.95	137
Fortune Info	73.55	70.05
Four Soft	76.7	76.8
GMR Ferro	3.17	3.03
GMR Infra	17.6	17.4

GVK Power	16.1	15.35
Gati Corpn	102.7	101.15
Gayatri Bio	7.18	7.52
Gayatri Proj	206	206.2
Gayatri Sugrs	9.43	9.77
Gennex Lab	3.99	3.91
GodavDru	32.4	32.55
Goldstn Tele	195.5	196.35
Goldstone Tech	13.7	13.36
Granules (I)	109.8	108.6
HBL Nife Pow	49.8	48.25
HYDIndus	1626.9	1609.5
Heritage Food	702	694
HindFlurocarb	9.7	9.54
ICSA Ltd	3.22	3.25
IDL Industrs	523.4	528.45
IKF Soft	0.6	0.61

IQMS Soft	15.05	15.2
IVRCL Infras	3.81	3.76
Incap	84.5	80.5
IndoNationl	853	826.7
Infotech En	625.3	624.5
Innaredy Com	3.22	3.25
Invinex Lab	107.4	113.05
JSTL	42.25	41.65
KCP LTD	116.95	115.9
KNR Constructio	297	294.35
Kabsons Indu	7.05	7.42
KakatiCem	269.95	264.05
Kallam Spg	31.75	31.3
Kernex Micro	37.5	37.25
Krebs Bio	198	204.15
LGS Global	5.05	5.04
LancoIndus	327.4	322.25

Lokesh Mach	58	58.25
Lotus Choc	49	49.95
MIC Elec	6.5	6.42
Madhucon Proje	24.75	24.05
Maytas Infra	37.8	36.8
Mold-tek	54.45	53.85
Moldtek Plastic	337.85	317.95
Moschip Semi	31.4	31.15
NCLInd	229.1	222.6
NETTLINX	74.9	75.15
NMDC Ltd	124.4	123.75
NagarAgrich	42.75	41.15
NagarConst	124.8	122.8
Natco Pharma	743.7	729.55
Nava Bh Ventur	143	143.3
Neha Inter	6.2	6.57
Neocure Ther	3.47	3.39

Neuland Lab	700	704.6
Nihar Info Glo	13.5	12.86
Nile	709	699.1
Oil Country	38.1	37.05
PL Enterpri	2.36	2.36
Padmalaya Tele	3.43	3.61
Pankaj Poly	8.7	8.33
Panyam Cemen	44.2	42.45
Peeti Securt	7.62	7.48
PennInd	55.9	55.8
Phytochem I	62.8	61.85
Pitti Lamin	86.5	86.1
Pokarna	195.1	193.15
Prajay Engs	12.35	12.51
PremiExpl	367	364.5
Prism Cement	118.3	116.4
Raasi Refrac	4.29	4.5

Rain Industries	394.1	392.45
Raj Packagin	43	41.3
Ram Informat	39.75	39.15
Reg.Ceramic	5.36	5.64
Restile Cer	6.73	7.15
Roopa Indus	16.3	15
Sagar Cem	908.6	934.55
Sai Wires(I)	1.04	1.04
Samkrg Pist	293.45	291.1
Sampre Nutri	55.7	54.95
SangInd	124.9	118.4
Satvah. Ispat	19.45	20.1
Saven Techno	26.4	26.8
South Bio Tech	2.75	2.62
SrRayAlk	52.7	50.7
Srinivasa Ship	58.75	60
Starchik Sp	22.45	21.55

Sujana Metal	1.22	1.27
Sujana Towers	3.52	3.7
Sujana Univers	0.75	0.77
Surana Strip	2.47	2.43
Surana Tele	4.96	4.95
Suryachakra Pow	0.9	0.94
Suryalata Sp	137	136
SuvarCem	130	129.05
Suven Pharma	179.95	178.7
TCI Finance	27.05	26.15
Taj Gvk Hotel	155.5	154.8
Tanla Solutions	33.2	33.15
Trans Biotek	2.35	2.25
Transport Co	259.45	256.4
Usher Agro	5.17	5.21

VBC Ferro	36.4	38
VST Indus	2822.1	2946.75
Vamshi Rubb	47.85	47.8
Viceroy Hotels	14.15	13.95
VijayTextil	44.7	43.1
Vimta Labs	194.4	199.45
Virat Crane	60.15	58.85
Virinchi Con	108	101.65
VisakaInd	690	663.15
Vision Tech	1.47	1.42
Vista Pharma	43	42.5
Vivimed Labs	76.85	75.45
Vjil Consult	17	16.8
ZenoTech Lab	41.5	39.55

కలుషిత నీటితో 80 మందికి అస్వస్థత

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం జగన్నాథపురంలో తాగునీటి పైప్‌లైన్ లీక్ అయి డ్రైనేజీ నీరు కలవడంతో అతిసార వ్యాధి ప్రబలింది. దీంతో హరిజన కాలనీకి చెందిన 80 మంది వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నారు. మంగపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి, బాధితులకు చికిత్స అందించారు. నీరసంగా ఉన్న ఆరుగురిని శిబిరంలోనే ఉంచారు. డీఎం అండ్ హెచ్‌వో దయానందస్వామి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రామ్‌కుమార్ వైద్య శిబిరాన్ని సందర్శించారు.

యూఏఈ వెళ్లే నిరుద్యోగులకు పీసీసీ సరళీకృతం

రాయికల్(జగిత్యాల): ఉపాధి కోసం యూఏఈ వెళ్లే నిరుద్యోగ యువతకు వీసా కోసం పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) విషయంలో వెసులుబాటు లభించింది. గతనెల 4 నుంచి యూఏఈలో ఈ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం నిరుద్యోగ యువత రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీ ఆఫీసుల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది. దీనిని దృష్టిలో ఉంచుకొని విదేశీ వ్యవహారాల శాఖ అధికారి లూథర్ యూఏఈ ఎంబసీ అధికారులతో చర్చలు జరిపారు. పాస్‌పోర్ట్ ఆఫీసు ద్వారా జారీ అయ్యే పీసీసీ చెల్లుబాటు అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. పాస్‌పోర్ట్ ఆఫీసుల్లో తీసుకున్న పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌తోపాటు యూఏఈ వెళ్లేవారు ముంబై, ఢిల్లీ, త్రివేంద్రంలోని యూఏఈ దౌత్య కార్యాలయాల్లో తప్పనిసరిగా ధ్రువీకరణ చేయించుకోవాలి. అప్పుడే వీసాలు జారీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఏపీ ఉద్యోగులు వద్దు

రామగుండంలో విద్యుత్ ఉద్యోగుల ధర్నా

రామగుండం: రాష్ట్రంలో జెన్‌కో ఆధ్వర్యంలోని విద్యుత్ కేంద్రాల్లో ఆంధ్రా ఇంజనీర్లను నియమించవద్దని డిమాండ్ చేస్తూ స్థానిక విద్యుత్ ఇంజనీర్లు ఆందోళన చేపట్టారు. వారిని ఇక్కడ నియమిస్తే స్థానికుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రామగుండంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం ఎదుట వారు నిరసనకు దిగారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని.. వారు హైకోర్టును ఆశ్రయించడంతో వారిని విధుల్లో చేర్చుకోవాలని కోర్టు తీర్పు ఇచ్చిందని, దీంతో త్వరలోనే మళ్లీ జెన్‌కో కేంద్రాలు ఆంధ్ర ఉద్యోగుల చేతుల్లోకి వెళ్లనున్నాయని స్థానిక ఇంజనీర్లు ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సుప్రీం కోర్టులో పిటిషన్ వేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పొడిశెట్టి విజేందర్‌కు అందజేశారు. ఆందోళనలో ఇంజనీర్ల అసోసియేషన్, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

త్రిపురారం(నాగార్జునసాగర్): నల్లగొండ జిల్లా అనుముల మండలం పంగవానికుంట గ్రామానికి చెందిన సురిభి సత్యనారాయణ(35) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సొంత భూమి లేకపోవడంతో 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని రెండేళ్లుగా వరి, పత్తి పంట సాగు చేస్తున్నాడు. పెట్టుబడుల కోసం రూ.4 లక్షల అప్పు చేశాడు. దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

స్వామిగౌడ్ డ్రామాలు ఆడుతున్నారు

వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి



సాక్షి, వనపర్తి: ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ డ్రామాలు ఆడుతున్నారని వనపర్తి ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి జిల్లెల చిన్నారెడ్డి ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా సోమవారం అసెంబ్లీలో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో 11 మంది కాంగ్రెస్ సభ్యులపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ జాబితాలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి కూడా ఉండగా ఆయన మంగళవారం 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతిపక్షం అనేది లేకుండా చేయాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్ర అని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు సిగ్గుచేటని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీలు ప్రతిరోజూ గొడవ చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విషయాన్ని సీఎం గుర్తించాలని సూచించారు. కేసీఆర్ సర్కారుకు ఇదే చివరి బడ్జెట్ అని ఈ బడ్జెట్‌లో జరిగిన లోపాలపై కాంగ్రెస్ సభ్యులు ప్రశ్నిస్తారనే భయంతోనే తమను సభ నుంచి సస్పెండ్ చేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ శాసనసభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయడం దారుణమని, అధికార పార్టీకి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

చేయని తప్పుకు
ఇరాక్ జైల్లో నరకయాతన

ఏడాది తర్వాత విముక్తి ● స్వగ్రామం చేరిన వలస బాధితులు

ధర్మపురి: కుటుంబ పోషణ కోసం పరాయి దేశం వెళ్లిన ఐదుగురు రాష్ట్రవాసులు ఏజెంట్ల మోసంతో జైలుపాలై.. చివరికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఏ తప్పు చేయని వీరు ఇరాక్‌లో ఏడాదిపాటు జైల్లో నరకయాతన అనుభవించారు. ఇందులో ముగ్గురు ఎట్టకేలకు విడుదలై మంగళవారం స్వగ్రామాలకు చేరుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్ అనుబంధ గ్రామం మగ్గిడికి చెందిన దుర్గం శాంతయ్య, పసుల లక్ష్మణ్, జక్కి రాజుతోపాటు మంచిర్యాల జిల్లా దండేపెల్లి మండలానికి చెందిన కోడి రాజన్న, నిర్మల్ జిల్లాకు చెందిన దుర్గం నారాయణ బతుకుదెరువుకోసం 2016, జూన్ 17న ఇరాక్ వెళ్లారు. ఇందుకోసం ధర్మపురికి చెందిన ఓ ఏజెంట్‌కు రూ.1.40 లక్షలు ఇచ్చారు. ఆ ఏజెంట్ కంపెనీ వీసా అని చెప్పి విజిట్ వీసాపై ఈ ఐదుగురినీ ఇరాక్ పంపించాడు. ఏడాదికి రూ.లక్ష వేతనం ఉంటుందని నమ్మించాడు. అయితే అక్కడికి వెళ్లాక పరిస్థితి మారింది. అక్కడ ఓ కంపెనీలో ఆరునెలలపాటు నెలకు కేవలం 400 దినార్ల వేతనంతో పనిచేశారు. వేతనం చాలకపోవడంతో అక్కడ మరో ఏజెంట్‌ను కలిశారు. ఎక్కువ వేతనం వచ్చే కంపెనీలో ఉద్యోగం పెట్టిస్తానని సదరు ఏజెంట్ చెప్పడంతో వీరు ఇంటి నుంచి మరో రూ.1.30 లక్షలు తెప్పించి ఆ ఏజెంట్‌కు ఇచ్చారు. అయితే అతడు ఉద్యోగం చూపకపోవడంతో కొంతకాలం అతని చుట్టూ తిరిగారు. చివరకు విధిలేని పరిస్థితిలో 2017, మే 14న ఇంటికి తిరుగు ముఖం పట్టారు.

నకిలీ వీసాగా గుర్తించి జైలుకు..

ఏజెంట్లను నమ్మి వారికి ఒక్కొకరు రూ.2.70 లక్షలు ముట్టజెప్పినా ఫలితం లేకపోవడంతో ఇంటికి బయల్దేరిన వలస బాధితుల వీసాలను అక్కడి విమానాశ్రయంలో తనిఖీ చేయగా, అవి విజిట్ వీసాలు అని తేలింది. గడువు ముగిసిన తర్వాత కూడా ఇరాక్‌లో ఉన్నందుకు పోలీసులు ఐదుగురినీ అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. మే 14 నుంచి సుమారు 10 నెలలు జైల్లో నరకం చూశామని బాధితులు తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని వారు కన్నీటి పర్యంతమయ్యారు. తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, బ్యాగులు, ఇంటికి తీసుకొచ్చేందుకు కొనుగోలు చేసిన సుమారు 60 వేల విలువైన వస్తువులను కూడా అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేయని తప్పుకు తాము శిక్ష అనుభవిస్తున్నామని అక్కడివారి ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు తమను విడిపించుకునేందుకు అనేక పాట్లు పడ్డారని బాధితులు తెలిపారు. కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్‌ను కూడా కలవడానికి ఢిల్లీ వెళ్లారని, మంత్రి కేటీఆర్, నిజామాబాద్ ఎంపీ కవిత తదితరులను కలిసి వినతిపత్రాలు అందించారని వివరించారు. తమ కుటుంబ సభ్యుల ప్రయత్నాలు ఫలించి ఎట్టకేలకు విముక్తి కలిగిందన్నారు. జక్కి రాజు, దుర్గం నారాయణ మరో 15 రోజులకు స్వగ్రామానికి వస్తారని తెలిపారు.

జైల్లో నరకం చూశా

పొట్టకూటి కోసం పరాయి దేశం వెళ్లిన మమల్ని జైల్లో బంధించారు. జీతం చాలక ఇంటికి వచ్చేముందు ఎయిర్‌పోర్టులో వీసాలు చూసి జైలుకు పంపించారు. పది నెలలు జైల్లో నరకం చూశాం. కటుంబం ఎట్లుంటదో తెలియదు. ఏజెంటు చేసిన మోసానికి బలయ్యాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– పసుల లక్ష్మణ్, మగ్గిడి

నల్లగొండపై టీఆర్‌ఎస్ పక్కా వ్యూహం!

కోమటిరెడ్డిపై వేటు తర్వాత గులాబీ నేతల అలర్ట్

- ముఖ్య నాయకులతో ఫోన్లో మాట్లాడిన అధినేత కేసీఆర్
- రాత్రికి రాత్రే దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాల రూపకల్పన
- టీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య పెరిగిన ఉద్రిక్త వాతావరణం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

సార్వత్రిక ఎన్నికలకు ముందు బల నిరూపణకు.. తమ పట్టును ప్రకటించుకునేందుకు అధికార టీఆర్‌ఎస్ పెద్ద వ్యూహాన్ని రచించిందా..? పద్నాలుగేళ్ల ఉద్యమ కాలంలో పార్టీ శ్రేణులు, నాయకుల్లో ఉత్సాహం నింపాల్సి వచ్చిన ప్రతిసారీ ప్రయోగించిన 'ఉప ఎన్నికల' వజ్రాయుధాన్నే ఇప్పుడూ ప్రయోగిస్తోందా..? నల్లగొండపై టీఆర్‌ఎస్ సిద్ధం చేసుకున్న ప్రణాళిక గురించి తెలుసుకుంటే పై ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. ఆరేడు నెలల కిందట నల్లగొండ ఎంపీ స్థానంలో ఉప ఎన్నిక ప్రయోగం అమలు చేయాలని చూసినా.. వివిధ కారణాలతో టీఆర్‌ఎస్ నాయకత్వం వెనకడుగు వేసింది. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలు వేదికగా గవర్నర్ ప్రసంగ సమయంలో సోమవారం సభలో చోటు చేసుకున్న పరిణామాలను టీఆర్‌ఎస్ తమకు అనుకూలంగా మార్చుకుంటోందన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి తమకు దక్కకుండా ఊరిస్తున్న నల్లగొండ అసెంబ్లీ స్థానంలో పాగా వేసేందుకు ఎదురుచూస్తున్న టీఆర్‌ఎస్ మంగళవారం నాటికి ఓ స్పష్టతకు వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విసిరిన హెడ్‌ఫోన్స్ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి తగిలి గాయమైన నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మరో ఎమ్మెల్యే సంపత్ శాసన సభ్యత్వాలను స్పీకర్ రద్దు చేయడంతో నల్లగొండలో పరిణామాలు వేగంగా చోటు చేసుకుంటున్నాయి.

ముఖ్య నేతలతో అధినేత ఫోన్ సంభాషణ?

నల్లగొండ ఎమ్మెల్యేపై చర్య తీసుకోవడం ఖాయమయ్యాక టీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ జిల్లా ముఖ్య నాయకులతో మాట్లాడారని విశ్వసనీయంగా తెలిసింది. ఉప ఎన్నిక అనివార్యమవుతుందని, పూర్తిస్థాయిలో దృష్టి సారించి పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారని సమాచారం. వాస్తవానికి ఉమ్మడి నల్లగొండపై దృష్టి సారించిన పార్టీ అధినాయకత్వం వరుస కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే మున్సిపల్, ఐటీ శాఖా మంత్రి కేటీఆర్ ప్రగతి సభల పేర జిల్లాలో పర్యటిస్తున్నారు. పార్టీ వర్గాలు చెబుతున్న సమాచారం మేరకు ఈనెల 20వ తేదీన నల్లగొండలో కూడా సభ జరగాల్సి ఉంది. ఇప్పటికే శాసనసభ నుంచి రాష్ట్రంలో రెండు అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయ్యాయని ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇచ్చిన నేపథ్యంలో సమీప నెలల్లోనే ఉప ఎన్నిక జరుగుతుందని టీఆర్‌ఎస్ నాయకత్వం భావిస్తోంది.

నిరసన కార్యక్రమాలు..

మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడికి నిరసనగా సోమవారం కొన్ని నిరసన కార్యక్రమాలు జరిగాయి. అయితే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని అధినాయకత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు సోమవారం రాత్రికి రాత్రే కార్యక్రమాలను రూపొందించారు. ప్రధానంగా నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మంగళవారం పెద్ద ఎత్తున దిష్టిబొమ్మల దహనాలు చేపట్టారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తాలో నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల భూపాల్ రెడ్డి నేతృత్వంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర జరిపారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులంతా పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టులు

కోమటిరెడ్డి శాసన సభ్యత్వం రద్దు, ఇతర ఎమ్మెల్యేల సస్పెన్షన్‌కు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. దీంతో పోలీసులు ముందస్తుగానే అప్రమత్తమై ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. కాంగ్రెస్ నాయకుల ఇళ్లకు వెళ్లి మరీ నేతలను అరెస్టు చేశారు. మరో వైపు జిల్లా కేంద్రంలో భారీ సంఖ్యలోనే పోలీసులను మోహరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సీఐలు, ఎస్‌ఐలను ఉదయం ఏడు గంటలకల్లా నల్లగొండకు రప్పించారు. ఇక అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇలా, టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటా పోటీగా కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో ఉద్రిక్తత నెలకొన్నా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు.

థర్డ్‌ఫ్రంట్ కేసీఆర్ పగటి కల!



మంగళవారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మురళీధర్ రావు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు

- మాజీ నక్సల్స్, కాంగ్రెస్, అవినీతిపరుల కూటమి టీఆర్‌ఎస్
- దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం లేదు
- రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పతనం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

థర్డ్ ఫ్రంట్ అనేది కేసీఆర్ పగటికల అని.. అస్థిరత, అవినీతి, కొట్లాట తప్ప థర్డ్ ఫ్రంట్‌లో ఏమీ ఉండదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. మాజీ నక్సలైట్లు, ఆక్రమణదారులు, పాత కాంగ్రెస్ నేతల కలయికే టీఆర్‌ఎస్ పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 'థర్డ్‌ఫ్రంట్‌కు నాయకులు లేరు, ఓట్లు లేవు'అని అన్నారు. దేశ ప్రజలు మోదీకి, బీజేపీకి ప్రత్యామ్నాయం కోరుకోవడం లేదన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయ పరంపరను కొనసాగించిందని, ఇదే విజయ పరంపర దక్షిణాది రాష్ట్రాలలో కూడా ఉంటుందని పేర్కొన్నారు. కర్ణాటకలో బీజేపీ గెలుపుతో దక్షిణాది రాష్ట్రాలకు ద్వారం తెరుచుకుంటుందని మురళీధర్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో 119 స్థానాల నుంచి బీజేపీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందని, నేర చరిత, అవినీతి ఆరోపణలు లేని వారు, వివాదరహితులను పార్టీ బరిలో దింపుతుందని తెలిపారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ పతనానికి రాహుల్ గాంధీ వేగంగా బాటలు వేస్తున్నారని అన్నారు. ఆయన అధ్యక్షుడు అయిన తర్వాతే ఆ పార్టీ ఓటములను మూట కట్టుకుంటుందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో టీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రానికి సహకరించడం లేదన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. కర్ణాటకలో గెలిచి దక్షిణాదిలో పాగా వేస్తామని ధీమా వ్యక్తంచేశారు. 21వ శతాబ్దంలో దేశానికి నాయకత్వం, స్థిరమైన, బలమైన సుపరిపాలన ఇవ్వగలిగేది నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వమేనని మురళీధర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డితో పాటు కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి పోల్సాని సుగుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్న జింక మాంసం

జింకల మాంసం
విక్రయ కేంద్రంపై దాడి

పోలీసుల అదుపులో ఒకరు

ముస్తాబాద్(సిరిసిల్ల): వన్యప్రాణులను వేటాడి, వధించి విక్రయిస్తున్న కేంద్రంపై రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఒక జింకతో పాటు, మరో రెండు జింకల తలలు, మాంసం స్వాధీనం చేసుకున్నారు. ఒక వేటగాడిని అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారయ్యారు. వివరాలు.. ముస్తాబాద్ మండలం మోహినికుంట శివారులో జింక మాంసం విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో పోలీసులు విక్రయ కేంద్రంపై దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ వేటగాళ్లు సూత్రం రాజయ్య(44), వానరాశి ఎల్లయ్య(45), ఉబిది యాదగిరి(30) జింక మాంసం విక్రయిస్తున్నారు. పోలీసులను చూసిన యాదగిరి, ఎల్లయ్య పరారు కాగా, రాజయ్య పోలీసులకు చిక్కాడు. మధ్యాహ్నం సమీప అడవుల నుంచి మూడు జింకలను వేటాడి తెచ్చారు. ఇందులో రెండు పిల్ల జింకలను కోసి మాంసం విక్రయించే క్రమంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గాయపడ్డ తల్లి జింకతోపాటు, మాం సం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల చట్టం కింద పరారీలో ఉన్న ఎల్లయ్య, యాదగిరితోపాటు పట్టుబడ్డ రాజయ్యపై కేసులు నమోదు చేసినట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సరిత తెలిపారు.

ఏసీబీకి చిక్కిన బిల్‌కలెక్టర్

నర్సంపేట: ఇంటి యాజమాన్య సర్టిఫికెట్ ఇవ్వడానికి లంచం డిమాండ్ చేసిన నర్సంపేట నగర పంచాయతీ బిల్‌కలెక్టర్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్‌రావు కథనం ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన జడల వెంకటేశ్వర్లు తన సోదరుడు శ్రీనివాస్ ఇంటికి సంబంధించిన యాజమాన్య ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని గత సంవత్సరం డిసెంబర్ 22న దరఖాస్తు చేసుకున్నాడు. సర్టిఫికెట్ ఇవ్వాలంటే రూ.20 వేలు లంచం ఇవ్వాలని బిల్‌కలెక్టర్ మురళీ డిమాండ్ చేయడంతో వారం రోజుల క్రితం ఆ డబ్బులను వెంకటేశ్వర్లు ఇచ్చాడు. అయినప్పటికీ ఆలస్యం చేస్తుండటంతో సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించగా మరో రూ.10 వేలు ఇస్తేనే సర్టిఫికెట్ ఇస్తాననడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో బిల్‌కలెక్టర్ మురళీ అతడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. మురళీ ఇంటికి వెళ్లి తనిఖీలు చేసి ఆస్తుల వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు.

'మిషన్' పైపుతో రైతు ఉపాధి గల్లంతు

వరదనీటితో పూడుకుపోయిన వ్యవసాయ బావి

కోనరావుపేట(వేములవాడ): మిషన్ భగీరథ కోసం వేసిన పైప్‌లైన్ కారణంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన సంకినేని వేణుమాధవరావు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాడు. మాధవరావుకు గ్రామశివారులో ఎనిమిదెకరాల వ్యవసాయ భూమి ఉంది. పక్కన ఉన్న బావి ఆధారంగా కూరగాయలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతేడాది మిషన్ భగీరథ కోసం ఈ బావి పక్కనుంచే పైపులైన్ నిర్మించారు. దీనికోసం తవ్విన కందకంలో అప్పుడు కురిసిన వానలతో పెద్దఎత్తున వరద వచ్చి వ్యవసాయ బావిలో చేరింది. వరదనీటితో వచ్చిన మట్టితో బావి పూడుకుపోవడంతో సాగునీరు లేకుండాపోయింది. నీటి సౌకర్యంలేక కూరగాయల సాగు నిలిచిపోయింది. ఈ పంటలపైనే ఆధారపడిన వేణుమాధవరావు కుటుంబం ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డది. బావినుంచి పూడిక తీయిస్తే మళ్లీ తాను కూరగాయలు పండించుకుంటానని, ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నా ఏడాదిగా ఏ అధికారీ పట్టించుకోవడంలేదు. ఈ విషయంపై మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్‌ను సంప్రదించగా, బావి పూడుకుపోయిన మాట వాస్తవమేనని అన్నారు. సుమారు 13 గజాల మేర మట్టిపేరుకుపోయిందని, ఎస్ఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని రైతుకు సూచించామని తెలిపారు.

ప్రాణాలు తీసే 'సీజన్'!

వేసవి సమయంలో కమెండో వర్సెస్ టీసీవోసీ

- దాడులకు పోలీసులు.. ప్రతిఘటనకు మావోలు
- ఏటా ఇరువైపులా వందలాది మంది మృత్యువాత



(ఫైల్)

పెద్దపల్లి: వేసవి కాలంలో అడవి అంతటా ఆకులు రాలుతాయి.. కానీ, ఛత్తీస్‌గఢ్ అడవిలో ప్రాణాలే రాలిపోతున్నాయి. 2001 నుంచి వరుసగా మావోయిస్టులకు పోలీసులకు యుద్ధం జరుగుతుండగా వేసవి సీజన్‌లో.. ఛత్తీస్‌గఢ్ అడవులలో ఇది మరింత రెట్టింపవుతుంది. వారం రోజుల క్రితం 10 మంది మావోలు ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే మావోయిస్టు పార్టీ టీసీవోసీ (టాక్టికల్ కౌంటర్ అఫెన్స్ కాంపెయిన్) దళాలదాడిలో మంగళవారం 9 మంది జవాన్లు హతమయ్యారు.

వర్షాకాలం వరకు కలిసే..

ఛత్తీస్‌గఢ్ అడవులు రానున్న మూడునెలల కాలం యుద్ధానికి నిలయం కానున్నాయి. ఏటా మావోయిస్టు పార్టీ దళాలన్ని ప్లాటూన్‌తో కలసి మార్చి నుంచి జూన్ వరకు దాడులకు దిగుతున్నాయి. మైదాన ప్రాంతంలో పోలీసులు సురక్షితంగా ఉంటూ డ్రోన్ కెమెరాల ద్వారా ఆపరేట్ చేస్తూ అడవిలో ఉన్న దళాలను కనిపెట్టే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వర్షాకాలం ప్రవేశించే సమయం వరకు మావో దళాలన్ని కలసి ఉంటాయని సమాచారం. ఈ అవకాశం రెండు వర్గాలు ఇటు పోలీసులు, అటు మావోయిస్టులు వినియోగించుకుంటూ ఎవరికి వారు పైచేయి కోసం ప్రయత్నిస్తున్నారు. ఆకురాలే సీజన్‌లో పోలీసులు అడవుల్లో కూంబింగ్ చేపడుతుండగా ప్రతిదాడి కోసం ఎత్తుగడల వ్యూహంతో మావోలు ఎదురుదాడికి దిగుతున్నారు. 2013లో దర్బా డివిజన్‌లో మే 25న కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు పోలీసు బలగాలను టార్గెట్ చేస్తూ మందుపాతర పేల్చడంతో 28 మంది హతమయ్యారు. 2014 ఏప్రిల్ 25న సుక్మా జిల్లాలో మందుపాతర పేల్చడంతో 24 మంది పోలీసులు చనిపోయారు. అదే జిల్లాలో ఏప్రిల్ 11న మందుపాతర పేల్చగా మావోయిస్టుల చేతిలో ఏడుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు చనిపోయారు. ఇదే సమయంలో వేసవి సీజన్‌లో నారాయణపూర్, కాంకేర్, దర్బా డివిజన్‌లతో పాటు పశ్చిమ, దక్షిణ బస్తర్ ప్రాంతాల్లో పోలీసులు పెద్దఎత్తున కూంబింగ్‌కు దిగుతుండటంతో ప్రతీ వేసవి సీజన్‌లో రెండు వైపులా ఓ వంద ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. తెలంగాణకు ఉత్తరం దిశగా ఉన్న గోదావరి, ప్రాణహిత అవతల మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఖమ్మం వరకు విస్తరించి ఉన్న వేలాది కిలోమీటర్ల అటవీ ప్రాంతాన్ని మావోయిస్టులు తమ అధీనంలో ఉంచుకున్నారు. దండకారణ్యంలో జనతన సర్కార్ నడుపుతున్న మావోయిస్టులకు వేసవి సీజన్ మొదలైందంటే ఆ పార్టీకి గడ్డు పరిస్థితి ఎదురవుతోంది. గత కొంతకాలంగా పోలీసులు సైతం మైదాన ప్రాంతాలకు అనువుగా ఉన్న అటవీ ప్రాంతాలలో సైతం చొరబడి తమ ఆధిపత్యాన్ని సాధించుకోగలుతున్నారు. ఇటీవల ఖమ్మం సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయిన ఘటన తరువాత ఛత్తీస్‌గఢ్‌లో ఆ పార్టీ ప్రతీకార చర్యలకు పాల్పడుతూనే ఉంది. గడిచిన వారం రోజుల్లోనే మూడు చోట్ల మందుపాతరలు పేల్చిన మావోలు మంగళవారం భారీ ఘటనకు పాల్పడి కిష్టాపురం వద్ద 9 మంది కమాండోలను హతమార్చి తమ ప్రతీకారాన్ని తీర్చుకున్నారు.

కమాండోలకు తోడుగా డ్రోన్ కెమెరాలు

నల్లమల అటవీప్రాంతం, తెలంగాణ మైదాన ప్రాంతాలను జల్లెడ పట్టిన పోలీసులు పైచేయిగా నిరూపించుకున్నారు. పదేళ్ళ కాలంలో మైదాన ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలు దాదాపుగా తగ్గాయనే చెప్పొచ్చు. కేవలం అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల కేకేడబ్ల్యూ కమిటీ మినహాయిస్తే మైదాన కమిటీ మావోయిస్టు గెరిల్లా రైతాంగ దళాలేవి లేవని చెప్పొచ్చు. పోలీసులు గత కొంతకాలంగా కేకేడబ్ల్యూ కమిటీ వెంటపడి ఆ కమిటీకి చెందిన సభ్యులను ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టారు. అయితే తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి హరిభూషణ్‌తోపాటు, కేకేడబ్ల్యూ కార్యదర్శి బడే దామోదర్ సురక్షితంగా బయటపడ్డారు. ఇక మావోయిస్టు కార్యకలాపాల అణచివేతలో పోలీసులు కొత్త పంథాను ఎన్నుకున్నారు. అటవీ ప్రాంతాల్లో ఆకురాలే సీజన్‌లో డ్రోన్ కెమెరాలను ప్రయోగించేందుకు సిద్ధపడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో మావోల ఆచూకీ కనిపెట్టేందుకు పోలీసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో డ్రోన్ కెమెరాల సహాయం తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. మైదాన ప్రాంతంలో పోలీసులు సురక్షితంగా ఉంటూ డ్రోన్ కెమెరాల ద్వారా ఆపరేట్ చేస్తూ అడవిలో ఉన్న దళాలను కనిపెట్టే అవకాశం లేకపోలేదు. దీంతో తాజా టెక్నాలజీ, ఆకురాలే సీజన్ అడవులను యుద్ధ వాతావరణానికి దగ్గరగా తీసుకెళ్తున్నాయని చెప్పవచ్చు.

వేసవి సీజన్‌లో జరిగిన సంఘటనల్లో కొన్ని...

2006 ఏప్రిల్ 28
కడప జిల్లా సుండుపల్లి మండలం శేషాచలం అటవీ ప్రాంతంలో ఎదురు కాల్పుల్లో 9మంది మావోయిస్టులు మరణించారు.

2006 ఏప్రిల్ 30
మహబూబ్‌నగర్ జిల్లా మద్దిమడుగు వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు.

2011 మార్చి 13
ప్రకాశం, వరంగల్ జిల్లాల్లో వేర్వేరుగా జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేతలు శాఖమూరి అప్పారావు, సోలిపేట కొండల్‌రెడ్డి అలియాస్ టెక్ రమణ మరణించారు.

2012 మార్చి 18
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 15 మంది మావోయిస్టులు మరణించారు.

2013 మే 25
దర్బా డివిజన్‌లో జరిగిన మందు పాతర సంఘటనలో కాంగ్రెస్ నాయకులతో సహా పోలీస్ సిబ్బంది 28 మంది మరణించారు.

2014 ఏప్రిల్ 12
ఛత్తీస్‌గఢ్ చింతల్‌నాల్ వద్ద మావోలు పేల్చిన మందు పాతరకు 32 మంది బలయ్యారు.

2016 మార్చి 2
తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలున్నారు.


విపక్షాల ముఖ్యనేతలతో సోనియా, రాహుల్

విపక్ష నేతలకు సోనియా విందు

బీజేపీకి వ్యతిరేకంగా మద్దతు కూడగట్టేందుకే ● 20 ప్రతిపక్ష పార్టీల నాయకుల హాజరు

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి లక్ష్యంగా పనిచేస్తున్న విపక్ష పార్టీలన్నీ ఒక్క చోటకు చేరాయి. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తన నివాసం 10 జన్‌పథ్‌లో మంగళవారం ఇచ్చిన విందుకు 20 రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. సాధారణ ఎన్నికలకు సుమారు మరో ఏడాది మాత్రమే గడువున్న నేపథ్యంలో.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేను ఓడించడానికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఈ విందు భేటీలో చర్చించారు. ఎన్డీయేతర పక్షాల ఐక్యతను సాధించడమే తొలి ప్రాథమ్యంగా ఈ భేటీ జరిగింది. ఎన్సీపీ, ఆర్జేడీ, ఎస్పీ, బీఎస్పీ, టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు తదితర ప్రధాన ప్రతిపక్ష పార్టీల నేతలు ఈ విందు సమావేశంలో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా(జమ్మూకశ్మీర్), బాబూలాల్ మరండీ, హేమంత్ సోరెన్(జార్ఖండ్), జితన్ రాం మాంఝీ(బిహార్)లు కూడా ఇందులో పాల్గొన్నారు. ఎన్సీపీకి చెందిన శరద్ పవార్, ఎస్పీ నుంచి రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీ నేత సతీశ్ చంద్ర మిశ్రా, జేడీయూ బహిష్కృత నేత శరద్ యాదవ్, ఆర్ఎల్‌డీకి చెందిన అజిత్ సింగ్ తదితరులు విందు సమావేశానికి హాజరయ్యారు. ఆర్జేడీ తరఫున ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు మిసా భారతి, కొడుకు తేజస్వీ యాదవ్‌లు వచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ నుంచి సుదీప్ బందోపాధ్యాయ, సీపీఐ నేత డి.రాజా, సీపీఎం నుంచి మహమ్మద్ సలీం, డీఎంకే అధినేత కరుణానిధి కూతురు కనిమొళి, ఏఐయూడీఎఫ్‌కు చెందిన బద్రుద్దీన్ అజ్మల్, జేడీఎస్ నేత కుపేందర్ రెడ్డి తదితరులు కూడా సోనియా పిలుపు మేరకు ఈ సమావేశానికి వచ్చారు. టీడీపీ, టీఆర్ఎస్, బీజేడీలకు ఆహ్వానం పంపించలేదని సమాచారం. సోనియాతోపాటు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, అహ్మద్ పటేల్, ఏకే ఆంటోని తదితరులు విందులో పాల్గొన్నారు. బీజేపీని ఓడించేందుకు విపక్షాలన్నీ తమ విభేదాలను పక్కనబెట్టి కలసి రావాలని గతంలోనూ సోనియా కోరడం తెలిసిందే. తృణమూల్ నేత సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ 'ఇది రాజకీయ విందే. కానీ రాజకీయాల గురించి మేం మాట్లాడలేదు. మా పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఎందుకు రాలేదని సోనియా నన్ను ఆరా తీశారు. ఆమె ముందుగా అనుకున్న కొన్ని పనులు ఉండటం వల్ల రాలేకపోయారని చెప్పాను' అని వివరించారు.

హిల్లరీ చేతికి గాయం



మెట్లు దిగుతూ పడిపోతున్న హిల్లరీ

జోధ్‌పూర్: భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి హిల్లరీ క్లింటన్ చేతికి మంగళవారం స్వల్ప గాయమైంది. ప్రస్తుతం హిల్లరీ రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో పర్యటిస్తుండగా ఆమె చేయి బెణికింది. మధ్యప్రదేశ్ నుంచి రెండు రోజుల యాత్ర కోసం ఆమె మంగళవారం ఉదయమే జోధ్‌పూర్‌కు చేరుకున్నారు. సాయంత్రం మెహ్రాంగఢ్ కోటను సందర్శించాల్సి ఉండగా చేయి బెణకడంతో అది రద్దయింది. జోధ్‌పూర్‌లోని ఉమైద్ భవన్ ప్యాలెస్‌లో ఆమె ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమైతే సలవాస్ గ్రామంలోని తివాచీలు తయారుచేసే కేంద్రాలను హిల్లరీ బుధవారం సందర్శించి అక్కడి నేత కార్మికులతో ఆమె మాట్లాడాల్సి ఉంది. అయితే చేతికి గాయం కారణంగా ఆమె అక్కడికి వెళ్లడం కూడా అనుమానమేనని అధికారులు తెలిపారు.

రక్షణ కేటాయింపులపై ఆర్మీ అసంతృప్తి

న్యూఢిల్లీ: కేంద్రం ఈ ఏడాది బడ్జెట్‌లో తమకు అరకొర నిధులు కేటాయించడంపై ఆర్మీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తాజాగా కేంద్రం కేటాయించిన రూ.21,338 కోట్లు ప్రస్తుతం అమలుచేస్తున్న 125 పథకాలకే సరిపోవని స్పష్టం చేసింది. భవిష్యత్‌లో పాకిస్తాన్, చైనాలతో ఒకేసారి యుద్ధం సంభవించే అవకాశమున్న నేపథ్యంలో ఈ మొత్తాన్ని పెంచాల్సిన అవసరం ఉందని తేల్చిచెప్పింది. ఈ మేరకు రక్షణ బడ్జెట్‌పై ఏర్పాటైన స్థాయీ సంఘం ఆర్మీ అభిప్రాయాలతో కూడిన నివేదికను మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఆర్మీలో 68 శాతం ఆయుధాలు పాతవనీ, 24 శాతం ఆయుధాలు కొత్తవనీ, కేవలం 8 శాతం ఆయుధాలు మాత్రమే అత్యాధునికమైనవని నివేదికలో తెలిపింది.

అమితాబ్ బచ్చన్‌కు అస్వస్థత



జోధ్‌పూర్/న్యూఢిల్లీ: బిగ్ బీ అమితాబ్ బచ్చన్ అస్వస్థతకు గురయ్యారు. 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్' చిత్ర షూటింగ్‌లో బిగ్ బీ అస్వస్థతకు గురి కావడంతో వెంటనే ఆయన్ని జోధ్‌పూర్‌లోని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అమితాబ్‌కు చికిత్స అందించేందుకు ముంబై నుంచి జోధ్‌పూర్‌కు ప్రత్యేక వైద్య బృందం కూడా వస్తున్నట్లు తెలుస్తోంది. వెన్నునొప్పితో బాధ పడుతున్న అమితాబ్ ఇటీవల లీలావతి ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందిన సంగతి తెలిసిందే. అయితే మంగళవారం ఉదయం కూడా పలు ట్వీట్స్ చేసిన అమితాబ్ హఠాత్తుగా అస్వస్థతకు గురి కావడంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అమితాబ్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆయన భార్య జయాబచ్చన్ చెప్పారు.

ప్రపంచ స్మార్ట్ సిటీల్లో భువనేశ్వర్

భువనేశ్వర్: ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు స్మార్ట్ సిటీల జాబితాలో ప్రపంచంలోనే 20వ స్థానం దక్కింది. జునిపర్ రీసెర్చ్ అనే సంస్థ ఇంటెల్ సాయంతో 'గ్లోబల్ స్మార్ట్ సిటీ పర్ఫామెన్స్ ఇండెక్స్' పేరుతో గతేడాది జూలై నుంచి సెప్టెంబరు వరకు ఓ సర్వే నిర్వహించింది. ఆ ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. ఈ జాబితాలో చోటు సాధించిన ఏకైక భారతీయ నగరం భువనేశ్వర్ మాత్రమే కావడం విశేషం. రవాణా సౌకర్యాలు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత, ఉత్పాదకత అనే నాలుగు అంశాల్లో ఒక్కో నగరానికి జునిపర్ రీసెర్చ్ ర్యాంకింగ్స్ ఇచ్చింది. భద్రతలో ప్రపంచంలోనే 13వ ర్యాంకు దక్కించుకున్న భువనేశ్వర్.. రవాణా, ఆరోగ్యం, ఉత్పాదకత సూచీల్లో 20 స్థానంలో నిలిచింది. 2016లో భారత ప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్ సిటీల జాబితాలోనూ భువనేశ్వర్ తొలిస్థానంలో నిలవడం తెలిసిందే. జునిపర్ రీసెర్చ్ సర్వేలో సింగపూర్ నాలుగు అంశాల్లోనూ తొలిస్థానం సాధించింది. రెండో స్థానం రవాణా అంశంలో శాన్‌ఫ్రాన్సిస్కోకు, ఆరోగ్యంలో సియోల్‌కు, భద్రతలో న్యూయార్క్‌కు, ఉత్పాదకతలో లండన్‌కు దక్కింది. ఇక మూడో స్థానంలో రవాణా, ఆరోగ్య రంగాల్లో లండన్.. భద్రత, ఉత్పాదకతల్లో షికాగో నగరాలు నిలిచాయి.

నేపాల్ అధ్యక్షురాలిగా మళ్లీ విద్యా దేవి భండారీ



కఠ్మాండు: నేపాల్ అధ్యక్షురాలిగా విద్యా దేవి భండారీ(56) రెండోసారి ఎన్నికయ్యారు. ప్రస్తుత అధ్యక్షురాలు, లెఫ్ట్ కూటమి అభ్యర్థి అయిన భండారీ.. నేపాలీ కాంగ్రెస్ అభ్యర్థి కుమారి లక్ష్మీ రాయ్‌పై మూడింట రెండో వంతుకు పైగా మెజారిటీతో గెలుపొందారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో భండారీకి 39,275 ఓట్లు, లక్ష్మీ రాయ్‌కు 11,730 ఓట్లు దక్కాయి. భండారీ 2015లో నేపాల్ తొలి మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. 1994, 1999లో రెండు సార్లు నేపాల్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు.

హోంగార్డు వేతనాలపై రాష్ట్రాలది నిర్లక్ష్య వైఖరి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా హోంగార్డుల డ్యూటీ అలవెన్సులను పెంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను చాలా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉద్దేశపూర్వకంగా అమలుచేయడం లేదని పార్లమెంటరీ స్థాయీ సంఘం తెలిపింది. ఈ ప్రవర్తన ఆయా రాష్ట్రాల నిర్లక్ష్య వైఖరికి అద్దంపడుతోందని విమర్శించింది. కేంద్ర మాజీ హోంమంత్రి పి.చిదంబరం నేతృత్వంలోని పార్లమెంటరీ స్థాయీ సంఘం హోంశాఖ వ్యవహారాలపై మంగళవారం పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. హోంగార్డుల డ్యూటీ అలవెన్సులను పెంచాలని హోంశాఖ పదేపదే గుర్తుచేసినప్పటికీ కేవలం ఐదు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మాత్రమే సుప్రీంకోర్టు ఆదేశాలను అమలుచేశాయని కమిటీ నివేదికలో తెలిపింది. గుజరాత్, త్రిపుర, తమిళనాడు రాష్ట్రాల్లో హోంగార్డులకు చెల్లిస్తున్న మొత్తం కనీస వేతనాల కంటే చాలాతక్కువగా ఉన్నట్లు పేర్కొంది.

ఇష్రాత్ కేసులో మోదీని విచారించారు: వంజర

అహ్మదాబాద్: ఇష్రాత్ జహన్ ఎన్‌కౌంటర్ కేసులో ప్రధాని మోదీని అప్పట్లో కేసు దర్యాప్తు అధికారి విచారించారని ఆ కేసు నిందితుడు, మాజీ ఐపీఎస్ అధికారి డీజీ వంజర తెలిపారు. ఇష్రాత్ కేసు నుంచి తనను తప్పించాలంటూ ఆయన మంగళవారం సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'అప్పటి గుజరాత్ సీఎం, ప్రస్తుత ప్రధాని మోదీని అధికారులు విచారించారు. అయితే ఆ వివరాల్ని రికార్డుల్లోకి ఎక్కించలేదు. కేసుకు చెందిన అన్ని వివరాల్ని నమోదు చేశామన్న విషయం అవాస్తవం' అని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కేసు నుంచి తప్పించాలన్న పిటిషన్‌పై మార్చి 28లోగా స్పందించాలని జడ్జి జేకే పాండ్యా సీబీఐకి నోటీసులు జారీచేశారు.

ఐసీయూలోనే పూజలు ; చికిత్స పొందుతూ మృతి

పుణె: చికిత్స పొందుతున్న మహిళ కోలుకోవాలని ఆసుపత్రి ఐసీయూలోనే ఓ స్వామీజీ పూజలు చేసిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. బహుళ అవయవ వ్యవస్థ విఫలం కావడంతో ఆమె ఆ తరువాతి రోజు సోమవారం మృతిచెందింది. పుణెలోని ఆసుపత్రిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఛాతీలో ఏర్పడిన కణితిని తొలగించుకోవడానికి సంధ్యా సోనవానే అనే మహిళ సతీష్ చవాన్ అనే వైద్యుడిని సంప్రదించింది. కణితిని తొలగించడానికి శస్త్ర చికిత్స అవసరమని చెప్పిన ఆయన సూచన మేరకు దీన్‌నాథ్ మంగేష్కర్ ఆసుపత్రిలో చేరి సర్జరీ చేయించుకుంది. అయితే ఆదివారం చవాన్ వెంట వచ్చిన స్వామీజీ ఆమెపై ఏవో పూజలు చేస్తూ మంత్రాలు చదివినట్లు వీడియోలో కనిపించింది. ఈ ఉదంతంలో తమ సిబ్బంది పాత్ర లేదని ఆ ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది.

మార్చి 31 తరువాత కూడా!

- ఆధార్ అనుసంధాన గడువును పొడిగించిన సుప్రీంకోర్టు
- బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లకు అమలు
- రాజ్యాంగ ధర్మాసనం తుది తీర్పు వచ్చే వరకు వెసులుబాటు



న్యూఢిల్లీ: ఆధార్ అనుసంధానం తలనొప్పి ప్రస్తుతానికి తొలగింది. వివిధ సేవలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్ అనుసంధాన గడువైన మార్చి 31వ తేదీ దగ్గరికొస్తుండటంపై ఆందోళన చెందుతున్నవారు ఊపిరి పీల్చుకోవచ్చు. బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్‌ను అనుసంధానించుకునే గడువును సుప్రీంకోర్టు పొడిగించింది. ఆధార్ చట్టబద్ధతను నిర్ధారించేందుకు ఏర్పాటైన రాజ్యాంగ ధర్మాసనం తుది తీర్పు ఇచ్చేవరకు, ఈ గడువు కొనసాగుతుందని స్పష్టం చేసింది. అంటే, మార్చి 31 తరువాత కూడా, రాజ్యాంగ ధర్మాసనం తుది తీర్పు వెలువడే వరకు, ఆధార్ అనుసంధాన ప్రక్రియను పౌరులు, వినియోగదారులు కొనసాగించుకోవచ్చు. అయితే సంఘటిత నిధి నుంచి నిధులందే ఉపాధి హామీ, ఆహార భద్రత తదితర సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం ఆధార్ సంఖ్యను మార్చి 31 తరువాత కూడా యథావిధిగా కోరవచ్చని స్పష్టతనిచ్చింది.

తత్కాల్ పాస్‌పోర్ట్‌కూ అవసరం లేదు

వివిధ సేవలు, సంక్షేమ పథకాలతో ఆధార్ అనుసంధానానికి ఇచ్చిన మార్చి 31 గడువుని పొడిగించేందుకు సిద్ధమని కేంద్రం ఇదివరకే కోర్టుకు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. 'ఆధార్ చట్టబద్ధతపై ఏర్పాటైన రాజ్యాంగ ధర్మాసనం విచారణ పూర్తి చేసి, తుది తీర్పు వెలువరించే వరకు.. ఆధార్ అనుసంధానానికి సంబంధించి గతంలో ఇచ్చిన మార్చి 31 గడువును నిరవధికంగా పొడిగించాలని ఆదేశిస్తున్నాం' అని బెంచ్ పేర్కొంది. అలాగే, తత్కాల్ పాస్‌పోర్ట్ పొందడానికి ఆధార్ తప్పనిసరి కాదని కూడా తేల్చి చెప్పింది. మంగళవారం జరిగిన విచారణలో అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, సీనియర్ న్యాయవాదులు పి.చిదంబరం, కేవీ విశ్వనాథన్ పాల్గొన్నారు. ఆధార్ చట్టబద్ధత, దానికి సంబంధించిన చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణను ప్రత్యేకంగా రాజ్యాంగ ధర్మాసనం చేపట్టిన సంగతి తెలిసిందే.

సబ్సిడీల పంపిణీలో అవాంతరాలు వద్దు

ఆధార్ అనుసంధానానికి గడువు పొడిగించడం వల్ల ఆ చట్టంలోని సెక్షన్ 7 పరిధిలోకి వచ్చే సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించడంలో అవాంతరాలు ఏర్పడకుండా చూడాలని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఆధార్ చట్టంలోని నిబంధన 7 ప్రకారం.. లబ్ధిదారుడి గుర్తింపును ధ్రువీకరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్ వివరాలు కోరొచ్చు.

ఆధార్ తప్పనిసరే: యూఐడీఏఐ

బ్యాంకు ఖాతాలు, తత్కాల్ పాస్‌పోర్టులకు ఆధార్ తప్పనిసరియేనని ఆధార్ ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) స్పష్టం చేసింది. అయితే ఆధార్ ఇంకా పొందని వారు, దానికి దరఖాస్తు చేసుకుని అప్లికేషన్ సంఖ్యతో ఆ సేవలు పొందొచ్చని పేర్కొంది. 'సంబంధిత చట్టాల ప్రకారం బ్యాంకు ఖాతాలు, తత్కాల్ పాస్‌పోర్టులకు ఆధార్ తప్పనిసరి అని చెబుతున్న నిబంధన కొనసాగుతుంది' అని యూఐడీఏఐ తెలిపింది.

ఆధార్ పొందని వారు కూడా ఆ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నామని నిరూపించగలిగితే ప్రభుత్వ ప్రయోజనాలు పొందొచ్చు. అలాంటి వారి గుర్తింపును నిర్ధారించడానికి ప్రత్యామ్నాయ మార్గాలు కల్పిస్తారు. ఆధార్ చట్టబద్ధతను సవాల్ చేసిన పిటిషనర్లలో ఒకరైన మాజీ కేంద్ర మంత్రి జైరాం రమేశ్ తరఫున హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం వాదిస్తూ.. ఆధార్ బిల్లును లోక్‌సభ స్పీకర్ తప్పుగా మనీ బిల్లుగా పేర్కొని, అది రాజ్యసభకు రాకుండా అడ్డుకున్నారని అన్నారు.

ఆర్థిక బిల్లుపై సాగని చర్చ

- ఏడో రోజూ పార్లమెంటులో నిరసనల పర్వం
- ఎలాంటి చర్చా లేకుండానే బుధవారానికి వాయిదా



న్యూఢిల్లీ: వరుసగా ఏడోరోజు కూడా పార్లమెంటు ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగడంతో కీలకమైన ఆర్థిక బిల్లుపై చర్చను చేపట్టలేకపోయారు. బ్యాంకింగ్ కుంభకోణాలపై ఓటింగ్‌తో కూడిన చర్చ కోసం కాంగ్రెస్, తృణమూల్‌తో పాటు ఇతర విపక్షాలు డిమాండ్ చేయగా.. ఏపీకి ప్రత్యేక హోదాపై వైఎస్సార్సీపీ, టీడీపీలు, తెలంగాణలో రిజర్వేషన్లపై టీఆర్ఎస్ ఎంపీలు నినాదాలతో ఉభయ సభల్ని హోరెత్తించారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ, రాజ్యసభలు బుధవారానికి వాయిదా పడ్డాయి.

ఆర్థిక బిల్లుతో పాటు 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాలకు చెందిన వినిమయ బిల్లులపై లోక్‌సభలో మంగళవారం చర్చ జరగాల్సి ఉంది. అయితే ప్రధాన ప్రతిపక్షంతో పాటు ప్రాంతీయ పార్టీల సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు కొనసాగించడంతో స్పీకర్ సభను 50 నిమిషాలు వాయిదా వేశారు. రైల్వే, వ్యవసాయం, రైతుల సంక్షేమం, సాంఘిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖలకు గ్రాంట్ల కేటాయింపు డిమాండ్లపై తీర్మానాల్ని కూడా అజెండాలో పొందుపరిచినా.. వాటిపై కూడా ఎలాంటి చర్చా జరగలేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సభ మళ్లీ ప్రారంభమైనా ఆందోళనలు ఆగలేదు. పీఎన్‌బీ కుంభకోణంపై కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌లు, ఏపీకి ప్రత్యేక హోదాపై వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ సభ్యులు, తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్ఎస్, కావేరీ నదీ జలాల నిర్వహణ బోర్డును ఏర్పాటు కోసం అన్నాడీఎంకేలు ఆందోళన చేశాయి. లెఫ్ట్ పార్టీల ఎంపీలు కూడా నినాదాలు చేశారు. ప్రతిపక్షాల నిరసనల మధ్య ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే రాజ్యసభ కూడా బుధవారానికి వాయిదా పడింది.

పూర్తిస్థాయి రాజకీయవేత్తను కాను


అంతరాత్మను తెలుసుకునేందుకే ఆధ్యాత్మిక బాట: రజనీకాంత్


హిమాలయ పర్యటనలో గుర్రంపై రజనీ

రిషికేశ్: తానింకా పూర్తిస్థాయి రాజకీయవేత్తను కాలేదని సూపర్‌స్టార్ రజనీకాంత్ వ్యాఖ్యానించారు. ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా ఆయన ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో ఉన్న దయానంద సరస్వతి ఆశ్రమానికి మంగళవారం చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తన రాజకీయ అరంగేట్రంతో పాటు ఆధ్యాత్మిక అంశాలపై రజనీ మీడియాతో ముచ్చటించారు. 'నేనింకా పూర్తిస్థాయి రాజకీయవేత్తను కాలేదు. కనీసం పార్టీ పేరును కూడా నేను ప్రకటించలేదు. కాబట్టి ఇక్కడ (ఆశ్రమంలో) రాజకీయ వ్యాఖ్యలు చేయదల్చుకోలేదు' అని రజనీ చెప్పారు. 'మనిషి జీవిత లక్ష్యం తనను తాను తెలుసుకోవడమే. నా అంతరాత్మ గురించి తెలుసుకునేందుకే నేను ఆధ్యాత్మిక బాట పట్టాను' అని వెల్లడించారు. తానిక్కడికి రావడం ఇదే తొలిసారి కాదనీ, గతంలోనూ చాలాసార్లు వచ్చినట్లు రజనీ స్పష్టం చేశారు. తమిళనాడులోని తేని జిల్లాలో 10 మంది ట్రెక్కర్లు సజీవదహనం కావడంపై విచారం వ్యక్తం చేసిన రజనీ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. మంగళవారం దయానంద సరస్వతి ఆశ్రమానికి చేరుకున్న రజనీకాంత్‌తో ఫొటోలు దిగేందుకు ఆయన అభిమానులు ఎగబడ్డారు.

టిల్లర్సన్‌పై ట్రంప్ వేటు

- అమెరికా కొత్త విదేశాంగ మంత్రిగా పాంపియో
- సీఐఏ కొత్త డైరెక్టర్‌గా గినా


టిల్లర్సన్

వాషింగ్టన్: అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రెక్స్ టిల్లర్సన్‌పై కొంతకాలంగా ఆగ్రహంగా ఉన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయనను ఆ పదవి నుంచి తప్పించారు. టిల్లర్సన్ ఆఫ్రికా పర్యటనలో ఉన్న సమయంలో అమెరికా కొత్త విదేశాంగ మంత్రిగా సీఐఏ డైరెక్టర్ మైక్ పాంపియోను నియమిస్తూ ట్రంప్ హడావుడిగా నిర్ణయం తీసుకున్నారు. ఉత్తర కొరియా, రష్యాల విషయంలో అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలతో పాటు పలు అంశాలపై ట్రంప్, టిల్లర్సన్ మధ్య విభేదాలున్నాయి. ట్రంప్‌ను టిల్లర్సన్ బుద్ధిహీనుడని విమర్శించినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఎలాంటి రాజకీయానుభవం లేకపోయినా ఎక్సన్ మొబిల్ సీఈవో టిల్లర్సన్‌ను గతేడాది ఫిబ్రవరి 1న ట్రంప్ విదేశాంగ మంత్రిగా నియమించారు.

పాంపియో తగిన వ్యక్తి: ట్రంప్

తన నిర్ణయంపై ట్రంప్ స్పందిస్తూ 'మైక్ పాంపియో నూతన విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపడతారు. ప్రస్తుతం క్లిష్ట సమయంలో ఈ పదవికి ఆయన తగిన వ్యక్తనే నమ్మకంతో ఉన్నాను' అని ట్వీట్ చేశారు. సైన్యంతో పాటు కాంగ్రెస్‌లో పనిచేసిన అనుభవం, సీఐఏలో అందించిన సేవలు.. ఈ కొత్త పదవి నిర్వహణలో పాంపియోకు బాగా ఉపకరిస్తాయని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం సీఐఏ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న జినా హాస్పెల్‌ను కొత్త డైరెక్టర్‌గా నియమించారు.

2025 నాటికి క్షయరహిత భారత్

- టీబీపై పోరులో అనుసరించే విధానాలు మారాలి
- టీబీ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ


కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్‌తో మోదీ కరచాలనం

న్యూఢిల్లీ: క్షయ వ్యాధి రహిత భారత్‌ను సాధించడమే తమ లక్ష్యమని, 2025 నాటికి దేశాన్ని క్షయ రహితంగా మార్చాలనే దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా 2030 నాటికి టీబీని నియంత్రించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, కానీ మనదేశంలో ఐదేళ్ల ముందుగానే అంటే 2025 నాటికే దీనిని సాధించాలని నిర్దేశించుకున్నామని చెప్పారు. క్షయ వ్యాధిపై అంతర్జాతీయంగా సాగించిన పోరాటం విజయవంతం కాలేదని, అందువల్ల క్షయ వ్యాధి రహిత భారత్‌ను సాధించాలనే లక్ష్యాన్ని సాధించేందుకు దీనిపై పోరాటంలో మార్పులు చేయడం అవసరమన్నారు. మంగళవారం ఢిల్లీలో టీబీ ఫ్రీ ఇండియా ప్రచార ఉద్యమాన్ని మోదీ ప్రారంభించారు.

అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకుంటేనే..

దేశంలోని ప్రతి టీబీ రోగికి.. మొదటిసారే పూర్తిస్థాయిలో వైద్యం అందజేయాలనే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని మోదీ చెప్పారు. టీబీ నియంత్రణలో అన్ని రంగాల వారూ.. అన్ని స్థాయిల్లో ముందుకు రావాలని, అప్పుడే టీబీ రహిత గ్రామం, పంచాయతీ, జిల్లా, రాష్ట్రాలను సాధించగలమన్నారు. ఈ అంటురోగం ప్రధానంగా పేదలపైనే ఎక్కువ ప్రభావం చూపుతోందని, క్షయ నివారణకు తీసుకునే ప్రతి చర్యా నేరుగా వారి జీవితాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) 25 ఏళ్ల క్రితమే టీబీని ప్రమాదకరమైన వ్యాధిగా గుర్తించిందని, అప్పటి నుంచి దీనికి అడ్డుకట్ట వేసేందుకు పలు దేశాలు అనేక చర్యలు చేపట్టాయని మోదీ చెప్పారు. వాస్తవ పరిస్థితి చూసుకుంటే ఇప్పటికీ మనం టీబీని నియంత్రించడంలో విజయం సాధించలేకపోయామన్నారు. వచ్చే ఏడాది నాటికి దేశవ్యాప్తంగా 90 శాతం మందికి క్షయ వ్యతిరేక టీకాలను అందుబాటులోకి తెస్తామని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

వీరే 'మహా' మార్చ్ సారథులు

దాదాపు 50 వేల మంది రైతులు, ఆదివాసీలు.. మండుటెండలో రోజుకు దాదాపు 30 కిలో మీటర్ల చొప్పున ఆరురోజులు నడక.. దారిలోనే అన్నపానీయాలు, ఆరుబయటే విశ్రాంతి.. సోలార్ ప్యానెళ్లతో సెల్‌ఫోన్ల చార్జింగ్.. ముంబై చేరుకుని, ప్రభుత్వం నుంచి హామీలు పొంది విజయవంతంగా ముగిసిన ఉద్యమం.. మహారాష్ట్ర రైతుల మహా మార్చ్. ఈ మొత్తం పాదయాత్రలో ఎక్కడా చిన్న అపశ్రుతి లేదు. హింసాత్మక ఘటనలు లేవు. అసాంఘిక శక్తుల అలజడులు లేవు. ఇతరులు ఇబ్బందిపడ్డ సందర్భాలు లేవు. ఏ సందర్భంలోనూ క్రమశిక్షణ తప్పలేదు. పైగా, ట్రాఫిక్ సమస్యతో ముంబైలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు కష్టం కలగకుండా చూడటం కోసం రాత్రంతా నడిచి, ఆజాద్ మైదాన్‌కు చేరుకున్న మంచితనం. ఇంత ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో సాగిన ఉద్యమ సారథులు ఎవరు? సూత్రధారులు ఎవరు?


జీవా పాండు గావిట్


అశోక్ ధావలే


అజిత్ నవ్‌లే


విజూ కృష్ణన్

జీవా పాండు గావిట్ - సీపీఎం ఎమ్మెల్యే

నాసిక్ జిల్లాలోని కాల్వన్ నియోజకవర్గానికి గావిట్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుత మహారాష్ట్ర శాసనసభలో కమ్యూనిస్టు పార్టీలకు చెందిన ఏకైక ఎమ్మెల్యే ఈయనే. అంతేకాదు కాల్వన్ నుంచి ఆయన ఏడుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. గిరిజన తెగకు చెందిన గావిట్‌కు నిరాడంబరుడిగా పేరుంది. రైతు పాదయాత్రకు వ్యూహరచన చేసింది ఈయనే. తరాల నుంచి సాగుచేస్తున్న అటవీ భూములను తమకు ఇచ్చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు ఎక్కువ సంఖ్యలో మార్చ్‌లో పాల్గొనడానికి కారణం కూడా గావిట్ అని చెబుతారు.

అశోక్ ధావలే - ఏబీకేఎస్ అధ్యక్షుడు

రైతుల పోరాటానికి నేతృత్వం వహించింది అఖిల భారతీయ కిసాన్ సభ (ఏబీకేఎస్). సీపీఎం అనుబంధ సంస్థ అయిన ఏబీకేఎస్‌కు అశోక్ ధావలే ఇటీవలే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈయన సామాజిక కార్యకర్త గోదావరి పారులేకర్ సిద్ధాంతాలను గట్టిగా నమ్ముతారు. 1993 నుంచి ఠాణే, పాల్ఘర్ జిల్లాల్లో రైతు సమస్యలపై ధావలే పోరాటాలు సాగిస్తున్నారు. దశాబ్దం క్రితం రాయ్‌గఢ్‌లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)కి భూసేకరణను, తాజాగా ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు, ముంబై–నాగపూర్ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టులకు భూసేకరణను కూడా ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అజిత్ నవ్‌లే - ఏబీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి

2017 జూన్‌లో రైతుల చేత ఆందోళనలు చేయించి ప్రభుత్వం రైతు రుణమాఫీని ప్రకటించేలా చేయడంలో అజిత్ నవ్‌లే పాత్ర ఎంతో కీలకం. అప్పట్లో రైతులు సంపూర్ణ రుణ మాఫీ, కనీస మద్దతు ధర పెట్టుబడి కన్నా కనీసం ఒకటిన్నర రెట్లు ఎక్కువ ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. నగరాలు, పట్టణాలకు పండ్లు, కూరగాయల సరఫరాను నిలిపివేస్తామని కూడా రైతులు అప్పట్లో హెచ్చరించారు. ఆ తర్వాత రైతు రుణ మాఫీ విధివిధానాలు ఎలా ఉండాలో నిర్ణయించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించి అజిత్‌ను కూడా అందులో సభ్యుడిగా చేర్చింది. కానీ తన మాటకు విలువ లేకపోవడంతో ఆయన కమిటీ నుంచి వైదొలిగి అప్పటి నుంచి మండల, జిల్లా స్థాయిల్లో రైతుల పోరాటాలను నడుపుతున్నారు.

విజూ కృష్ణన్- ఏబీకేఎస్ సంయుక్త కార్యదర్శి

కేరళకు చెందిన, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) పూర్వ విద్యార్థి అయిన విజూ కృష్ణన్ పాత్ర కూడా రైతు పాదయాత్ర విజయవంతం కావడంలో కీలకమైనది. 1946లో కేరళలోని కన్నూర్ సమీపంలోని కరివేల్లూరు అనే గ్రామంలో రైతులు బ్రిటిష్ వారి సామ్రాజ్య, భూస్వామ్య విధానాలపై తిరుగుబాటు చేశారు. విజూ కృష్ణన్ కూడా అదే గ్రామానికి చెందిన వారు. రైతుల కష్టాలు, సమస్యల గురించి వింటూ ఆయన పెరిగారు. కరివేల్లూరు రైతుల తిరుగుబాటు జరిగిన దాదాపు 70 ఏళ్ల తర్వాత దాదాపు అలాంటి డిమాండ్లతోనే మహారాష్ట్ర రైతులు ఉద్యమిస్తుండటం ఆయనను వారికి దగ్గర చేసింది. రైతులు వారి హక్కుల కోసం పోరాడేలా విజూ వారిలో స్ఫూర్తిని నింపారు.

–సాక్షి, నేషనల్ డెస్క్

మండిన సూరీడు

పలుచోట్ల 40 డిగ్రీలకు చేరిన గరిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. మార్చి చివరి వారంలో ఉండాల్సిన ఎండలు, రెండో వారంలోనే నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం, నిజామాబాద్, కొమురం భీం, మహబూబాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలుచోట్ల 40 డిగ్రీల చొప్పున నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం తెలిపింది. నిర్మల్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్ రూరల్, మంచిర్యాలల్లో 39 డిగ్రీల చొప్పున పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

జీడిమెట్లలో సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉద్యానాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.10.65 కోట్లతో జీడిమెట్లలో సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి తెలిపారు. మంగళవారం జరిగిన సంస్థ మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ యూనిట్‌లో కారం, పసుపు, ధనియాల పొడులు, అల్లం వెల్లుల్లి మిశ్రమం, అల్లం మిశ్రమం, వెల్లుల్లి మిశ్రమం, చింతపండు పొడి, చింతపండు ముద్దలను తయారు చేస్తామన్నారు. దసరా నాటికి ప్రాసెసింగ్ యూనిట్‌ను స్థాపించి, ఆయా ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తామన్నారు. సమావేశంలో సంస్థ ఎండీ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అండర్ టేకింగ్‌ను ఉపసంహరించుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు కాపీ కొడితే ఉపాధ్యాయులదే బాధ్యత అని, వారిపై అండర్ టేకింగ్ చర్యలు తీసుకోవచ్చని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, పీఆర్‌టీయూ సంఘాల నేతలు మంగళవారం డిమాండ్ చేశారు.

సకల ఉద్యోగుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఈ నెల 25న తలపెట్టిన సకల ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను టీజీవోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షురాలు మమత టీజీవో భవన్‌లో ఆవిష్కరించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 'సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ వచ్చే విధంగా ప్రభుత్వం చూడాలి. ఉద్యోగులకు 11వ పీఆర్సీ అమలు చేయాలి. ఆంధ్రలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలి. ఉద్యోగుల విభజన సమస్యలను పరిష్కరించాల'న్నారు. మమత మాట్లాడుతూ సకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని, ఉద్యోగులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం, 14-3-2018


ప్రతీకాత్మక చిత్రం

జీవితాన్ని చక్కదిద్దుకోడానికి
నాలుగిళ్లు చక్కదిద్దగలిగితే?!
అరె! భలే ఉందే ఐడియా!
ఇళ్లను అందంగా సర్ది..
తన జీవితాన్నీ అంతే అందంగా
తీర్చిదిద్దుకున్న ఓ సుగంధ కథ ఇది.
చదువు లేని సుగంధ..
భర్తలేని సుగంధ..
డబ్బు లేని సుగంధ..
ఆదరించేవారు లేని సుగంధ..
కథ ఇది!

జీవితం... చక్కదిద్దింది

మగవాళ్లు ఉద్యోగం చేసి డబ్బు సంపాదించడం, ఆడవాళ్లు ఇంటి దగ్గరే ఉండి వంట పని, ఇంటి పని చూసుకోవడం.. ఏళ్లుగా సమాజంలో స్థిరపడిపోయిన సంప్రదాయం! ఇప్పటికీ చాలావరకు ఆ సంప్రదాయమే మన కుటుంబాలను, సమాజాన్ని నడిపిస్తోంది. అందుకే సుగంధ.. ఇంటి నుంచి బయటికి అడుగేయగానే ఒడ్డున పడిన చేప అయింది! అయితే ఆమె చేపలా విలవిల్లాడలేదు. బతుకు ఎడారిలో ఆత్మవిశ్వాసంతో పయనించి తన కోసం ఒక జీవ నదినే వెతుక్కుంది!

తెలిసింది రెండే గడపలు

సుగంధకు 16 సంవత్సరాల వయసు వచ్చేసరికి, వాళ్ల ఇంటికి మూడిళ్ల అవతల ఉన్న సుధీర్‌తో ఆమె వివాహం నిశ్చయం అయింది. ఏదో కులాచారం అని చెప్పి ఇంట్లో వాళ్లు ఆమెను చదివించలేదు. సుగంధకు ఒక్క అక్షరం కూడా చదవడం రాదు! 'చదువుతాను' అని ఆమె ఎప్పుడూ అనలేదు. 'ఎందుకు చదివించలేదు?' అనీ అడగలేదు. తల్లిదండ్రుల మాటే ఆమెకు వేదం. తల్లి చెప్పినట్లుగా చక్కగా వంట పనులు, ఇంటి పనులు నేర్చుకుంది. పుట్టింటికి మంచి పేరు తేవాలని అమ్మ చెప్పిన మాటలు ఒంట బట్టించుకుంది. అత్తవారింట్లో అడుగుపెట్టింది. సుగంధకు తెలిసింది రెండే గడపలు. పుట్టింటి గడప, మెట్టినింటి గడప.

మూడేళ్లకే భర్తకు నూరేళ్లు!

మూడేళ్లు సంతోషంగా గడిచాయి. ఒక బాబు పుట్టాడు. వాడికి దీపక్ అని పేరు పెట్టుకున్నారు. ప్రేమించే భర్త, ముద్దుల కొడుకు.. వాళ్లిద్దరి మధ్య సుగంధ జీవితం బాంధవ్యపు సుగంధాలు వెదజల్లింది. అంతలోనే అనుకోకుండా ఓ దుర్ఘటన! రోడ్డు మీద జరిగిన యాక్సిడెంట్‌లో సుధీర్ కన్నుమూశాడు! అప్పటికింకా సుగంధ వయసు ఇరవయ్యే. అంత చిన్నవయసులో ఆమెకది పెద్ద దెబ్బ. జీవితాన్నే తలకిందులు చేసే దెబ్బ. అసలు ఆ ఘటనకు ఎలా స్పందించాలో కూడా ఆమెకు మొదట అర్థం కాలేదు. రోజులు ఎలా గడుస్తున్నాయో కూడా తెలియని స్థితిలోకి జారిపోయింది సుగంధ. ఆ స్థితిలోనే.. చదువు లేని సుగంధకు ఒక్క విషయం ఏ మాత్రం స్పష్టంగా అర్థం అయ్యింది, తాను, తన బిడ్డ ఎవ్వరికీ భారం కాకూడదని. ఆమె అత్తింటివాళ్లు, పుట్టింటి వాళ్లు కూడా ఆర్థికంగా అంతంత మాత్రమే. అందుకని కాదు కానీ, ఎవ్వరినీ చేయి చాచి ఒక్క రూపాయి కూడా అడక్కూడదనుకుంది సుగంధ. అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చింది.

> ఒక చేత్తో బిడ్డను, ఒక చేత్తో పెట్టెను మోసుకుంటూ ముంబైలో దిగగానే.. ఒంటరి స్త్రీకి ఈ సమాజంలో ఎదురయ్యేవన్నీ సుగంధకూ ఎదురయ్యాయి. అయితే జీవితం అంటే ఎదురీదడమేననే సత్యాన్నీ ముంబైని చూసే ఆమె తెలుసుకుంది.

మూడో గడప ముంబై

అత్తింటివారు వారిస్తున్నా వినకుండా.. ఓరోజు బిడ్డనొక చేత్తో, బట్టల పెట్టెను ఒక చేత్తో పట్టుకుని, తన దగ్గరున్న కాస్త డబ్బుతో తను ఉంటున్న కల్యాణ్ ప్రాంతం నుంచి సమీపంలోనే ఉన్న ముంబైకి బయలుదేరింది సుగంధ! ఆ మహానగరంలో ఎలాగైనా బతకొచ్చనే ఆశ ఆమెను ఇంటి బయటికి అడుగు వేయించింది. అయితే అక్కడకు వచ్చాక తెలిసింది ఆమెకు.. ముంబై వచ్చి తప్పు చేశానని! జీవితం అంటే భయం కలగడం ప్రారంభమైంది. పుట్టింటి నుంచి నేరుగా అత్తింటికి వెళ్లిన సుగంధకు ఈ రెండిటి మధ్య ఉండే బయటి జీవితంలో ఇటువంటివి ఎదురౌతాయని అస్సలు తెలీదు. ముంబైలో దిగగానే ఒంటరి స్త్రీకి ఈ సమాజంలో ఎదురయ్యేవన్నీ సుగంధకు ఎదురయ్యాయి. అయితే జీవితం అంటే ఎదురీదడమేననే సత్యాన్నీ ముంబైని చూసే ఆమె తెలుసుకుంది.

కొడుకును చూసి ఆగిపోయేది!

ఏ ఉద్యోగానికైనా కొద్దో గొప్పో చదువు అవసరం. మరి నిరక్షరాస్యురాలైన సుగంధకు ఉద్యోగం ఎలా వస్తుంది? రోజులు గడిచిపోతున్నాయి. ఆమె దగ్గర ఉన్న డబ్బు కర్పూరంలా కరిగిపోతోంది. ఆమె ఆశలు కూడా ఆవిరైపోతున్నాయి. చాలాసార్లు కుంగిపోయింది సుగంధ. ఆత్మహత్య కూడా చేసుకోవాలనుకుంది. బిడ్డ ముఖం గుర్తుకు రాగానే నిర్ణయం మార్చుకునేది. చివరికి వాడినే తన ఆశాదీపం అనుకుంది. తాను కుంగిపోవడం సరి కాదనుకుంది. ఒకరోజు ఉదయం నిద్ర లేస్తూన్న సమయంలో వచ్చిన ఆలోచనతో సుగంధ మనసు తేలికపడినట్లయింది. కొత్త శక్తి పుంజుకుంది, డబ్బు సంపాదించడానికి మార్గం కనిపించింది. ప్రతి మనిషిలోను ఏదో ఒక శక్తి ఉంటుంది. అలాగే తనలో ఉన్న శక్తి ఏమిటో గమనించుకుంది.

అమ్మ నేర్పిన 'విద్య' ఆదుకుంది

పుట్టింట్లో ఉండగా తల్లి ఆమెకు కుదురుగా ఇల్లు సర్దడం నేర్పించింది. ఆ నమ్మకంతో ధనవంతుల ఇళ్లలో ఇంటిని అందంగా సర్దే పని చేయడానికి నిశ్చయించుకుంది. ఆలోచన వచ్చిందే తడవుగా ముంబై అంధేరిలోని ఒక ఇంట్లో పనికి కుదిరింది. ఆమె పనితీరుకు ముచ్చట పడిన మిగతా ఇళ్లవాళ్లు కూడా ఆమెను పిలిపించుకుని ఇల్లు సర్దించుకునేవారు. ప్రతిఫలం కూడా వేలల్లోనే దక్కేది. అలా కొద్దికొద్దిగా డబ్బు సమకూరుతూ ఉండడంతో అక్కడికి దగ్గరలోని ఒక స్లమ్ ఏరియాలో చిన్న గది అద్దెకు తీసుకుంది సుగంధ. ఆ వెంటనే దీపక్‌ను స్కూల్‌లో చేర్పించింది. ఏళ్లు గడుస్తున్నాయి. దీపక్ పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసి, ఇంజనీరింగ్‌లో చేరాడు. కొద్ది కొద్దిగా డబ్బు పోగు చేసి, చిన్న ఇల్లు కొనుక్కోగలిగింది. ఇంతలోనే మరో ఘటన. అయితే అది ఆమె మంచికే జరిగింది. తను నివసిస్తున్న స్లమ్ ఏరియాను ఒక బిల్డర్ కొనేశాడు. పరిహారంగా స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద, అక్కడ చిన్న హౌసింగ్ కాంప్లెక్స్ కట్టి సుగంధకు, ఇంకా కొందరికి ఆ కాంప్లెక్స్‌లో సొంత ఇంటిని కేటాయించాడు.

గతమే సుగంధ వర్తమానం

ఇప్పుడు సుగంధకు ఒక ఇల్లు ఉంది, చేతికి అంది వచ్చిన కుమారుడున్నాడు. అతడు ఉద్యోగం చేస్తున్నాడు. పనిచేయవలసిన అవసరం లేదు. కాని ఆమె తన పని మానలేదు. ''ఇళ్లను సర్దేపని నా జీవితాన్నీ చక్కగా సర్దింది. ఈ పనితోనే ఈ రోజు నేను ఈ స్థితికి వచ్చాను. ఈ పని కూడా రాకుండా ఉంటే, నా జీవితం ఎలా ఉండేదో! నా గతాన్ని నేను ఎప్పటికీ మర్చిపోను. ఎందుకంటే నా గతమే నా వర్తమానం'' అంటుంది సుగంధ. జీవిత ఆరంభంలో బెరుకుగా, పిరికిగా ఉన్న సుగంధ ఈ రోజు ఆత్మస్థైర్యంతో, ఆనందంతో ఉంది. మహిళలకు ఒక ఆదర్శంగానూ నిలిచింది.

(సుగంధ విజయగాథను పాలక్ కపాడియా అనే కాలమిస్ట్ మూడు రోజుల క్రితమే 'షీరోస్'లో పొందుపరిచారు)

– రోహిణి

పేరు లేని ప్రతిష్ఠ


'బ్రేక్‌ఫాస్ట్ ఎట్ టిఫనీస్' చిత్రంలో ఎల్బీడీతో ఆడ్రీ హెప్‌బర్

లిటిల్ బ్లాక్ డ్రెస్!


హ్యూబర్ట్ జివించీ

పాశ్చాత్య దేశాలలోని సంపన్న మహిళల బట్టల బీరువాల్లో ఎల్బీడీ (లిటిల్ బ్లాక్ డ్రెస్) తప్పనిసరిగా ఉంటుంది. యువతుల ఫేవరెట్ డ్రెస్ అది. వాళ్లంతా ఎక్కువగా సాయంకాలపు వేడుకలకు దీనిని ధరించి వెళుతుంటారు. ఎక్కడైనా డ్యాన్స్ చేయాల్సి వస్తే అక్కడికి కూడా. ఎల్బీడీకి ప్రత్యేకంగా గుర్తింపు ఉంది. ప్రత్యేకంగా పేరే లేదు. లిటిల్ బ్లాక్ డ్రెస్. అంతే. ఈ డ్రెస్ సృష్టికర్త హ్యూబర్ట్ జివించీ తన 91వ ఏట.. మొన్న శనివారం రోజు కన్నుమూశారు. ఆయన అలా కన్నుమూయగానే ఎల్బీడీ చరిత్ర ప్రముఖంగా వార్తల్లోకి, వర్తమానంలోకి వచ్చింది. 1920లలోనే ఎల్బీడీకి ఒక రూపం ఉన్నప్పటికీ, హాలీవుడ్ చిత్రం 'బ్రేక్‌ఫాస్ట్ ఎట్ టిఫనీస్' హీరోయిన్ ఆడ్రీ హెప్‌బర్న్ కోసం హ్యూబర్ట్ డిజైన్ చేసిన ఎల్బీడీతో ఫ్యాషన్ రంగానికి ఒక కొత్త ఊపు వచ్చింది. ఆర్డర్లు పెరిగాయి. మార్కెట్ పెరిగింది. తనకే పేరూ లేకుండానే డిజైనర్‌కు పేరు తెచ్చిపెట్టిన డ్రెస్.. ప్రపంచ ఫ్యాషన్ చరిత్రలో బహుశా ఇదొక్కటే కావచ్చు.

చెట్టు నీడ

నిజమైన ఇంద్రజాలం

ఒక పట్టణంలో రెండు ఆశ్రమాలుండేవి. ఇద్దరు గురువులు ఉండేవారు.

మొదటి ఆశ్రమంలో గురువు బోధనలు చక్కగా ఉండేవి. ప్రేమ, కరుణ, శాంతం గురించి ఎక్కువగా చెబుతుండేవాడు. దాంతో వినడానికి చుట్టుపక్కల ఊళ్ల నుంచి ఎంతోమంది జనం వచ్చేవారు.

రెండో గురువు గొప్ప శక్తులను సంపాదించడం మీద తన దృష్టి సారించేవాడు. అలా ఎన్నో అద్భుతాలను ఆయన చేయగలిగేవాడు.

అయితే, రెండో గురువు దగ్గర ఎన్ని శక్తులు ఉన్నప్పటికీ మొదటి గురువుకే ఎక్కువ ఆదరణ ఉండేది. ఇది రెండో గురువుకు తీవ్రమైన అసూయ కలిగించేది.

> మర్యాద పలకరింపు కూడా లేకుండా- 'ఏమిటి నీ గొప్ప? మామూలు బోధనలే కదా నువ్వు చేసేది! మరి నేను అలా కాదే! ఎన్నో అద్భుతాలు చేయగలను' అన్నాడు గర్వంగా.

దాంతో ఒకరోజు నేరుగా మొదటి గురువు దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఆయన చుట్టూ శ్రోతలు కూర్చునివున్నారు. మర్యాద పలకరింపు కూడా లేకుండా- 'ఏమిటి నీ గొప్ప? మామూలు బోధనలే కదా నువ్వు చేసేది! మరి నేను అలా కాదే! ఎన్నో అద్భుతాలు చేయగలను' అన్నాడు గర్వంగా.

'ఏమిటా అద్భుతాలు?' కుతూహలంగా అడిగాడు మొదటి గురువు.

'నేను మన ఊళ్లోని చెరువు ఈ ఒడ్డున బ్రష్ పట్టుకుని నిల్చుంటాను. అవతలి ఒడ్డున నా సహాయకుడు కాన్వాస్ పట్టుకుని నిలుచుంటాడు. నేను ఇక్కడ గీస్తే అక్కడ బొమ్మ రూపుకడుతుంది తెలుసా?' అన్నాడు.

'ఓహో, నిజంగా బాగుంది. అయితే, నేను అంత ఇంద్రజాలం ప్రదర్శించలేనుగానీ నేను పడుకోగానే మాత్రం వెంటనే నిద్ర పడుతుంది' నవ్వుతూ బదులిచ్చాడు మొదటి గురువు.

టీవీ క్రైమ్

అమ్మా.. పులి!



''అమ్మా.. '' అంటూ గట్టిగా అరిచి లేడీబర్డ్ సైకిల్ మీద నుంచి కిందపడిపోయింది పదేళ్ల హారిక. ఆ అరుపుకి వంటింట్లో ఉన్న అమృత గాభరా పడిపోయి ఒక్క పరుగున వాకిట్లోకి వచ్చింది.

రెండు చేతుల్లో మొహం దాచుకొని హారిక ''అమ్మా.. మంట'' అంటూ విలవిల్లాడుతోంది. నీళ్లతో ఉన్న పెప్సీ బాటిల్‌ను పట్టుకొని పన్నెండేళ్ల ధీరజ్, ఉపేంద్ర గేట్ వైపు పరుగులెడుతున్నారు. హారిక పక్కనే ఉన్న అంకిత.. ''హెల్ప్.. ప్లీజ్ హెల్ప్ '' అని అరుస్తోంది.

ఆ సీన్ చూస్తున్న అమృతకు ఏమీ అర్థంకాలేదు. ఆదివారం.. ఇరుగుపొరుగు పిల్లలంతా కాస్త విశాలంగా ఉన్న తమ కాంపౌండ్‌లో చేరి ఆడుకోవడం అలవాటే. అలాగే ఆడుకుంటున్నారనుకొని వంట పనిలో పడిపోయింది అమృత. కాని ఆ కేకలు.. ఆ దృశ్యం ఏంటో అయోమయంగా తోచింది.

''అంకితా.. ఏమైందమ్మా'' కంగారుగా అడిగింది అమృత.

ఆ మాటకు చటుక్కున అమృతవైపు తలతిప్పి సిగ్గుపడింది అంకిత.

'అమ్మా.. మంట' అని అరిచిన హారిక కూడా దిగ్గున లేచి కూర్చుంది. ఈలోపు ధీరజ్, ఉపేంద్ర కూడా వీళ్లవైపు రాసాగారు.

అప్పటికీ ఏమీ అర్థంకాలేదు అమృతకు. కాళ్లు వణుకుతున్నాయి. గబగబా వెళ్లి హారిక మొహం తుడిచి, చెదిరి నుదుటి మీదకు వచ్చిన జుట్టును సర్దసాగింది.. ''ఏమైంది? ఎందుకలా అరిచావ్'' అంటూ.

''మమ్మీ.. ''అంటూ నవ్వసాగింది హారిక.

కోపమొచ్చింది అమృతకు. ''ఏయ్.. నిన్నే.. ఏం తమాషానా? అప్పుడే అరుపులు కేకలేంటి? ఈ నవ్వులేంటి?'' స్వరం పెంచింది గద్దించింది.

''ఏం కాలేదు మమ్మీ.. ఆడుకుంటున్నాం''.. చెప్పింది హారిక అలాగే నవ్వుతూ.

ఎర్రబడ్డ మొహంతో అమృత ''ఆటా? ఇదేం ఆటా?'' అదే కోపం ఆమె మాటలో.

''యాసిడ్ ఆట ఆంటీ''.. పక్కనుంచి చెప్పింది అంకిత.

ఆ జవాబుకి ఉలిక్కిపడింది అమృత. ఆమె ఫీలింగ్ గమనించినట్టుగా ''అవును ఆంటీ.. యాసిడ్ ఆట.. టీవీలో చూపిస్తారు కదా.. అదే'' వివరణ ఇచ్చాడు ధీరజ్ చేతులు తిప్పుకుంటూ!

> భవిష్యత్ తరాల ఆలోచనల్లో సున్నితత్వాన్ని పెంచుదామనే ప్రయత్నాలు, ప్రచారాలు, ప్రణాళికలు వాళ్లలో రాక్షసత్వాన్ని పెంచట్లేదు కదా! మనం ఏం చేస్తున్నా.. ఏం చూపిస్తున్నా.. సమాజంలో పిల్లలూ ఉంటారు.. మన ప్రతి చర్యకూ వాళ్ల ప్రతిచర్య ఉంటుందనే స్పృహ లేకుంటే ఎలా?

● ❖ ●

తల తిరిగింది అమృతకు.

అప్పుడెప్పుడో.. ఏదో మ్యాగజైన్‌లో చదివినట్టు గుర్తు.. కశ్మీర్‌లో పిల్లలంతా 'సెక్యూరిటీ చెక్ ' ఆట ఆడుకుంటున్నట్టుగా! దేన్ని ఎక్కువగా గమనిస్తే దాన్నే పిల్లలు అనుకరిస్తారు. చెమటలు పట్టాయి ఆ అమ్మకు. 24 గంటల వార్తాచానళ్లు, సీరియళ్లు, సోషల్ మీడియా, పనులైపోయాక తామంతా చేరి మాట్లాడుకునే మాటలు.. ఇవన్నీ ఇలా వాళ్లమీద ఎఫెక్ట్ చూపి ఆటల్లో కనపడుతున్నాయా? ఆటల్లో అరటిపండు కాదు.. ఆటలతో పెద్దాళ్ల మెదళ్లో బాంబులు పేలుస్తున్నారు ఈ పిడుగులు. బాంబులను అందిస్తోంది ఈ పెద్దవాళ్లేనా? జనాలను సెన్సిటైజ్ చేయాలనే ఉద్దేశంతో సమాజంలో జరుగుతున్న నేరాలను ప్రసార మధ్యమాలు చూపిస్తున్న తీరు నిందితులను లేదా నేరస్తులను హీరోలుగా చేస్తోందా? ఆడవాళ్ల సమస్యలను ఫోకస్ చేస్తున్నామని చెప్పి వారి పరిస్థితిని మరింత దిగజార్చడం లేదు కదా? సోషల్ మీడియా ప్రవర్తన కూడా ఇందుకు అతీతంగా లేదని సర్వేలూ చెప్తున్నాయి. ఇదంతా మనం అనుకున్న ధోరణిలో కాకుండా ప్రతికూల ప్రతిఫలాన్నిస్తోందా? భవిష్యత్ తరాల ఆలోచనల్లో సున్నితత్వాన్ని పెంచుదామనే ప్రయత్నాలు, ప్రచారాలు, ప్రణాళికలు వాళ్లలో రాక్షసత్వాన్ని పెంచట్లేదు కదా! మనం ఏం చేస్తున్నా.. ఏం చూపిస్తున్నా.. సమాజంలో పిల్లలూ ఉంటారు.. మన ప్రతిచర్యకూ వాళ్ల ప్రతిస్పందన ఉంటుందనే స్పృహ లేకుంటే ఎలా? సమాజం అంటే ఆడ, మగ కాదు.. పిల్లలతో కూడిన ప్రజలు అనుకుంటూ.. ఆలోచనల్లోంచి బయటపడింది అమృత. తనేం జాగ్రత్తలు తీసుకోవాలో అవగతమైనట్టు!

– సరస్వతి రమ

గుడ్ ఫుడ్

పాలిచ్చే తల్లులకు




మంచి రుచికరమైన ధాన్యాల్లో సజ్జలు ముఖ్యమైనవి. వీటిల్లో పిండి పదార్థాలు ఎక్కువ. దాంతోపాటు క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియమ్, సోడియం, పొటాషియమ్, జింక్, కాపర్, మాంగనీస్ వంటి ఖనిజలవణాలు పుష్కలంగా ఉంటాయి. విటమిన్ బి కాంప్లెక్స్, విటమిన్-ఈ, విటమిన్-కె కూడా ఎక్కువే. సజ్జలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాల్లో కొన్నివి.

- పాలిచ్చే తల్లులు రొమ్ముపాలు పుష్కలంగా పడేలా చేసే గుణం సజ్జలకు ఉంది. ఇందులో ఉండే మెగ్నీషియమ్ వల్ల మహిళల్లో రుతుసమయంలో వచ్చే 'మెన్‌స్ట్రువల్ క్రాంప్స్' తగ్గుతాయి.
- సజ్జల్లో ఫాస్ఫరస్ పాళ్లు చాలా ఎక్కువ. అందుకే అవి ఎముకలను దృఢంగా మార్చుతాయి. అంతేకాదు.. సజ్జలు కండరాలను మరింత శక్తిమంతంగా చేస్తాయి.
- సజ్జలు రక్తంలోని ట్రైగ్లిజరైడ్స్ పాళ్లను తగ్గించి, గుండెజబ్బులను నివారిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ హెచ్‌డీఎల్ పాళ్లను పెంచి రక్తనాళాలు పెళుసుబారకుండా కాపాడతాయి.



- వీటిల్లో పీచుపదార్థాలు పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణకోశ వ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు పైల్స్, పెద్దపేగు క్యాన్సర్ వంటి వ్యాధులను నివారిస్తాయి.
- సజ్జల్లో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనోఎంజైమ్ త్వరగా కడుపు నిండేలా చేసి, సంతృప్తభావనను పెంచుతుంది. ఆరోగ్యకరంగా బరువు తగ్గాలనుకునేవారికి సజ్జలు మంచి ఆహారం. ఇదే ఎంజైమ్ ఒత్తిడిని తగ్గించి, బాగా నిద్రపట్టేలా కూడా చేస్తుంది.
- తరచూ ఆహారంలో సజ్జలు తీసుకునేవారిలో గాల్‌స్టోన్స్ ఏర్పడటం చాలా తక్కువ.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! నేను డ్రైవింగ్ చేస్తుంటా. నాకు నా మరదలంటే చాలా ఇష్టం. తను మాత్రం ''మా మమ్మీ ఎవరిని చేసుకోమంటే వాళ్లనే చేసుకుంటా'' అని చెప్పింది. కానీ తను లేకపోతే చచ్చిపోవాలనిపిస్తోంది. నిద్ర పట్టడంలేదు. చాలా భయంగా అనిపిస్తోంది. తట్టుకోలేకపోతున్నా. ఇన్ని రోజులు నాతో చాట్ చేసేది. బట్ ఇప్పుడు అది కూడా మానేసింది. ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. తనే గుర్తుకొస్తోంది. ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి అన్నయ్యా.

- జగదీశ్

సిగ్నల్ రెడ్ ఉందన్నా...

అది గ్రీన్‌గా మారాలని అనుకుంటున్నావు...!

'సార్ ఏ సిగ్నల్ అయినా రెడ్ నుంచి గ్రీన్‌కి మారుతుంది కదా సార్???'

సిగ్నల్ రెడ్ ఉందన్నా...

'చెప్పిందే చెబుతారేంటి సార్?????'

అది గ్రీన్‌గా మారాలని అనుకుంటున్నావు...

'సార్ మీరు అరిగిపోయిన రికార్డులా అక్కడే తిరుగుతూ ఉంటారా? ముందుకేమైనా వెళ్తారా???'

ఎలా వెళ్లాలి? సిగ్నల్ రెడ్ ఉంది కదా???

'మీకు ఉత్తరాలు రాసేవాళ్లు మీ రెడ్ సిగ్నల్ చూసి రాయడం మానేస్తారు.. జగదీశ్‌కి ఏదో ఒక సొల్యూషన్ చెప్పండి సార్!'

గుండె సిగ్నల్ గ్రీన్ ఉంది. అందుకే జగదీశ్ ప్రతి క్షణం తన గురించే ఆలోచిస్తున్నాడు. కానీ అమ్మాయి మనసులో రెడ్ పడింది. మనకు కావల్సినట్టు డ్రైవ్ చెయ్యడానికి ఇది హైవే కాదు. కష్టమైన, ఇరుకైన బిజీ ట్రాఫిక్...!

'అంటే అమ్మాయి అక్కడెక్కడో ఉంది. జగదీశ్ ట్రాఫిక్ జామ్‌లో ఉన్నాడా సార్???'

ఎగ్జాట్లీ నీలాంబరీ...! జీవితం.. ప్రేమ.. ఖాళీ రోడ్లు కావు. ఎన్నో బండ్లు, ఎన్నో రకాలు.. ఒక్కోసారి అనుకున్న టైమ్‌కి చేరలేము. ఒక్కోసారి రూట్ మార్చుకుంటాము.. ఒక్కోసారి....

'గమ్యమే మారిపోతుంది కదా సార్!.. ఎంత పొయిటిక్‌గా చెప్పారు సార్...!'

రోడ్డు ఏదైనా.. సిగ్నల్ ఏదైనా స్టీరింగ్ మనదన్నా... తిప్పు. గిర్రున తిప్పు..! కొత్త బాట పట్టన్నా..! లవ్ యు జగదీశ్...!!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

సుడోకు

	2				1	7		
9				2	8			
3							2	1
	8			7		9	6	5
		3	2	9	5	4		
7	9	5		4			3	
2	4							6
	1		4	3				8
		9	6				1	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3x3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

7	9	4	1	5	3	8	2	6
5	8	2	9	7	6	4	1	3
6	3	1	4	8	2	7	5	9
9	6	5	2	3	4	1	7	8
4	2	8	6	1	7	9	3	5
3	1	7	8	9	5	2	6	4
1	4	6	3	2	8	5	9	7
2	5	3	7	4	9	6	8	1
8	7	9	5	6	1	3	4	2

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

పల్లవి: వచ్చిండే మెల్లమెల్లగ వచ్చిండే క్రీము బిస్కెట్ యేసిండే
గమ్మున కూసోనియ్యాడే కుదురుగ నిలుసోనియ్యాడే
సన్నసన్నగ నవ్వెండే కునుకే గాయబ్ జేసిండే
ముద్ద నోటికి పోకుండా మస్తు డిస్టర్బ్ చేసిండే

పిల్లా రేణుకా పిలగాడొచ్చిండే డిన్నరన్నాడే డేటు అన్నాడే
ఏలు పట్టి పోలు తిరిగి నిన్ను ఉల్టా సీదా జేసిండే
॥వచ్చిండే॥

చరణం : 1
మగవాళ్లు మస్తు చాలూ (మూడు సార్లు) మస్కలు గొడత ఉంటే
నువ్వు ఎన్నపూస లెక్క కరిగితే అంతే సంగతే
ఓసారి సరే అంటూ ఓసారి సారీ అంటూ
మైన్టైను నువ్వు జేస్తే లైఫంతా పడుంటాడే
॥వచ్చిండే॥ ॥సన్నసన్నగ॥

చరణం : 2
అయ్‌బాబోయ్ ఎంత పొడుగో (3)
ముద్దులెట్టా ఇచ్చుడే
అయ్‌బాబోయ్ ఎంత పొడుగో ముద్దులెట్టా ఇచ్చుడే
తన ముందు నిచ్చెనేసి ఎక్కితే కాని అందడే
పరువాలే నడుం పట్టి పైకెత్తి ముద్దే పెట్టే
టెక్నిక్సే నాకున్నాయ్‌లే పరేషానే నీకక్కర్లే
॥వచ్చిండే॥ ॥పిల్ల రేణుక॥
అరే ఓ పిల్లా ఇంక నువ్వు నేలనిడిచి గాలి మోటర్లో
॥వచ్చిండే॥

రచన: సుద్దాల అశోక్‌తేజ; **సంగీతం:** శక్తికాంత్ కార్తిక్
గానం: మధుప్రియ, రాంకీ, బృందం; **చిత్రం:** ఫిదా

000000


కట్‌చేయ్...దాచేయ్...

రాజకీయ రంగస్థలం



రామ్‌చరణ్
ఆది పినిశెట్టి

ఇప్పటి వరకు వచ్చిన ఫస్ట్ లుక్స్, సాంగ్స్‌ను ఆధారంగా చేసుకుని ...'రంగస్థలం' సినిమా ఓ ఫ్యామిలీ కమ్ క్యూట్ లవ్‌స్టోరీ అనుకుంటే పొరపాటే. రంగస్థలంలో రాజకీయాలు మస్త్ రంజుగా ఉన్నాయి. రంగస్థలం అనే గ్రామంలో సాగే రాజకీయ ఆధిపత్య పోరు నేపథ్యంలో సినిమా సాగుతుందని టాక్. ఇందుకు తగ్గట్లుగానే –''రంగస్థలం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రెసిడెంట్ అభ్యర్థిగా గ్రామ ప్రజలు బలపరిచిన కె.కుమార్‌బాబు లాంతరు గుర్తుకే మీ ఓటు ముద్రను వేసి గెలిపించండి'' అని కుమార్ బాబు ఫొటోతో ఉన్న కరపత్రం ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మించిన చిత్రం 'రంగస్థలం'. సమంత కథానాయిక. ఈ సినిమాలో వినికిడి లోపం ఉన్న చిట్టిబాబు పాత్రలో రామ్‌చరణ్, రామలక్ష్మి పాత్రలో సమంత నటించారు. మరి.. సడన్‌గా కుమార్ బాబు ఎవరు? అంటే..ఆది పినిశెట్టి. మరి..కుమార్‌బాబు ఎన్నికల్లో గెలిచాడా? ప్రత్యర్థులు ఎవరు? రంగస్థలం రాజకీయాల్లో చిట్టిబాబు పాత్ర ఎంత? వంటి ఆసక్తికర వివరాలు తెలియాలంటే మాత్రం 'రంగస్థలం' సినిమా చూడాల్సిందే. ఈ సినిమాలో రామ్‌చరణ్, ఆది పినిశెట్టి అన్నదమ్ములుగా నటిస్తున్న సంగతి తెలిసిందే. 1985 కాలం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో జగపతిబాబు, ప్రకాశ్‌రాజ్, అనసూయ కీలక పాత్రలు పోషించారు. 'రంగస్థలం' చిత్రాన్ని ఈనెల 30న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



రవితేజ

ఉగాదికి కొత్తగా...

తెలుగు సంవత్సరాది ఉగాదికి కొత్త కొత్తగా కనిపించి అభిమానులకు పండగ ఉత్సాహాన్ని డబుల్ చేయనున్నారు హీరో రవితేజ. 'సోగ్గాడే చిన్ని నాయనా, రారండోయ్ వేడుక చూద్దాం' చిత్రాల ఫేమ్ కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మాతగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. మాళవిక శర్మ కథానాయిక. ఈ సినిమాకు 'నేల టిక్కెట్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, టైటిల్‌ను తెలుగువారి మొదటి పండుగ ఉగాది సందర్భంగా ఈనెల 18న విడుదల చేయాలనుకుంటున్నారు. రీసెంట్‌గా చిత్రబృందం యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించింది. ఆల్మోస్ట్ 60 శాతం సినిమా చిత్రీకరణ పూర్తైంది. జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాశ్, రఘుబాబు, సుబ్బరాజు నటిస్తున్న ఈ సినిమాను మే లో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమాకు సంగీతం: శక్తికాంత్ కార్తీక్.

గోపీచంద్‌తో 'బొమ్మరిల్లు'?



గోపీచంద్

'బొమ్మరిల్లు' వంటి చక్కటి కుటుంబ కథా చిత్రంతో సూపర్ డూపర్ హిట్ అందుకున్నారు దర్శకుడు భాస్కర్. ఆ సినిమాతో తొలి సినిమానే ఇంటిపేరుగా మార్చుకున్న వారిలో 'బొమ్మరిల్లు' భాస్కర్ కూడా చేరారు. ఆ తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'పరుగు' సినిమా మంచి విజయం అందుకోగా, 'ఆరెంజ్, ఒంగోలు గిత్త' సినిమాలు నిరాశ పరచాయి. ఆ చిత్రాల తర్వాత ఆయన తెలుగు సినిమాలేమీ చేయలేదు. కానీ, తమిళంలో చేశారు. తాజాగా యాక్షన్ హీరో గోపీచంద్‌తో భాస్కర్ ఓ సినిమా చేయనున్నారని ఫిల్మ్‌నగర్ సర్కిల్‌లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గోపీచంద్ ఇమేజ్‌కి తగ్గట్టుగా ఆయన ఓ కథ రెడీ చేశారట. గోపి–భాస్కర్ కాంబినేషన్‌లో సినిమా నిర్మించేందుకు నిర్మాతలు కూడా రెడీ అట. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌పై త్వరలోనే ప్రకటన వచ్చే అవకాశం ఉంది. వీరి కాంబినేషన్‌లో రానున్న సినిమా గోపీచంద్ తరహా యాక్షన్ నేపథ్యంలో ఉంటుందా? భాస్కర్ శైలిలో ఫ్యామిలీ, ప్రేమ నేపథ్యంలో ఉంటుందా? అన్న ఆసక్తికర చర్చ ఇండస్ట్రీ వర్గాల్లో నడుస్తోంది. ఈ సినిమాతో పాటు అల్లు అరవింద్, డి.సురేశ్‌బాబు బ్యానర్లలో సినిమాలు చేసేందుకు కథలు సిద్ధం చేసుకుంటున్నారట భాస్కర్.



తమన్నా

ఆ నంబర్ నాకు అన్‌లక్కీ

నీకు ఎన్ని చాక్లెట్లు కావాలి? అంటే, 'వన్ నుంచి టెన్ వరకు' ఏ నంబర్ అయినా చెబుతారు కానీ, పొరపాటున ఆ నంబర్ మాత్రం చెప్పరు తమన్నా. ఈ మిల్కీ బ్యూటీకి చాక్లెట్స్ అంటే చాలా ఇష్టం. ఏడు చాక్లెట్స్ ఇచ్చి, ఇంకోటి ఇస్తానంటే ఒప్పుకోరు. పోనీ తొమ్మిదికి ఒకటి తగ్గిస్తానన్నా 'ఊహూ' అంటారు. ఎందుకంటే ఏడుకి, తొమ్మిదికి మధ్య ఉన్న 'ఎనిమిది' తమన్నా అన్‌లక్కీ నంబర్. చాక్లెట్స్‌కి కూడా లక్కీ నంబర్ చూడాలా అనుకుంటున్నారా? ఎనిమిది అంటే తమన్నాకు ఇష్టం ఉండదని చెప్పడానికి ఓ ఉదాహరణ అంతే. ఎనిమిదిని ఎందుకు అన్‌లక్కీ నంబర్‌గా భావిస్తారో తమన్నా స్పష్టం చేయలేదు. సో.. ఈ బ్యూటీని ఆరాధించేవారు పండ్లూ, పూలూ, వేరే ఏదైనా తీసుకెళ్లేటప్పుడు టోటల్‌గా నంబర్ ఎనిమిది లేకుండా చూసుకుంటే చాలు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమన్నా తన అన్‌లక్కీ నంబర్‌ని బయటపెట్టారు. ఇంకా తను ఫుడ్ లవర్‌ని అని, షూటింగ్‌కి పేకప్ చెప్పాక అందరి అమ్మాయిల్లా మామూలుగా ఉంటానని, తన బెస్ట్ ఫ్రెండ్స్ అందరూ సినిమా ఇండస్ట్రీ బయటివారే అని చెప్పారు.

నో మోర్ డౌట్స్



సూర్య

సూర్య హీరోగా కేవీ ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. అయితే.. ఈ సినిమాను అధికారికంగా మంగళవారం అనౌన్స్ చేశారు దర్శకుడు కేవీ ఆనంద్. సో.. ఇక సూర్య నెక్ట్స్ మూవీపై నో మోర్ డౌట్స్. ''సూర్య హీరోగా లైకా ప్రొడక్షన్స్ పతాకంపై నా తర్వాతి చిత్రం తెరకెక్కనుంది. హారిస్ జైరాజ్ స్వరకర్త. ఆర్ట్.. డి.ఆర్.కె కిరణ్.'' అని పేర్కొన్నారు కేవీ ఆనంద్. ''మా అందరికీ మీ ప్రేమ, ఆశీర్వాదాలు కావాలి సార్'' అన్నారు సూర్య. ఈ సినిమా ఏప్రిల్‌లో సెట్స్‌పైకి వెళ్తుందని టాక్. ప్రస్తుతం సెల్వ రాఘవన్ దర్శకత్వంలో సూర్య హీరోగా 'ఎన్‌జీకే' అనే చిత్రం రూపొందుతోంది. సాయిపల్లవి, రకుల్ ప్రీత్‌సింగ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ సినిమాను ఈ ఏడాది దీపావళికి రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



నేహాదేశ్ పాండే, సంతోష్ రాజ్

రక్త సంబంధీకులను పెళ్లి చేసుకుంటే...

సంతోష్ రాజ్, నేహాదేశ్ పాండే జంటగా సుమన్ ప్రధాన పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'అనువంశికత'. 'జెనిటిక్ లవ్ స్టోరీ' అన్నది ఉపశీర్షిక. రమేష్ ముక్కెర దర్శకత్వంలో తాళ్లపెల్లి దామోదర్ గౌడ్ నిర్మిస్తున్న ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. నటుడు సుమన్ మాట్లాడుతూ– ''రక్త సంబంధీకులను పెళ్లి చేసుకుంటే వచ్చే పరిణామాలు ఎలా ఉంటాయనే పాయింట్‌తో ఈ సినిమా తీశారు. మంచి సందేశాత్మకంగా ఉంటుంది. పెద్ద విజయం సాధిస్తుంది'' అన్నారు. ''ఈ సినిమా కోసం 45 డిగ్రీల వేడిని సైతం లెక్క చేయకుండా షూటింగ్ చేశాం. నిర్మాత సహకారం వల్లే ఇంత మంచి సినిమా తీశాం'' అన్నారు రమేష్ ముక్కెర. ''మంచి కథాంశంతో రూపొందిన చిత్రమిది. మా తొలి ప్రయత్నాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు తాళ్లపెల్లి దామోదర్ గౌడ్. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, సంతోష్ రాజ్, నేహాదేశ్ పాండే, గీత రచయిత తైదల బాపు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: యండి. యాకూబ్, సమర్పణ: అశ్విత, క్రాంతికుమార్, కథ, మాటలు, సంగీతం, దర్శకత్వం: రమేష్ ముక్కెర.

డిఫరెంట్ కాన్సెప్ట్‌తో బంగారు తెలంగాణ



బిపిన్, రమ్య

బిపిన్, రమ్య, ఏవి స్వామి, బాబుమోహన్, సాయి త్రిశాంక్ ముఖ్య తారలుగా కూర అంజిరెడ్డి సమర్పణలో షిరిడి సాయి క్రియేషన్స్ పతాకంపై బిపిన్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బంగారు తెలంగాణ'. తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ తలసాని శ్రీనివాసయాదవ్ ఈ చిత్రం ఆడియో సీడీలను విడుదల చేశారు. దర్శకుడు– నటుడు– నిర్మాత బిపిన్ మాట్లాడుతూ–''తెలంగాణ కోసం ఎంతో మంది ఆత్మ బలిదానాలు చేసుకున్నారు. సీయం కేసీఆర్ కృషి వల్లే బంగారు తెలంగాణ సాధ్యం అయింది. అసలు... తెలంగాణ ఎలా వచ్చింది? అనే కాన్సెప్ట్‌పై సినిమాను తెరకెక్కించాం. సినిమాకు సహకరించిన అందరికీ నా కృతజ్ఞతలు. తలసాని శ్రీనివాస్ యాదవ్‌గారు మా సినిమా రిలీజ్‌కు అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మందల విజయభాస్కర్ రెడ్డి.

585 ఏళ్ల ప్రేమగాథ



ప్రియమణి

ప్రియమణి టైటిల్ పాత్రలో తెరకెక్కిన చిత్రం 'అంగుళీక'. దీపక్ కథానాయకుడు. ప్రేమ్ ఆర్యన్‌ని దర్శకునిగా పరిచయం చేస్తూ కోటి తూముల, ఎ.హితేష్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ –''ఈ సినిమా కథ నాకు తెలుసు. నిర్మాతలిద్దరూ నాకు కావాల్సిన వారు కావడంతో ఎప్పటికప్పుడు అప్ డేట్స్ ఇచ్చేవారు. టీజర్ టైమింగ్, కటింగ్ చూశాక దర్శకుడు సినిమాని బాగా తీసుంటాడని అర్థమైంది. ఈ చిత్రం విజయవంతమై నిర్మాతలకు లాభాలు, దర్శకుడికి మంచి పేరు రావాలి'' అన్నారు. ప్రేమ్ ఆర్యన్ మాట్లాడుతూ –''కోడి రామకృష్ణగారి స్ఫూర్తితో 'అంగుళీక' చిత్రాన్ని డైరెక్ట్ చేశా. కాలచక్రంతో ముడిపడిన ఇద్దరు ప్రేమికుల వీరగాథే ఈ సినిమా. కాలచక్రం, సూర్యగ్రహణం ఈ రెండు అంశాల చుట్టూ సినిమా తిరుగుతుంది. సూర్యగ్రహణం ఘడియల్లో విడిపోయిన ప్రేమజంట మళ్లీ సూర్యుడి ఆశీస్సులతో 585 ఏళ్ల తర్వాత కలుసుకుంటారు. అదే సమయంలో పగతో రగిలిపోతున్న దుష్ట ఆత్మ ఆ జంటపై పగ తీర్చుకుందా? ఆ ప్రేమ జంట ఆత్మలకు ఎలా మోక్షం కలిగింది– అనేది సినిమాకు హైలెట్'' అన్నారు. కోటి తూముల, ఎ.హితేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శామ్ కె. ప్రసన్, కెమెరా: చిట్టిబాబు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: శశి బాణాల, శివ సిర్రి.

సెల్ఫ్ చెక్

పిల్లలకు మంచిమాటలు నేర్పిస్తున్నారా?

సమాజం అభివృద్ధి అనుకరణతోనే సాగింది. ముఖ్యంగా భాష పెంపొందేది దీనితోనే. పిల్లలు 'అమ్మ' అనమంటే 'అమ్మ' అంటారు. 'ఆవు' అనమంటే 'ఆవు' అంటారు. ఇంటిలోనే భాష సరిగా లేకుంటే పిల్లలకు ఎలా వస్తుంది? కొన్నిసార్లు ఇంటిలో ఎలాంటి తప్పుమాటలు మాట్లాడకపోయినా పిల్లలు అక్కడక్కడ విని నేర్చుకుంటారు. ఇలాంటి అలవాటును మొదటిలోనే మాన్పిస్తే పిల్లలకు మంచి భాష అలవడుతుంది. మీ పిల్లలూ ఇలాంటి మాటలు మాట్లాడుతుంటే మాన్పించే ప్రయత్నం చేస్తున్నారా?

1. పిల్లలు తప్పు మాట్లాడిన వెంటనే దాన్ని సవరిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. తప్పు మాటలు మాట్లాడేటప్పుడు పట్టించుకోకుండా, వారిని మీ అటెన్షన్‌లోకి తెచ్చే ప్రయత్నం చేస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. పిల్లలకు చెప్పే ముందు మీరూ అలాంటి మాటలు మాట్లాడరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. చెడ్డమాట స్థానంలో మంచిమాట మాట్లాడిన ప్రతిసారీ ఏదైనా బహుమతి ఇస్తామని ప్రామిస్ చేస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. పిల్లలు ఇలాంటి మాటలను చాలా చోట్ల నుంచి వింటారు కాబట్టి వారిని అర్థం చేసుకొని, అలాంటి పదాల నష్టం ఏమిటో వివరిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. పిల్లల ప్రవర్తనలో మార్పు రాకపోతే కొంచెం ఘాటుగా స్పందించటానికి వెనకాడరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. తప్పు మాట్లాడిన ప్రతిసారీ ఒక రూపాయి కాయిన్, రూమ్‌లో అమర్చిన జార్‌లో వేయాలని చెప్తారు. (దీన్నో గేమ్‌లాకాక పనిష్మెంట్‌లా ఉపయోగిస్తారు)
   ఎ. అవును ☐ బి. కాదు ☐



8. చెడ్డమాటలకు బదులు నవ్వు తెప్పించే పదాలు ఉపయోగించటం నేర్పిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
9. పిల్లలు అలాంటి మాటలను ఎక్కడనుంచి నేర్చుకుంటున్నారో గమనించి ఆ సోర్సును ఆపేస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
10. మాట్లాడకూడని మాటలు మాట్లాడినప్పుడు నవ్వరు. నవ్వు వారిని ఎంకరేజ్ చేస్తుందని మీకు తెలుసు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

'ఎ' లు ఏడు దాటితే పిల్లల తప్పుమాటలు మాన్పించటానికి ప్రయత్నిస్తారు. ఇదేవిధంగా వారిలో మంచి ప్రవర్తన కలగటానికి ప్రయత్నించండి. 'బి' లు 'ఎ' ల కన్నా ఎక్కువగా వస్తే పిల్లల్లో మంచిమాటలు నేర్పించటానికి ఎలాంటి ప్రయత్నాలు చేయరు. 'ఎ' లను సమాధానాలుగా చేసుకొని పిల్లల ప్రవర్తనలో మార్పు తీసుకురావటానికి ప్రయత్నించండి.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం
14-3-2018

నేను నా దైవం

ఎం.ఎం.శ్రీలేఖ, సంగీత దర్శకురాలు



ఫొటో : శివమల్లాల

హృదయ నివేదన

నేటి తెలుగు సినీపరిశ్రమలో ఒకే ఒక్క మహిళా సంగీత దర్శకురాలు ఎమ్.ఎమ్.శ్రీలేఖ. మధురమైన సంగీతం, పాటలతో తెలుగువారికి ఆమె సుపరిచితురాలు అయ్యారు. పన్నెండేళ్ల వయసులోనే 'తాజ్‌మహల్' సినిమాకు సంగీత దర్శకత్వం అందించి ఆ తర్వాత దక్షిణ భారతదేశంలో పేరు ప్రఖ్యాతులు పొందారు. బాలీవుడ్‌లోనూ తన బాణీలతో అలరించారు.

దేవుడికి నివేదించడానికి భౌతికమైన మార్గాలు చాలా ఉన్నాయి. కాని ఆత్మికమైన మార్గం హృదయ సంభాషణే అంటారు శ్రీలేఖ. మన మనసుతో మౌనంగా దేవునితో చేసే ప్రతి సంభాషణ ఆయన వరకూ చేరుతుందని నమ్ముతారు ఆమె. లౌకిక జీవితం, ఆధ్యాత్మిక జీవితం సమంగా గడపడమే తన మార్గం అంటారు శ్రీలేఖ.

సాయంసంధ్య వేళ హైదరాబాద్ మణికొండలోని ఎమ్.ఎమ్.శ్రీలేఖ ఇంటి ముందున్నాం. లోపలి నుంచి 'మహీం మూలాధారే కమపి మణిపూరే..' కమ్మని స్వరంలో అమ్మవారి సౌందర్యలహరి వినిపిస్తోంది.

అడుగుపెడితే హాల్లో ఏడాది వయసున్న పిల్లవాడిని ఒళ్లోకూర్చోబెట్టుకొని పాడుతున్నారు ఎమ్.ఎమ్.శ్రీలేఖ.

'మా అబ్బాయి మహిమాన్.. ఆదిశంకరాచార్యుల వారి సౌందర్యలహరి శ్లోకాలు పాడితే చాలు అల్లరి మానేసి కామ్‌గా వింటూ వుంటాడు' అంటూ నవ్వారు. ఆ సంగీత దర్శకురాలితో భక్తి సంగీతం మీదుగా 'నేను– నా దైవం' ఫీచర్‌కు ఇంటర్వ్యూ మొదలైంది.

- **మీకు సినిమా పాటలే అనుకున్నాం. భక్తి గీతాలు కూడా కంఠతా వచ్చన్నమాట..**

అదేమిటి అలా అంటారు. సినిమా వాళ్లకు భక్తి పాటలు కూడా వస్తాయి. నేనైతే చిన్నప్పటినుంచీ వీటిని వింటూ పెరిగాను. చాలా భక్తి గీతాలు అలవోకగా వంటపట్టేశాయి. నాకు ఒకప్పటి జోలపాట ఇప్పుడు మా అబ్బాయికి లాలిపాట.

- **మీ హాల్లో చాలా దేవతా పటాలు కనిపిస్తున్నాయి....**

మా ఇంట్లో ఈ పటాలకు ఎప్పుడూ అలంకరణ ఉంటుంది. పూమాలలను చూశారుగా. మా వారు (పుట్టా వీరవరప్రసాద్) పూజలు చేస్తుంటారు. నేను ఆయనతో పాటు పాల్గొంటుంటాను. అందరి దేవుళ్లకు నేను అభిమానినే. ఎవ్వరినీ తక్కువ చేయను. కానీ, మూకాంబికా అమ్మవారిని మా ఇంట్లో అందరూ భక్తిగా కొలుస్తుంటారు.

- **మూకాంబిక ఆలయం ఉన్నది కర్ణాటకలో.. మీరెలా ఆ అమ్మవారి భక్తులయ్యారు?**

నేను పుట్టి పెరిగింది కర్ణాటకలోని రాయచూర్‌కి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ చిన్న పల్లెటూరులో. అప్పట్లో కరెంట్, వైద్య సదుపాయం లేని ఊరు అది. మా కుటుంబం అక్కడే వ్యవసాయం చేస్తుండేది. అర్ధరాత్రి నేను పుట్టిందే పూజ గదిలోనట. ఇప్పుడు ఈ హాల్‌కి రెండింతలు ఉంటుంది ఊళ్లో ఆ పూజగది. అంత పెద్ద పూజగదిలో మా పెదనాన్న శివశక్తిదత్త (ఎమ్.ఎమ్.కీరవాణి తండ్రి) వేసిన దేవతామూర్తుల చిత్రపటాలు ఎన్నో ఉండేవి. పుట్టాక గంటవరకు నేను ఏడ్వలేదట. పెద్దవాళ్లు భయపడి మూకాంబికా అమ్మవారికి నమస్కరించుకొని ఆమె కుంకుమ నా నుదుటన పెట్టాక నాలో కదలిక వచ్చి, ఏడ్చానట. అలా నా పుట్టుక గురించి తెలుసుకున్నప్పుడు ఒక అలౌకికమైన శక్తి ఏదో నా చుట్టూ ఉందని అర్థమైంది. అమ్మా నాన్నలకు ఒక్కత్తే కూతుర్ని మా నాన్నగారు (బోసు), అమ్మ (విజయలక్ష్మి భరణి) నన్ను భక్తికి దగ్గరగా ఉండేలా పెంచారు. మంగళ, శుక్రవారాలు మౌనవ్రతంలో ఉండేదాన్ని. పౌర్ణమి, అమావాస్యలైతే నాచేత నిష్ఠగా, కఠిన నియమాలు పాటింపజేసేవారు నాన్నగారు. నేను వేసుకునే డ్రెస్ కలర్‌ని బట్టి ఆ రోజు ఏ వారమో తెలిసిపోయేది. పన్నెండేళ్ల వయసు వచ్చే వరకు ఉప్పుకారాలు లేకుండా తులసి ఆకులతో పెంచారంటే నమ్ముతారా! ఒక సన్యాసిని ఎలా ఉంటుందో అలా ఉండేదాన్ని.

- **ఇంతటి కఠిన నియమాలా! .. ఉల్లంఘించాలనిపించలేదా?**

నాన్నగారు ఏదో కారణం లేకుండా ఇలా చేయరు అనుకునేదాన్ని. కాకపోతే లోపల ఓ సంఘర్షణ ఉండేది. ఎందుకుచేయాలి ఇవన్నీ అని. కానీ ఎప్పుడూ అడగలేదు. కీరవాణి అన్నయ్య, మా పెదనాన్న, చిన్నాన్న... మా ఇంట్లో ఆయనకు ఎవరూ ఎదురుచెప్పేవారు కాదు. ఆయన ఎంత చెబితే అంత. ఆయన ద్వారానే ధ్యానం, ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణ అలవడ్డాయి. స్పిర్చ్యువల్ పవర్ గురించి కూడా ఆయన ద్వారానే నాకు తెలిసింది. పాజిటివ్‌గా ఉంటే అంతా మంచే వస్తుందనే నమ్మకం ఏర్పడింది.

- **దేవుడు ఉన్నాడని మీరెలా నమ్ముతారు?**

దైవం మానుష రూపేణా అనేది నేను నూరు శాతం నమ్ముతాను. ఏదైనా చిన్న అవకాశం వచ్చినా అది మనిషి ద్వారానే రావాలి. మనం దారి తప్పినప్పుడు ఒక మనిషి దారి చూపిస్తాడు. దేవుడే ఆ మనిషిని పంపుతాడు. మనకు ఆకలిగా ఉన్నప్పుడు ఎవరో అన్నం పెడతాడు. దైవమే ఆ మనిషిని ఏర్పాటు చేసి ఉంటాడు. నాకు దాసరి నారాయణరావుగారి ద్వారా మొదటి అవకాశం వచ్చింది. ఆ అవకాశమే దేవుడు. పన్నెండేళ్ల వయసులో నేనేంటి... ఆ పాటలేంటి? ఆ ప్రేమ పాటలకు బాణీలేంటి? దేవుణ్ణి మనిషిలా చూడాలి... మనిషిని దేవుడిలా చూడాలి. అప్పుడు అందరూ మనకు ఆప్తులై జీవితం ప్రశాంతంగా సాగుతుంది.

- **కళ కూడా దైవమే అంటారా?**

దేవుని ఉనికే కళ. నాకు ఆ కళ ఇచ్చి తన ఉనికిని తెలియచేశాడు దేవుడు. దాన్ని పట్టుకొని ఈ జీవితాన్ని నెగ్గుకొస్తున్నాను. ఇప్పటికీ కీ బోర్డు దగ్గర కూర్చున్నానంటే ఏదో అలౌకికమైన శక్తి నన్ను ఆవరిస్తున్నట్టుగా ఉంది. అలవోకగా బాణీలు వచ్చేస్తుంటాయి.

- **ఇప్పుడు దైవానికి సంబంధించి ఎలాంటి నియమాల పాటిస్తున్నారు?**

ఏదైనా చిన్న సమస్య వచ్చినా చాలు క్షణం క్షణం సినిమాలో శ్రీదేవిలా 'దేవుడా దేవుడా దేవుడా..' అని మొక్కేసుకుంట. కాని ఫలానా దేవుడికే మొక్కాలి అనే నియమం కూడా లేదు. నేను జీసస్‌నూ నమ్ముతాను. మా నాన్నగారు 300 వరకు జీసస్ పాటలు రాశారు. కొన్నింటికి నేనూ బాణీలు కట్టాను. తిరుమలకు వెళతాను. అలాగే కడప దర్గాకు వెళతాను. దైవాన్ని నమ్మడానికి కులం, మతం తేడాలే లేవు. దైవం అనేది ఒక సుప్రీం పవర్. అన్నింటికీ అతీతమైనది.

- **మీ నాన్నగారిలాగ మీరూ మీ అబ్బాయికి ఆధ్యాత్మికతను చేరువ చేస్తున్నారా?**

కొన్ని లక్షణాలు జన్మతః వచ్చేస్తుంటాయి. అందులో ఆధ్యాత్మిక శక్తి కూడా ఒకటి. మా అబ్బాయిని 'అమ్మ ఏది' అంటే చాలు మూకాంబికా అమ్మవారి ఫోటో చూపిస్తాడు. ప్రసవం సమయంలో నాకు ఆపరేషన్ తప్పనిసరి అయ్యింది. డాక్టర్లు ఆపరేషన్ చేస్తూ ఉంటే నేను సౌందర్యలహరి పాడుతూ ఉన్నాను. అలా వాడు ఆ సౌందర్యలహరి వింటూ పుట్టాడు. డాక్టర్లు చాలా ఆశ్చర్యపోయారు. ఇది ఫస్ట్ టైమ్ తల్లి పాట పాడుతూ బిడ్డకు జన్మనివ్వడం అన్నారు.

> **“ ప్రసవం సమయంలో నాకు ఆపరేషన్ తప్పనిసరి అయ్యింది. డాక్టర్లు ఆపరేషన్ చేస్తూ ఉంటే నేను సౌందర్యలహరి పాడుతూ ఉన్నాను. అలా మా అబ్బాయి ఆ సౌందర్యలహరి వింటూ పుట్టాడు. డాక్టర్లు చాలా ఆశ్చర్యపోయారు. ఇది ఫస్ట్ టైమ్ తల్లి పాట పాడుతూ బిడ్డకు జన్మనివ్వడం అన్నారు. ”**

- **దేవుడిని ఎలా ఫీల్ అవుతుంటారు?**

మనం తెలిసో, తప్పకనో.. తప్పులు చేస్తూనే ఉంటాం. అది అవసరమో, అనవసరమో, అహంకారమో కూడా తెలియదు. జీవనశైలిలో ఇవన్నీ భాగమే. పడుకునే ముందు చేసే ధ్యానంలో నా వల్ల ఈ రోజు ఎవరైనా హర్ట్ అయి ఉంటే వారికి సారీ అని చెప్పుకుంటాను. టెలీపతి ద్వారా మన మనసులోని భావం వారికి చేరుతుందని నా నమ్మకం. అలాగే దేవుడికి కూడా నా మనసులోని భావం చేరుతుందని నా నమ్మకం. అందుకే చాలా విషయాలు ఆయనకు చెప్పుకుంటూ ఉంటాను. జీవితంలో అన్నీ ఉండాలి. బంధువులు, మిత్రులు, పని. అయితే, దేని కోసం దేన్నీ వదులుకోకూడదు. బ్యాలెన్స్ చేసుకోవాలి. వచ్చిన పని గొప్పగా చేయాలి. మంచి మంచి పాటలకు సంగీతం అందించాలి. ఇదే దైవాన్ని కోరుకునేది.

- నిర్మలారెడ్డి చిల్కమర్రి

పరి పరిశోధన

వచ్చే ఏడాదే అంగారక యాత్ర!




అంతరిక్షంలో బోలెడన్ని విజయాలు సాధించామని మనం తరచూ చెప్పుకుంటూ ఉంటాం. వాస్తవం మాత్రం దీనికి భిన్నంగా ఉంది. ఇప్పటివరకూ మనిషి జాబిల్లిని దాటి వెళ్లనే లేదు. అయితే.. ఇంకో ఏడాదిలో ఈ పరిస్థితి మార్చేయడమే కాకుండా.. మనిషిని ఏకంగా అంగారకుడి పైకి పంపేస్తాం అంటున్నారు... స్పేస్ ఎక్స్ అధినేత, టెస్లా కార్ల తయారీదారు అయిన ఈలాన్ మస్క్. ఇటీవల ఒక సమావేశంలో మాట్లాడుతూ ఈలాన్ మస్క్... 'వచ్చే ఏడాది రెండో సగ భాగంలో అంగారకుడి యాత్ర ఉండవచ్చు' అన్నారు. అంతేకాకుండా ఇంకో ఐదేళ్లలోనే ఆ గ్రహంపై మనుషులతో కాలనీ కూడా ఏర్పాటు చేస్తాం అంటున్నారు. ఈ కాలనీలో ఉండే ప్రజలు ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతిలో అంశాలవారీగా ఓట్లు వేస్తారని చెప్పారాయన. ఈ క్రమంలోనే కృత్రిమమేధ గురించి మాట్లాడుతూ... ఈ టెక్నాలజీ అణుబాంబుల కంటే ప్రమాదకరమైనదని హెచ్చరించారు. ప్రజలందరికీ సమస్యలు తెచ్చిపెట్టే ఈ అంశంపై నిఘా పెట్టేందుకు ఓ వ్యవస్థ కచ్చితంగా ఉండాలని అంటున్నారు.

వ్యాయామంతో వృద్ధాప్యం దూరం...



వయసుతో సంబంధం లేకుండా, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉంటే శరీరం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఆయుష్షు కూడా తగ్గుతుందని బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అంటున్నారు. సైక్లింగ్‌తోపాటు ఇతర వ్యాయామాలు చేసే కొంతమంది (55 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్నవారు) పై పరిశోధనలు చేసిన తరువాత తాము ఈ అంచనాకు వచ్చినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. వ్యాయామం కేవలం కండరాలను గట్టిపరచడానికి మాత్రమే కాకుండా రోగనిరోధక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోందని ఈ అధ్యయనం ద్వారా తెలిసింది. రోగ నిరోధక కణాలు (టీ–సెల్స్) తయారు చేసే థైమస్ అనే అవయవం ఇరవై ఏళ్ల తరువాత ఉత్పత్తిని తగ్గించేస్తుందని, వ్యాయామం ఈ పరిస్థితిని మార్చేస్తుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ప్రొఫెసర్ జానెట్ లార్డ్ తెలిపారు. వయసు పెరుగుతున్న కొద్దీ శరీరం బలహీనమైపోతుందనే భావన కూడా సరికాదని, అందుకే తాము జీవితాంతం వీలైనంత వరకూ శారీరక శ్రమ చేయడం మంచిదని తమ అంచనా అంటున్నారు డాక్టర్ నిహారికా అరోరా దుగ్గల్. వయసు మీదపడిన తరువాత జబ్బులు సాధారణమన్నది తెలిసినప్పటికీ, దీన్ని వ్యాయామం ఆపివేయడానికి సాకుగా చూపరాదని హెచ్చరిస్తున్నారు.

పౌష్టికాహారానికి కొత్త రూపు..



పౌష్టికాహార లోపం తీవ్రమైన సమస్య. చాలామంది పసిపిల్లలు వయసుకు తగ్గట్టుగా ఎదగలేకపోతున్నారు కూడా. ఈ నేపథ్యంలో సముద్రంలోనే అత్యంత పుష్టికరమైన ఆహారాన్ని పండించి అందించేందుకు సిద్ధమవుతోంది అమెరికాలోని ఓ స్టార్టప్ కంపెనీ. సముద్రంలో పెరిగే అనేకానేక మొక్కల్లో 'కెల్ప్' ఒకటి. అన్ని రకాల విటమిన్లు, ప్రొటీన్లు, ఒమేగా –3 కొవ్వులు కలిగి ఉండే ఈ మొక్కలతో రుచికరమైన వంటకాలు తయారుచేసి అమ్మేందుకు అకువా అనే సంస్థ కిక్‌స్టార్టర్‌లో నిధులు సమీకరించే ప్రయత్నం చేస్తోంది. కెల్ప్ ఎంత పుష్టికరమైందంటే... పాలలో ఉండే కాల్షియం కంటే పది రెట్లు ఇందులో ఎక్కువ ఉంటుంది. దీంతోపాటు విటమిన్ ఏ, బి1, బి2, సి, డి, ఈ లు కూడా సమృద్ధిగా ఉంటాయి. అకువా జెర్కీ పేరుతో రానున్న కెల్ప్ వంటకాలలో కొంతవరకూ చక్కెర కూడా ఉంటుంది. ఈ కెల్ప్ మొక్కలు చాలా వేగంగా పెరుగుతాయి. రోజుకు అడుగు కంటే ఎక్కువ పొడవు పెరుగుతాయి. ప్రస్తుతం అకువా జెర్కీ మూడు రకాల రుచుల్లో లభిస్తోంది. ఒకటి సముద్రపు ఉప్పు రుచిలో ఉంటే.. రెండోది నువ్వుల రుచి.. మూడోది నిప్పులపై కాల్చిన రుచిలోను ఉన్నాయి.

డయాబెటిస్ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

పేరెంట్స్‌కు డయాబెటిస్ ఉంటే మనకూ వస్తుందా?



నా వయసు 32 ఏళ్లు. మా నాన్నగారికి డయాబెటిస్ ఉంది. నాకు కూడా ఉందేమోనని అనుమానం వచ్చి, ఇటీవల ఎఫ్‌బీఎస్ (ఫాస్టింగ్ బ్లడ్ షుగర్) పరీక్ష చేయించుకున్నాను. ఆ పరీక్షలో ఫలితం 114 ఎంజీ/డీఎల్ అని వచ్చింది. నాకు డయాబెటిస్ లేదని చెప్పారు. అయితే మా నాన్నగారికి మధుమేహం ఉంది కాబట్టి నాకు కూడా కచ్చితంగా డయాబెటిస్ వస్తుందా? ఒకవేళ వస్తే ఏ వయసులో వస్తుంది? దయచేసి నా సమస్యకు సరైన పరిష్కారం చూపించగలరు.

– సుధాకర్‌రావు, గుడివాడ

మీకు ఎఫ్‌బీఎస్ పరీక్షల్లో వచ్చిన ఫలితాన్ని బట్టి చూస్తే మీరు ప్రీ–డయాబెటిక్ దశలో ఉన్నారని తెలుస్తోంది. అంటే డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దశ అని అర్థం. మీ నాన్నగారికి డయాబెటిస్ ఉందని తెలిపారు కాబట్టి మీరు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే డయాబెటిస్ వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ దశలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే డయాబెటిస్‌ను దరిచేరకుండా జాగ్రత్తపడవచ్చు. మీరు ముందుగా పరీక్షలు చేయించుకోవడం మంచి విషయం. ఎందుకంటే డయాబెటిస్ వచ్చిన తర్వాత నియంత్రించుకోవడం మినహా చేయగలిగినదేమీ లేదు. అయితే ఇప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డయాబెటిస్‌ను నివారించుకోవచ్చు. మీరు ఇకపై డాక్టర్లు సూచించిన ప్రకారం క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోండి. ఇకపై మీ జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోండి. ప్రధానంగా మీ బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. అధిక క్యాలరీలు, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉండండి. మద్యపానం, పొగాకు వంటి అలవాట్లు ఏమైనా ఉంటే వెంటనే వాటిని మానేయండి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలా వీలుకాకపోతే కనీసం వారంలో ఐదురోజులైనా... రోజుకు అరగంట పాటు కచ్చితంగా వ్యాయామం చేయండి. తాజా ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోండి. పెసర్లు, మొలకెత్తి గింజలు శ్నాక్స్‌గా తీసుకుంటే చాలా మంచిది. ఆహారం విషయంలో కచ్చితంగా సమయపాలనను పాటించండి. సాధ్యమైనంత వరకు ఒత్తిడికి దూరంగా ఉండేందుకు ప్రయత్నించండి.

డయాబెటిస్ ఉన్నవారు బరువు తగ్గితే ప్రమాదమా?

నా స్నేహితుడి వయసు 45 ఏళ్లు. అతడికి డయాబెటిస్ వ్యాధి ఉంది. తాను బాగా లావుగా ఉండటంతో తన బరువు తగ్గించుకోడానికి రోజూ వ్యాయామం చేస్తున్నాడు. ఇటీవల అతడి బరువు అకస్మాత్తుగా తగ్గడం మొదలయ్యింది. ఈమధ్య బాగా బరువు తగ్గి, చాలా సన్నగా కనిపిస్తున్నాడు. అతడిని చూస్తేనే ఆందోళనగా ఉంది. డయాబెటిస్ వ్యాధి ఉన్నవారు ఇలా అకస్మాత్తుగా బరువు తగ్గితే ఏదైనా ప్రమాదమా?

– దామోదర్‌రావు, విజయవాడ



సాధారణంగా ఏమాత్రం ఊబకాయం ఉన్నా బరువు తగ్గడం ఆరోగ్యానికి మంచిదనే అందరమూ అనుకుంటాం. శారీరక వ్యాయామం చేస్తూ, క్యాలరీలు తక్కువగా ఉండే ఆహారం తీసుకుంటూ, క్రమంగా ఉండాల్సినంత బరువుకు చేరడం మంచిదే. ఇలా బరువు తగ్గడం కొలెస్ట్రాల్, బీపీని అదుపులో ఉంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దీనికితోడు బరువు తగ్గడం ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను తగ్గించడమే కాకుండా కండరాలు, కణజాలం, రక్తంలోని కొవ్వులు ఇన్సులిన్‌కు స్పందించేలా చేస్తుంది కూడా. శరీర కణజాలం, కండరాలు గ్లూకోజ్‌ను ఉపయోగించుకొని శక్తి పొందడానికి ఇన్సులిన్ అవసరమవుతుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ వల్ల కండరాలు, కణజాలం గ్లూకోజ్‌ను వాడుకోవాలంటే మామూలు కంటే అధిక స్థాయిలో ఇన్సులిన్ అందుబాటులోకి రావాలి. టైప్–2 డయాబెటిస్‌లో ఇదే పరిస్థితి ఉంటుంది. ఫలితంగా ఒక విషవలయం ఏర్పడుతుంది. ఇన్సులిన్ లెవల్ ఎక్కువ అవుతున్న కొద్దీ శరీరం బరువు తగ్గడం కష్టమవుతుంది. మరోవైపు శరీరం బరువు అధికమవుతున్నకొద్దీ ఇన్సులిన్ లెవెల్ పెరుగుతూ ఉంటుంది. ఈ చక్రవలయాన్ని ఛేదించడం కష్టం. డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఉద్దేశపూర్వకంగా బరువు తగ్గించుకోవడం మంచిదే. కానీ తమ ప్రయత్నమే లేకుండా అకస్మాత్తుగా బరువు తగ్గడం మాత్రం మంచి సూచన కాదు. రక్తంలో చక్కెర పరిమాణం ఎక్కువగా ఉన్నవారు వారు తరచూ మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంటుంది. ఇది డీ–హైడ్రేషన్‌కు దారితీస్తుంది. దాంతో శరీరం బరువు తగ్గిపోతుంది. డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు చాలామంది మొదటిసారి డాక్టర్‌ను కలిసినప్పుడు చేసే ఫిర్యాదు తమ బరువు తగ్గిందనే. డయాబెటిస్‌తో పాటు థైరాయిడ్, క్యాన్సర్ వంటి వ్యాధుల వల్ల కూడా శరీరం బరువు తగ్గిపోతుంది. అందువల్ల వ్యాయామం, డైటింగ్ వంటి తమ ప్రయత్నాలు ఏమీ లేకుండా బరువు తగ్గడం ఒక ప్రమాద సూచిక. రక్తంలోని చక్కెర పరిమాణంలో మార్పులకు ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయేమో అని కచ్చితంగా తేల్చుకోవడం అవసరం. ఇక ఏమాత్రం ఆలస్యం లేకుండా మీ స్నేహితుడికి పూర్తిస్థాయి వైద్యపరీక్షలు చేయించండి.

డయాబెటిస్ రోగులు... పాదాల జాగ్రత్తలు



డయాబెటిస్ రోగులు పాదాల విషయంలో జాగ్రత్తలు పాటించాలంటారు. ఎందుకలా? ఆ జాగ్రత్తలను సూచించండి.

– ధనరాజ్, నూతలపాడు

డయాబెటిస్ రోగుల్లో సాధారణంగా పాదాలకు గాయం అయినప్పుడు ఉండే నొప్పి తెలియదు. దాంతో ఆ గాయం పెద్దదైపోయి మాననివిధంగా మారి, కుళ్లడం ప్రారంభమయ్యే వరకు (గ్యాంగ్రీన్‌లా మారేవరకు) తెలియదు. ఒక్కోసారి ఈ పరిస్థితి పాదాన్ని తొలగించే పరిస్థితి వరకు తేవచ్చు. అందుకే డయాబెటిస్ రోగులు క్రమం తప్పక రోజూ పాదాలను పరిశీలించుకోవాలంటూ డాక్టర్లు హెచ్చరిస్తుంటారు. షుగర్ ఉన్న ప్రతివారూ, అందునా ఐదు నుంచి పదేళ్లుగా ఈ వ్యాధితో బాధపడుతున్నవారు తమ కాళ్లనూ ప్రత్యేకంగా పాదాలను చాలా జాగ్రత్తగానూ, నిశితంగానూ పరిశీలించుకుంటూ ఉండాలి. ఆ క్రమంలో పాటించాల్సిన మార్గదర్శకాలివి...

- తరచూ కాలి పరీక్ష స్వయంగా చేసుకుంటూ ఉండాలి. ఈ ప్రక్రియంలో భాగంగా పాదాల కింద అద్దం పెట్టుకుని, పాదం ఏవిధంగా ఉందో చూసుకోవాలి. కాలి పైభాగాన్నీ నిశితంగా పరీక్షించుకోవాలి. అలాగే కాలి వేళ్ల మధ్య భాగాలనూ పరీక్షించుకుంటూ ఉండాలి. ఈ పరిశీలనలో చిన్న పొక్కులాంటిది ఉన్నా దాన్ని విస్మరించకూడదు. భవిష్యత్తులో అది పుండుగా మారే ప్రమాదం కూడా ఉండవచ్చు. ● నిత్యం పాదాలను పొడిగా ఉంచుకోవాలి. కాళ్లు కడుక్కున్న వెంటనే పొడిగా అయ్యేలా తుడుచుకోవాలి. కాలి వేళ్ల మధ్య కూడా పొడిగా ఉండటం కోసం పౌడర్ రాసుకోవాలి. ● కాలికి చెప్పులు, బూట్లు లేకుండా నడవకూడదు. అయితే ఈ చెప్పులు, బూట్లూ కాలికి చాలా సౌకర్యంగా ఉండాలి. ఏమాత్రం అసౌకర్యం ఉన్నా ఆ పాదరక్షలు వాడకండి. సౌకర్యంగా ఉండేవి మాత్రమే ఎంచుకోవాలి. ● వేడి వస్తువులనుంచి మీ కాళ్లను దూరంగా ఉంచుకోండి. డయాబెటిస్ ఉన్నవారు హాట్ వాటర్ బ్యాగ్‌తో కాళ్లకు కాపడం పెట్టుకోకపోవడమే మంచిది. ● పాదాలను మృదువుగా ఉంచుకోవాలి. ఇందుకోసం కాళ్లు కడుకున్న తర్వాత పొడిగా తుడుచుకొని, ఆ తర్వాత వాజిలైన్‌తో కాళ్లను రుద్దుకొని, మళ్లీ ఆ తర్వాత పొడిగానూ మారేలా శుభ్రం చేసుకోవాలి.
- కాళ్ల మీద పులిపిరి కాయల్లాంటివి ఏవైనా ఏర్పడితే డాక్టర్‌ను సంప్రదించి, ఆయన పర్యవేక్షణలోనే వాటిని తొలగించుకోవడం చాలా ముఖ్యం. ● కాలిగోళ్లను ప్రతివారమూ తొలగించుకోవాలి. ఈ సమయంలో గోళ్లను మరీ లోపలికి కట్ చేసుకోకూడదు. అలాంటప్పుడు ఒక్కోసారి గోరు మూలల్లో రక్తం వచ్చేంతగా గోరు కట్ కావచ్చు. ఇది జరిగినప్పుడు కొందరిలో గోరు లోపలి వైపునకు పెరగవచ్చు. ఇది డయాబెటిస్ రోగుల్లో మరింత ప్రమాదం.
- ఇంట్లో కూడా పాదరక్షలు లేకుండా నడవకండి. ప్రత్యేకంగా తడి, తేమలో పనిచేసే మహిళలు స్లిప్పర్స్ వంటివి తొడుక్కునే పనిచేసుకోవాలి. ● ఏడాదికోసారి కాలి వైద్య నిపుణులకు చూపించుకుంటూ ఉండాలి.

ఇవన్నీ కాలి సంరక్షణకు ఉపయోగపడే మార్గాలు.



డాక్టర్ అశోక్ వెంకట నరసు
సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్ అండ్ డయాబెటాలజిస్ట్
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
బుధవారం
14-3-2018

డబ్బింగ్ క్లాసిక్స్-12

ఒక్క సినిమాతో వంద సినిమాలు పుట్టించిన బాషా



● రజనీకాంత్

బాషాలో మంచి సీన్ ఉంటుంది.

రజనీకాంత్ చెల్లెలికి మెడిసిన్‌లో సీట్ కావాల్సి వస్తుంది. ఫ్రీ సీట్లు అయిపోయి ఉంటాయి. కాలేజీ ఓనరు 'ఇక మిగిలింది నా చేతిలో ఉన్న ప్రయివేటు సీట్లే' అంటాడు.

'ఆ సీటు కావాలంటే నువ్వు కాలేజీతో పాటు అప్పుడప్పుడు గెస్ట్‌హౌస్‌కు వచ్చిపోతుండాలి' అని అంటాడు.

ఈ మాటతో హతాశురాలైన రజనీకాంత్ చెల్లెలు క్యాంటీన్‌లో కూచుని కన్నీరు పెట్టుకుంటూ రజనీకాంత్‌తో అంటుంది– 'కాలేజీకెళ్లి చదువుకోవచ్చు, హాస్టల్‌లో ఉండి చదువుకోవచ్చు, కాని గెస్ట్‌హౌస్‌కు వెళ్లి ఎలా చదవమంటావ్ అన్నయ్యా'. రజనీకాంత్ అప్పుడు ఆ అమ్మాయిని తీసుకుని కాలేజీ ఓనర్ దగ్గరకు వెళతాడు.

'ఏరా బెదిరించడానికి వచ్చావా నేనే పెద్ద రౌడీని' అంటాడు ఓనర్.

అప్పుడు రజనీకాంత్ అందరినీ బయటకు పంపించేసి 'అయ్యా... నా పేరు మాణిక్యం' అని టేబుల్ మీద చేతులు పెట్టి ముందుకు వొంగుతాడు.

'నాకు ఇంకో పేరు కూడా ఉంది' అంటాడు.

అంతే. ఆర్.ఆర్ మొదలవుతుంది.

లోపల ఏం మాట్లాడుతున్నాడో మనకు వినిపించదు.

అద్దాల గదిలో కాలేజీ ఓనరు సీట్లో నుంచి లేచి నిలుచోవడం, చెమటలు కక్కడం, రజనీకాంత్ ముందు చేతులు కట్టుకుని వణకడం... ప్రేక్షకులకు చాలా సంతృప్తిని, అహం తృప్తిని కలిగిస్తుంది.

'మా హీరో అంటే ఏమనుకుంటున్నావురా'.. అని వాళ్లు అనుకుంటారు. అతడు ఫ్లాష్‌బ్యాక్‌లో చాలా పెద్ద డాన్. తుపాకులతో, బుల్లెట్లతో ఆడుకున్నవాడు. అలాంటివాడు అజ్ఞాతంలో ఒక ఆటోవాడిలాగా బతుకుతుండొచ్చు. కాని పులి బోనులో ఉన్నంత మాత్రాన పులి కాకుండా పోతుందా?

ఘనమైన ఫ్లాష్‌బ్యాక్ ఉండి కూడా అతి సామాన్యంగా బతుకుతున్న హీరో మళ్లీ జమ్మి చెట్టు మీద నుంచి అస్త్రాలు దించే తీరుతాడు అని ఎదురు చూసేలా చేసే ఫార్ములా ఇది.

భారతం నుంచి బాషా వరకు ఆ ఫార్ములా సక్సెస్ అవుతూనే ఉంది.

* * *


బాషాలో రజనీకాంత్ ఒక సరదా అయిన సగటు మనిషిలా మొదట కనిపిస్తాడు. కాని అతడిది అది అసలు రూపం కాదని ప్రేక్షకులకు తెలుస్తూనే ఉంటుంది. ఒక గొప్ప వీరుడు మారువేషంలో అజ్ఞాతంలో ఉన్నాడని దర్శకుడు హింట్స్ ఇస్తూ ఉంటాడు. ఆ పాత్రను ప్రేక్షకులే కాదు సాటి పాత్రలు కూడా తలెత్తి చూసేలా ఒక సన్నివేశం పెడతాడు. రజనీకాంత్ తమ్ముడికి పోలీస్ ఉద్యోగం వచ్చినప్పుడు ఇంటర్వ్యూలో కమిషనర్‌కు డౌట్ వస్తుంది. 'మీ అన్నను రమ్మను' అంటాడు. అప్పటికే ముంబై రికార్డ్స్‌లో బాషా మరణించాడని ఉంటుంది. ముంబైలో పని చేసి వచ్చిన ఆ కమిషనర్‌కు బాషా తెలుసు. ఇక్కడ ఉన్నది ఆ బాషాయేనా తెలుసుకోవడానికి రమ్మంటాడు.

పెద్ద ఆఫీస్ రూమ్ అది.

రజనీకాంత్ ఆటోవాలాలా ఎంట్రీ ఇస్తాడు.

ఒక్కసారిగా కమిషనర్ లేచి నిలబడతాడు. పక్క పాత్రలూ ప్రేక్షకులు కూడా.

'హమ్' నుంచి స్ఫూర్తి పొంది...



● సురేశ్ కృష్ణ, దర్శకుడు

సురేశ్ కృష్ణ దర్శకత్వంలో 1995లో విడుదలైన 'బాషా' చాలా పెద్ద విజయం సాధించింది. ఒక రకంగా రజనీకాంత్ కెరీర్‌ని ఇంకో ఇరవై ఏళ్లు పొడిగించిన సినిమా ఇది. రజనీకాంత్ ఇమేజ్ భారీగా పెరడగానికి ఈ సినిమా ముఖ్యకారణం. దీని తర్వాత రజనీకాంత్ మల్టీ స్టారర్ హిందీ సినిమాలు మానుకొని సంవత్సరంలో రెండు మూడు సినిమాలు చేయడం మానుకొని ఒక్కసారికి ఒక్క సినిమా పద్ధతిలోకి వెళ్లి తన మార్కెట్ బాగా పెంచుకోగలిగాడు. 1991లో వచ్చిన 'హమ్' సినిమాలో నటించడం రజనీకాంత్‌కు లాభించింది. ఆ సినిమాలో అమితాబ్ ఇలాగే పెద్ద డాన్‌గా ఉండి అన్నీ మానేసి కుటుంబం కోసం అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోతాడు. ఆ పాయింట్‌ను 'బాషా' కోసం కొత్తగా డెవలప్ చేసుకున్నాడు రజనీకాంత్. మంచి వయసు, ఆరోగ్యం ఉన్న రోజులలో వచ్చిన సినిమా కాబట్టి ఇందులో రజనీ పూర్తి ఎనర్జిటిక్‌గా కనిపిస్తాడు. 'ప్రేమికుడు'తో తెర మీదకు వచ్చిన నగ్మా ఈ సినిమాతో రజనీ పక్కన నటించే చాన్స్ కొట్టేసింది. దేవా పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా ప్లస్ అయ్యాయి. ఇక 'నేను ఒక్కసారి చెప్తే వందసార్లు చెప్పినట్టే' డైలాగ్ ఎన్ని సినిమాలలో ఎన్ని స్పూఫులుగా వచ్చిందో తెలుసు. 'బాషా ఫార్ములా' ధోరణి 'సమరసింహారెడ్డి', 'నరసింహనాయుడు', 'ఇంద్ర' సినిమాల్లో మనం చూస్తాం. బాషా డిజిటల్లీ ఇంప్రూవ్డ్ ప్రింట్‌ను 2017లో విడుదల చేశారు. 20 ఏళ్ల తర్వాత కూడా ఒక సినిమా రీరిలీజ్ అయ్యిందంటే అది బాషాకు మాత్రమే దక్కిన ఘనత.

మారువేషంలో ఉన్నది భీముడు అని కీచకుడు కనిపెట్టి అదిరిపడితే ఎలాంటి మజా వస్తుందో ఇక్కడ కూడా అలాంటి మజాయే ప్రేక్షకులకు వస్తుంది.

* * *

రజనీకాంత్, చరణ్‌రాజ్ ముంబైలో స్నేహితులు. చిన్నప్పటి నుంచి కలిసి పెరిగారు. కాని ఆ ప్రాంతంలో డాన్ అయిన రఘువరన్ మురికివాడను ఖాళీ చేయిస్తుంటే రజనీకాంత్, చరణ్‌రాజ్ అడ్డు పడతారు. చావు ఎదురైనా ఇద్దరం కలిసే ఈ అన్యాయాన్ని ఎదిరిద్దాం అనుకుంటారు. కాని రఘువరన్ చాలా దుర్మార్గుడు. తన దగ్గర పని చేసే మేనేజర్ విజయకుమార్ కొడుకు కాబట్టి రజనీకాంత్‌ని వదిలిపెట్టి చరణ్‌రాజ్‌ను దారుణంగా హత్య చేయిస్తాడు. చరణ్‌రాజ్ పేరు అన్వర్ బాషా. చరణ్ రాజ్ మృతదేహం ఖననం అయ్యేలోపు రజనీకాంత్ అతణ్ణి చంపిన ప్రతి ఒక్కరినీ నరుకుతాడు. బస్తీ వాసులంతా ఈ దుష్ట శిక్షణకు జేజేలు పలుకుతారు. ఆ రోజు నుంచి రజనీకాంత్ తన పేరును మాణిక్ బాషాగా మార్చుకొని ముంబైలో పెద్ద డాన్‌గా మారుతాడు. కాని రఘువరన్‌కు, రజనీకాంత్‌కు మధ్య గొడవలు పెరిగిపోయి ఆ గొడవల్లో తండ్రి ప్రాణమే పోయే పరిస్థితి వచ్చేసరికి తండ్రి చివరి కోరిక మేరకు నేర జీవితం వదిలేసి చెన్నై చేరుకుని మామూలు జీవితం గడుపుతుంటాడు రజనీకాంత్. కాని తిరిగి పాత రూపం చూపించే పరిస్థితి వస్తుంది. ఒక లోకల్ రౌడీ తన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతుంటే మాణిక్యం అవతారం చాలించి తిరిగి బాషా అవతారంలోకి వెళతాడు రజనీకాంత్.

ఆ సన్నివేశం సినిమాలో ముఖ్యమైనది.

అంతకు ముందు సన్నివేశాలలో ఆ రౌడీని చూసి రజనీకాంత్ భయపడినట్టుగా కనిపిస్తాడు. మనకెందుకు గొడవ అన్నట్టు పక్కకు తప్పుకుంటుంటాడు. చివరకు ఆ రౌడీ తనను స్తంభానికి కట్టేసి చితక బాదినా సహిస్తాడు. కాని ఎప్పుడైతే చెల్లెలి మీద ఆ రౌడీ చేయి వేస్తాడో... ఒకే గుద్దు... రౌడీ ఎగిరి కరెంట్ పోల్‌ను ఢీకొని కిందపడతాడు.

రజనీకాంత్ మాణిక్యం అవతారాన్ని చాలించి తిరిగి బాషాగా మారాడన్న సంగతి తెలియగానే తల్లి అక్కడి నుంచి అందరినీ తీసుకెళ్లిపోతుంది. ప్రేక్షకుల రోమాలు నిక్క పొడుచుకుంటాయి. కేరెక్టర్ ఇమేజ్ ఆకాశానికి అంటుతుంది. ఇంతకు ముందు సినిమాల్లో ఇలాంటి అనుభూతి లేదు.

ఇది బాషా ఫార్ములా అనుభూతి.

* * *

పాండవులు మారువేషంలో బతకడం సామాన్య జనులకు ఎంత అబ్బురమో హీరోలు మారువేషంలో బతకడం కూడా అంతే అబ్బురం. ఇచ్చిన మాటకు, విలువకు కట్టుబడి కుటుంబం కోసం సాధారణ జీవితం గడపడానికి వచ్చిన బాషా తిరిగి పాత రూపంలోకి వెళ్లి శత్రుశేషం ఎలా నిర్మూలించుకున్నాడన్నది క్లయిమాక్స్.

సాధారణంగా సినిమాలు ముగిశాక శుభం కార్డు పడుతుంది. కాని బాషా ముగిశాక కూడా శుభం కార్డు పడలేదు. ఆ సినిమా కథ ముగియలేదు. ఇప్పటికీ అనేక కథలను పుట్టిస్తూనే ఉంది. 'నేను ఒక్కసారి చెప్తే వంద సార్లు చెప్పినట్టే' అనేది ఇందులో పంచ్ డైలాగ్. ఒక్కసారి రిలీజైనా వంద విధాలుగా రీరిలీజ్ అవుతున్నదే– బాషా.

- కె

స్టీల్ లోడింగ్..!





● ఎన్టీఆర్

'ఇంకా మిగిలే ఉంది బాసూ..' ఎన్టీఆర్ కొత్త లుక్ గురించి ఆయన ట్రైనర్ స్టీవెన్ లాయిడ్స్ చెప్పిన మాట ఇది. ఇప్పుడు ఈ మిగిలిన దాన్ని కూడా మిగల్చకుండా కంప్లీట్ చేసే పనిలో పడ్డారు ఎన్టీఆర్ అండ్ స్టీవెన్స్. అందులో భాగంగానే ఎన్టీఆర్ సీరియస్‌గా వర్కౌట్స్ చేస్తున్న ఫొటోను ''థింగ్స్ ఆర్ గెటింగ్ సీరియస్.. కొత్త లుక్ కోసం ఎన్టీఆర్ ఇలా కష్టపడుతున్నాడు' అన్న క్యాప్షన్ ఉండేలా స్టీవెన్ లాయిడ్ ఎన్టీఆర్ ఫొటోను పోస్ట్ చేశారు. అంటే.. ఎన్టీఆర్ కొత్త లుక్ స్టీల్ లోడింగ్ అన్నమాట. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇందులో ఒక కథానాయికగా పూజాహెగ్డేను ఎంపిక చేశారు. ఈ సినిమాకు 'ఆన్ సైలెంట్‌మోడ్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారని టాక్. ఈ చిత్రంలో స్లిమ్ అండ్ స్టైలిష్ లుక్‌తో పాటు సిక్స్‌ప్యాక్‌లో కనిపించనున్నారట ఎన్టీఆర్. ఏప్రిల్‌లో షూటింగ్‌ను స్టార్ట్ చేయనున్న ఈ సినిమాకు తమన్ స్వరకర్త. కెమెరా: పీయస్ వినోద్.

చంద్రముఖి పాత్రలో జేజెమ్మ?



● అనుష్క

'చంద్రముఖి' సినిమా అనగానే జ్యోతిక.. జేజెమ్మ అంటే అనుష్క గుర్తుకు రాక మానరు. 'చంద్రముఖి' సినిమాలో చంద్రముఖిగా జ్యోతిక ఏ రేంజ్‌లో అలరించారో తెలిసిందే. వెంకటేష్ హీరోగా వచ్చిన 'నాగవల్లి' సినిమాలో జ్యోతిక పాత్రలో నాగవల్లిగా అలరించారు అనుష్క. తాజాగా మరోసారి జ్యోతిక పాత్రలో అనుష్క నటించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. జ్యోతిక ప్రధాన పాత్రలో జీవీ ప్రకాష్ హీరోగా బాలా దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'నాచియార్'. పోలీసు అధికారిణిగా జ్యోతిక పలికిన డైలాగ్స్ మహిళలను కించపరిచేలా ఉన్నాయంటూ అప్పట్లో తీవ్ర దుమారం రేగిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 16న విడుదలైన ఈ సినిమా తమిళంలో ఘన విజయం సాధించింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయనున్నారట. తెలుగు హక్కులను నిర్మాత కల్పన కోనేరు సొంతం చేసుకున్నారట. జ్యోతిక పాత్రకి స్వీటీ అయితేనే న్యాయం చేయగలరనీ, అప్పుడే తమిళ వెర్షన్ కంటే తెలుగు వెర్షన్ బాగా వస్తుందని అనుష్కతో చర్చలు జరిపారట. మరి అనుష్క గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

ఆ మాట అన్న ప్రతిసారి పెద్ద వసూళ్లు

- రాజేంద్రప్రసాద్



● అనూప్ రూబెన్స్, కిరణ్, రాజేంద్రప్రసాద్, సాక్షీ చౌదరి, 'నిధి' ప్రసాద్, రిషి

''సాధారణంగా చిన్న సినిమా, పెద్ద సినిమా అంటుంటారు. నా చిత్రాన్ని చిన్న సినిమా అన్న ప్రతిసారి పెద్ద వసూళ్లను సాధించాయి. 'ఊ.పె.కు.హ' సినిమా కూడా పెద్ద హిట్ అయి మంచి వసూళ్లు రాబడుతుంది'' అని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో 'నిధి' ప్రసాద్ దర్శకత్వంలో భాగ్యలక్ష్మి నిర్మించిన సినిమా 'ఊ.పె.కు.హ'. 'ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి' అన్నది ఉపశీర్షిక. సాక్షీ చౌదరి కథానాయిక. అనూప్ రూబెన్స్ స్వరాలందించారు. బిగ్ సీడీని నిర్మాత కిరణ్, ఆడియో సీడీలను రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ– ''నేను రాజ్–కోటి గారితో పనిచేసేటప్పుడు దిలీప్ అనే కీబోర్డ్ ప్లేయర్ ఉండేవాడు. తనే ఇప్పుడు ఎ.ఆర్.రెహమాన్ అయ్యారు. అనూప్ కూడా తాను కీ బోర్డ్ ప్లేయర్‌నని చెప్పుకోవడం వింటుంటే ఆనందంగా ఉంది. భాగ్యలక్ష్మి, విక్రమ్ ఈ సినిమాను చక్కగా నిర్మించారు'' అన్నారు. ''వినోదాత్మకంగా తెరకెక్కిన చిత్రమిది. మా సినిమాకు సంగీతం చేయమని అడిగే సమయంలో అనూప్ చాలా బిజీగా ఉన్నాడు. అయినా నేను అడిగానని ఒప్పుకుని, అనుకున్న సమయం కంటే ముందుగానే ఆడియో పూర్తి చేసి ఇచ్చినందుకు థ్యాంక్స్. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు 'నిధి' ప్రసాద్. భాగ్యలక్ష్మి, సాక్షీచౌదరి, అనూప్ రూబెన్స్ పాల్గొన్నారు.

నవ్వుల్ నవ్వుల్

తేజ, హరిణిరెడ్డి జంటగా రూపొందుతోన్న వినోదాత్మక చిత్రం 'డ్రీమ్ బాయ్'. రాజేష్ కనపర్తి దర్శకత్వంలో సెవన్ వండర్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రేణుక నరేంద్ర నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఎం.వి. రావు కెమెరా స్విచ్చాన్ చేయగా, మరో నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. రాజేష్ కనపర్తి మాట్లాడుతూ– ''ఇదొక థ్రిల్లింగ్ ఎంటర్‌టైనర్. ప్రేమతో నిండిన క్యూట్ స్టోరీ. ఆద్యంతం కామెడీతో రూపొందుతోన్న ఈ చిత్రం అందర్నీ ఆకట్టుకుంటుందనే నమ్మకముంది. కొత్త, పాత నటీనటులతో తెరకెక్కిస్తున్నాం'' అన్నారు. ''రాజేష్ చెప్పిన కథ నచ్చడంతో ఈ చిత్రం నిర్మిస్తున్నా. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. మాకు, మా బ్యానర్‌కు మంచి పేరు తీసుకొచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు రేణుక. నటులు ధనరాజ్, రాకేష్, సుఖేష్ రెడ్డి, లడ్డు, ఆర్ట్ డైరెక్టర్ వెంకట్ సన్నిధి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని, సంగీతం: సుభాష్ ఆనంద్, సమర్పణ: మాస్టర్ ఎన్.టి. రామ్ చరణ్.



● తేజ, హరిణి రెడ్డి

ముగ్గురు దర్శకుల విశ్వదాభిరామ



● 'చిత్రం' శ్రీను

'చిత్రం' శ్రీను ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'విశ్వదాభిరామ'. ఈ చిత్రానికి సురేష్ కాశీ, సురేంద్ర కమల్, అశోక్ చక్రం దర్శకత్వం వహించడం విశేషం. సోలో స్టార్ ఎంటర్‌టైన్ మెంట్స్ పతాకంపై సురేంద్ర కమల్(సురేంద్ర వంటిపులి) నిర్మించారు. దర్శకులు మాట్లాడుతూ –'' కొండవీటి కోట నేపథ్యంలో జరిగే డెత్ గేమ్ థ్రిల్లర్ 'విశ్వదాభిరామ'. ఇప్పటి వరకూ కామెడీ పాత్రల్లో అలరించిన 'చిత్రం' శీను ఈ చిత్రంలో తొలిసారి విలన్‌గా నటించారు. తెలుగు ప్రేక్షకులకు ఇదొక సరికొత్త థ్రిల్ కలిగిస్తుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల చేస్తాం'' అన్నారు. భువన్ తేజ్, అనిల్, ఆనంద్, సహస్ర, రాజారెడ్డి, మానస నటించిన ఈ చిత్రానికి కెమెరా: అజీమ్, తరుణ్ సోనూ.

వాంటెడ్ దబాంగ్



● సోనాక్షీ సిన్హా

సల్మాన్‌ఖాన్–ప్రభుదేవా దర్శకత్వంలో 2009లో వచ్చిన 'వాంటెడ్' సినిమా మంచి విజయం అందుకున్న సంగతి తెలిసిందే. మరోసారి వీరి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుంది. అది కూడా సల్మాన్‌కి మాంచి హిట్స్ ఇచ్చి కలెక్షన్ల వర్షం కురిపించిన 'దబాంగ్' సిరీస్ కావడం విశేషం. 'దబాంగ్' కి అభినవ్ కశ్యప్ దర్శకత్వం వహించగా, 'దబాంగ్ 2' ని సల్మాన్ సోదరుడు అర్బాజ్‌ఖాన్ డైరెక్ట్ చేశారు. ఈ సిరీస్‌లో 'దబాంగ్ 3' రాబోతోందని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి ఎవరు దర్శకత్వం వహిస్తారనే విషయంపై అర్బాజ్‌ఖాన్‌తో పాటు పలువురి పేర్లు వినిపించాయి. అయితే.. ఆ అవకాశం ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవాని వరించింది. ఈ విషయాన్ని ప్రభుదేవా స్వయంగా ప్రకటించారు. ''దబాంగ్ 3' సినిమాకు సంబంధించి గత వారం ముంబాయిలో చర్చలు జరిపాం. ఈ చిత్రానికి నన్నే దర్శకత్వం వహించమని సల్మాన్ ఖాన్, అర్బాజ్ ఖాన్ కోరారు. నేనే దర్శకత్వం వహిస్తున్నా. కథానాయిక సోనాక్షీసిన్హా నటిస్తారు. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ పాతవారే ఉంటారు'' అన్నారు ప్రభుదేవా.



● సల్మాన్ ఖాన్



● ప్రభుదేవా